RNI No. APTEL/2003/12253

Reffered Journal & Peer Reviewed Journals

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 22 Issue No. 12 Monthly December 2025 ISSN No. 2456-4702 Rs. : 15/-



## వాసిరెడ్డి సీతాదేవి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **డిసెంబర్ - 2025** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 22 - Issue. 12 - December 2025 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**

**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Former Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD, Dept. of Telugu
   Sri A.S.N.M. Govt. Degree College,
   Palakollu, West Godavari Dist., A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002,
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# వాసిరెడ్డి సీతాదేవి

(జననం : 15 డిసెంబర్ 1933 - మరణం : 13 ఏప్రిల్ 2007)

వాసిరెడ్డి సీతాదేవి 1933, డిసెంబర్ 15వ తారీఖున గుంటూరు జిల్లా చేబ్రోలు జన్మించింది. ఆమె తల్లిదండ్రులు వాసిరెడ్డి రాఘవయ్య, రంగనాయకమ్మ. ఈమె ఐదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివింది. తర్వాత ప్రైవేట్‌గా హిందీ ప్రచారక్, ప్రవీణ సాహిత్య రత్నా ఉత్తీర్ణులైంది. నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి బి.ఏ., ఎం.ఏ.,ను పూర్తి చేసింది. ఆమెకు చిన్నతనం నుంచి తెలుగు భాష, సాహిత్యం పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆసక్తి ఆమెను రచయితగా చేసింది. వాసిరెడ్డి సీతాదేవి రచించిన మొదటి నవల జీవితం అంటే (1950) తొలి కథ సాంబయ్య పెళ్లి (1952) వాసిరెడ్డి సీతాదేవి 39 నవలలు 100 పైగా కథలు రాశారు. ఆమె రాసిన "మట్టి మనిషి" నవల 14 భాషల్లో అనువాదం చేశారు. ఆమె నవలల్లో చాలా దూరదర్శన్ లో సీరియల్స్‌గా సినిమాలుగా వచ్చాయి.

ఆమె నక్సలిజంపై 1982 సంవత్సరంలో రచించిన "మరీచిక" నవలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది.

తర్వాత ఆరుద్ర వంటి సాహిత్యకారులు అభిప్రాయాలపై హైకోర్టు కేసు కొట్టి వేసి నిషేధాన్ని తొలగించింది. వాసిరెడ్డి సీతాదేవి జవహర్ బాల భవన్ డైరెక్టర్‌తో పనిచేశారు. 1985-1991 మధ్యకాలంలో ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యురాలుగా సేవలు అందించారు. ఆమెకు ప్రతిభకు అనేకమైన అవార్డులు వరించాయి...

- ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం - ఐదు సార్లు
- ఆత్మగౌర పురస్కారం
- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాల గౌరవ డి.లిట్ ( 1989 )
- పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గౌరవ డి.లిట్(1989)
- తెలుగు విశ్వవిద్యాలయం-జీవితకాల సాఫల్య పురస్కారం(1996)
- 1994లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యం లో విశిష్ట పురస్కారం.

తెలుగు సాహిత్యంలో వివిధ సాహితీ ప్రక్రియ లైన కథ,నవల,మొదలగు రంగాలకు యెనలేని కృషి చేసిన వాసిరెడ్డి సీతాదేవి 2007లో మరణించారు. తెలుగు సాహితీ రంగానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | వేమన - బద్దెనల దృక్పథంలో స్త్రీ | - ఆచార్య వి. నారాయణప్ప | 8 |
| 2. | భాష ప్రయోగౌచితి - సాంకేతిక పద నిర్మాణం | - డా॥. యం. ప్రసాద్ నాయక్ | 13 |
| 3. | రాధికాసాంత్వనం - ముద్దు పళని కవితా వైదుష్యం | - డా॥. కొయ్యా శ్రీనివాసులు | 18 |
| 4. | అనువాద సాహిత్య విశిష్టత - స్థూల పరిచయం | - డా॥. ఎం. హరికృష్ణ | 24 |
| 5. | "కలవారి కోడలు" కలికి కామాక్షి గేయం - జానపదుల గ్రామీణ సంస్కృతి | - డా॥. పి. చిరంజీవిరావు | 29 |
| 6. | గుర్రం జాషువా సాహిత్యంలో - మహాత్మాగాంధీ వ్యక్తిత్వ చిత్రణ | - డా॥. ఎ.ఎ. నాగేంద్ర | 34 |
| 7. | భాగవతం - ప్రహ్లాద అద్వైతసిద్ధి | - డా॥. సి. చిన్న పాపమ్మ | 39 |
| 8. | తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర | - వడ్డేపల్లి సుమిత్ర | 43 |
| 9. | చంద్రబోస్ పాటల నుండి జీవిత పాఠాలు | - పెందోట వీణ | 47 |
| 10. | రాసాని రచనల్లో దేవర్ల సంస్కృతి | - మల్లెల సునీత<br>- ఆచార్య కె. వేణుగోపాలరెడ్డి | 52 |
| 11. | దేశాభిమాన ప్రతీకలు - రాణాప్రతాప్, పురుషోత్తముడు | - ఎం. గాయత్రీదేవి | 56 |
| 12. | జాషువా క్రీస్తు చరిత్ర - క్రైస్తవ సందేశం | - సుజిత రెడ్డి<br>- వై. సుభాషిణి | 60 |
| 13. | ప్రపంచ భాషలలో తెలుగు గొప్పదనం | - వంజరి రాజేశ్వరి | 65 |
| 14. | తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం | - గౌరెడ్డి పవిత్ర | 69 |
| 15. | గద్దర్ పాట : ప్రజా చైతన్యానికి ప్రతిధ్వని | - బలుగూరి నవత | 72 |
| 16. | "నవ్య సంప్రదాయ సాహిత్యం - "భూతదయ" | - తమ్మెర లక్ష్మీనరసింహారావు | 77 |
| 17. | జనగామ జిల్లాలో రైతాంగ ఉద్యమాలు | - అలంశెట్టి పర్శరాములు | 80 |
| 18. | ఆచార్య కసిరెడ్డి పొదుపు కథలలో - సంస్కృతి | - పోల్కం రాములు | 84 |
| 19. | రాష్ట్ర గీతం ప్రదాత - శంకరంబాడి సుందరాచారి | - యస్. రాజేంద్రుడు | 87 |
| 20. | రావి నూతల ప్రేమ కిషోర్ వచన కవిత్వం-చైతన్య దృక్పథం | - చెరుకూరి వేణు | 92 |
| 21. | డా॥. ముదిగొండ శివప్రసాద్ 'ఆవాహన' నవల - ఒక అవలోకనం | - చీరబోయిన తిరుపతి | 95 |

| | | |
|---|---|---|
| 22. డాక్టర్ మన్నవ భాస్కరనాయుడు - స్వేద సూర్యోదయం - పద్య కావ్యం | - ఎరికంబట్టు రాజేష్ | 101 |
| 23. వాడ్రేవు చినవీరభద్రుడు పాఠాంతరం కథలో సామాజిక జీవన చిత్రణ | - కొత్తకోట శ్రీనివాసరావు<br>- ఆచార్య జర్రా అప్పారావు | 104 |
| 24. సారంగ కథలు - ముస్లిం స్త్రీ జీవిత చిత్రణ | - భాగం సైదారావు<br>- ఆచార్య జర్రా అప్పారావు | 108 |
| 25. సామాజిక అంధకారంలో 'నిప్పు కణిక' ఆచార్య అయిలయ్య | - దండెం రాజశేఖర్ | 114 |
| 26. వ్యక్తి సంస్కారాన్ని ఆశించిన చలం కథలు | - బానోత్ అనిల్ కుమార్ | 118 |
| 27. సడ్లపల్లి చిదంబర రెడ్డి కథలో రైతు జీవన చిత్రణ | - సత్తిబాబు<br>- ఆచార్య జర్రా అప్పారావు | 122 |
| 28. తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి కథలలో మధ్యతరగతి జీవన చిత్రణ | - పల్లపు పవన్ కుమార్<br>- ఆచార్య జర్రా అప్పారావు | 128 |
| 29. ఉన్నత పాఠశాల తెలుగు వాచకాలు:నిర్మాణ రూపకల్పనపై విశ్లేషణ | - గంగాధర్ | 133 |
| 30. బి.వి.యస్. స్వామి తెలంగాణ కథా విమర్శ | - రెడ్డి శ్రీనివాస్ | 137 |
| 31. మాధురి ఇంగువ నవలలు - వస్తు వైవిధ్యం | - అల్లం అరుణ కుమారి<br>- డా॥. పెండ్యాల లావణ్య | 142 |
| 32. భూషణం - గోధూమపల్లె కథ : ఆదివాసీ జీవన చిత్రణ | - వంతిన బాలజీ<br>- ఆచార్య జర్రా అప్పారావు | 146 |
| 33. Dalit Ecologies and Epistemic Resistance : Traditional Knowledge Systems as a Critique of Eco - Casteism | - Chettupally Anvesh | 153 |
| 34. South Indian Rock - Cut Architecture - Historical - Epigraphcal Perspective | - D. Musugu Srinivasa Rao | 158 |
| 35. Cluster of Temples at Pillalamarri of Suryapet District. Telangana : A Sculptural Study | - Dr. Narasaiah Barigala<br>- Dr. Nagalaxmi Bantu | 165 |
| 36. Culture of Banjara Women : Special Reference to Rayaparthi Mandal, Wanangal District. | - Gugulothu Lalitha | 169 |
| 37. Socio - Economic Transformation among the Yerukalas in Telangana (1950-2025) : A Study | - Dr. Radhika Palakurthy | 172 |

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# వేమన - బద్దెనల దృక్పథంలో స్త్రీ



- ఆచార్య వి. నారాయణప్ప
భారతీయ భాషలు మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ.

**సంక్షిప్త పరిచయం :**

ఈనాడు తెలుగు సాహిత్యంలో కొంతమంది ప్రజా కవులు కనబడుతున్నారు. కాని మొదటి ప్రజాకవి మాత్రం వేమన. ఇతడు రాజాశ్రయ కవి కాదు. రాజాశ్రయ కవుల కంటే ప్రజాకవులు అందించే సందేశాలు బలీయమైనవి. వాస్తవికమైనవి. వేమన - బద్దెన కవులు స్త్రీ - పురుషుల వాస్తవిక మానవ స్వభావాన్ని మాత్రం ఆవిష్కరించారు. అయినా ఈ కవులు తమ శతకాలలో స్త్రీల పట్ల వివక్ష చూపారని కొంత విమర్శకు గురైనారు. కాని ఈ కవులు చూపిన పరిష్కార మార్గాలను గుర్తించలేకపోయారు. ఈ కవులను చూసే దృక్కోణంలో లోపం కావచ్చునేమో. నిజానికి ఆ కవులు అందించిన పరిష్కార మార్గాలని ఈ వ్యాసంలో చర్చించాను.

**ముఖ్యాంశాలు :**

ప్రజాకవులు, దృక్పథం, ప్రక్షిప్తాలు, మకుటం, పెక్కుపాట్లు, కలకంఠి, కులకాంత, వారకాంత, దమ్మిడీ, కొక్కోకం.

**వ్యాసం :**

సామాన్య ప్రజలలో కూడా మంచి ఆదరణ లభించిన తెలుగు శతకాలలో వేమన శతకం ఒకటి. అంత ఆదరణకు కారణం వేమన ప్రజాకవి. ప్రజల కోసమే, ప్రజల మాటలతోనే కవిత్వం చెప్పటం. తాను ఎన్నుకొన్న వస్తువు ప్రజాజీవితం కావటం. వేమనవన్నీ నీతి పద్యాలు కావటం. ప్రతి సమస్యకూ పరిష్కారం లభించటం. అందుకే - ఆచార్య ఎస్. గంగప్ప గారు "వేమన వస్తువు జీవితాన్ని, సమాజాన్ని మథించి తీసిన వెన్నలాంటి సారం" అన్నారు. పాశ్చాత్యులు, దేశీయులూ వేమనను కవిగా, తాత్వి కునిగా, దార్శనికునిగా, యోగిగా, ఉపదేశకునిగా, సంఘ సంస్కర్తగా, లోకకవిగా, విప్లవకవిగా, ప్రజాకవిగా గుర్తిం చారు. వేమన ఆటవెలది ఛందస్సులో వేలకొలది పద్యాలు చెప్పాడు. ఇతని పద్యాలు ప్రపంచ భాషలలోనికి అను వదించబడ్డాయి. వేమన పద్యమొకటైనా రాని తెలుగు వారుండరు. వేమన పద్యం పూర్తిగా రాకపోయినా "కంచు మోగినట్లు కనకంబు మోగునా!", "చెప్పుదినెడు కుక్క చెరుకు తీపెరుగునా!", "కుక్కతోక బట్టి గోదావరీదునా" వంటి వేమన పద్యపాదాలను అక్కడక్కడ సందర్భాన్ని బట్టి సామెతలుగా ప్రయోగిస్తుంటారు. ఇలాంటి సామెతలు ప్రజల సొత్తుగా మారిపోయినాయి.

అయినా వేమన పద్యాలు కొన్ని వివాదాస్పదంగా ఉన్నాయని, అతని దేశకాలాదులు స్పష్టంగా లేవని, వేలకొలది పద్యాలు చెప్పిన వేమన శకత కవి ఎలా అవుతాడనీ మొదలైన ప్రశ్నలకు ఎన్నో పరిశోధన పత్రాలు,

పుస్తకాలు వచ్చాయి. నిజానికి సి.పి. బ్రౌన్ గారి అహో రాత్రులు శ్రమ ఫలితంగా క్రీ.శ. 1829లో తొలిసారిగా వేమన పద్యాలు వేలసంఖ్యలో ముద్రింపబడి వెలుగు చూశాయి. వేమన కాలాన్ని పరిశోధకులు క్రీ.శ. 1472 నుంచి క్రీ.శ. 1672 వరకూ ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా నిర్ణయిస్తున్నారు. అయితే, భారత ప్రభుత్వం తెలిసిన పండితులను, పరిశోధకులను సంప్రదించి వేమన కాలం క్రీ.శ. 1672 అని నిర్ణయించి అధికార ముద్ర వేసింది. వేమనది రాయలసీమ ప్రాంతమని చాలామంది పరి శోధకులు అంగీకరిస్తున్నారు.

వేమన పద్యాలు (ప్రక్షిప్తాలు మినహాయించి) మొదట నుంచీ చివరి దాకా ఆటవెలది ఛందస్సులోనే సాగాయి. పద్యం చివరి పాదం పూర్తిగా "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో సాగింది. పద్యాలన్నీ ముక్తకాలు కావటం మొదలైన శతక లక్షణాలను గుర్తించిన పండితులు వేమనను శతక కవిగా పరిగణించి ఉండవచ్చు.

వేమన కంటే పూర్వమే ఎన్నో శతకాలు వచ్చాయి. వాటిలో కాలాన్ని బట్టి, గుణాన్ని బట్టి అగ్రగణ్యమైన శకతం మరొకటి ఉంది. అది "సుమతీ శతకం". ఇది 108 నీతి పద్యాలు సమాహారం. ఇందులో అన్నీ కంద పద్యాలే. ప్రతి పద్యం చివర 'సుమతీ' అన్న మకుటం ఉంది. ఈ శతకంలోని పద్యాలు సరళభాషలో చెప్పబడిన నీతులు తెలుగు భాషలోను, తెలుగువారి జీవితాలలోనూ పెన వేసుకొన్నాయి. సుమారు ఏడు వందల సంవత్సరాల క్రితం వ్రాయబడిన ఈ పద్యాలలోని పదాలన్నీ నేటి భాషలోనూ వున్నాయి. ఇందులో దీర్ఘ సమాసాలుగాని, సంస్కృత పదాలుగాని లేవు. కాబట్టి, అక్షరజ్ఞానం లేనివారికి కూడా వినిన వెంటనే భావం అర్థమవుతుంది. అందుకే బద్దెన శతకంలోని పద్యం పూర్తిగా రానివాళ్ళు కూడా ఒకటి రెండు పాదాలను సులభంగా గుర్తు పెట్టుకొని "కరి మ్రింగిన వెలగపండు", "తన కోపమే తన శత్రువు", "చెవిటికి సంకూదినట్లు", "ఇత్తడి బంగారమగునె" వంటి పద్య భాగాలను జాతీయాలుగా, సామెతలుగా ఉప యోగిస్తుంటారు. కాని, 'సుమతీ శతకం' కర్త ఎవరో కచ్చిత మైన సమాచారం లభించడం లేదు. అయితే క్రీ.శ. 1220-1280 మధ్యకాలంలో బద్దెన లేదా భద్ర భూపాలుడు అనే కవి సుమతీ శతకాన్ని వ్రాశాడని సాహితీ చరిత్రకారుల అభిప్రాయం.

నీతి శతకంలో కవి జీవిత సమస్యలను చర్చిస్తాడు. నీతి శతకాలలో రాజనీతి, గృహనీతి, లోకనీతి, ప్రవృత్తినీతి అనేవి ప్రధానమైనవి.

గృహనీతిలో తల్లి - తండ్రి - పుత్ర సంబంధాలు, అనుకూలవతియైన భార్య, పరస్త్రీలపట్ల వర్తన, స్త్రీ ధర్మాలు, స్త్రీల పట్ల ఆనాటి పురుషుల దృష్టి, వార కాంతలు అనే విషయాలు ప్రాముఖ్యం వహిస్తాయి.

లోకనీతిలో లోకవృత్తం, సంఘవిమర్శ, బంధువులు, ఆశ్రితులు, ధనార్జన, సమకాలిక జీవితం, విషయ సంపద అనే విషయాలు ముఖ్యమైనవి.

ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది. కవి తన జీవితంలో ప్రత్యక్షంగా అనుభవించిన సమస్యలు పరోక్షంగా తన కవిత్వంలో కొన్ని చోట్ల ప్రతిబింబిస్తాయి. ఆ విధంగా వేమన జీవిత ప్రయాణంలో సమకాలీన సామాజిక పరిస్థితులు, తాను ఎదుర్కొన్న సమస్యలు ఎక్కువగా కనబడుతాయి. దీనికి బద్దెన కూడా భిన్నమైన వాడు కాదు. వీరిద్దరూ తమ నీతి శతకాలలో లోకం తీరుని, గృహనీతిని ఉన్నది ఉన్నట్లు చెప్పినందుకు కొంత విమర్శకు గురి అయ్యారు. ముఖ్యంగా వీరిద్దిరు తమ శతకాలలో స్త్రీల పట్ల వివక్ష చూపారని కొంతమంది విమర్శిస్తున్నారు. కాని, ఈ కవులు స్త్రీ - పురుషుల వాస్తవిక మానవ స్వభావాన్ని మాత్రం ఆవిష్కరించారు. నిజానికి ప్రజా కవులు సమాజంలో తప్పులను ఎత్తిచూపి, ప్రజా నీకాన్ని ఉత్తమ పాఠకులుగా తయారు చేస్తారు తప్ప, సమాజాన్ని తప్పుదోవను పట్టించరు.

ఎవరైతే ఈ ప్రజా కవులను విమర్శిస్తున్నారో... వారు ఈ కవులను చూసే ధృక్కోణంలో లోపం కావచ్చునేమో.

ఆనాడు ఎక్కువగా స్త్రీలోలత్వం, వ్యభిచారం పెరి గింది. అప్పటికే వేమనపై వీరశైవ సిద్ధాంతాల ప్రభావం ఉంది. ఆ సిద్ధాంతాలలో స్త్రీ - పురుష సమానత్వం, స్త్రీ జనోద్ధరణ ప్రముఖ స్థానమాక్రమిస్తాయి.

వేమన దృష్టిలో స్త్రీ తల్లి. అందుకే వేమన - "తల్లి నెరుగువాడు దైవంబు నెరుగును" అన్నాడు.

మరోచోట -

"వెలయ భూమి తల్లి, విత్తనం బటు తండ్రి,
పంట లరయ సుతులు, పాడిపరము;
ధర్మమె తన పాలి దైవంబు తలపోయ" అన్నాడు.

అంటే, మానవునికి భూమి తల్లి, విత్తనం తండ్రి, పంటలు సంతానం, పాడి స్వర్గం, ధర్మం (సత్కార్యాచరణం) దైవం - ధర్మ స్వరూపమైన దైవాన్ని చేరుకోవడానికి మూలం తల్లి అని శ్లాఘించాడు వేమన.

వేమన ఇంకో అడుగు ముందుకు వెళ్ళి, తల్లి రక్షణలో ఉన్నప్పుడు కలిగే ప్రయోజనాలను, విలువలను గూర్చి ఎంతో ఉన్నతంగా చెప్పాడో చూడండి :

తల్లియున్నయపుడె తనదు గారాబము
లామె పోవఁ దన్ను నరయ రెవరు
మంచి కాలమపుడె మర్యాద నార్జింపు" అన్నాడు.

అంటే, తల్లిపోయాక ఎదురుంటే ఏమి లాభం. 'ఆమె పోవ తనను అరయరెవరు' అంటూ నిత్యసత్యాన్ని విన్నవించాడు.

బద్దెన కూడా - 'అమ్మా అని పిలిచి అన్నమడుగని నోటిని కుమ్మరివాడు మన్ను తవ్వినటువంటి గుంటతో సమానం' అన్నాడు.

అలాగే స్త్రీల అదోగతికి కారణం పురుషులేనని గుర్తించిన వేమన -

"తరుని పుణ్యవతిగ వరుని బట్టియె యగు,
పాపియగు మగని ప్రాపువలన
భర్తవర్తనంబె పడుతుల యందుండు" అన్నాడు.

అంటే, మగని బట్టే భార్య ఉత్తమరాలుగను, పాపాత్మరాలుగను అవుతుంది. భర్త మంచి చెడుగులే ఆమె మంచి చెడ్డలకు కారణం అని స్త్రీల పక్షాన వాదించాడు.

'ఆడద నరక ద్వారమని, పుణ్యం కొద్దీ పురుషుడ'నీ పురాణ ప్రసిద్ధి. కాని, వేమన దృష్టిలో అది స్త్రీల పట్ల పురుషులు చూపిన దారుణమైన వివక్ష అని, దీనిని ఖండిస్తూ 'పురుష భాగ్యముననె పుణ్యవతి దొరుకు' అని కళ్ళు తెరిపిస్తాడు.

అందుకే -

"కావ వలయు మగఁడు కాంత నెల్లప్పుడు
కావలేనివాడు ఆవవలయు..." అని

స్త్రీజన సంరక్షణలో పురుషుల బాధ్యతను గుర్తుకు తెస్తాడు.

ఇంతేకాదు, పురణా పురుషులైన త్రిమూర్తులు కూడా స్త్రీ లేకపోతే తమ తమ ఉనికిని కోల్పోతామని ఎంతో జాగ్రత్త వహించారని పురుషులను మరింత హెచ్చరిస్తూ...

వేమన -

"పడఁతి మోసెనొకఁడు పడతి మేసెనొకండు
పడఁతి నురముఁ జేర్చి బ్రతికె నొకఁడు
పడఁతి కొఱకె పెక్కు పాట్లను బడిరయా" అన్నాడు.

ఇక్కడ హాస్యరసాన్ని అమలు చేస్తూ స్త్రీలను కాపాడుకొనే జవాబ్దారితనాన్ని పురుషులకు అప్పజెప్పాడు.

వేమన ఉత్తమ భార్యను గురించి...

"సుగుణవంతురాలు సుదతియైన యుండిన
బుద్ధిమంతులగుఁచు పుత్రులొప్ప
స్వర్గమేటికయ్య సంసారికింకను" అని ప్రశంసించగా;

బద్దెన స్త్రీని గురించి...

"నీరే ప్రాణాధారము
నారే నరులకు రత్నము" అంటూనే...

"కులకాంత తోడ నెప్పుడుఁ
గలహింపకు వట్టి తప్పు ఘుడియింపకుమీ;
కలకంఠి కంటఁ కన్నీ
రొలికిన సిరియింట నుండనొల్లదు సుమతీ"

అని స్త్రీ ఔన్నత్యాన్ని ప్రశంసించుటను చూస్తే, ఉత్తమ భార్యల పట్ల వేమన - బద్దెనలలో ఎంత ఉత్కృష్టమైన భావాలున్నాయో తెలుస్తోంది.

ఇక బాలికల మీద జరిగే అత్యాచారాలను గురించి వేమన - బద్దెనలు ఏమి ఎప్పారో చూద్దాం!

'బాలిక అంటే 'యౌవనానికి రానటువంటి ఆడపిల్ల'. బాలికలకు పుష్పవతులు కాక మునుపు కామాపేక్ష ఉండదు. సామాన్యంగా ఇళ్ళల్లో చిన్న ఆడపిల్లలుంటే అందరూ చూసి ఆనందిస్తారు. అంతేగాని, యౌవనవతులను వర్ణించినట్లు బాలికలను, వృద్ధస్త్రీలను గురించి ఏ కవి ఏ ప్రబంధంలోనూ వర్ణించినట్లు కనిపించదు.

వేమన 'బాలికలు సంగమించడానికి భయపడుతార''ని చెప్పాడు.

కన్నడ కవి సర్వజ్ఞుడు 'బాలికలకు దృఢ మనస్సు ఉండదు. బాలికలను కామ దృష్టితో చూడకూడదని, వారితో సంభోగించకూడదనీ' చాలా కటువుగా చెప్తూ "ఎవడైతే బాలికలను భోగిస్తాడో వాడి స్థితి బాగా పాలు ఇచ్చే నల్లబర్రె పచ్చిగడ్డిని తినటం మాని, మనిషి యొక్క మలం తినినట్లుంటుంది" అని అసహ్యించుకొన్నాడు.

బద్దెన కూడా...

"కసుగాయ కఱచి చూచిన
మసలక తిన వగరుగాక మధురంబగునా?
పస గలుగు యువతులండగ
పసిబాలలఁ పొందువాడు పశువుర సుమతీ" అన్నాడు.

అంటే - బాలికల పొందు ఎలా ఉంటుందంటే పక్వానికి వచ్చిన తియ్యని పండ్లను వదలి పచ్చి కాయలు కొరికినట్లు, లోకంలో ఎందురో మంచి యౌవనవతులుండగా వారిని విడిచి బాలికలను అనుభవించేవాడు పశువుతో  సమానమని దుయ్యబట్టాడు బద్దెన. కాబట్టి, ఆనాటి సమాజంలో కూడా బాలికల మీద అత్యాచారాలు చేసే మగమృగాలు ఉండేవారని తెలుస్తోంది. ఆనాడు లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం కూడా ఉండేది కాదు.

ఈనాడు నిండా తొమ్మిది పది సంవత్సరాలు కూడా నిండని బాలికల మీద అత్యాచారాలు చేసే మగమృగాలను గురించి మనం రోజూ వార్త పత్రికలలో చదువుతున్నాం, టీవీలలో చూస్తున్నాం. అందువలన ఆనాటి సమాజానికి మంచిని బోధిస్తూ చెప్పిన ఈ పద్యం నేటి తరానికి కూడా ఎంతో అవసరం.

ఇక యౌవనవతులను గురించి వేమన - బద్దెనలు ఏమన్నారంటే..

"బాల చనులఁ పూల బంతులఁ బోల్తురు
పాలు మాటినట్టి భ్రాంతులవని
మాంసఖండమందు మఱియేమి యున్నది"

"బాల్యమందు తాను బహువిధములఁబట్టి
చప్పపణచినట్టి స్తనములకును
మోహమింత యేల మూఢాత్మ తెలియరా" అంటాడు వేమన.

అంటే... అందమైన యువతి స్తనాలను పూలగుత్తులతో పోల్చి జనులు భ్రాంతి పొందుతారు. అవి మాంసపు ఖండలే కదా! పసితనంలో తాను పాలకై చప్పరించినవే ఇవి అని తెలిసికొనక మానవుడు ఆ స్తనాలను చూసి మోహించి భ్రమపడుతున్నాడు. వీటిని తెలుసుకోరా మూఢాత్మ అని వేమన ప్రబోధించాడు.

అయితే, బద్దెన - 'తాంబూలాన్ని వేసుకొనని నోటిని, యౌవనవతులైన స్త్రీల అధరామృతాన్ని గ్రోలని నోటిని బూడిదగుంటతో సమానమ'ని చెప్పాడు. ఇది కొంత విడ్డూరంగానే వుంది. కాని, ఇది నాటి సమాజంలోని పురుషుల మనస్సులయందు గల భావాలను బంధించి ఈ విధంగా బద్దెన తన శతకంలో ప్రతిబింబింపజేసి ఉండవచ్చు

వేశ్యలను గురించి వేమన - బద్దెనల అభిప్రాయం ఎలాంటిదో పరిశీలించి చూద్దాం :

వేశ్యలు అనగానే కొంతమంది వేమనను వేశ్యాలోలుడని గుర్తుకు తెచ్చుకుంటారు. దానికి మొదట అవుననే చెప్పాలి. వేమన తన యౌవనమంతా వెలయాలి కౌగిట్లో గడిపిన వ్యసనలోలుడు. వేశ్యా స్వభావం తెలిసినవాడు. వేశ్యా గృహాలు తిరిగినవాడు. వేశ్యల కొరకు ధనాన్ని వెచ్చించి ఇల్లు గుల్ల చేసుకొన్నవాడు. 'మంచి కాలమపుడె మర్యాద నార్జింప' లేదని వదినగారి (కథలున్నాయి) బోధనలకు తలొగ్గి, కాముకతను రోసి, చివరికి యోగిగా మారాడు. మునపటి వెలయాలి సాంగత్యాన్ని అసహ్యించుకొని "అయ్యో ఇంతకాలం ఈ నీచమైన సుఖం

కోసమా నా కాలాన్ని వృథా చేసింది! నా జీవితాన్ని చీకటి కూపంలో ముగ్గబెట్టింది" అనుకుంటూ పశ్చాత్తాపం చెందిన వేమన వెలయాలు పొందులో వచ్చే అనార్థలను చెప్పాడు. వేశ్య తన నవ్వుతోనే మోహం కలిగిస్తుంది. వారివన్నీ నటనలే! వారికి నిజమైన ప్రేమ ఉండదు. వారికి ధనమే ముఖ్యమని వేమన చెప్పిన పద్యాన్ని గమనించండి:

"కడుపునిండ తవుడు గంపలోఁబెట్టిన
చన్నుఁ బట్టనీక తన్నుగేదె
వారకాంతలెట్లు వలతురో యూరక"

అని వేశ్యల కొరకు ఎగబడు విటులను హెచ్చరించాడు.

అలాగే యౌవనం శాశ్వతం కాదంటూ వేశ్యావృత్తిలోని అంతరార్థాన్ని విప్పి చెప్తూ...

"మొలక చనుల నాడు మూడు కోటులు చేయు
కులుకు చనులనాడు కోటి చేయు
తబక చనులనాడు దమ్మిడీ చేయదు"

అని వేశ్యలను కూడా హెచ్చరించాడు వేమన.

బద్దెన వేశ్యను గురించి ఏమన్నాడంటే...

వెలయాలి వలన నిజమైన ప్రేమ లభించదు. బోగముది చేయు ప్రమాణాలు నమ్మదగినవి కావు అంటూనే...

"కొక్కోక మెల్లఁ జదివినఁ
చక్కనివాఁడైన రాజ చంద్రుండైనన్
మిక్కిలి రొక్కము లియ్యక
చిక్కదురా వారకాంత; సిద్ధము సుమతీ" అన్నాడు.

ఈ పద్యాన్ని బట్టి చూస్తే వేశ్యకు ధనమే ప్రధానమని తేటతెల్లమౌతుంది.

ఈ కవుల పద్యాలను విశ్లేషించి చూస్తే వేమన కాలంలోను, బద్దెన కాలంలోనూ వేశ్యా గృహాలు ఎక్కువగా ఉండేవని, ఈ వేశ్యా గృహాలకు సంపన్న మగరాయళ్ళు వెళ్ళేవారని తెలుస్తోంది.

ఈనాడు కూడా రహస్యంగా వేశ్యాగృహాలు నడిపే వాళ్ళు ఉన్నారు. అప్పుడప్పుడు వీరు పోలీసుల చేతికి చిక్కిబిక్కిరిస్తుంటారు. దేశం ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఆధునిక వేశ్యాగృహాలను నిర్మూలించాల్సిన అవసరముంది.

**సంప్రదించిన గ్రంథాలు :**

**తెలుగు :**


1. అరుణాచలం పి.వి. (సం)., 2000 వేమన కవితాతత్త్వం, కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం.
2. నారాయణప్ప వి., 2016, వేమన - సర్వజ్ఞ - తిరువళ్ళువర్‌ల రచనల్లో స్త్రీ పాత్ర విన్యాసం : ఒక తులనాత్మక అధ్యయనం, ఢిల్లీ : శ్రీవినాయక ప్రచురణలు.
3. ప్రసాద్ మెండెపు, 2013, శతకాలలో స్త్రీల పట్ల వివక్ష, హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. బద్దెన (ప్రణీతం), 1930, సుమతీ శతకం, రాజమండ్రి : శ్రీ సత్యనారాయణ బుక్ డిపో.
5. వేంకట రమణయ్య బులుసు (సం.), 1989, వేమన పద్యరత్నాకరము (4వ ముద్రణం), మద్రాసు : బాలసరస్వతీ బుక్ డిపో.
6. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం (సం), 2017, వేమన కవిత్వం - స్త్రీ, విజయవాడ : ప్రజాశక్తి బుక్ హౌస్.

**కన్నడం :**

7. గురురాయరు కలమదాని (సం), 1989, సర్వజ్ఞ వచనగళు, హుబ్బళ్ళి : లలిత ప్రకాశన.


★★★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# భాష ప్రయోగౌచితి - సాంకేతిక పద నిర్మాణం



- డా॥. యం. ప్రసాద్ నాయక్

సహాయ ఆచార్యులు, డిపార్ట్మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ , ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**పరిచయం :**

పత్రికా రచనలో వాడే భాషను వ్యావహారిక భాష అంటున్నాం. కాని, ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. మాట్లాడే భాషను సాధారణంగా వ్యావహారిక భాష అంటాం. మాట్లాడినట్లే రాస్తే దాన్ని కూడా వ్యావ హారిక భాషే అనవచ్చు. అట్లాగే, రాసేవన్నీ మాట్లాడే భాషలో ఉండక్కర్లేదు. ఉదాహరణకు : 'నీకు మొన్న పరిచయం చేశానే ఆ అబ్బాయే పెళ్ళికొడుకు' ఈ రకపు వాక్యం మాట్లాడే భాషలో కన్పిస్తుంది. రాసే భాషలో 'నీకు పరిచయం చేసిన అబ్బాయి' అనే పద్ధతిలో మారుతుంది. అట్లాంటి కొన్ని పద్ధతులను గురించి ఈ భాగంలో తెలుసుకుందాం.

**కర్త, కర్మ, క్రియాంశ ప్రధాన వాక్యాలు :**

వాక్యంలో ప్రాధాన్య వివక్షను అనుసరించి మూడు పద్ధతుల్ని మనం చెప్పుకోవచ్చు. సాధారణంగా వాక్యంలో కర్త,కర్మ, క్రియాంశ ప్రధాన వాక్యాలు అని మూడు రకాలుగా విభజించవచ్చు.

సాధారణ వాక్యాల్లో చాలా భాగం కర్త ప్రధాన వాక్యాలు. 'ఆయన అన్నం తిన్నాడు' అనేది సాధారణ వాక్యం. ఇందులో కర్తకు ప్రాధాన్యం ఉంది. అయితే మిగతా వాటికి ప్రాధాన్యం లేదని కాదు. కర్తను మించిన ప్రాధాన్యం లేదు. అట్లాంటి ప్రాధాన్యం మిగతా పదాలకు ఇవ్వాల్సిన అవసరం భాషా వ్యవహారంలో, ముఖ్యంగా రచనా భాషా వ్యవహారంలో వచ్చే అవకాశం ఉంది.

"ఒక పురుషుడు చదువుకుంటే అతని వరకే ఆ విద్య పరిమితం. అదే స్త్రీ చదువుకుంటే ఆ కుటుంబానికంతా పరిమితమవుతుంది". పరిమితమనే మాట మొదటి వాక్యంలో సందర్భోచితంగా ఉంది. రెండవ వాక్యంలో అసందర్భంగా ఉంది. బహుశా ఇక్కడ పర్యాప్తమవుతుంది అనే అర్థంలో పరిమితం అనే మాటను వాడినట్లు అర్థమవుతుంది.

**ఈ ఉదాహరణలు చూడండి :**

**ఒక తెలుగు మాస పత్రికలో 'లవ్ సైకాలజీ' అనే శీర్షికలో ఈ వాక్యం ఉంది :**

"ప్రేమించబడడం అన్నిటికన్న గొప్పది. ప్రేమించే హృదయం లేకుండా ప్రేమించబడడం కల"

ఒక నవలలో "దుకాణాలన్నీ మూసివేయబడ్డాయి" అనే వాక్యం ఉంది.

అన్నం తినబడింది అనే వాక్యంతో పోల్చుకుంటే ఈ పైన ఉదహరించిన వాక్యాలేవీ అసహజంగా కన్పించటం

లేదు. దీనికి కారణం పైన ఉపయోగించిన కర్మ ప్రధాన వాక్యాలు సందర్భోచితంగా ప్రయోగించబడ్డాయి.

**రాసే భాషలో అవసరమైన కొన్ని సందర్భాలను స్థూలంగా తెలుసుకుందాం :**

ఎ. 'కర్త ఎవరో తెలియనపుడు - ఒక పురాతనమైన కట్టడాన్ని ఎవరు నిర్మించారో నిర్మింపజేశారో తెలియనప్పుడు - ఈ కోట పదహారో శతాబ్దంలో నిర్మించబడింది' అనవచ్చు.

బి. కర్త ఎవరో చెప్పదలచుకోనప్పుడు, లేక చెప్పటం అవసరం లేదనుకున్నప్పుడు :

ఇక్కడ పాలు అమ్మబడును, ఇక్కడ పిండి రుబ్బబడును, ఇల్లు అద్దెకివ్వబడును'' అనే వాక్యాలు మహానగరాల్లో సర్వసాధారణంగా కనిపిస్తాయి. ఇక్కడ కర్తకు ప్రాధాన్యం లేదు. అందువల్ల విషయ ప్రాధాన్యం వల్ల ఇలాంటి వాక్యాలు కన్పిస్తాయి. ఇందులో అసహజమేమీ లేదు.

అట్లాగే హెచ్చరిక చేయబడింది, వార్త పంపబడింది అనే చోట్ల కర్తను గురించి చెప్పదలచుకోకపోవడం కన్పిస్తుంది.

**వాక్య ప్రయోగాలు – ఆమోదయోగ్యత :**

ఎ. 'నీకు మొన్న పరిచయం చేశానే అతనే పెళ్ళికొడుకు'.

బి. 'నీకు ఏ అబ్బాయిని పరిచయం చేశానో ఆ అబ్బాయే పెళ్ళికొడుకు'.

సి. 'నీకు పరిచయం చేసిన అబ్బాయి పెళ్ళికొడుకు'.

పై మూడు రకాల వాక్యాల్నీ ఒకే అర్థంలో వాడుతారు. మొదటిది మాట్లాడే భాషలో కనిపిస్తుంది అనుకుందాం. రెండు, మూడు రచనా భాషలో కన్పిస్తాయి. మూడో రకపు వాక్యాన్ని గురించి వివాదం లేదు. రెండో రకపు వాక్యమే తెలుగు పద్ధతి కాదని కొందరు అభిప్రాయ పడుతారు. ఇది తెలుగు పద్ధతి అవునా, కాదా అనే చర్చ జోలికి పోకుండా ఈ వాక్యాల అవసరాన్ని మనం గమనిద్దాం. మూడో రకపు వాక్యం సాధ్యం కాని సందర్భాలు కొన్ని ఉన్నాయి. ''నేను ఏ అమ్మాయితో సినిమాకు వెళ్ళానో, ఆ అమ్మాయి'' అనవచ్చు. అదే అర్థంలో ''నేను సినిమాకు వెళ్ళిన అమ్మాయి'' అనలేము. అంటే కొన్ని కొన్ని సందర్భాల్లో రెండవ రకపు వాక్యం రచనా భాషలో అవసరం అవుతుందన్నమాట. ఈ వాక్యాలు వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు అవసరం.

**ప్రసంగ క్రియలు :**

మామూలుగా మాట్లాడే భాషలో సాధారణంగా ఒకరన్న మాటను కోట్ అనుకరణం చేసినప్పుడు అన్నారనో, చెప్పారనో అంటాం. పత్రికలో ఎంతో మంది ఉపన్యాసాలనీ, ప్రకటనలనీ వారు చెప్పినట్లుగా రాయాల్సి ఉంటుంది. వారు చెప్పిన విషయాల్ని కొన్ని సార్లు రాయాల్సి ఉంటుంది. ఒక్క రెండు క్రియలతోటే అన్ని ప్రకటనలనూ, ఉపన్యాసాలనూ వర్ణించటం కుదరదు. అందువల్ల ఉద్ఘాటించారు, ప్రకటించారు, తెలియపరచారు, పేర్కొన్నారు అనే విధంగా రకరకాల క్రియలు ప్రయోగిస్తారు. ''విద్యుత్తుపై పన్ను పెంచక తప్పలేదని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు'' అని రాస్తే అసందర్భంగా ఉంటుంది. అదే క్రియను 'మద్యనిషేధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎత్తివేసేది లేదని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు'' అంటే సందర్భోచితంగా ఉంటుంది.

**వాక్య నిర్మాణం – కొన్ని విశేషాలు ప్రయోగాలు :**

ఒక నవలలో ఈ వాక్యం చూడండి : 'శవాన్ని హాస్పటల్ అధికారులు తీసుకుని పోవచ్చు అని అన్నా! అక్కడ ఉండే వార్డుబాయ్ లు అటకాయించారు'. ఈ వాక్యంలో 'హాస్పటల్ అధికారులు' అనే నామవాచకం 'తీసుకు పోవచ్చు' అనే క్రియ ఒకదాని పక్కన ఒకటి వచ్చాయి. రెంటికీ ఉద్దేశించని సంబంధం చదివిన వెంటనే వస్తుంది. ఇక్కడ 'హాస్పటల్ అధికారులు' అన్న మాటను 'అన్నా' క్రియకు ముందు చేరిస్తే ఈ ఉద్దేశించని అర్థం రాదు.

**ఉదాహరణకు ఈ క్రింది రెండు వాక్యాల్లో భేదం చూడండి.**

ఆమె ఆఫీసుకు జడవేసుకుని వెళ్ళింది.

ఆమె జడవేసుకుని ఆఫీసుకు వెళ్ళింది.

మొదటి వాక్యంలో అలంకరణ విధానానికి ప్రాధాన్యం వచ్చింది. రెండవ వాక్యంలో పనుల వరకే ప్రాధాన్యం. పత్రికల్లో మనం వెతికితే అనుకోని అర్థాలు వచ్చే వాక్యాలు ఇట్లాంటివి చాలా దొరుకుతాయి.

**పద, వాక్య ప్రయోగాల్లో పాటించాల్సిన జాగ్రత్తలు :**

పద ప్రయోగంలోనూ, వాక్య నిర్మాణంలోనూ తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలను ఇంతవరకూ పరిశీలించాం. ఇవి సాధారణంగా నేటి వచనంలో ఇతరత్రా కూడా కన్పిస్తాయి.

**సాంకేతిక భాషా పదం :**

ఒక భావనను వ్యక్తీకరించే సంక్షిప్త భాషారూపమే సాంకేతికపదం. ఇది శాస్త్ర విషయాలకు, శాస్త్రేతర విషయాలకు ప్రత్యేక అర్థాన్ని తెలియజేసే విశిష్టపదం. ఇది వ్యస్తంగా, సమస్తంగా ఉంటుంది. సాంకేతిక పదాన్ని గురించి వివిధ శాస్త్రజ్ఞులు చెప్పిన నిర్వచనాలను బట్టి సాంకేతిక పదం ఒక ప్రత్యేకపదమనీ, శాస్త్ర సంబంధమైన విషయాలను సంక్షిప్తంగా చెప్పడానికి ఉపయోగించే విశిష్టపదమనీ దానికి పర్యాయపదం ఉండదనీ తెలుస్తుంది.

ఏ భాషలోనైనా సాధారణ భాషా ప్రయోగానికి, సాంకేతిక భాషా ప్రయోగానికీ గుర్తించదగిన భేదాలు ఉంటాయి. సాధారణ భాష అంటే అందరికీ సమానమైన ప్రయోజనాల కోసం అందరూ వాడుకునే భాష. సాంకేతిక భాష అంటే ఒక ప్రత్యేకమైన విషయాన్ని గురించి ఒక వర్గం వ్యవహర్తలు వాడుకునే భాష. లిఖిత భాషలో సాంకేతిక భాష అవసరం మరీ ఎక్కువ.

**శాస్త్ర సాంకేతిక పరిభాష–తెలుగులో పదనిధి నిర్మాణం :**

సాంకేతిక పదనిర్వహణలో సంజ్ఞాశబ్దాలకు వలె లాఘవాన్ని ఆదరించాలి. దానికి సౌందర్యం తోడు కావాలి. అంటే ఆ పదం సాధ్యమైనన్ని తక్కువ వర్ణాలు కలిగి సుందరంగా ఉండాలి. ఉదాహరణకి ధూమవాహనం అనక్కరలేదు. 'ధూమి' అంటే చాలు.

ఈ విభజన పద నిర్మాణంలో ఎక్కువగా కనిపిస్తుంది. అందువల్ల సాంకేతిక భాష అని వ్యవహరించినప్పుడల్లా ఎక్కువ మంది ఉద్దేశించేది సాంకేతిక పదాలనే.

వాక్యంలో అర్థ విస్తీర్ణత ఉంటుంది. పదంలో అర్థక్లుప్తి ఉంటుంది. పదంలో చెప్పిందల్లా వాక్యంలో చెప్పడం సాధ్యమే. అయితే పదం వాడవలసిన చోటల్లా వాక్యం వాడాల్సి వచ్చే మనుష్యుల శక్తి వ్యయం ఎక్కువ అవుతుంది. అందుకే సంఘంలో సాంకేతిక పరికరాల (technology) అభివృద్ధి, భాషలో సాంకేతిక పద నిర్మాణం అవసరం అవుతాయి.

**కొన్ని నవీన సాంకేతిక పదాలు :**

Cellphone - చరవాణి Sent Call - గతం Online - ధార Missed Call - అగతం/అప్రాప్తం Download - ప్రత్యక్షీకరణం Inbox - మంజూష/పేటిక On - సహితం Radio - వియద్వాణి Silent Mode - ''భృతం Received Call - ఆగతం SMS - సంక్షేపం అయితే సమాజంలో తత్త్వశాస్త్రం, సాహిత్య శాస్త్రం, వ్యాకరణ శాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి శాస్త్రాలు బాగా అభివృద్ధి చెందినట్లు మనకు సాక్ష్యాలున్నాయి. ఇవికాక గణిత, భౌతిక, రసాయనిక, వైద్యశాస్త్రాల్లో కూడా గణనీయమైన అభివృద్ధి సాధించింది.

ప్రాచీన భాషా సహాయమున్న ఆధునిక భాషలన్నింటికీ ఈ సౌకర్యం ఉంది. ఇంగ్లీషులో Water, Hydro అనే మాటలు సమానార్థకాలైనా, సాంకేతిక భాషలో Hydro అనే మాటను వాడతారు. ఇది గ్రీకు నుంచి Hydrochloric acid, Hydroelectricity waterchloric acid అని water electricity అని అనరు. అట్లాగే తెలుగులో ఉదజహరికామ్లము అనే మాటే సైన్సో వాడతాం కాని నీటి ఉప్పు పులుసు అని అనం. Hydro electricity జలవిద్యుత్ అంటాము. కాని నీటిమెరుపు అని గాని నీటి వెలుగు అని గానీ అనం. దీని అర్థం ఏమిటంటే ఒక భాషలో పురాతన భాషా (classical language) పదాలు, ఆధునిక భాషా పదాలు సమానార్థకాలుగా ఉంటే పురాతన భాషా పదాలు సాంకేతిక పద నిర్మాణానికి పనికి వస్తాయి.

**తెలుగులో సాంకేతిక పదాలు రూపొందడం :**

భాషాభివృద్ధి సాంకేతికపద విస్తృతిపై ఆధారపడి ఉంటుంది. భాషలో ఎన్ని ఎక్కువ సాంకేతిక పదాలు ఉంటే భాష అంత ఎక్కువగా అభివృద్ధి పొందిందని చెప్ప వచ్చును. సాంకేతిక పదాల రూపకల్పన అందుకు అనుసరిస్తున్న పరికరాలను బట్టి ఒక భాష ఏస్థాయిలో అభివృద్ధి చెందిందో తెలుస్తుంది. అవసరం అనిపించని పాతభావనలు మరుగనపడిపోతాయి. కొత్తభావనలు

ఆవిర్భవించినప్పుడు అందుకు కావలసిన సాంకేతికపదాల సృష్టి జరుగుతుంది. ఈ సృష్టే భాషాభివృద్ధిలో శక్తివంతమైన పరికరం.

అందుకుగాను అత్యంతావశ్యకమైన సాంకేతిక పదాల రూపకల్పనకు ఉపకరించే పద్ధతులు/పరికరాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి కొన్ని :

1. ఆదానం : 2. పౌరాణికీకరణ: 3 వృత్తికారుల పదజాలం 4. వివిధశాస్త్రాల పాఠ్యగ్రంథాల, నిఘంటువుల, జ్ఞానపత్రికల, పరిశోధన పత్రికల్లోని సాంకేతిక పదాల ఔచిత్యాన్ని పరిశీలించడం.

**సాంకేతికపదాల ప్రామాణికీకరణ – మార్గదర్శకాలు :**

భాషాభివృద్ధికి సాంకేతికపదాల ప్రామాణికీకరణ అత్యంతకీలకమైన అంశం కాబట్టి ప్రామాణికీకరణ విషయంలో శాస్త్ర నిపుణులు, భాషాశాస్త్రజ్ఞులు, పరిశోధకులు, పాత్రికేయులు, సృజనాత్మక రచయితలు, వివిధ వృత్తులలోని, వివిధరంగాలలోని అనుభవజ్ఞులు సమష్టిగా కృషి చేయవలసి ఉంది.

**మార్గదర్శక సూత్రాలు :**

1. వాడుకలో ఉన్న పదాలను స్వీకరించాలి. పదాల కూర్పు కృత్రిమంగా కాక సహజంగా ఉండాలి.
2. నిష్పాదక ప్రత్యయాలతో వివిధ రూపసాధన అవసరాలకు వీలుగా పదాలకూర్పు ఉండాలి.
3. క్లుప్తంగా స్పష్టంగా వచ్చేవిధంగా ఉండాలి.
4. ఒకే పదరూపానికి వేరువేరు భాషలో వేరువేరు అర్థాలనిచ్చే భాషాపదాలు సాంకేతిక పదాలుగా ఉండకూడదు.
5. ఉచ్చారణ సామ్యం వల్ల విపరీతార్థాలకు ఆస్కారం ఉండకూడదు.

ఉదా : Wireless Message వితంత్రి సమాచారం/ వితంతు సమాచారం.

**వ్యక్తీకరణ సామర్థ్యం :**

ఒక్కోసారి మాటలు ఇంగ్లీషులో ఉన్న వాటికి సరిపోయినట్లు కన్పించినా అవి ఉద్దేశించిన అర్థాన్ని వ్యక్తం చేయలేక పోవచ్చు. ఉదాహరణకు Social dialect అనే మాటను 'కుల మాండలికం' అని పి. ఎస్. సుబ్రహ్మణ్యం గారు వాడారు. అట్లాగే relative chronology అనే మాటకు సుబ్రహ్మణ్యం గారు తారతమ్య చరిత్ర, cyclic principle అనే దానికి 'తరంగ న్యాయం' అనీ వాడారు. రెండు ధ్వని పరిణామాల మధ్యన కాలానుక్రమణిక సూచిస్తే దాన్ని relative chronology అంటారు.

ఆధునిక భాషా శాస్త్రంలో ఇంగ్లీషులో కూడా రోజు రోజుకీ కొత్త పదాలు పుడుతూనే ఉన్నాయి. స్వతంత్ర రచన చేస్తున్నప్పుడు, స్వతంత్ర భావనలకు స్వతంత్ర పదాలు కూడా ఏర్పడుతాయి. ఇక్కడ ప్రధానంగా గ్రహించాల్సింది ఏమిటంటే ప్రతి బావనకూ ఇంగ్లీషు నుంచే వెతుక్కోనక్కరలేదనీ స్వతంత్ర రచన తెలుగులో చేస్తే ఆయా సందర్భాలకు అనుగుణంగా కొత్త భావనలు ఏర్పడ్డప్పుడు కొత్త పదాలు కూడా అవసరాన్ని బట్టి ఏర్పడతాయని భావించాలి.

**శాస్త్ర సాంకేతిక పరిభాషా పదనిర్మాణంలో C.S.T.T చేస్తున్న కృషి :**

1965లో Commission for Scientific and Technical Terminology (C.S.T.T.) స్థాపించారు. Commission for Scientific and Technical Terminology శాస్త్ర సాంకేతిక పరిభాషా సంఘం, ప్రపంచీకరణ దృష్ట్యా ఆధునిక శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలకు అనుగుణంగా భాషాభివృద్ధి జరగాల్సి వుంది. 19వ శతాబ్దంలో వచ్చిన శాస్త్రీయ మార్పులు, ఆవిష్కరణల ఫలితంగా కొత్తకొత్త పదాలు పుట్టుకొచ్చాయి. దీనివల్ల భారతీయ భాషల్లో నూతన శాస్త్ర సాంకేతిక పదసృష్టి చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

**C.S.T.T ప్రధాన కార్యకలాపాలు :**

1. హిందీ మరియు ఇతర భారతీయ భాషల్లోని శాస్త్ర సాంకేతిక పరిభాషలో మార్పు తీసుకురావడం.
2. Pan Indian Terminology ని గుర్తించడం. గుర్తించిన పదాలను భారతీయ భాషల్లో అత్యధికంగా ఉపయోగించేలా వ్యాప్తి చేయడం.
3. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మోనోగ్రాఫ్లను, శాస్త్రసాంకేతిక విషయాలను, ఉపవాచకాలరూపంలో ప్రచురించడం.

4. విశ్వవిద్యాలయ, కళాశాలల ఉపాధ్యాయులకొరకు పరిభాషా వర్క్షాప్లు నిర్వహించడం.

**వ్యవసాయ శాస్త్రంలో శాస్త్ర సాంకేతిక భాష :**

ఒకప్పటి విద్యావ్యవస్థ ఈనాడు లేదు. ఒకప్పటి భాషా వ్యవస్థ ఈనాడు లేదు. ఒకప్పటి అధ్యయన, అనుశీలన కృత్యావ్యవస్థలు ఇప్పుడు లేవు. కొత్త కొత్త శాస్త్రాలు, సాంకేతికరంగాలు ఆవిష్కరించబడుతున్నాయి. వీటికి అనుకూలంగా ఆంగ్లభాష ఎప్పటికప్పుడు ఆధునీకరించ బడుతుంది. మరి మనభాషలో అలాంటి కొత్తకొత్త మార్పులు వస్తున్నాయా? కొత్తమాటలు తయారు చేసుకో గలుగుతున్నామా? లేదు. ఒకప్పుడు సంస్కృత పదజాలాన్ని ఇప్పుడు ఆంగ్లపదజాలాన్ని వాడుతున్నాం. అన్యదేశ్యాలు అవసరమే కాని తప్పనిసరి కాదు. పల్లెల్లోకి వెళ్తే వ్యవసాయానికి సంబంధించిన మాటలను మూట కట్టు కొని రావచ్చు. ఎన్నో పదనిధులను తయారు చేసుకోవచ్చు.

**నీటిపారుదల – నీటితడులు Irrigation management**

**ఉదా :** జలసంరక్షణ సాగునీటి సద్వినియోగం జల వనరుల సంరక్షణ Water management నీటిపారుదల పద్ధతులు :

ఎ) చెక్ బేసిన్ (చిన్నమడులు)

బి) బోర్డర్ స్ట్రిప్ మెథడ్ (పొడవైన మళ్ళు/కయ్యలు)

సి) స్ప్రింక్లర్స్ - తుంపర్ల పద్ధతి, బిందుపద్ధతి

డి) సైఫను గొట్టాలు, స్పైల్స్

ఇ) ఫెర్టిగేషన్ (fertilizer + irrigation)

rrigated dry conditions ఆరుతడి ఈ పరిభాషపదం అచ్చమైన తెలుగులో అందంగా ఉంది.

**ముగింపు :**

లిఖిత భాషలో సాంకేతిక భాష అవసరం మరీ ఎక్కువ. అందుకే సంఘంలో సాంకేతిక పరికరాల (technology) అభివృద్ధి, భాషలో సాంకేతిక పద నిర్మాణం అవసరం అవుతాయి. భాషాభివృద్ధికి సాంకేతికపదాల ప్రామాణికీ కరణ అంత్యంతకీలకమైన అంశం కాబట్టి ప్రామాణికీకరణ విషయంలో శాస్త్ర నిపుణులు, భాషాశాస్త్రజ్ఞులు, పరి శోధకులు, పాత్రికేయులు, సృజనాత్మక రచయితలు, వివిధ వృత్తులలోని, వివిధరంగాలలోని అనుభవజ్ఞులు సమష్టిగా కృషి చేయవలసి ఉంది. (శాస్త్ర సాంకేతిక పరిభాషా సంఘం). ప్రపంచీకరణ దృష్ట్యా ఆధునిక శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలకు అనుగుణంగా సాంకేతిక భాషాభివృద్ధి జరగాల్సి వుంది.

**ఆధార గ్రంథాలు :**


1. ఆచార్య కోరాడ సుబ్రహ్మణ్యం. 2016. శాస్త్రసాంకేతిక పరిభాష: తెలుగులో పదనిధినిర్మాణం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
2. డా. ఎ. పాండయ్య, తెలుగు అకాడమీ, తెలుగులో సాంకేతికపదాల రూపకల్పనలో భాషాశాస్త్రసూత్రాలు 2016. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. రామారావు, చేకూరి. 2003, “తెలుగులో వెలుగులు”, నవోదయ బుక్స్: హైదరాబాదు.
4. ఆచార్య పగడాల చంద్రశేఖర్. 2016. తెలుగులో శాస్త్రసాంకేతిక పరిభాష-రూపకల్పనలో తెలుగు దినపత్రిక పాత్ర. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
5. వై. రెడ్డి శ్యామల, వడ్ల సుబ్రమణ్యం. 2016. తెలుగులో శాస్త్ర సాంకేతిక పరిభాషా నిర్మాణం సమస్యలు పరిష్కారాలు DRS - 1 ప్రాజెక్టు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
6. ఆచార్య చేకూరి రామారావు. 2000. భాషాంతరంగం (భాషా నిర్మాణవ్యాసాలు). పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్ హైదరాబాదు.
7. ఆచార్య చేకూరి రామారావు. 2000. భాషానువర్తనం భాషా ప్రయోగ వ్యాసాలు. చెర పుబ్లికేషన్ యస్టి .7, హబ్సిగూడ, హైదరాబాదు -500 007.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# రాధికాసాంత్వనం - ముద్దు పళని కవితా వైదుష్యం



- డా॥. కొయ్యా శ్రీనివాసులు

తెలుగు విభాగాధిపతి & లెక్చరర్, శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బుక్కపట్నం.

**ముద్దుపళని జీవిత విశేషాలు :**

ముద్దుపళని బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఆంధ్ర కవయిత్రులలో ముద్దుపళనిది విశిష్ట స్థానము. ఈమె తంజావూరి మహారాష్ట్ర రాజగు ప్రతాపసింహుడు (1769-1782) ఆస్థాన కవయిత్రి, ఒక వేశ్యాంగన, ముద్దుపళని తన రాధికాసాంత్వన గ్రంధావతారికలో తన వంశక్రమమును, విద్యావిశేషాలను ఈ విధంగా తెలుపుకొన్నది.

ముద్దుపళని తంజావూరు నాగవాసంలో పుట్టింది. ఆవూరిలో తంజనాయకి అనే గొప్ప వేశ్య ఉండేది. ఆమె వీణ అద్భుతంగా వాయించేది, కమ్మగా పాడేది, ఠీవిగా నటించేది. సభల్లో కమ్మగా ప్రసంగించేది. అందుకే ఆమెను చాలామంది దొరలు, ప్రభువులు ప్రశంసించారు. "అలా తంజనాయకీమణి, కలిమియు జెలిమియు గణింపగా దరమగునే?" అంటుండే ముద్దుపళని తంజనాయకీ గుణగణాలను!

తంజానాయకికీ పిల్లలను పెంచుకోవాలనే కోరిక కలిగి ఆ ఊర్లోని "అయ్యావయ్య, చెంగాతి" దంపతుల కుమారుడు, కుమార్తెను పెంచుకోండి. ఆ కొడుకు పేరు ముత్యాలు. కుమార్తె పేరు రామామణి.

ఈ రామామణి గొప్ప సౌందర్యవతి అగుటయే గాకుండా భగవద్భక్తురాలై, దానధర్మాదులలో ప్రసిద్ధికెక్కింది. "మేటి యెవ్వతె గండరకోట లోన, మరియు నిత్యాది దానాది మహిమలంది, పార్వతీశుల నిత్యోత్సవములొనర్చె, నట్టి రమామణి వధూటి నలవె పొగడ" అంటుంది ముద్దపళని.

ముత్యాలు, పోటిబోటిని పెండ్లాడి సంతానవంతుడయ్యెను.

**ముత్యాలు - పోటిబోటి**

ముద్దుపళని | వేలాయుధుడు | ముద్దుకుమారస్వామి | ముద్దులక్ష్మి | ముద్దయ | పద్మావతి | రామస్వామి

పై సంతానములో పెద్దకూతురు ముద్దపళని, ఆ వంశానికి ఎనలేని కీర్తిని తెచ్చింది. ముత్యాలు సుబ్రహ్మణ్యస్వామి భక్తుడు. పళని గొప్ప కుమారస్వామి ఆలయం. ఆ పేరే కూతురికి తండ్రి ముత్యాలు పెట్టాడు.

దక్షిణాదిలో క్షేత్రాల పేర్లు పిల్లలకు పెట్టడం సర్వ సామాన్యం ఉదా : తిరుపతయ్య, కదిరప్ప, సింహాచలం, యాదగిరి, శ్రీశైలం. అలాగే 'ముద్దు' అనేది దక్షిణాదిలో ఆ స్వామి సూచకపదం.

యౌవనానికి వచ్చిన ముద్దుపళని సాహిత్య విశారద అయింది. కవిత్వం చెప్పడం నేర్చుకొంది. లలిత కళా వైభవంతో ఒక వెలుగు వెలిగింది. ఆమె ఇంటికి విటులేగాక విద్వాంసులు కూడా వస్తూండేవారు! ముద్దుపళని కృతులు రచించడమే గాకుండా కృతులు కూడా అందుకొన్నట్లు తన కావ్యవతారికలో తెలియజేసింది. కానీ ఆకృతులేవో తెలియడంలేదు. ఆమె ఇతర రచనలు కూడా నేడు కనబడడం లేదు. స్త్రీలలో కృతులు రచించినవారు కలరు కానీ, ముద్దుపళని వలె కృతులందుకొన్నవారు లేరు. ఈ విషయములో ముద్దుపళని విశిష్టత ఎన్నదిగినది. ఈమె తన విద్యావైదుష్యాన్ని గూర్చి క్రింది ఆశ్వాసాంత గద్య నుండి తెలుసుకోవచ్చు.

"ఇది శ్రీ చిన్ని కృష్ణ కరుణాకటాక్షా వీక్షణక్షణ ప్రవర్థ మాన సూన శృంగార రస ప్రధాన సంగీత సాహిత్య భరత శాస్త్రాది విద్యా పారంగత శ్రీమత్తిరుమల తాతయ్యాచార్య పాదారవింద మిళిందాయమాన మానస చోళ సంహా సనాధ్యక్ష ప్రతాపసింహ మహరాజ బహుకృతానేక చామీక రాంబరాభరణ, ముత్యాలు గర్భశుక్తి ముక్తాయమాన ముద్దుపళని ప్రణీతంబైన రాధికాసాంత్వనంబును శృంగార ప్రబంధంబునందు ప్రథమాశ్వాసము."

ముద్దుపళని అందచందాలు, ఆటపాటలు, ఆనాటి తంజావూరి ప్రభువు మహారాష్ట్ర రాజు ప్రతాపసింహుని దృష్టిలో పడ్డాయి. ప్రతాపసింహుడు గొప్ప సాహితీ సర్వజ్ఞమూర్తి. ఆయన ముద్దుపళనిని ఆదరించాడు. సంగీత సాహిత్య భరత శాస్త్రాల వంటి విద్యలలో పారంగుతారలయిన ఆమెను సత్కరించాడు. ఎన్నో బహుమానాలు ఇచ్చాడు. ఆమెను చేపట్టాడు.

**రాధికాసాంత్వనం – కావ్య విశేషాలు :**

ముద్దుపళని చిన్నికృష్ణుని శృంగార భక్తురాలు. ముద్దుపళనికి కలలో చిన్నికృష్ణుడు ప్రత్యక్షమై రాధికాసాంత్వనము కావ్యము రచించి తనకు అంకితము ఇమ్మని ఆదేశించినట్లు తన అవతారికలో ఇలా చెప్పుకొన్నది.

తే. చిన్నికృష్ణుండనే నాడు చిత్తమునకు - సమ్మతం
బైన రాధికాసాంత్వనంబు
తగ నొనర్ప మదీయాంకితముగ నీవు
లలిత గుణ పేణి! శ్రీముద్దుపళని బోటి!

కవయిత్రి ముద్దుపళని తన స్వప్నాన్ని గురువైన వీర రాఘవ దేశిక సార్వభౌమునికి తెలిపి ఆయన ఆశీస్సులు, ఆనాటి విద్వజ్జన సంఘ ప్రోత్సాహముతో కావ్యాన్ని రచించింది.

ఈ కావ్యములో 585 గద్యపద్యములున్నాయి. షష్ఠ్యంతములు, ఆశ్వాసాంత పద్యగద్యములలో తప్ప, మిగతా గ్రంథము అంతటా తెలుగు పలుకుబడులు, జాతీయాలతో అలరారుచున్నది. ఒకటవ ఆశ్వాసమున 154 పద్యగద్యలు, రెండవ ఆశ్వాసమున 147 పద్య గద్యలు, మూడవ ఆశ్వాసమున 171 గద్యపద్యలు, నాల్గవ ఆశ్వాసమున 113 గద్యపద్యలు కలవు. ఈ నాలుగు ఆశ్వాసాలలోనూ కథాంశము స్వల్పమేయని చెప్పవచ్చు.

ముద్దుపళని రాధికాసాంత్వనము కావ్యం రాయక ముందే వంద ఏండ్లకు పూర్వమే సుముఖము వేంకట కృష్ణప్ప నాయకుడు "రాధికాసాంత్వనము" అనుపేర చాటు ప్రబంధాన్ని ఏకాశ్వాసములో రచించాడు. దీన్ని కవి గారు ఆ గ్రంధాంత గద్యయందు ఈ విధంగా చెప్పి యున్నాడు.

"ఇది శ్రీమత్పాండ్య మండలాధీశ్వర శ్రీ విజయరంగ చొక్కానాథ కటాక్షలబ్ధాఖిల సంపత్పారంపరీ సమేధమాన సముఖ మీనాక్షి నాయక తనూభవ మీనాక్షి దేవి కటాక్ష లబ్ధ వికతా సంప్రదాయక వేంకట కృష్ణప్ప నాయక ప్రణీతంబైన రాధికాసాంత్వనంబను చాటు ప్రబంధంబు సర్వంబు నేకాశ్వాసము."

సుముఖం వేంకటాకృష్ణప్ప తన రాధికాసాంత్వన కావ్యాన్ని 126 పద్యగద్యములలో ఏకాశ్వాసములో రచించాడు. ఇందలి ఇతివృత్తం శ్రీకృష్ణుడు రాధను అనునయించుట. శృంగార రసపూరితంగా, సంభోగ వర్ణనలతో రసవత్తరంగా రచించాడు.

ముద్దుపళని రచించిన రాధికాసాంత్వనమునకు మూలము సుముఖం వేంకటకృష్ణప్ప నాయకుని కృతియే యని విమర్శకులు నిరూపించినారు. కానీ కవి గారి ఏకాశ్వాస చాటు ప్రబంధాన్ని నాలుగాశ్వాసములతో కమనీయ, రమణీయ, రసబంధురంగా ప్రబంధాన్ని రచించి పాఠకుల హృదయాలను కొల్లగొట్టింది.

**రాధికాసాంత్వనం కథాంశం :**

సాంత్వనం అంటే సముదాయించడం, ఓదార్చడం, అనునయించమనే అర్థాలు ఉన్నా అసలైన అర్థం ఇక్కడ మాత్రం "అలిగిన వారి అలక తీర్చడమే" అన్నది సరియైన రూఢార్థం. రాధ అలిగింది, కష్ణుడు రాధ అలుకను ఏ విధంగా తీర్చాడు అన్నదే ఈకృతిలోని సంగ్రహ కథ.

శ్రీకృష్ణుని పెంపుడు తల్లిదండ్రులు యశోదానందులు వారు గారాబంగా చిన్నికృష్ణుని రేపల్లెలో పెంచుకొంటున్నారు. నందుని చెల్లెలు రాధ. చిన్నికృష్ణుడంటే రాధకు ఎంతో ప్రేమ. చిన్నికృష్ణుడు యవ్వనవంతుడైనాడు. రాధ కృష్ణుని మోహించి తన వశం చేసుకొన్నది. యశోద అన్న కుంభకుడు. అతని కుమార్తె ఇళ. ఇళ చిన్నప్పటి నుండి రాధ పోషణలో పెరిగింది. ఇళ పెద్ద మనిషియైంది. ఇళను కృష్ణునికిచ్చి వివాహం చేసినారు. ఇళ వయసులో చిన్న, తెలివితేటలలో మిన్న. కావున కావున కృష్ణుని తన పైట కొంగుకు ముడివేసుకున్నది.

కొన్నిరోజుల తర్వాత కృష్ణుడు అత్తవారింటికి ఇళాదేవితో మిథిలా నగరానికి వెళ్ళినాడు. అప్పటి నుండి రాధ కృష్ణుని విరహవేదన భరించలేక ఇళపై ద్వేషం పెంచుకొన్నది. ఒక చిలుక ద్వారా కృష్ణుని వద్దకు రాయబార మంపినది. చిలుక ఇళా కృష్ణుల సంగతి చూచివచ్చి వాళ్ళ అన్యోన్యతను రాధకు చెప్పగానే రాధ మరింత దు:ఖితురాలై వడలిపోయింది, తనను తాను నిందించుకొన్నది.

కొన్నిరోజులకు రాధను చూచుటకు కృష్ణుడు రేపల్లెకు తహతహలాడుతూ వచ్చినాడు. రాధ ఉక్రోషముతో కోపపడి, మండి పడి కృష్ణున్ని అనరాని మాటలనింది, కొట్టింది, తన్నింది, ఏడ్చింది. శ్రీకృష్ణుడామెను ఓదార్చి, సాంత్వన వచనములు పలుకగానే కృష్ణుని కౌగిలిలో కరిగిపోయింది. రాధికా సంబంధమైన సాంత్వనము ప్రధానము కావున ఈ కృతికి "రాధికాసాంత్వనము" అనుపేరు సరిగ్గా సరిపోయింది.

**పాత్రచిత్రణా నైపుణ్యం :**

ముద్దుపళని మృదుమధురమైన కవితరాయటంలో ఆమెది అందెవేసినచేయి. ఈమె తన కావ్యములో పాఠకుల హృదయాలను హత్తుకునే మధురమైన కవితతో బాటు, పాఠకుల హృదయాల్లో శాశ్వత ముద్రవేసే పాత్ర చిత్రణా నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. ఈ కావ్యంలో కృష్ణుడు, రాధ, ఇళ, గోపికలు, కుంభకుడు, శ్రీరాముడు, చిలుక, చెలికత్తెలు మొ॥ పాత్రలు రాధా కృష్ణులు, ఇళ, చిలుక మాత్రమే.

"వ్రేపల్లెలో గల తలిరుబోండ్లు, హరికపట చర్యలకు మోహితాత్ములైరి" - అటువంటి మోహితరూపం, శ్రీకృష్ణుని సొంతం. "నందుని మందిరమున వాసయైయుండు గౌస్తుబోద్భాసితుండు, దానవవిదారి, దృష్టి చిత్తాపహారి, భవ్యగుణపాళి, మదనగోపాల మౌళి" శ్రీకృష్ణుని శృంగార విలాసాన్ని కావ్యం నిండా నిండుగా వర్ణించింది.

రాధ ఇళాకృష్ణులకు వివాహం జరిపించింది. ఇళా మాధవుల రతికేళిని తలచుకొని రాధ విరహవేదనలో

ఆ॥ సొమ్ము లియ్యవచ్చు సమ్మంద మియవచ్చు -
నియ్యరాని ప్రాణమియ్యవచ్చుజ
దనదు విభుని వేఱు తరుణి చేతికి నిచ్చి -
తాళవశమె యెట్టిదానికైన?

తే॥ మున్నెయదిజాణ, సిగ్గుచేనున్నజ గాని -
విభుడవగజ జేసి తను వ్రీడ వీడజ జేసి
చేరజగా దీసి, యందందుజ జేయివేసి - కొమ్మని
టమున్నె తాదిద్దు కొనకయున్నె? అంటూ రాధ

ఇళపై అసూయ వెళ్ళ గ్రక్కి కృష్ణుని జాణతనాన్ని నెమరువేసుకుని మరింత విరహవేదనలో నలిగిపోయింది.

కృష్ణుడు మంచి సంభాషణా చతురుడు. ఇళతో పెళ్ళయింది. అంతకుముందే రాధతో సంబంధముంది. మొదటిరాత్రి ఇళతో కృష్ణుడు

సీ॥ చిన్ననాటనె చెల్మిజ జేసితి మెడ లేక

మనకేటి సిగ్గులే మధురవాణి?
నే బల్కజగా లేదే నినుజజూచి, ననుజజూచి
యీ వేళ మాటాడ విందువదన?
కూడి యిన్నాళ్ళాట లాడామో? యెటు పోయె
నా యాటలీయాట లంబుజాక్షి?
పోనీ పో, నేనేమి పొరుగూరి వాజడనా?
నీకు మేనఱికంబు నీల వేణి?

తే॥. యళుకు లేటికి ననుజ జూచి కులుకు లాడి -
మోము జూడవె మోమెత్తి మోహనాంగి
ముద్దుగా ముద్దులియ్యవే ముద్దు గుమ్మ! -
మాటుకే లజగకే నాయాన మందయాన!

ఈ విధంగా ముద్దు ముద్దుగా సరసల్లాపాలతో గడిపాడు ముద్దుపళని ఇళా కృష్ణుల శోభనాన్ని పాఠకులను రసలోకాలలో విహరింప జేసింది. కావ్యం అంతటా పసందైన కవితతో పట్టు పాన్పులపైన పాఠకులను పడుకోబెట్టి రసాస్వాదనలో మునిగే పద్యాలు కోకొల్లలు. గోపికా వల్లభుని పాత్రను శృంగార రసోపేతంగా తీర్చిదిద్దింది.

**పాత్రచిత్రణా నైపుణ్యం :**

**రాధ పాత్ర చిత్రణ :**

రాధికాసాంత్వనములో రాధ పాత్ర ప్రధానమైనది అని చాలా సాదాసీదా పదాలతో చెబితే సరిపోదు. కవయిత్రి ముద్దపళనే పరకాయ ప్రవేశం చేసి రాధ పాత్రను ఆనాటి సాంఘిక పరిస్థితులకనుగుణంగా తీర్చిదిద్దింది. శ్రీ కృష్ణుని ప్రాణ నాయికగా రాధ పాత్రను అమోఘంగా తీర్చిదిద్దింది.

రాధ ఇళకు కృష్ణునితో వివాహం జరిపించి అత్త వారింటికి పంపింది. అప్పుడు రాధ తన దుర్భర వినియోగమును చిలుకకు తెలిపే సందర్భములో "కంటికి నిద్రరాదు, విను కాంతుని బాసిన నాటి నుండియున్, వంటకం మింపుగాదు, పెఱ వార్తలు వీనుల సోంకలేదు, నే డొంటి బ్రొద్దుపోదు" అంటూ రాధ బాధపడుతూ చిలుకతో

సీ॥ కనుగవ హరిమోము గనుగొననే కోరు
వీనులు హరిమాట వినగ గోరు
నాసిక హరి వాసనల్ కొనగోరు
నధరంబు హరి మోవి యానజ గోరు
జెక్కివి హరిగోటి నొక్కు టెక్కులె కోరు
గుబ్బలు హరి ఱొమ్ము గ్రుమ్మ గోరు
గరములు హరి మేను కౌగిలింపగ గోరు
మేను శ్రీహరి ప్రక్క మెలగ గోరు.

తే॥ నిన్ని యొక్కొక్కటే కోరు, నిదిగో నాదు - మనసు
కోరెడి కోరికల్ మట్టులేవు
మర్మమెందుకు? మదన సామ్రాజ్య మిచ్చి -
నెగడు హరియె యాదుర్దాయ మగుట శుకమ!

రాధ తన దుర్భర నియోగాన్ని చిలుకకు తెలిపే సందర్భంలోని పద్యాలలో రాధ అంతరంగం, కృష్ణుడే సర్వస్వమని ఆయన లేకపోతే క్షణకాలం కూడా కష్టకాలంలా భావించింది.

**రాధికాసాంత్వనం – బ్రిటీష్ ప్రభుత్వ నిషేదం :**

బెంగళూరు నాగరత్నమ్మ గారు రాధికాసాంత్వనం తాటాకుల ప్రతిని సంపాదించి పాఠ పరిష్కరణ చేశారు. ఈ కావ్యాన్ని వావిళ్ల వారు 1910లో ముద్రించారు. ఈ కావ్యంలోని శృంగారాన్ని లోతుగా నెంచిన కొందరు సంప్రదాయ ప్రబుద్ధులు బ్రిటీష్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దాన్ని నెపంగా చూపిన గ్రంథాన్ని నిషేదించడమే గాకుండా, దాని ప్రతులను కూడా తగలబెట్టించింది. 1947లో అప్పటి ఉమ్మడి మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఈ గ్రంథం నిషేధం ఎత్తివేయించారు. ఈ కావ్యాన్ని రసికతా స్వభావం కలిగిన చదువరులు రహస్యంగా చదివేవారు. ఆ తర్వాత ఎమెస్కో ప్రింటర్స్ వారు సంప్రదాయ సాహిత్య ప్రచురణలో భాగంగా ఈ కావ్యాన్ని ముద్రించడంతో ఇప్పుడు అది అందరికి అందుబాటులో వుంది.

**బూతు కవిత్వం – విమర్శ :**

ఇందులోని డజనుకు పైగా పద్యాలు బూతు పద్యాలుగా ఉన్నాయని, ఇవి చదవడం వలన యువత పెడతోవ పడుతుందని కొంతమంది పెడబొబ్బలు పెట్టారు. ఈ గ్రంథాన్ని సేకరించిన నాగరత్నమ్మ గారు

ఆ విమర్శను తిప్పి కొట్టారు. హృదయానికి ఆహ్లాదం కలిగించి, ఊహలకు ఉత్తేజం అందించి, మనసుకు కొత్త రెక్కలిచ్చే పాటైనా, పదమైనా, కథైనా, కావ్యమైనా అది మంచి సాహిత్యమే అవుతుంది. ఏ విధంగా చూసినా ముద్దుపళని కవిత్వం ముచ్చటైన కవిత్వం.

ఆరుద్ర చెప్పిన ఒక్క మాట "కావ్యంలోని గుణం కన్నా కవయిత్రి కులానికి ప్రాముఖ్యం ఇవ్వడం తగని పని" మన పూర్వులు ఆ దృష్టిలోనే చిన్న చూపు చూశారు. అయితే తిరుపతి వేంకట కవులు, మల్లాది రామకృష్ణ శాస్త్రి తదితరాలు మాత్రం రాధికా సాంత్వనానికి ఇవ్వవలసిన స్థానం ఇచ్చారు.

**వ్యావహారిక భాషాపద ప్రయోగం :**

ముద్దుపళని కవిత్వం విశిష్టమైనది. రాధికా సాంత్వనమునందు కవయిత్రి ఆనాటి వ్యవహారములోని ప్రజాభాషలోని పసందైన పలుకుబడులు, సందర్భాను గుణంగా ప్రయోగించింది.

"విడకదాదులడుగులకు మడుగులొత్త"

- ప్ర.ఆ. 14వ పద్యం

("అడుగులకు మడుగు లొత్తుతున్నాడు/తుంది" అనే నానుడి ఈనాటికీ ప్రజల భాషలో ప్రబల ప్రయోగంలో వుంది.)

"మనిషి కాటున కెందు మందు లేదందురు"

- ద్వి.ఆ. 6వ పద్యం

మనిషి కాటుకు మందులేదు అనేది తెలుగు నాట ప్రఖ్యాత జాతీయం.

"జోడు జోడుగ నన, నీడు జోడు లేక"

- ద్వి.ఆ. 28వ పద్యం

తెలుగునాట వ్యావహారిక భాషలో "ఈడు జోడు" అనే జంటపదాలు స్నేహంగా ఉన్నవారిని చూసి, అందమైన జంటను చూసినప్పుడు, పెళ్ళి సంబంధాలప్పుడు ఈ జంటపదాలను వాడతారు.

"విడుపుడీ వట్టికూతలు పికములార! - నిలుపుడిక వెఱ్ఱికేకలు నెమ్మిలారా"

- ద్వి.ఆ. 100వ పద్యం

ప్రజా వ్యవహారములో గ్రామీణ ప్రాంతాల్లో "విడవండి, నిలపండి, వట్టికూతలు, వెఱ్ఱికేకలు," అనే మాటలు సాధారణంగా వినబడుతుంటాయి.

"వారి వీరిని నననేల?"

- తృ.ఆ. 45వ పద్యం

"ఎల్లవారికి శకునంబులెల్లజ బలికి - బల్లి తాజబోయి తొట్టిలో బడిన రీతి"

- తృ.ఆ. 46వ పద్యం

"నక్క యురులలోనజ జిక్కుకున్న వితాన - గోరి మనము చేసికొన్న కతలు"

- తృ.ఆ. 4వ పద్యం

"చిలుకా! నీకును నాపై నలుకా?"

- చ.ఆ. 28వ పద్యం

రాధ చెలికత్తెలు కృష్ణునితో నిష్ఠురములాడు సందర్భములోనూ, కృష్ణుడు రాధను ప్రాధేయపడు సందర్భములోనూ, కృష్ణుడు చిలుకను బుజ్జగించి రాధ అలకను తీర్చి తన దగ్గరకు చేర్చమని చెప్పే చతుర్థాశ్వాసంలోని పద్యాలలోను ముద్దుపళని నాటకీయతతో తీర్చిదిద్దించి. ఈ పద్యాలలో వ్యావహారిక భాషా తెలుగును ఎక్కువగా ప్రయోగించింది.

తెలుగులో పదాలు ఎక్కువగా రెండక్షరాలు, మూడక్షరాలు ఉన్నవే ఎక్కువ. అచ్చ తెలుగు పద ప్రయోగంలో ధ్వనించినట్టుగా సంస్కృత పదప్రయోగంలో కుదరదు. తన కావ్యములో జాతి, ఉపజాతి పద్యాలైన కందం, తేటగీతి, సీసం లకే పెద్దపీట వేసింది. మూడొంతుల పద్యాలు ఇవే ఛందస్సులో రచించినవే! వృత్త పద్యాలకు కేవలం ఒకవంతు మాత్రమే కేటాయించింది. ముద్దుపళని రాధికాసాంత్వనంలో తెలుగు వ్యావహారిక పద ప్రయోగాలు, నానుడులు, జాతీయాలు, పలుకుబడులు కోకొల్లలు. ఇవే గాకుండా పాత్రోచిత భాషకు పెద్దపీట వేసింది. ఉదాహరణకు

తే॥. ఎంతవేడిన బదులాడ వేమి చిలుక? - కాలగతులెట్టులున్నవో గడచినామె?

కాజగలది కాక మానదు, కానజ దెల్పు - చల్లకై
వచ్చి ముంత దాచంగ నేల?
- ది.ఆ. 126పద్యం

హృదయాన్ని తాకే అచ్చతెలుగు వ్యావహారిక భాషతో పాఠకులకు కట్టివేసింది.

**ముగింపు :**

మొత్తం మీద రాధాకాసాంత్వన కావ్యాన్ని ముద్దుపళని తనదైన శైలిలో తను చదివిన కావ్యాల ప్రభావంతో శబ్దాలంకారాల శోభితంగా తీర్చిదిద్దింది. ఆమె కవిత్వం ఆసాంతం ముద్దుల మూటయే. ఆ కవయిత్రి మాటల లోనే.

కII. తేటలుగా, జిగి ముత్యపు - బేటలుగా, బంచదార
పేటలుగాజ బూజ
దోజటలుగా, రా చిలుకల - మాటలుగాజ గంస
వైరి మాటల తనరున్ - ది. ఆ. 43వ పద్యం

రాధ తన మనస్సులో మాధవుని మోహన రూపమును తలచుకొను సందర్భములో చెప్పిన పద్యము ఇది. ఇందులో కృష్ణుని మాటలు ఎంత సొగసుగా ఉంటాయో, మోహనరూపం కూడా ఎదుటివారిని కట్టిబడేస్తుంది. కానీ ఇక్కడ ముద్దుపళని కవిత్వం కూడా తేటగా తెలుగుదనంతో, ముత్యాలహారంలాగా ప్రకాశంతో పంచదార గుళికలులాగా, తియ్యనైన రసాస్వాదనతో, పూలతోటల లోని పుష్పాలంత సుకుమారంగా తియ్యనైన మాటల్లాగా ముద్దుముద్దుగా ఉంటాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

తేII. తత సుగుణ పేటి, దివ్య సౌందర్యవాటి -
వనితలకు మేటి మాధుర్య వచన దాటి
భావజుని ఘోటి, ముద్దు రాధా వదూటి - గాన
మిల నేటి వరలోన దాని సాటి - తృ.ఆ. 96వ
పద్యం

రాధను తలచుకొని శ్రీకృష్ణుడు విరహతాపము సందర్భములోనిదైనా, ఇక్కడ కవయిత్రి ముద్దుపళని తనను రాధలో చూచుకొంది. ఈ పద్యం ముద్దుపళని స్వీయచరిత్రకు నిలువటద్దం. ఆమె సుగుణవతి, దివ్య సౌందర్యవతి తన కాలపు నాటి స్త్రీలలో కనిపించని వ్యక్తిత్వం వికాసం మధురమైన మాటలతో ఎదుటివారిని కట్టి పడేసే నేర్పు ముద్దుపళని సొంతం అని తెలుస్తుంది. నిజంగానే ఆ కవయిత్రి అన్నట్లు "గాన మిల నేటి వరలోన దాని సాటి" (ముద్దుపళని ముద్దుపళనియే ఆమెకు ఇంకొకరు నేడు సాటి రారు) అన్నది అక్షర సత్యం.

**ఆధార గ్రంథాలు :**


1. రాధికాసాంత్వనం - ఎమెస్కో ముద్రణ (2002)
2. రాధికాసాంత్వనం - ప్రవేశిక - ఆరుద్ర
3. రాధికాసాంత్వనం - పరిష్కరణ - పాఠ నిర్ణయం - బొమ్మకంటి వేంకట సింగరాచార్య బాలంత్రపు నళినీకాంత రావు
4. స్త్రీ అంతరంగాన్ని స్త్రీ భావనలను ఆవిష్కరించిన శృంగార ప్రబంధం ముద్దుపళని కావ్యం - రాధికాసాంత్వనం
5. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయం - డాII. నిడుదవోలు వేంకటరావు, మదరాసు విశ్వవిద్యాలయం (1978).


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# అనువాద సాహిత్య విశిష్టత – స్థూల పరిచయం



– డా॥. ఎం. హరికృష్ణ

సహాయ ఆచార్యులు, ప్రచురణల శాఖ, ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం.

'అనువాదం'.. సాహితీ ప్రక్రియల్లో మిగిలిన అన్ని ప్రక్రియలకన్నా వైవిధ్యమైనది. అత్యంత ప్రత్యేకమైనది, ప్రధానమైనది కూడా. మిగతా ప్రక్రియలకు లేనంత ప్రత్యేకత, ప్రాధాన్యత ఈ అంశానికే ఎందుకు అనే విషయాన్ని చూస్తే...

సాహిత్యంలోని ఇతర ప్రక్రియలు కేవలం రచయిత ఎంచుకున్న భాషకు, ఆ భాష తెలిసిన ప్రజలకు మాత్రమే పరిమితమవుతాయి. కానీ ఆయా ప్రక్రియలలో వచ్చిన సాహిత్యాన్ని, వాటి తాలూకు పరిమళాన్ని అన్ని ప్రాంతాలకూ పంచుతుంది. ఆ ప్రాంతాలను అనువాదం అనుసంధానిస్తుంది. ఒక ప్రాంతపు సంస్కృతిని, జీవన విధానాన్ని, కష్టాలను, సుఖాలను, సమస్త జీవన వైవిధ్యాన్ని ఇతర ప్రాంతాలకు చేరవేసి వారికి ఈ ప్రాంతాన్ని దగ్గర చేస్తుంది. ఇరువురినీ మమేకం చేస్తుంది. అందుకే ఇతర అన్ని సాహితీ ప్రక్రియలకన్నా అనువాదానికి ప్రత్యేక స్థానం వుంది.

"బహుభాష, సంస్కృతులకు నిలయమైన భారత దేశంలో అనువాద స్థానం అనల్పమైనది. భావ సమైక్యతకు అదే వారధి. అదే మాధ్యమం. భారతీయ సాహిత్య వికాసమే అనువాదంతో ముడిపడివుంది. ఈ దేశంలోని ప్రతి భాషా తన వ్యక్తిత్వాన్ని అనువాదంలో ప్రతిఫలింపజేసుకుంది."[1]

"సంస్కృతంలో 'చెప్పు' అనే అర్థంలో వున్న 'వద్' ధాతువుకు 'అను' అన్న ఉపసర్గ చేరి అనువాదం అనే పదరూపం ఏర్పడింది. సంస్కృతంలో అనువాదం అన్న పదానికి 'మళ్లీ చెప్పడం', 'పున:కథనం' అని అర్థం."[2]

అనువాదం అన్న పదానికి అర్థం మళ్లీ చెప్పడం అంటారు ప్రముఖ రచయిత, విమర్శకులు బూదరాజు రాధాకృష్ణ. అంటే మూలార్థం ఏ మాత్రం మారకుండా మరోసారి అదే విషయాన్ని మరో ప్రాంతపు, మరోభాషకు చెందిన పాఠకులకు చేరవేయడమని భావించవచ్చు.

"without translation, i would be limited to the borders of my own country. the translator is most important ally. he introduces me into the world"[3] ఇటలీకి చెందిన నవలా రచయిత, జర్నలిస్టు అయిన ఇటాలో కాల్వినో. అనువాదం అనే ప్రక్రియే లేకపోతే నా రచనలు నా దేశ సరిహద్దులు దాటేవి కావు అంటారాయన. అనువాదకుడు రచయితకు మిత్రుడని, రచయితలను వారు రాసిన రచనలను ప్రపంచానికి పరిచయం చేస్తారని అంటారు కాల్వినో. ఆయన నవలలు అనేక భాషలలోకి అనువదించబడ్డాయి.

"To change into another language retaining sense"4 అంటారు మొదటి ఆంగ్ల నిఘంటు రచయిత డా॥ జాన్సన్.

ఒక విషయాన్ని సమానార్థంలో ఒక భాషనుంచి మరో భాషలోకి అందించడాన్ని అనువాదం అంటారాయన.

ఎవరు ఏది చెప్పినా మొత్తానికి అనువాదం అంటే ఒక భాష సంస్కృతి, సంప్రదాయాలు, వారి జీవన విధానం, ఇతర సమస్త విషయాలను ఇంకో ప్రాంతపు ప్రజలకు సవివరంగా, సమగ్రంగా వారి భాషలో అందించడం అనవచ్చు.

చరిత్రలో చేసిన మొట్టమొదటి అనువాదంగా సుమేరియన్ పద్యం 'ఎపిక్ ఆఫ్ గిల్లమేష్'ను పేర్కొంటారు. ఇది 2000 బి.సిలో వివిధ ఆసియా భాషల్లోకి అనువదించబడింది. అయితే దీనిని అనువదించిన అనువాదకులు ఎవరో తెలియరాలేదు. అయితే అనువాద పితామహునిగా లివియో ఆంద్రోనికోను చెప్పుకోవచ్చు. 250 బి.సి.లో ఆయన గ్రీకులో హోమర్ రాసిన 'ఒడిస్సీ'ని లాటిన్‌లోకి అనువదించారు.

అనువాద సాహిత్యం సాంస్కృతిక పునరేకీకరణ లేదా సాంస్కృతిక పరివ్యాప్తికి ఏ విధంగా, ఎన్నిరకాలుగా తోడ్పడుతుందో ఇప్పుడు పరిశీలిద్దాం.

భారతీయ సాంస్కృతిక వారసత్వ చరిత్ర ప్రపంచంలోని చాలా సంస్కృతులకన్నా అత్యంత ప్రాచీనమైనదని ప్రపంచం యావత్తూ అంగీకరించాల్సిన విషయమే. మన దేశంలో దాదాపు 5వేల సంవత్సరాలకు ముందే నాగరికత విలసిల్లినట్లు అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఈ అధ్యయనాలు మన పురాణాలు, వేదాలు ప్రస్తావించిన అనేక సంఘటలను ధృవీకరించాయి.

వేదాలు, పురాణాలు అనాటి కాలంలో విస్తృతంగా వాడుకలో వున్న దేవనాగరి లేదా సంస్కృత భాషలో వున్నాయి. కాలక్రమేణా మూలభాషైన సంస్కృతం నుంచి అనేక భాషలు పుట్టుకొచ్చాయి. సంస్కృతం మాత్రం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఇలాంటి అనేక కారణాల వల్ల ప్రజల్లో సంస్కృతభాష పట్ల విముఖత ఏర్పడింది. దాంతో దేవనాగరి భాషలో వున్న వేదాలు, పురాణాలు, ఇతర గ్రంథాలను చదివేవారు తగ్గిపోయారు. దీనివల్ల మూల గ్రంథాల్లోని విషయాలకు వక్రభాష్యాలు చెప్పడం, వాటి పేరు చెప్పి ప్రజలను వేధించడం మొదలైంది. ఇది భారత సంస్కృతికి తీరని నష్టాన్ని కలిగించింది.

ఈ కారణాలన్నీ కూడా భారతీయ సంస్కృతికి, హైందవ మతానికి ప్రజలను దూరం చేశాయి. బ్రిటీష్ పాలకులు భారతదేశాన్ని ఆక్రమించుకున్న తర్వాత వారిలో ఆసక్తి కలిగిన కొందరు అధికారులు భారతీయ పురాణాలను పరిశీలించడం మొదలు పెట్టారు. వారి సౌలభ్యం కోసం వాటిని నిపుణులైన వారితో ఆంగ్లంలోకి అనువదింపజేసుకున్నారు. దీంతో వేదవేదాంగ రహస్యాలు, అసలు వాస్తవాలు వారి దృష్టికి చేరుకున్నాయి. వారు వీటిని తమకు అభివృద్ధికి వాడుకున్నారు. భారత రుషులు నిక్షిప్తం చేసిన అద్భుతమైన శాస్త్ర, సాంకేతిక విషయాలను వారు చాలావరకు వినియోగించుకో గలిగారు.

భరద్వాజ మహర్షి రాసిన సంస్కృతంలో రాసిన 'విమాన శాస్త్రం' ఆధారంగా 1895లో 'మారుత్సఖ్' పేరిట తొలిసారిగా విమానాన్ని నిర్మించి విజయవంతంగా గాలిలోకి ఎగిరిన శివశంకర్ బాపూజీ తల్పాడే కన్నా, ఇదే పరిజ్ఞానాన్ని వినియోగించుకుని 1903 డిసెంబర్ 17న రైట్ సోదరులు తయారు చేసిన విమానానికి చరిత్రలో ప్రాముఖ్యత లభించింది. కారణం ఆంగ్లం ప్రపంచంలోని అత్యధికశాతం మందికి తెలిసిన మాధ్యమం కావడమే.

భారతీయ రుషులు సంస్కృతంలో రచించిన అనేక విషయాలు కేవలం భాష మరుగున పడడం, అందరికీ అర్థం అయ్యే భాషల్లోకి అనువాదం కాకపోవడం వల్లనే వెలుగులోకి రాకుండా వుండిపోయాయి. అదే సంస్కృత భాషలోని ఆ పరిజ్ఞానాన్నంతా మూలార్థం చెడకుండా అందరికీ అర్థం అయ్యే భాషలోకి అనువదించి వుంటే ఆ పరిజ్ఞానంతో భారతదేశం మరింత పురోగతిని సాధించి వుండేది.

దీనికి ఉదాహరణగా పాల్ బ్రంటన్ అనే ఆంగ్లేయుడు రాసిన, 'ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా'ను జొన్నలగడ్డ పతంజలి తెలుగులోకి అనువదించిన

'రహస్యభారతంలో నా ఆధ్యాత్మిక అన్వేషణ' అనే పుస్తకాన్ని చెప్పుకోవచ్చు. ఈ పుస్తకం ఆంగ్ల భాషలో 1934లో ప్రచురితం అయింది. భారతదేశం గురించి తాను విన్న అత్యద్భుత విషయాలను కళ్లారా చూడడానికి పరితపించి ఇక్కడకు వచ్చి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఆధ్యాత్మిక గురువుకోసం అన్వేషించి సాధించిన వ్యక్తి పాల్ బ్రంటన్. ఆయన ఈ పుస్తకం ఆంగ్లంలో రాసిన తర్వాత గానీ భారతదేశంలో వున్న అసలు విలువైన సంపద ఏమిటో ప్రపంచదేశాలు అర్థం చేసుకోలేకపోయాయి.

విచిత్రమేమిటంటే దాదాపు 80 సంవత్సరాల తర్వాత ఈ పుస్తకం తెలుగులోకి అనువదించ బడింది. ఇంత వరకూ దాదాపు 20 భాషల్లోకి ఈ పుస్తకాన్ని అనువదించారు. అంటే సుసంపన్నమైన భారతీయ సనాతన సంప్రదాయం 20 ప్రాంతాలకు చేరిందన్నమాట. పాల్ బ్రంటన్ రాసిన ఈ పుస్తకాన్ని చదివిన వారంతా కూడా భారతదేశం వేదకాలంలో శాస్త్రసాంకేతికతలతో పాటు అనేక విషయాల్లో అగ్రగామి అన్న విషయాన్ని నిస్సందేహంగా అంగీకరించవలసిందే. ఈ పరిణామం వారిలో భారతదేశం పట్ల మరింత సానుకూలతను, ప్రేమను, ఆసక్తిని కలిగిస్తుంది. తద్వారా ఈ ప్రాంతపు సంస్కృతి మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఏర్పడుతుంది.

"ప్రాచీన భారతదేశం గురించి, నాటి చారిత్రక, సామాజిక జీవనం గురించి, ఆలోచనా విధానం గురించి తెలుగులో వచ్చిన రచనల సంఖ్య పరిమితమే. సమకాలీన చరిత్ర విషయంలో ఇది మరింత పరిమితం. ఆయా రంగాలలో కృషి చేసిన మేధావులు స్థానిక భాషల్లో కాక ఆంగ్లంలో రచనలు చేయడం వల్ల ప్రధానంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. తెలుగులో బహుళ సంఖ్యాకులకు ఈ ఆంగ్ల గ్రంథాల అధ్యయనం శ్రమతో కూడుకున్నది. అందువల్ల ఈ విషయాలు చర్చలోకి రావడం కూడా కష్టసాధ్యమైన విషయం." అంటారు ఈ పుస్తకం సంపాదకీయంలో అడ్లూరు రఘురామరాజు.

విలువైన సాహిత్యమంతా ప్రాచీన భాషల్లోంచి ఆంగ్ల భాషలోకి అనువాదం కావడం, స్థానిక ప్రాంతాల్లో ఆంగ్లాన్ని చదివేవారి సంఖ్య కాస్త తక్కువగా వుండడం వల్ల విలువైన సమాచారం అంతా మరుగున పడుతున్నదన్నది వాస్తవం.

'రహస్య భారతంలో నా ఆధ్యాత్మిక అన్వేషణ' గ్రంథంలో పాల్ బ్రంటన్ ఒక రెండవ శ్రేణి యోగిని కలుస్తారు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణల గురించి ఆయన మాటల్లో చూద్దాం...

"మా శారీరక యోగ శాస్త్రంలో 84 ఆసనాలు వున్నాయి. నాకు మాత్రం 64 ఆసనాలే తెలుసు అంటూనే నేను కుర్చీలో కూర్చున్నంత సుఖంగా బ్రమ ఒక యోగాసనంలో కూర్చున్నాడు. తన ఎడమకాలిని కడుపులోకి మడిచిపెట్టి రెండో కాలిమీద శరీరం బరువంతా ఆనించి కుడి మడమ శరీరం కిందకి వచ్చేటట్లు చేసి కూర్చున్నాడు.'

"హృదయమూ, ఉదరమూ, విసర్జకావయవాలపై నేను కొంతమేర నియంత్రణ సాధించాను. నిర్వికారంగా చెప్పాడు బ్రమ.

'అది ఎలా సాధ్యం' మళ్లీ ప్రశ్నించాను.

'కొన్ని శారీరక ఆసనాలూ, శ్వాసక్రియ పద్ధతులూ, మనోనియంత్రణ అభ్యాసాలతో ఇది సాధ్యవుతుంది. అయితే అవన్నీ యోగశాస్త్రంలో విశిష్ట శ్రేణికి చెందినవి. చాలా కష్టమనవి. అందుకని అతికొద్దిమంది మాత్రమే వాటిని సాధించగలరు. ఈ సాధన వల్ల నేను హృదపు కండరాలపై పట్టు సాధించి, ఆ నియంత్రణ వలన మిగిలిన అవయువాలపై పట్టు సాధించాను అని చెపుతూ...

'నీ చేతిని నా గుండెపై ఉంచు' అంటూ బ్రమ ఒక ప్రత్యేక భంగిమలోకి మారి, తన కళ్లు మూసుకున్నాడు.

నేను బ్రమ చెప్పినట్లే అతని హృదయం మీద చేయిపెట్టి ఎదురుచూడసాగాను. బ్రమ కొన్ని నిముషాల సేపు రాయిలాగా చలనం లేకుండా ఉండిపోయాడు. క్రమంగా అతని హృదయ స్పందన తగ్గసాగింది. అది మరీ తగ్గిపోతుంటే ఆశ్చర్యపోవడం నా వంతైంది. చివరికి అతని హృదయ స్పందన పూర్తిగా ఆగిపోయిందని స్పష్టమైంది. నా సంభ్రమాన్ని వ్యక్తం చేయలేకపోతున్నాను. ఆ విధంగా ఏడు సెకన్లు గడిచాయి. నాలో భయం మొదలైంది.

మరణం అంచులకి వెళ్లిన అతని హృదయంలో మళ్లీ చలనం ప్రారంభమవడంతో నా మనస్సు కుదుట పడింది. అతని హృదయ స్పందనలు మెల్లిగా వేగం అందుకుని కొద్దిసేపటిలో హృదయం సామాన్య స్థితికి వచ్చేసింది" అంటాడు పాల్ బ్రంటన్.

ఈ వాక్యాలు పాల్ బ్రంటన్ స్వయంగా అన్వేషించి అనుభవించి రాసిన రాతలు. ప్రాచీన సంస్కృత గ్రంథాల లోని వెలలేని విషయాలను పుక్కిటి పురాణాలుగా కొట్టి వేసే మన భారతీయులకు వాస్తవమేమిటో రుజువు చేసే విషయాలు. హృదయస్పందనను స్తంభింపజేయగల సాంకేతికతను పతంజలి యోగశాస్త్రం వేలాది సంవత్సరాల ముందే మన జాతికి ప్రసాదించిందన్న అద్భుతమైన వాస్తవం.

ఇవన్నీ పుక్కిటి పురాణాలుగా మారడానికి కారణం సంస్కృతం సామాన్యులకు చేరకపోవడమే. సంస్కృత గ్రంథాలను ఇతర భాషల్లోకి అనువదించిన తర్వాత మాత్రమే వీటి విలువ అర్థం కావడం మొదలైంది. అనువాదం ఎంత అవసరమో తెలియచేయడానికి ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు.

1920 అక్టోబర్ 17న తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించడంతో భారతదేశంలోకి కమ్యూనిజం ప్రవేశించింది. ప్రారంభదశలోనే ఉధృతంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న పార్టీ నేతలు బ్రిటిష్‌వారి నుంచీ తీవ్ర అణచివేతను ఎదుర్కొన్నారు. అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటూనే భారత స్వాతంత్ర్య సమరానికి తమ వంతు సేవను అందించారు. దీనిని తట్టుకోలేని బ్రిటిషువారు 1934లో పార్టీని నిషేధించారు.

స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టులు బాగా పుంజుకున్నారు. దీనికి కారణం వారు భారతదేశంలో అత్యధిక శాతం వున్న పేదలవైపు బలంగా నిలవడం ఒక కారణమైతే, రెండవ కారణం కమ్యూనిజానికి పట్టుగొమ్మ అయిన మాస్కోనుంచి వెలువడిన విప్లవ, బాల సాహిత్యాలు 'రాదుగ' ప్రచురణాలయం నుంచి భారతదేశంలోకి పుంఖాను పుంఖాలుగా దిగుమతి కావడం ప్రధాన కారణం.

రష్యన్ సాహిత్యం భారతీయ భాషల్లోకి అనువదించడం వలన భారత, రష్యాల మధ్య బలమైన బంధం ఏర్పడడానికి అనువాద సాహిత్యం చేసిన కృషి చెప్పుకోదగినది.

లియో టాల్‌స్టాయ్ రాసిన "వొయ్నా ఐ మీర్" (వార్ అండ్ పీస్)ను రెంటాల గోపాలకృష్ణ, బెల్లంకొండ రామదాసు కలిసి తెలుగులోకి అనువదించిన "యుద్ధమూ - శాంతి", మాక్సీమ్‌గోర్కీ రాసిన "మథర్"ను క్రొవ్విడి లింగరాజు తెలుగులోకి అనువదించిన "అమ్మ", వంటి నవలా సాహిత్యంతో పాటు, బాల సాహిత్యం కూడా భారతదేశ యావత్ ప్రజానీకాన్ని ఆకర్షించింది. ఈ సాహిత్యం కారణంగా పుస్తక పఠనం విపరీతంగా పెరిగింది. రష్యా, భారత దేశాల మధ్య స్నేహబంధం ఏర్పడడంతోపాటు ఒక తరం రష్యాను ఆవాహన చేసుకున్నది.

అలాగే భారతదేశం గర్వించే కవి, నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి అనేకమంది ప్రముఖ కవులను, రచయితలను రష్యా స్వంతం చేసుకున్నది. భారతదేశ పురాణాలను కూడా రష్యా సాదరంగా స్వీకరించింది. ఈ అనువాదాల కారణంగా ఇరు ప్రాంతాల మధ్య సంస్కృతి రేఖలు తుడిచిపెట్టుకుపోయి ఇరు ప్రాంతాలూ చాలా ఏళ్లపాటు కలిసి కట్టుగా వుండడానికి సహాయం చేసింది.

ఇవే కాకుండా షేక్స్పియర్ నాటకాలు, రాబర్ట్ షెల్లీ కవితలు, జార్జ్ బెర్నార్డ్ షా నాటకాలు, ఇతర అనేక అనువాదాలు ఆ ప్రాంతాలను గురించిన అవగాహనను మనకు కల్పించాయి.

ప్రస్తుత కాలంలో అయితే అనువాదాలకోసం ఎన్నో యాప్‌లు రావడంతో పాటు గూగుల్ ప్రాంతీయ అనువాదాలకు పెద్దపీట వేసింది. దీనివల్ల ఏ రచననైనా సరే మాతృభాషలో అర్థం చేసుకునే అవకాశం కలిగింది. తద్వారా విషయాన్ని ఆకళింపు చేసుకోవడంలో అడ్డు తొలగిపోయింది.

కరోనా అనంతరం ఓటీటీలు ప్రపంచాన్ని ముంచెత్తుతున్న నేటికాలంలో పుస్తకాలు, సాహిత్యం మాత్రమే కాకుండా, సినిమాలు, వెబ్ సిరీస్ కూడా అనువాదాల

బాట పట్టాయి. తద్వారా ఆయా ప్రాంతాల జీవన విధానం నేరుగా మరో భాషలోని ప్రేక్షకులకు చేరుకుంటోంది. ఇది సాంస్కృతిక మార్పిడిని మరింత వేగవంతం చేస్తోంది. కుకు ఎఫ్ఎం లాంటి యాప్స్ అనేక భాషల్లోని సాహిత్యాన్ని నేరుగా ప్రాంతీయ భాషల్లో వినే సదు పాయాన్ని కలిపిస్తోంది. ఇవన్నీ కూడా అనువాదాలకు ఎంత ఆదరణ వుందో, అనువాదం అవసరం ఎంత వుందో మనకు తెలుపుతున్నాయి.

**ఆధార గ్రంథాలు:**


1. రామకృష్ణారావు గోవిందరాజు. 2007. అనువాదం. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.
2. రాధాకృష్ణ బూదరాజు. 2003. అనువాద పాఠాలు, హైదరాబాద్: మీడియా పబ్లిషింగ్ హౌస్ పబ్లికేషన్స్.
3. యూకో.కామ్
4. సదానందం జె. అనువాద కళ. 2009. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# "కలవారి కోడలు" కలికి కామాక్షి గేయం - జానపదుల గ్రామీణ సంస్కృతి



- డా॥. పి. చిరంజీవిరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్ (కా.), తెలుగు విభాగం, ఆర్.జి.యు.కె.టి. (ఐఐఐటి), శ్రీకాకుళం.

**పరిచయం :**

ఉమ్మడి కుటుంబం అంటే ఈ రోజుల్లో అంతగా తెలియడం లేదు. ఈనాటి పిల్లలకు కుటుంబ సంబంధాలు కాని, మనుషుల మధ్య ఉండే ప్రేమలూ, అనుబంధాలు కాని, ఆప్యాయతలు కాని గౌరవాలు కాని కనీసం కన్పించడం కష్టమైపోయింది. అత్తాకోడళ్ళు మధ్య, తోడికోడళ్ళు మధ్య, వదిలా మరదళ్ళూ మధ్య, వారి మధ్య పెనవేసుకున్న బంధాలు, చిన్న చిన్న ఆరళ్ళు, అలకలూ, చతురోక్తులూ, ఎగిరి పడటాలూ, ఒదిగి ఉండటాలూ వంటివి ఎంతో హృద్యంగా ఒకప్పుడు ఉండేవి. అనుభంలో ఉన్నవారికి అవన్నీ కొన్ని మధురమైన జ్ఞాపకాలుగానే మిగిలాయి. వీటన్నింటినీ తిరిగి ఇప్పుడు మనం పొందగలిగినా, పొందలేకపోయినా, జీవితంలో మనం ఏం పోగొట్టుకుంటున్నామో ఈనాటి తరానికి తెలియచేయడం ఈ వ్యాసం ఉద్దేశం. "కలవారి కోడలు" జానపద గేయాన్ని, నల్గొండ జిల్లా, భువనగిరి తాలూకాలోని నానిరెడ్డి పల్లె గ్రామంలో "శ్రీమతి మనమ్మ" బతుకమ్మ పండుగ సందర్భంలో పాడారని తెలుస్తుంది. ప్రస్తుతం తెలంగాణ బతుకమ్మ పండుగలో బాగా పాట పాడుతున్నారు.

**జానపద గేయాల విశిష్టత :**

లిఖిత సాహిత్యం, మౌఖిక సాహిత్యం అని రెండు విధాలుగా మనం చెప్పవచ్చు. జానపద సాహిత్యం అక్షర రూపంలో కాకుండా, నోటిమాట, పాటరూపంలో ఒకరి నుండి మరొకరికి, ఒక తరం నుండి మరొక తరానికి ప్రచారం చెందుతూ వచ్చింది. జానపదులు తమ భావాలనూ, అనుభవాలనూ, ఆచార సంప్రదాయాలనూ, సుఖదుఃఖాలనూ వ్యక్తం చేసుకోవడానికి ఆశువుగా పాటలను పాడుతుంటారు. అందుకే వీరిపాటల్లో జానపదుల జీవిత విధానాలు, మనస్తత్వాలు ప్రతిబింబిస్తుంటాయి. అంతేగాక జానపదులకు తమ భావవ్యక్తీకరణ పైననే దృష్టి ఎక్కువగా ఉంటుంది. కానీ పాటలో తమ పేరును చెప్పుకోవాలనే ధ్యాస వారికుండనందువల్ల పాటల రచయితల పేర్ల గురించి కానీ, కాలం గురించి కానీ మనకు అంతగా తెలియదు. జానపద గేయాలు ఒకరి నుండి మరొకరికి మౌఖికంగా ప్రచారం కావడం వల్ల వీటికి నియమిత స్వరూపం ఉండదు. పాటలో కొన్ని చరణాలు పెరుగుతుంటాయి. కొన్ని తరుగుతుంటాయి. మూలాంశం ఒక్కటే అయినా ఒకటే పాటకు అనేక పాదాంతరాలు ఏర్పడుతుంటాయి. జానపద గేయాల్లో కొన్ని పదాలు పల్లవులు, చరణాలు మాటి మాటికి పునరావృత్తమవుతుంటాయి.

ఈ పునరావృత్తుల వల్ల గాయకులు, శ్రోతలు పాటను గుర్తుంచుకోవడానికి వీలవుతుంది. నిరక్షరాస్యులైన జానపదుల గేయాలు కాబట్టి వీటిలో పాండిత్య ముండదు. కఠిన పదాలుండవు. సులభశైలిలో, అందరికీ అర్థమయ్యే రీతిలో ఉంటాయి. మాండలిక పదాలు, యాస పాటల్లో ప్రాంతాలను బట్టి ఏర్పడుతుంటాయి. జానపద గేయ సాహిత్యాన్ని శ్రామిక గేయాలు, బాల గేయాలు, ఆచార సంబంధ గేయాలు, కుటుంబ గేయాలు, పారమార్థిక గేయాలు. దేవతా సంబంధిత గేయాలని విభజించవచ్చు. ప్రస్తుత నా వ్యాసం "కలవారి కోడలు" కుటుంబ గేయశాఖకు చెందుతుంది. దీని ద్వారా కుటుంబ విలువలు మనం ఇప్పటి తరానికి తెలియజేయవచ్చు.

**"కలవారి కోడలు కలికి కామాక్షి" గేయం – గ్రామీణ సంస్కృతి వివరణ :**

జానపద కవిత్వ లక్షణాలను మననం చేసుకోవడానికి ఈ వ్యాసం ఉపయోగపడుతుంది. ఇళ్ళల్లో పెద్దవారు పాడే జోలపాటలను గాని, లాలిపాటలను గాని, పండుగల్లో పాడే పాటలనుగాని విని వాటిలోని విశిష్టతను మనం పరిశీలించాలి.

"కలవారి కోడలు ఉయ్యాలో- కలికి కామాక్షి ఉయ్యాలో
కడుగుతున్నది పప్పు - కడవల్లో బోసి
అప్పుడే వచ్చాడు - ఆమె పెద్దన్న
కాళ్ళకు నీళ్ళిచ్చి - కన్నీరు నింపె"

కామాక్షి కలవారికోడలు అనడంవల్ల ఆమె పుట్టింటి వారు పేదవారై వుంటారని సులభంగానే మనకు అర్థమవుతుంది. లేనివారు వున్నవారితో వియ్యమందడం సాధారణంగా జరిగే పనికాదు. కాని కామాక్షి అత్తవారు చాలా సంస్కారవంతులు. ఆ పిల్ల అందాన్ని చూచి కోడలుగా తెచ్చుకున్నాదేగాని ఆస్తులూ, అంతస్తులూ చూసి కాదు. కామాక్షికి వాడిన "కలికి" అనే విశేషణం వల్ల ఆమె అందాల బొమ్మ అని తెలుస్తూనే ఉంది. కలవారంటే పంట సిరి కలవారనే అర్థం. వెనకటి రోజుల్లో డబ్బు లెక్క గాదు. పంటచేలూ, పైరుపచ్చా, గొడ్డూగోదా, ఎడతెగని పాడి ఇవే లెక్కలో ఉండేవి. పెద్దన్నయ్య వచ్చేసరికి కామాక్షి పప్పు కడుగుతుంది. వచ్చిన పెద్దన్నయ్య అప్పటి పెద్ద ఇల్లు మదురగుమ్మ దాటి లోపకికి వచ్చేదాక కామాక్షి చూడనే లేదు. అన్నను చూసిచూడగానే ఆమెకు ప్రాణం లేచివచ్చింది. కడవక్కడే వదలి, గబగబా చేతులు కడుక్కుని అన్నకు కాళ్ళకు నీళ్ళిచ్చింది. నీళ్ళిస్తుంటో గిర్రున ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అన్నకు కనపడకుండా ముఖం పక్కకు తిప్పుకుని పైటచెంగుతో కళ్ళద్దుకుంది.

"ఎందుకూ కన్నీరు - ఏమి కష్టాలు
తుడుచుకో చెల్లెలా - ముడుచుకో కురులు
ఎత్తుకో బిడ్డను - ఎక్కు అందలము"
పెట్టుకో సొమ్ములు - కట్టుకో చీర
మీ అత్తమామలకు - చెప్పిరావమ్మా

"కలవారి కోడలు" కామాక్షిని అత్తింటి నుండి పుట్టింటికి తీసుకొని పోవడానికి ఆమె అన్నలు వస్తారు. కడవలో పప్పును కడుగుతున్న కామాక్షి అన్నలను చూడగానే కన్నీరు పెట్టుకుంది. ఆమె కన్నీరు పుట్టింటి పైన కలవారి కోడలకుండే ప్రేమానురాగాలకు ప్రతీక. ఇంటికి అతిధులు వచ్చినప్పుడు మొదట కాళ్ళకు నీళ్ళివ్వడం జానపదుల సంప్రదాయం. కామాక్షి కూడా అన్నలకు నీళ్ళనిస్తుంది. వారు చెల్లిలి కన్నీరును చూచి, ఆమె అంతరంగంలోని ఆవేదనను అర్థం చేసుకొని సొమ్ములు పెట్టుకొని, పట్టుచీర కట్టుకొని అత్తమామల అనుమతిని తీసుకొని పుట్టింటికి బయలుదేరమంటారు. అత్తింటి సౌభాగ్యసంపదలు పుట్టింట్లో ప్రదర్శించటం. పుట్టింటి భోగభాగ్యాలను అత్తింటిలో చెప్పుకోవడం తెలుగు ఆడపడుచుల సహజగుణం.

కుర్చీ పీటమీద - కూర్చున్న అత్త
మా అన్నలొచ్చింద్రు - మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ - నీ మామనడుగు

వినయంగా, భయంగా అడిగింది. అవతల మామ గారున్నారు. కాని ముందర మామగారి అనుమతి కోరకుండా కామాక్షి, అత్తగారి అనుమతినే కోరుతుంది. తెలుగు వారికి అత్తవారిళ్లే గాని మామగారిళ్లు లేవు, అల్లుళ్ళకి పెట్టుపోతలు జరిపేది అత్తగారు, కోడళ్ళను ఆరళ్ళు

పెట్టేది అవసరమైనప్పుడు అనునయించేది అత్తగారే. అత్తగారు కామాక్షిని ఓరగంట చూస్తూ లోలోపల మురిసి పోయి, మేమెరుగ మేమెరుగ మీ మామనడుగు అనేసి, అన్నల ఆదేశానుసారం కోడలు ఇంటికి పెత్తనం వహించే కుర్చీపీట మీద కూర్చున్న అత్తను పుట్టింటికి వెళ్ళడానికి అనుమతి కోరుతుంది. నేనెరుగ నేనెరుగ అంటూనే అత్తగారి అనుమతి ఇచ్చేస్తుంది. ఆ తర్వాత మామగారి దగ్గరకు వెళుతుంది. వెళ్ళి ఇలా అడుగుతుంది.

పట్టె మంచం మీద - పండుకున్న మామ
మా అన్నలొచ్చింద్రు - మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ - నీ బావనడుగు

అని కామాక్షి మామ బావను అడగమంటారు. సేద్యం పనులు కోసం కొడుకులు అడిగితే చెప్పడం తప్ప ఆయనకు ఇంట్లో పనులేమి అంతగా లేవు. ఇంట్లో కొడుకు పొలం పనులు చేసుకుంటూ ఉంటారు. పూర్వం పెద్దవారు మాత్రం పట్టె మంచం మీద పడుకొని సేదతీరే వారు. ఆమె మామ బావనడుగమంటాడు. బావను అడగ డానికి వెళ్ళి ఇలా అంటుంది.

భారతం చదివేటి - బావ పెదబావ
మా అన్న లొచ్చింద్రు - మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ - మీ అక్కనడుగు

భారతం చదివేటి పెదబావ మీ అక్కనడుగమంటాడు. అక్కడ దగ్గరకు వెళుతుంది. అడుగుతుంది.

వంటలు చేసేటి - ఓ అక్కగారు
మా అన్నలొచ్చింద్రు - మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ - మీ భర్తనడుగు

అవును, ఆ తోగికోడలు తనకు తల్లి తర్వాత తల్లి కాపరానికి వచ్చిననాటి నుంచి తన్ను వేయికళ్లతో కనిపెట్టిన తల్లి ఆ ఇంట్లో ఎవరి స్వభావాలు ఎలా ఉంటాయో, ఎవరితో ఎలా మాట్లాడాలో, ఆ ఇంట్లో ఎలా మసులు కోవాలో నేర్పిన తల్లి తాను తెలియక చేసిన పనులను కప్పి ఉంచి రహస్యంగా తనకు బుద్దులు చెప్పిన తల్లి. తోడుకోడళ్ళకుండే అసూయలు, అనుమానాలు ఏమి ఎరుగని తల్లి. అందుకే ఆ తల్లిని విడిచి వెళుతుంటే కొంచెం బాధ పడుతుంది. ఈ రోజుల్లో తోడుకోడళ్ళు అలా లేరని మనం గమనించవచ్చు. అప్పుడు ఉన్న అనుబంధాలు మనం గుర్తించాలని కూడా ఈ గేయం తెలుపుతుంది. నేనెరుగ నేనెరుగ నీ భర్తనడుగు అనేస్తుంద అక్క. వంటలు చేసేటి అక్కగారు తన భర్తనడుగ మంటుంది. చుట్టూ పదిమంది స్నేహితుల్ని పోగేసుకొని వాళ్ళతో భర్త ముచ్చట్లాడుతుంటాడు. కామాక్షి ఆ సమయంలో ఆ భోగిని ఎలా పిలవాని సందేహం. ఎలా అయితే నేమి భర్త దృష్టిని ఆకర్షించి ఇలా అంటుంది.

రచ్చలో కూచున్న - రాజేంద్రభోగి
మా అన్నలొచ్చింద్రు - మమ్మంపుతార
పెట్టుకో సొమ్ములు - కట్టుకో చీరలు
పోయిరా సుఖముగా - పుట్టింట్లో పెళ్ళికి

చిట్టచివరకు రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగి "సొమ్ములు పెట్టుకొని, చీరకట్టుకొని పుట్టింటికి పోయిరా" అని అనుమతినిస్తాడు.

ఇరుగు పొరుగులార - ఓ అమ్మలార
చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు - చేయించపోయి
మరదుల పెళ్ళికి - మళ్ళీ వస్తాను
ఇరుగక్క పొరుగక్క - ఇదెపోయి వస్తాను

కోడలు కామాక్షి ఇంటి వారి అనుమతిని తీసుకొని ఇరుగక్క, పొరుగక్కలకు చెప్పి పుట్టింటికి బయలు దేరడంతో గేయం ముగుస్తుంది.

**"కలవారి కోడలు" కలికి కామాక్షి గేయం – సందేశం :**

పుట్టి పెరిగిన కన్న వారంటికి పోవడానికి కామాక్షి అత్తింట్లోని కుటుంబ సభ్యుల అనుమతిని వేడడం, ఇరుగు పొరుగు వారికి కూడా చెప్పి వెళ్ళడం ఉన్న అచ్చమైన పల్లె పడతి జీవితాన్ని ప్రతిబింబించే గేయమిది. భర్త కొరకే భార్య అత్తింటికి వచ్చినా, కోడలు భర్తతోపాటు కుటుంబ సభ్యులందరితో భక్తి గౌరవాలతో మెలగాలి అని ఈ గేయం పరోక్షంగా బోధిస్తుంది. అందిరి అనుమతిని వేడినా, అనుమతినిచ్చేది మాత్రం ఆమె భర్తే, భార్య జీవితాన్ని శాసించేది భర్తే భార్యకు స్వంత వ్యక్తిత్వ ముండదు. భర్త ఇష్టానుసారంగా భార్య ప్రవర్తించాలి. ఇటువంటి వినయ విధేయతలున్న కోడళ్ళ వల్లనే కుటుంబం సమిష్టిగా మనగలుతుంది, లేకుంటే

ముక్కలు ముక్కలై పోతుంది. అందుకే అవిభక్త కుటుంబానికి కోడలు సహనం. వినయ విధేయతలే మూల స్తంభాలని జానపదుల విశ్వాసం కూడా.

ఈ గేయంలోని కామాక్షి కలవారి కోడలు, కలవారి ఇళ్ళల్లో కోడళ్ళు తప్ప మిగతా వారెవ్వరూ పనిచేయరు. అత్తగారు కుర్చీపీట పైన కూర్చుంటుంది. మామ పట్టె మంచంపైన పడుకుంటాడు. బావ భారతం చదువు తుంటాడు. భర్త రచ్చలో రాజేంద్ర భోగిలా కూర్చుంటాడు. కామాక్షి మాత్రం పప్పు కడుగుతుంటుంది. ఆమె తోటికోడలు వంటలు చేస్తుంటుంది. పల్లెల్లో ఒక్కొక్క వీధిలోని వారందరూ ఒకే కుటుంబంగా సఖ్యతతో ఉం టుంటారు. ఎవ్వరింట్లో ఏది జరిగినా, ఎవ్వరు ఎక్కడకు వెళ్ళినా వీధి అంతా తెలియచెప్తారు. కోడలు కామాక్షి కూడా ఇరుగు పొరుగు వారికి పుట్టింటికి వెళ్తున్నానని చెప్పడం పల్లెటూళ్ళలోని ఇరుగు పొరుగుల సభ్యతకు ఒక నిదర్శనంగా కనిపిస్తుంది. పల్లెల్లోకూడా అన్ని కుటుంబాల్లోని కోడళ్ళు కామాక్షి మాదిరి వినయ విధేయతలతో ఉండరు. పుట్టింటికి వెళ్ళడానికి కూడా అందరి అనుమతిని కోరాలంటే విసుకునే కోడళ్ళుంటారు. అత్త శాపనార్థాలు పెట్టి ఆడవారు ఈ రోజుల్లో ఉన్నారు.

**“కలవారి కోడలు” కలికి కామాక్షి – బతుకమ్మ పాట :**

“కలవారి కోడలు” కలవారి కోడలు బతుకమ్మ పాట. తెలంగాణలోని స్త్రీల ప్రత్యేక పండుగ, పూల పండుగ, ఇతనమ్మ పండుగ. ఈ పండుగ తెలంగాణా స్త్రీల సాహిత్య, సంగీత, నృత్య కళారూపాల త్రివేణి సంగమం. స్త్రీల సౌభాగ్య ప్రదాయిని అయిన గౌరీదేవియే బతుకమ్మగా ఆరాధనలందుకుంటుంది. మహిషాసుర మర్దిని, భీకర స్వరూపిణి అయిన దేవిని నవరాత్రుల సమయంలో తెలంగాణా స్త్రీలు అందమైన పూల రూపంలో దర్శిస్తారు. పాటలు పాడుతూ, ఆడుతూ ఆమెను పూజిస్తారు.

మహాలయ అమావాస్యనాడు ఆరంభమైన బతుకమ్మ పండుగ మహర్నవమితో ముగుస్తుంది. బతుకమ్మ పండుగ నాటికి ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో పళ్ళేరంలో త్రిభుజాకారంగా బతుకమ్మను పేరుస్తారు. ఉదయం పేర్చిన బతుకమ్మలను స్త్రీలందరూ కలసి సాయంకాలం ఒకే దగ్గరకు చేరుస్తారు. వటి చుట్టూరా స్త్రీలు వలయా కారంగా వంగి చేతులను తట్టుతూ తిరుగుతుంటారు. ఒకరు పాటను చెప్పుతుంటే మిగిలిన వారు పాడుతుంటారు. చీకటి పడే వరకు ఆడి తర్వాత వాటిని చెరువులోగాని, కాలువలోగాని విడిచిపెడతారు.

బతుకమ్మ పండుగ ఆటపాటల మేలు కలయిక. బతుకమ్మ పాటలన్నీ ఒడుదుడుకులు లేని క్రమగతిలో ఒకే స్వరంలో సాగిపోతుంటాయి. సహజ సంగీతంతో ఒప్పారే బతుకమ్మ పాటలకు సంగీత శాస్త్ర నియమాలను లక్షణాలను ఆన్వయించడం అసాధ్యం. సాధారణంగా ఇవి చతురశ్ర గతిలో ఉంటాయి. పాటలోని పదాలు, చరణాలు, పల్లవులు నాట్యానికి అనుగుణంగా సాగు తుంటాయి. బతుకమ్మను ఆడేటప్పుడు ఒక్కొక్క ఆవృత్తానికీ, పల్లవికీ చేతులను తట్టడం జరుగుతుంది.

**ముగింపు :**

జానపదుల పాటలోని ప్రతి చరణాంతంలో “కలవారి కోడలు” పాటలో మాదిరి “ఉయ్యాలో” అని గానీ, “వలలో అనిగానీ, “చందమామ” అనిగానీ పల్లవులు ఆవృతమవుతుంటాయి. బతుకమ్మను ఆడేటప్పుడు స్త్రీలు నీతి బోధాత్మక గేయాలను, పౌరాణిక గేయాలను, కుటుంబ సంబంధమైన గేయాలను పాడుతుంటారు. ఆ పాటల్లోని ప్రతిపదంలో స్త్రీల మనోభావాలు, జీవిత విధానాలు ఒదిగి ఉంటాయి. పల్లెల్లో వెనుకటికాలంలో ఆభం శుభం తెలియని వయస్సులో ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు జరిగిపోయేవి. అందుకే అత్తింట్లో ఆడపిల్లలు మెలగవలసిన విధానాలను బతుకమ్మ పాటల్లో పొందు పరచి పాడుతుంటారు. ఉత్సవ సందర్భంలో ఉల్లాసంగా ఉన్న బాలికలకు పాటల రూపంలో కుటుంబ వ్యవస్థ గురించి, ఆడపిల్లల బాధ్యతల గురించి బోధిస్తే వారి మనస్సులలో ముద్రవేసుకుంటాయని జానపద స్త్రీల విశ్వాసం. “కలవారి కోడలు” పాటలో కామాక్షి “సమిష్టి కుటుంబంలోని కోడలుకు” ఒక నిదర్శనం. కామాక్షి మాదిరిగానే అవిభక్త కుటుంబ మర్యాదలను నియమా లను ఆడపిల్లలు కాపాడాలనే హితబోధ ఈ పాటలో

అంతర్లీనంగా ఉంది. ఆడపిల్లల భావి జీవితాలకు ఈ పాటలు మార్గదర్శకాలవుతాయి.

కుటుంబాల్లో సమిష్టి కుటుంబ విధానాన్ని, గృహిణుల పరిస్థితిని ప్రతిబింబిస్తుంది "కలవారి కోడలు". అవిభక్త కుటుంబాల్లో కోడలి సహనశీలం, వినయ విధేయతలే కుటుంబ సంక్షేమానికి మూలస్తంభాలని జానపదలు విశ్వాసంగా చెప్పవచ్చు. ఏ విషయానికైనా కోడలు అందరి అనుమతిని తీసుకున్నా, చివరగా అనుమతి ఇవ్వవలసింది ఆమె భర్తే అని జానపదులు నమ్ముతారు. అవిభక్త కుటుంబాల్లోని మర్యాదలను, సంప్రదాయాలను ఆడపిల్లలే ఎక్కువగా కాపాడతారు. కాని ఈ రోజుల్లో ఆ విధానం సాంకేతిక వినిమయం వల్ల నశిస్తుందని చెప్పాలి. అందుకే ఈ విలువలు ఇప్పుడున్న పరిస్థితులను బట్టి అందరికీ తెలపవలసిన బాధ్యత మనందరిపైన ఉంది.

**ఆధార గ్రంధాలు :**


1. తెలుగు సాహిత్యం - డా॥. బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం - హైదరాబాద్, 2005.
2. ఇంటర్మీడియట్ - మొదటి సంవత్సరం - అమరధామం - 2018.
3. జానపద విజ్ఞాన వ్యాసాలు - నేదునూరి గంగాధరం - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - హైదరాబాద్ - 2003.
4. ఆంధ్రుల జానపద విజ్ఞానం - మైసూరు విశ్వవిద్యాలయం - డా॥. ఆర్వీయస్. సుందరం - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - హైదరాబాద్ - 2004.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గుర్రం జాషువా సాహిత్యంలో – మహాత్మాగాంధీ వ్యక్తిత్వ చిత్రణ



– డా॥. ఎ.ఎ. నాగేంద్ర

అకడమిక్ కన్సల్టెంట్, తెలుగు తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయము, అనంతపురము.

**సంక్షిప్త పరిచయం :**

మహాకవి గుర్రం జాషువా (1895-1971) గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. లింగమాంబ, వీరయ్యలు వీరి తల్లిదండ్రులు. అంటరానివాడుగా అవమానాలకు గురిఅవుతూనే 'జాషువా' బాల్యంలో విద్యాభ్యాసం చేశారు. ఉన్నత పాఠశాలలో చదువు తున్నప్పుడు సాహిత్య లోకంలో సంచలనం కలిగించిన తిరుపతి వేంకటకవులు, కొప్పరపు కవుల అవధాన విధానాలు వీరిని ఆకర్షించాయి.హైస్కూల్ చదువు పూర్తయిన తర్వాత 1919 నుండి తొమ్మిదేండ్లు గుంటూరు ట్రెనింగ్ స్కూల్లో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. తర్వాత 'ఉభయ భాషా ప్రవీణ' చదివి పదిహేనేళ్ళు గుంటూరు జిల్లా బోర్డు పాఠశాలల్లో పండితులుగా పనిచేశారు. మూడేళ్ళు యుద్ధ ప్రచారశాఖలోనూ, కొన్నాళ్ళు రేడియోలో 'ప్రొడ్యూసర్' గా కూడా పనిచేశారు. జీవిక కోసం ఎన్ని ఉద్యోగాలు చేసినా కవిత్వంలో తనకుతానే ఒక ఉద్యమంగా సంఘసంస్కార ప్రబోధమైన కవిత్వం రచించారు. లెక్కలేని బిరుదులు, సన్మానాలు పొందారు. జాషువా గారు 1917 నుంచి 1966 వరకూ తన సాహిత్య జీవితం 50 ఏళ్ళలో 1650 పుటలు రచించారు.

సమకాలీన సాహిత్యాన్ని ఉర్రూతలూపిన భావ కవిత్వోద్యమంగాని, అభ్యుదయ కవిత్వోద్యమం గాని జాషువాను ప్రభావితం చేయలేదు. సంఘంలో దురాచారాలు సమసిపోయి అందరూ సహజీవనం చేయాలనే తలపుతో జాషువా సాహిత్యాన్ని రచించారు. సాంఘిక విప్లవాన్ని కోరిన జాషువా, భాషలో విప్లవాన్ని కోరలేదు.

కవిగా మిక్కిలి ప్రసిద్ధులైన జాషువా తన సాహిత్య జీవిత ప్రారంభదశలో నాటకాలు రచించారు. అది: 'రుక్మిణీ కల్యాణము', 'చిదానంద ప్రభాతము', 'ధ్రువ విజయము', 'వీరాబాయి', 'తెరచాటు' మొదలైనవి. ఇవి ఏవీ జాషువా ప్రతిభకు నికషోపలమైనవి కావు. అట్లాగే ఆయన ఆశుకవితా సాధన దశలో రచించిన 'హిమధామార్కధర పరిణయము', 'కన్యకాపరమేశ్వరి', 'కుశలవోపాఖ్యానము' ఆయన కవితా శక్తిని నిరూపించేవి కావు.

గుర్రం జాషువా సామాజిక కవిగా పరివర్తన చెందినాక 14 కావ్యాలు, 7 సంపుటాలు, ఖండకావ్యాలు రచించారు. వీటిలో జాషువా సామాజిక కవితాశక్తి జ్వాజ్వల్యమానంగా వెలుగొందుతున్నది.

**గుర్రం జాషువా స్వాతంత్ర్యానంతరం చేసిన రచనలు ఇవి:**

1) ఖండకావ్యాలు: 4,5,6,7 సంపుటాలు
2) బాపూజీ - 1948
3) చిన్నా నాయకుడు 1948

4) స్వయంవరం 1950
5) రాష్ట్రపూజ 1953
6) కొత్తలోకము 1957
7) నా కథ 1962
8) క్రీస్తుచరిత్ర 1963
9) ముసాఫరులు 1963
10) నాగార్జున సాగరము 1966

'ఖండము' అంటే భాగం 'చిన్నది' అనే అర్థాలు ఉన్నాయి. సాహిత్యపరంగా 'చిన్నకావ్యం' అని అర్థం చేసు కోవచ్చు. దీనిని జగన్నాథుడు అనే ఆలంకారికుడు "ఖండ కావ్యమ్ భవేత్ కావ్యైక దేశానుసారిచ ఇతి మేఘదూతాది" అన్నాడు. 'ఖండ కావ్యం' అనేది ఏక కాలంలో చదివించేది. మహాకవి గుర్రం జాషువా 25 కావ్యాలు, 65 ఖండ కావ్యాలు, నాటకాలు మొదలైనవి రచించారు. కావ్యాల కంటే ఖండ కావ్యాల్లోనే అఖండ ఖ్యాతిని, అనంత వ్యాప్తిని పొందారు జాషువా.

**జాషువా తాత్విక నేపథ్యం :**

ఏ కవికైనా ఒక తాత్విక నేపథ్యముంటుంది. జాషువాకుకూడా అది ఉంది. గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు, మహాత్మాగాంధీ ఈ ముగ్గురు గుర్రం జాషువాకు తాత్విక గురువులు. ఈ త్రయాన్ని జాషువ తన కవిత్వంలో అనేక పర్యాయాలు ప్రస్తావించాడు. ఈ ముగ్గురిలోని శాంతి, అహింస, కరుణ అనే గుణాలే వీరిని జాషువాకు తాత్విక గురువులుగా చేశాయి.

**జాషువా సాహిత్యంలో గాంధీ :**

"గాంధీ మహాత్ముని వంటి మనిషి ఈ ధరాతలంపై నడియాడెనను మాట భావితరాల ప్రజలు నమ్మరని" ప్రపంచ ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్త 'ఐన్‌స్టీన్' చెప్పడం మనకి అంతులేని ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

గాంధీజీ భారతదేశ స్వాతంత్ర్య సంపాదనకు ప్రధాన కారణభూతుడైనవాడు, 'సత్యము', 'అహింసా' ఆయన ఆయుధాలు. 'భగవద్గీత' ఆయన ఆత్మ.

గాంధీని అభిమానించాలంటే భారతీయ తాత్విక నేపథ్యం పునాది కావాలి. ఆనాడు గాంధీ వ్యక్తిత్వం ప్రపంచాన్ని ఆకర్షించింది. ఆయన వలె జీవించాలని ప్రయత్నించింది. స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా జరుగుతున్న ఆ రోజుల్లో గాంధీని ప్రత్యక్షంగా చూస్తూ, ఆయన మాటలు వింటూ, ఆయనలోని తాత్వికతను గమనించిన తెలుగు కవులెందరో ఆయనపై పుంఖాను పుంఖంగా కవిత్వం రాశారు. వీరిలో మంగిపూడి వేంకట శర్మ, మహాకవి జాషువా, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, కరుణశ్రీ (జంధ్యాల పాపయ్య శాస్త్రి), పాలా వెంకటసుబ్బయ్య, డా॥ సి. నారాయణ రెడ్డి వంటి ప్రముఖులెందరో ఉన్నారు. వీరిలో మంగిపూడి, తుమ్మల గాంధీపై గ్రంథాలే ప్రచురించారు. జాషువా మాత్రం గాంధీని ఆరాధించిన తీరు నిరుపమానం.

భారత జాతిపితగా, అహింసావాదిగా, కరుణామూర్తిగా, సంఘ సంస్కర్తగా, హిందు, ముస్లిం సమైక్యతా వాదిగా విశ్వఖ్యాతినార్జించిన మహాత్ముని మరణ వార్త విన్న జాషువా అంతరంగంలో చెలరేగిన కన్నీటి సుడిగుండం 'బాపూజీ' కావ్యమై ఆవిర్భవించింది.

"లోక మోహన సబర్మతి సన్మునికింగుమారుడన్" (కొత్త-11) "మహాత్ముని చెప్పుల జాడలోన కాలాడ చరించెదన్" (కొత్త-10) అని ప్రకటించిన జాషువా గాంధీజీ గురించి ఎలా సంబోధించాడో పరిశీలిద్దాం. గాంధీజీని గుర్రం జాషువా సంబోధించిన మాటలు ఇవి.

గాంధీబాబు, చర్కాసాధురాణ్మూర్తి, బాపూజీ మహాత్యాగి, గాంధీ దేవుడు, గాంధీ వీరుడు, సకల విశ్వంభరా సంస్కారి, గాంధీ ముని, దిగంబర ప్రభువు, అహింసా ఖడ్గ వీరుడు, చరఖాసమ్మౌని, గుజరాతు మునివరుడు, కరముచందుగాంధీ, గుజరాతీయుతపస్వీ, గాంధీ మునీంద్రుడు.

'బాపూజీ' ఖండికలో గాంధీమహాత్ముని గురించి జాషువా వివరించిన తీరు ఎంతో విశ్లేషణాత్మకంగా ఉంటుంది. గాంధీ మహాత్ముని గుణగణాలకు దేశ సంపద సరితూగదన్నారు. భారతీయుల స్వాతంత్ర్యం కోసం తాను ఉపవాసం వుండి, స్వాతంత్ర్యాన్ని సంపాదించిన తీరు చక్కగా వివరించారు జాషువా.

సీ. భరతవర్షంబీను వజ్రాలధనరాశి
తూకంబునకు పెచ్చుదూగువాడు

మూడుమూర్తుల దయాభూతి ప్రత్యంగాన
తాండవించెడు పవిత్రస్వరూపి
పదివేలయేండ్ల లోపల ధరాదేవత
కనియెఱుంగని జగన్మునివరుండు
అనుగుదమ్ములు కోరుకొను స్వరాజ్యార్థమై
పస్తుండి శుష్కించు పండుముసలి

ఆ.వె. గోచిపాత గట్టుకొని జాతిమానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామితప్రదాత! గాంధీతాత!!

ఆంగ్లేయుల దోపిడీ విధానాన్ని నిలువరించి, వారి హృదయాలలో భారతీయుల పట్ల జ్ఞానజ్యోతిని వెలిగించిన సూర్యుడిగా గాంధీని జాషువా భావించాడు. 'మానవత్వం' అనే సూత్రాన్ని ప్రపంచ జాతికి అందించిన గొప్ప మానవతావాది, 'సత్యాగ్రహం' అనే ఆయుధాన్ని భూమిమీదకు తెచ్చిన మహాపురుషుడని కొనిడాయాడు. కులదురాచార నిర్మూలనలో పీడితుల పక్షాన నిలబడ్డ పేదల బంధువు అని చాటిన విధానాన్ని కింది పద్యంలో చూడవచ్చు.

సీ. విమత భూపతుల దోపిడి గుందు జాతిలో
దీపంబుబెట్టిన దినకరుండు
మానవత్వమును భూమండలంబున నెల్ల
చాటిన యాచార్య చక్రవర్తి
సత్యాగ్రహంబును శస్త్రచాలన విద్య
భువికిదెచ్చిన మహాపురుషమౌళి
నిమ్నజాతుల కంటి నీరంబుదుడిచి యా
శ్వాసించు నిఱుపేద బాంధవుండు (బాపూజీ పు. 13)

**దండి సత్యాగ్రహం :**

మహాత్మాగాంధీ 1930 మార్చి 12న 'సబర్మతి' ఆశ్రమం నుంచి 'దండి' అనే గ్రామానికి నడిచివెళ్లి, శాసనోల్లంఘనం చేసి ఉప్పు తయారుచేశాడు. ఈ 'దండి' యాత్రనే సుభాష్‌చంద్రబోస్ "నెపోలియన్ 'ఎల్బా' నుంచి 'పారిస్' కు నడిచివచ్చిన యాత్రలాంటిదని" పేర్కొన్నాడు. అలా 'దండి' సత్యాగ్రహాన్ని జాషువా చిత్రించిన తీరు ఈవిధంగా ఉంది.

తే.గీ. ఉప్పు సత్యాగ్రహంబున కుత్సహించి
కఱ్ఱమోపున జలధికి గదులునాడు
శాంత గంభీర భంగహస్తములు సాచి
యంజలిఘటించె బాపూజి కబ్ధిరాజు
(బాపూజీ పు. 58)

**నిరసన దీక్ష :**

భారతీయుల సమస్యలు పరిష్కరించడానికి ముందుకురాని బ్రిటిష్ పాలకులలో చలనం కల్గించి, సమస్యల పరిష్కారం కోసం వారు కదిలేటట్లు చేయడానికి గాంధీ అనేక సందర్భాలలో నిరసన దీక్షలు చేశారు. అలా గాంధీజీ ఉపవాసదీక్షను జాషువా భావన చేసినతీరు ఎంతో హృద్యంగా ఉంది.

తే.గీ. అలిగి కూర్చుండు చిన్ని బిడ్డల విధాన
నుపవసింతువు భువనముఱ్ఱూతలూగ
విశ్వములకెల్ల గారాలబిడ్డ వకట
చంపుకొన్నది భారతక్ష్మాతలంబు
(బాపూజీ పు.9)

**గాంధీ మార్గం :**

భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో అస్పృశ్యత, స్త్రీవివక్ష, బానిస వ్యవస్థ వంటివి ఉన్నాయి. ఈ సమస్యలకు సంబంధించిన గాంధీ ఆలోచనా విధానాన్ని జాషువా కవితాత్మకంగా చెప్పారు.

మనుషులను మనుషులుగా చూడని అంటరానితనం కనుమరుగైపోవాలని గాంధీ కలలు కన్నారు. ఈ జాడ్యం మన మీద స్వారీ చేస్తున్నంత కాలం మనకు స్వరాజ్యం రాదు అని, బానిస వ్యవస్థ ఉన్నంత వరకూ పాలకులకు బలం చేకూరుతుందంటూ జాషువా ప్రబోధించిన తీరు మనల్ని ఎంతగానో ఆలోచింపజేస్తుంది.

ఆ.వె. మనము బానిసలము, మనకును బానిసల్
శాశ్వతముగ నిమ్నజాతివారు
బానిసీంద్ర క్రింద బానిసలున్నచో
బలము ముమ్మరించు పాలకులకు
(బాపూజీ పు. 76)

అంటరానితనం మనిషిని ఎలా కృంగదీస్తుందో అది అనుభవించేవాడికే తెలుస్తుంది. అలాంటి చేదు

సంఘటన మన గాంధీగారు కూడా దక్షిణాఫ్రికాలో తెల్ల వాడితో ఎలా అనుభవించాడో జాషువా ఇలా తెలియ జేస్తాడు.

ఆ.వె. అంటరానివారి యంతరంగంబున
బ్రేలు నగ్నిపర్వతాల ఘోష
అంటరానివాడనై ఆఫ్రికాయందు
తెల్లవారినడుమ దెలిసికొంటి

**సత్యాహింసల దివ్యజ్యోతి :**

గాంధీ నమ్మిన సిద్ధాంతాలు సత్యం, అహింస. ఈ రెండు మార్గాలే మానవుణ్ణి మాధవుణ్ణి చేస్తాయని గాంధీ విశ్వసించారు. అన్ని పుణ్యాలకు పరమావధి ఈ రెండేనని ప్రబోధించిన విధానాన్ని జాషువా క్రింది పద్యం ద్వారా ఇలా తెలియజేసారు.

క. సత్యాహింసలు రెండే
ముత్యాల సరాలు సకల పుణ్యంబులకున్
గత్యంతరములు ప్రేమ
వ్యత్యస్తము లేని మోక్షపతి నేత్రంబుల్
(బాపూజీ పు. 82)

**స్త్రీ స్వేచ్ఛ :**

మహిళలకు ఇంట్లో, సమాజంలో స్వేచ్ఛ ఇవ్వాలని, స్త్రీని ఒక మనిషిగా చూడాలని, స్త్రీని పవిత్రమూర్తిగా చూడటంలోనే దేశనాగరికత ఉందని గాంధీ బోధిస్తారు. స్త్రీల పట్ల గాంధీ చూపిన అభిమానాన్ని జాషువా కింది పద్యం ద్వారా చక్కగా తెలియజేస్తారు.

శా. ఘోషాలోబడి క్రుళ్ళిపోయినది దిక్కున్ మ్రొక్కు లేకుండ నీ
యోషామండలి యెండకన్నెఱుగ కీ యుత్త ధర్మాలకున్
బోషాణంబయి బూజుపట్టినది హిందూజాతి చిత్తంబునం
దీపత్రేమ వహించి స్వేచ్ఛ యిడవోయీ! అక్క చెల్లెంధ్రకున్ (బాపూజీ పు. 91)

**అవతారమూర్తి :**

According to J.H. Holmes, he was "The greatest Indian since Buddha and the greatest man the world has seen since Jesus Christ"

(భారతీయులలో బుద్ధుని తరువాత గొప్ప మహా పురుషుడు - ఏసుక్రీస్తు తరువాత ప్రపంచం కనీవినీ ఎరుగని మహామనిషి మహాత్మాగాంధీజీ) ఈ అభి ప్రాయాన్ని బాషువా వ్యాఖ్యానిస్తూ

మ. కలికాలమ్మున యేసుక్రీస్తువని వక్కాణించి దిగ్దేశముల్
తులువల్ సల్పిన గాయముల్ మరల నీలోదోచి, యేసుప్రభున్
దలపించెన్ ఋజువయ్యె నీదగు మహత్వశ్రీ భవత్త్యాగ శ
క్తులలో నెన్ని స్వరాజ్యముల్ భువనవైకుంఠంబు లింపారునో (బాపూజీ పు. 7)

అని బాపూజీ త్యాగశక్తిని క్రీస్తుతో పోల్చాడు.

జాషువా మీద గాంధీ మహాత్ముని సత్యాగ్రహ కార్య క్రమం చాలా ప్రభావం చూపించింది. ఒక పద్యంలో దాని గురించి ఇలా వివరించాడు.

"గుర్రాలకు రెక్కలు గల
వెర్రియుగాల్ దాటిపోయే విజ్ఞానంబున్
బుర్రగల గాంధీ యుగమిది
కర్రలు ఖడ్గంబు లేలగ లేవు ప్రజన్." అని అంటారు.

**ముగింపు :**

గాంధీ స్మృతిలో జాషువా రాసిన 'బాపూజీ' కావ్యం గాంధీపై వచ్చిన కావ్యాలన్నిట్లో ఉత్తమ మైనది. గాంధీపై జాషువాకున్న గౌరవాన్ని, ప్రేమను, అతని మార్గంపై ఉన్న అనురాగాన్ని, దాన్ని ముందుకు తీసుకుపోయే తత్వాన్ని ఈ కావ్యంలో వెల్లడించాడు జాషువా. గాంధీ మరణం జాషువాను అతలాకుతం చేసింది. అతని పనులను, దేశానికి చేసిన సేవలను, మానవాళికి అతడిచ్చిన సందేశాన్ని కరుణ రసాత్మకంగా రాస్తూ, గాంధీకి గొప్ప నివాళి అర్పించాడు జాషువా. ప్రజలు, దేశం, మొత్తం ప్రపంచమే మూగబోయిందని జాషువా అభి ప్రాయపడ్డాడు.

ఉ॥ భగ్గునమండు సీమ నరపాలనతోడ నెదిర్చి వెన్కకున్
దగ్గక రక్తపుంజినుకు నష్టముగాని స్వరాజ్య యుద్ధమున్
నెగ్గిచినట్టి భారతముని ప్రవరుండు క్షమాప్రవాసి యా
ముగ్గన పండు బోనమయి పోయెనె నేడు తుపాకి
గుండ్లకున్

జాషువా గారు 'బాపూజీ' కావ్యాన్ని శ్రీ తిక్కవరపు రామిరెడ్డి గారికి అంకితం ఇచ్చారు.

ఈకృతి స్వీకృతిని తిక్కవరపు రామిరెడ్డి గారెంతయు అర్హులై గాంధీమహాత్ముని ఆత్మశాంతికి ఉపకరింతురని నా విశ్వాసము అని జాషువా అభిప్రాయపడ్డారు.

**ఆధార గ్రంథాలు :**


1) జాషువా సాహిత్యతత్త్వ వివేచన, తెలుగు అకాడమీ, హైదరాబాదు, ప్రచురణ 2012.

2) జాషువా (జాషువ సర్వలభ్యరచనల సంకలనం) మనసు ఫౌండేషన్, బెంగుళూరు.

3) జాషువా రచనలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, ప్రచురణ, 2015.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# భాగవతం – ప్రహ్లాద అద్వైతసిద్ధి



– డా॥. సి. చిన్న పాపమ్మ

తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి.

నేను నాది అనే భావన ప్రతి ఒక్కరికి ఉంటుంది. "నేను"ను "నాది" నుంచి వేరుచేసి చూడడం అద్వైతంలో మొదటి మెట్టు. నేను సమస్తంతో ఏకం కావడమే అద్వైతం. కంటికి కనిపించే ఈ సమస్త జగత్తు అంతా పరమాత్మ విభూతిగా భావించి అందులో మమేకమయ్యే భావం. "విశ్వం దర్పణ దృశ్యమాన నగరీత్యులం.." దక్షిణామూర్తి శ్లోకంలో చెప్పినట్లు అద్దంలో కన్పించే ప్రతిబింబమే ఈ విశ్వం. బింబము పరమాత్మ. అద్దం పగిలితే ప్రతిబింబం కనిపించదు. బింబంలో లయమై పోతుంది. అలాగే సర్వవ్యాపకమైన పరమాత్మ బింబం నుండే పిండాండ, బ్రహ్మాండాలన్నీ సృష్టించబడ్డాయి. సృష్టి, స్థితి, లయాలతో ఏకమైనదంతా నశిస్తుంది. కాని పరమాత్మ ఎప్పటికీ శాశ్వతం. పరమాత్మ చైతన్యమే ఈ చరాచర జగత్తు అంతా నీవారసూకం మోపడానికి కూడా వీలు లేనంతగా వ్యాపించి ఉందని తెలుసుకోవడమే అద్వైతం. అంటే పరమాత్మ కన్నా అన్యంగా ఏదీ లేదన్న అనన్య భావం.

"...మత్‌స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితం:" భగవద్గీత (9-4)లో చెప్పినట్లు నిరాకార పరబ్రహ్మనైన నా చేతనే ఈ జగత్తంతయును జలములలో మంచువలె పరిపూర్ణమై ఉన్నది. ప్రాణాలన్నియు నా సంకల్పము ఆధారంగా పుట్టి నాయందే లయమౌతున్నాయి. ఈ అద్వైత భావాన్ని అణువణువులో నింపుకున్న పాత్ర ప్రహ్లాదుడిది.

హిరణ్యకశిపుడు, లీలావతికి జన్మించినవాడు ప్రహ్లాదుడు. దానవ కులంలో జన్మించినా ఆ గుణాలేవీ ఇతనికి ఒంటబట్టలేదు. పైగా దేవతల చేతనే కొనియాడబడే గొప్ప గుణాలతో విరాజిల్లినవాడు ఆదిశేషుడైనా, బృహస్పతికైనా, ఆఖరికి బ్రహ్మకైనా అతని గుణాలను వర్ణింప శక్యం కాదని దేవతలే అన్నారంటే ప్రహ్లాదుడి గుణసంపద ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. భగవంతుడైన శ్రీహరిని తన హృదయ కమలంలో పదిలపరచుకున్నవాడు, సమస్తంలోనూ ఆ పరమాత్మతత్వాన్ని అనుభవపూర్వకంగా దర్శించిన జ్ఞానసంపన్నుడు. అలాంటి ప్రహ్లాదుని హిరణ్యకశిపుడు రాక్షసుల గురువైన శుక్రాచార్యుని కుమారులు చండ, అమర్కుల వద్దకు విద్యాభ్యాసానికై పంపుతాడు.

అలా విద్య నేర్చుకుంటున్న ప్రహ్లాదుని విద్యాభ్యాసం ఎలా సాగుతున్నాదో చూడాలని హిరణ్యకశిపుడు ఒకనాడు ప్రహ్లాదునితో ఇలా అన్నాడు. కుమారా! ఏదైనా ప్రయత్నం ఫలించాలంటే ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి అనే మూడు శక్తులు కలిసి రావాలి. అవన్నీ సహకరించి నీ

ప్రయత్నాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయా, గురువుల వద్ద వలసినంత విజ్ఞాన సంపద పొందావా అని ప్రశ్నించాడు. అందుకు ప్రహ్లాదుడు "తండ్రీ! నాకు నచ్చిన విషయం నారాయణ స్మరణ ఒక్కటే. అజ్ఞానులు, అవివేకులూ సంసారమనే చీకటి నూతిలో పడి బయటకు రాలేక "నువ్వు - నేను వేరు" అనే భ్రాంతిలో బ్రతుకు తుంటారు. అలా భావించకుండా ఇదంతా భగవంతుని లీలా విన్యాసం అని తెలుసుకోలేరు" అని బదులు చెప్పాడు.

మానవులు నేను - నాది అన్న ద్వైతభావంతో జీవిస్తుం టారు. ఆత్మ - పరమాత్మతత్వాన్ని వేర్వేరుగా చూస్తుం టారు. ఉన్నది పరమాత్మే. ఈ జగత్తు అంతా ఆయన విభూతి అని గ్రహించలేరు అని చెప్పడంతో ప్రహ్లాదుడి లోని అద్వైతసిద్ధి తెలియచున్నది.

ప్రహ్లాదుని నోటివెంట శ్రీహరిని గురించి స్తుతించడం విన్న హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో కుమారా! ఎవరైనా నిన్ను బెదిరించి తప్పుడు బుద్ధులు నేర్పారా? శత్రువుని మెచ్చుకోమని ఎవరు చెప్పారు. దేవతలను బాధించడమే మన పరమావధి. అంతేగానీ.. హరి! గిరి అంటూ మూఢుడులాగా అంధకారంలో పడకు అని చెప్పగా అందుకు ప్రహ్లాదుడు తండ్రితో ఇంకను గురువులతో ఇలా అన్నాడు.

కోరికలను జయించి భగవంతుని గురించి ధ్యానించే జ్ఞానుల మనస్సులో మీరు - మేము అనే అర్థం లేని భేదాలు ఉండవు. అలాంటి సమదృష్టిని ఇచ్చే ఆ హరిని సేవిస్తున్నా. "అజ్ఞాత గొందఱు నేము దామనుచు మాయం జెంది సర్వాత్మకుం..." అజ్ఞానంతో కొందరు 'మీరు వేరు - మేము వేరు' అనే భ్రాంతిలో ఉంటారు. అలాంటివారు తమ బుద్ధికి అందని భగవంతుని తెలుసుకోలేరు. పరమాత్మను తెలుసుకొనే విషయంలో బ్రహ్మ వంటి వేదమూర్తులు కూడా ఒక్కోసారి అసమర్థులే. ఇక సామాన్యులు ఆ పరాత్పరుని ఎలా తెలుసుకోగలరు. ప్రహ్లాదుడికి ఉన్న జ్ఞానదృష్టితోనే ఆ పరాత్పరుని దర్శిం చాడు. తనకన్నా అన్యంగా ఏదీలేదని తెలుసుకున్నాడు. ఇది అతని అద్వైతదృష్టికి గొప్ప నిదర్శనం.

ఇనుము అయస్కాంతాన్ని ఆకర్షించినట్లు ప్రహ్లాదుని మనస్సు ఆ పరమాత్మునిపై లగ్నమై ఉంది. "ఇనుమ యస్కాంత సన్నిధినెట్లు భ్రాంత, మగహృషికేశు సన్నిధి నా విధమున గరగుచున్నది..." అని చెప్పడంలోని ఆంతర్యం అదే కదా! "మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు.." ఆ విధంగానే అతని హృదయం నిండా విష్ణువే నిండివుండాడని ఆ పరంధాముని దివ్య పాదపద్మాలను దర్శించడంలో లగ్నమై పరవశించి ఆనందం పొందుచున్నానని అంటాడు.

ప్రహ్లాదుని మాటలు విని గురువులు కోపించి బాలకా! మేము చెప్పిన శాస్త్రాలలోని ఒక్క విషయం కూడా చెప్పవేమి? మహారాజు ముందు మాకు తలవంపులు తెచ్చావు శత్రువుని మెచ్చుకొంటూ మీ వంశానికి మచ్చ తెచ్చావు అంటూ హిరణ్యకశిపుని ఆజ్ఞతో మరలా ప్రహ్లాదునికి ధర్మ, అర్థ, కామశాస్త్రాలను గొప్పగా బోధిం చారు. తర్వాత గురువులు హిరణ్యకశిపునితో దానవేంద్రా! బాలునికి అన్ని విద్యలు నేర్పామని చెప్పారు. హిరణ్య కశిపుడు ఆనందంతో కుమారా! నీకు ఇష్టమైన ఏ గ్రంథంలోదైనా ఒక పద్యం చెప్పి, దాని భావం వివరించు అనగా అందుకు ప్రహ్లాదుడు "చదివించిరి నను గురువులు... చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ" అన్ని చదువులలోని సారమూ, రహస్యమూ తెలుసు కొన్నాను. కానీ శ్రీహరిని సేవించడం కన్నా ఉత్తమమార్గం మరేదీ లేదని నాకు అనిపిస్తున్నది. ఇది తప్ప మరొక సత్యంలేదు. శ్రీ పతిని సేవించలేని జన్మ వృథా. విష్ణు భక్తి లేని వాడు ద్విపాద పశువుతో సమానమని చెప్పగా హిరణ్యకశిపుడు సేవకులను పిలిచి ప్రహ్లాదుని అనేకరకాల మరణదండనలకు గురిచేయమని అజ్ఞాపించాడు.

సేవకులు ప్రహ్లాదుని మదపుటేనుగుల చేత తొక్కిం చారు; విషసర్పాలచేత కురిపించారు. అగ్నిగుండంలో తోయించారు. నడిసముద్రంలో పడవేశారు. కొండశిఖరా లపై నుండి క్రిందకి నెట్టారు... ఇలా ఎన్ని హింసలకు గురిచేసినా ప్రహ్లాదుడు ఏ మాత్రం చలించకుండా, సేవకులపై కోపం తెచ్చుకోకుండా అచలుడై ఆ హరి పాదపద్మాలను మనస్సులో స్మరిస్తూ మృత్యుంజయుడు అయ్యాడు. దీన్ని బట్టి ప్రహ్లాదుడిలోని అద్వైతభావం

ప్రకటమౌతున్నది. జనన మరణాల్ని సమదృష్టితో చూడ గలిగిన జ్ఞాని ప్రహ్లాదుడు.

ప్రహ్లాదుడు సామాన్యుడు కాడని ఈ బాలునితో విరోధం పెట్టుకుంటే తనకు మరణం కలుగుతుందని మనసులో భావించి బాధపడుతున్న హిరణ్యకశిపునితో గురువులు ప్రహ్లాదుని తీసుకెళ్ళి పెద్దలైన గురువుల వద్ద కొన్నాళ్ళు చదివిస్తే బుద్ధిమంతుడు అవుతాడని చెప్పి గురుకులానికి తీసుకెళ్ళాడు. ప్రహ్లాదుడికి గురువులు చెప్పే లోక వ్యవహార విద్యలన్నీ భ్రాంతి అని తెలుసుకొని, గురువులు ఆశ్రమంలో లేని సమయం చూసి తోడి రాక్షక బాలకులతో ఇలా అచెప్పాడు.

"ధర్మాలు ఆచరించే మానవ జన్మ దొరకడం అతి దుర్లభం.." అనేక జన్మల సుకృతం ఫలితంగా పొందిన ఈ జన్మను సార్థకం చేసుకోవాలంటే మోక్షమార్గం వైపు ప్రయాణం సాగించాలి. మానవుడు రకరకాల గర్భాలలో నానా అవస్థలు పడి పుడుతూ గిడుతూ ఉంటాడు. తనను గూర్చి తాను తెలుసుకోలేడు. వందలకొద్దీ జన్మలెత్తినా కర్మబంధాల్లో చిక్కుకుని బయటపడలేడు. అసలు చావు పుట్టుకలు లేని మంచి దారిని వెతుక్కోవడం మనకు శ్రేయస్కరం అని చెపుతూ తాను చవిచూసిన అద్వైత భావాన్ని ఇలా వివరిస్తాడు. "ఆ పరాత్పరుడు అన్ని ప్రాణుల మనస్సులోను, అన్ని దిక్కులలోను ఉన్నాడు. బ్రహ్మమే పరాకాష్టగా ఉన్న ఈ లోకంలో కంటికి కనిపించే, కనిపించని చిన్న, పెద్ద జీవకోటిలోను, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వీ అనే పంచభూతాల్లోనూ, అండాండ, పిండాండ, బ్రహ్మాండాలలోను, సమస్త వస్తువుల్లోనూ, త్రిగుణాల్లోనూ భగవంతుడు ఉన్నాడు".

అంతేకాదు "ఆస్వామి ఏమార్పుకు లోనుకాడు. ఆనందస్వరూపుడు. నిరుపమానుడు, నిరాకారుడు, నిర్గుణుడు, నిశ్చలుడు, నిరంజనుడు త్రిగుణాలనే తన దివ్యమైన మాయచేత అదృశ్యమైన శక్తితో వ్యాపించి, వ్యాపింపచేయునట్టి రూపాలలో కనిపించువాడు. చూచు వాడు, అనుభవించువాడు అన్నీ తానే అయి స్పష్టాస్పష్టంగా అంతటా ఉంటాడు" కావున ఎటువంటి కోరికా లేకుండా త్రిగుణాతీతుడైన శ్రీహరికి హృదయాన్ని

తత్వాన్ని తెలుసుకున్న అలాంటి మానవుడు తాను వేరు - మరొకరు వేరు అనే భేదభావంతో ఉండడు.

ఇంకనూ తాను లీలావతి గర్భంలో ఉండగా నారద మహర్షి బోధించిన అద్వైతసారమంతా ఆ రాక్షస బాలకు లకు ఇలా వివరిస్తాడు. "కాలం ఈశ్వర స్వరూపం. కాలక్రమంలో వృక్షాలు ఫలాల నుంటి పుట్టడం, వృద్ధి పొందడం, పడడం, ఎండడం, కృశించడం, నశించడమనే క్రమం ఎలా ఉంటుందో, ఈ దేహానికి కూడా పై ఆరు విధాలైన వికారాలు ఉంటాయి. కానీ అన్నిటా సర్వవ్యాపక మైన ఆత్మకు ఈ వికారాలు అంటవు.

ఆత్మ అంతటా ఉంటుంది. వేటినీ తనలోకి రానీయదు. అది లేకుండా ఏదీ ఉండదు. ఏదీ లేక పోయినా ఆత్మ నిత్యమై, సత్యమై వెలుగొందుతూ ఉం టుంది. ఈశ్వరుడైన భగవంతుడే ఆత్మగా సర్వప్రాణికోటి హృదయాల్లో అంతర్యామియై ఆకాశంవలె వ్యాపించన ఆత్మేశ్వరుడ. పంచభూతాల్లో పంచతన్మాత్రలుగా, పంచభూతాత్మకమైన దేహంలో జీవుడుగా పిలువ బడుతున్నాడు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ హృదయాలలో వుండే ఆ భగవంతుని భక్తిశ్రద్ధలతో నిష్కామంగా సేవించి ధ్యానించాలని వివరించాడు. దీన్ని బట్టి "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్న ఉపనిషద్వాక్యం, అద్వైతభావం ప్రహ్లాదుడు దర్శించి, అనుభవానికి తెచ్చుకున్నాడని తెలుస్తున్నది.

ఇలా తోడి బాలురకు చెప్పుచుండగా చండ, అమార్కులు విని ప్రహ్లాదుడు గురుకులంలోని విద్యార్థులందరికీ మోక్షం గురించి బోధించి మనకు తీరని ద్రోహం చేశాడని హిరణ్య కశిపునితో చెప్పారు. అది విని ఉగ్రుడైన హిరణ్యకశిపుడు ఓరీ! డింభకా! నేను యుద్ధ రంగంలో దేవతలను దండిస్తుంటే నీవు సేవించే ఆ హరి ముందుకు రాలేదేం? అంతేకాక ఆచార్యులు చెప్పింది వినక పైగా నీ తోడిబాలకులకు కైవల్యం పట్ల కాంక్ష కల్గించావు. నీవు కులద్రోహివి. మూఢుడవు. నీ వంటి వాణ్ణి చంపడం చాలా మంచిది.

ఓరీ ! "దిక్కులు గెలిచితినన్నియు, దిక్కెవడురోరి నీకు దేవేంద్రాదుల్
దిక్కుల రాజులు వేరొక, దిక్కెఱుగక కొలుతురితడె దిక్కని నన్నున్"

నీకు నేను తప్ప వేరు దిక్కులేదని తెలుసుకో అని కోపంగా పలికిన తండ్రితో ప్రహ్లాదుడు "బలవంతులకు దుర్బలులకు, బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్ బలమెవ్వడు ప్రాణులకును, బలమెవ్వండట్టి బలమ సురేంద్రా" దానవేంద్రా! బలవంతులకు, బలహీనులకు ఎవడు బలమో, నీకు, నాకు, బ్రహ్మాది దేవతలకు ఎవడు బలమో, సమస్త ప్రాణికోటికి ఎవడు బలమో, ఆ పరాత్పరుడే నాకూ బలము.

మహాత్మా! "దిక్కులు కాలముతోనే, దిక్కున లేకుండు..." దిక్కులకూ, కాలానికీ అతీతుడైన వాడెవడో, దిక్కులకు దిక్కైనవాడు ఎవరో ఆ అచ్యుతుడే నాకు ఆధారం.

తండ్రి ఆ జగత్పతి విరాణ్మూర్తిగా విరాజిల్లు తుంటాడు. వినోదంగా త్రిగుణాల ప్రభావంతో విశ్వాన్ని సృష్టిస్తూ, పోషిస్తూ, లయం చేస్తూ ఉంటాడు. మరి నీవు లోకాలను జయించానని చెప్పావు. కానీ నీలోని అరిషడ్వర్గా లనే శత్రువుల్ని కూడా జయించలేకపోయావు. కావున అవ్యయుడైన ఆ అచ్యుతుని పై మనస్సు లగ్నం చేయి అనగా హిరణ్య కశిపుడు.. ఓయీ! దుర్మతీ! నాకే నీతులు చెపుతున్నావు. చావుని లెక్కచేయక మితిమీరి మాట్లాడు తున్నావు. విశ్వమంతా గాలించాను. కానీ ఆ విష్ణువు ఎక్కడా కన్పించలేదు. పిరికివాడైన ఆ విష్ణువు ఎక్కడ ఉంటాడు? ఏ విధంగా ఉంటాడు? ఏ రీతిగా తిరుగు తుంటాడు చెప్పు లేదా నిన్ను నీ హరినీ కూడా సంహ రిస్తాను అని హిరణ్య కశిపుడు పలుకగా అద్వైత దృష్టి గల ప్రహ్లాదుడు నిలువెల్లా పులకిస్తూ..

"కలడంబోధిఁ గలండు గాలి, గలడాకాశంబునం, గుంభినిం..." భగవంతుడైన విష్ణువులనిచోటు విశ్వంలో లేదు. సముద్రంలో ఉన్నాడు. సమీపంలో ఉన్నాడు. ఆకాశంలో ఉన్నాడు. అవని మీద ఉన్నాడు. అగ్నిలో ఉన్నాడు. అన్ని దిశలలో ఉన్నాడు. రాత్రిలో ఉన్నాడు. పగటిలో ఉన్నాడు. సూర్యునిలో, చంద్రునిలో, ఓంకారంలో, శ్రీకారంలో ఉన్నాడు. త్రిమూర్తులలో ఉన్నాడు. స్త్రీ, పురుష, నపుంసక వ్యక్తులలో ఉన్నాడు. అక్కడ, ఇక్కడా వెదకడం దేనికి, సర్వేశ్వరుడు ఒక చోట ఏమిటి? అంతటా నిండి ఉన్నాడు. "ఇందుగలడందు లేడని సందేహము వలదు..." నా మాట నమ్మ అంటాడు.

అందుకు హిరణ్య కశిపుడు ఆ హరి అన్నిచోట్లా, అన్నింటిలో ఉన్నాడని గొంతు చించుకుంటాన్నవే. అయితే ఈ స్తంభంలో చూపు లేకపోతే నీతల త్రుంచి వేస్తానని అంటాడు భక్తవత్సలుడైన ప్రహ్లాదుడు "అంభోజాసను డాదిగాగ దృణ పర్యంతంబు విశ్వాత్ముడై.." పరం దాముడు బ్రహ్మ మొదలు గడ్డిపరక దాకా అన్ని వస్తువు ల్లోనూ, సమస్త ప్రపంచమంతా నిండి ఉన్నాడు. అటు వంటప్పుడు ఈ స్తంభంలో ఎందుకుండడు. నిస్సం దేహంగా ఉన్నాడని చెబుతాడు. దీనిబట్టి ప్రహ్లాదుడిలోని భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో కూడిన అద్వైతసిద్ధి పరాకాష్టకు చేరుకుంది.

సర్వత్రా ఉన్న చైతన్యం పరమాత్మే. ఈ విశ్వమే పరమాత్మ శరీరం అని అనుభవంలోకి తెచ్చుకోవడమే మోక్షస్థితి. అదే అద్వైతసిద్ధి. "ఏకమేవా అద్వితీయం బ్రహ్మ" అనే ఉపనిషద్వాక్యాన్ని ప్రహ్లాదుడు అనుభవం లోకి తెచ్చుకొన్నాడు. జ్ఞానదృష్టితో ఆ పరంధాముని దర్శించి వదలక పట్టుకున్నాడు. తనకన్నా అన్యంగా ఏదీ అతనికి కన్పించలేదు. కాబట్టే సేవకులు పెట్టే అనేక హింసల్ని కూడా అలా సాక్షిగా చూస్తూ అచంచలంగా, నిశ్చలంగా అద్వైత స్థితిలో నిలబడగలిగాడు. సత్యం - జ్ఞానం - అనంతం అయిన ఆ పరమాత్మను తెలుసు కోవడమే మానవధర్మం. ఇక్కడ ధర్మమంటే జన్మ తీసుకున్నందుకు భగవదన్వేషణ చేయడం. ఆత్మ - పరమాత్మతత్వాన్ని అర్థం చేసుకొని ఆ దిశగా ప్రయాణం సాగించడం, శోధించడం, సాధించడం మానవాళి ధర్మమని ప్రహ్లాదుడి జీవితం అందరికీ దిశానిర్దేశనం చేస్తున్నది.

"సర్వేజనా సుఖినోభవంతు"

**ఆధార గ్రంథాలు :**

1) శ్రీమద్భాగవతం - తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ. 2) భగవద్గీత - గోరఖ్ ప్రెస్.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర



- వడ్డేపల్లి సుమిత్ర
తెలుగు ఉపన్యాసకురాలు, శ్రీరత్న డిగ్రీ మహిళా కళాశాల, ఉప్పల్, హైదరాబాద్.

**పరిచయం :**

భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర ఏర్పడి జూన్ 2, 2025 నాటికి 11 వసంతాలు దాటింది. దశాబ్దాల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం, దీని వెనుక సముద్రమంత పోరు ఉంది. తుఫానంత పోరు ఉంది. దీని వెనుక చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కారణాల బలమైన నేపథ్యం ఉంది. ఇక్కడి ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగలు, జారతలు, వేష భాషలు, అలవాట్లు, వీరాట సృభవం అన్నీ కలిపి తెలంగాణకు ఒక విలక్షణతను ఆపాదించి పెట్టాయి. తెలంగాణ ఆటలు, పాటలు, పండుగలు, వంటకాలు మొదలగునవన్నీ కాలగర్భంలో కలిసిపోతుంటే సగటు తెలంగాణ వాది కుతకుత ఉడికిపోయేవాడు. ఈ బాధలన్నింటి నుండి విముక్తి చేసేది కేవలం ప్రత్యేక రాష్ట్రం మాత్రమేనని భావించేవారు. వాదించిన ప్రతివారిని సీమాంధ్ర పాలకులు ఇది ఒక శాంతిభద్రతల సమస్యగానే చూసి ఉక్కుపాదం మోపి అణచివేసేవారు. "పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్లు తప్ప" అన్న శ్రీశ్రీ మాటలు ఆలోచింపచేశాయి. ప్రతి రక్తపు బొట్టుకు తిరుగుబాటు తత్వాన్ని, ప్రతి గొంతుకు నినదించే శక్తిని అందించింది. పుట్టిన శిశువు నుండి కాటికి కాళ్ళు చాపుకున్న పండు ముసలివారిదాక తెలంగాణ వస్తదా బిడ్డా అని కలవరించింది. ఇంతటి మహత్తర పోరాటాలతో బృహత్తర పాత్రను పోషించిన సాహిత్య ప్రక్రియలో కవులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరిపోసి రాష్ట్రాన్ని సాధించారు.

**ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం :**

**తెలంగాణ తొలిదశ ఉద్యమం :**

తొలి దశలో అసంతృప్తితో ప్రారంభమైన ఉద్యమం 1969 వరకు సాగి హింసాత్మకంగా మారింది. 1969 ఉద్యమానికి ప్రత్యేక కారణాలుగా

1) పెద్ద మనుషుల ఒప్పందం అమలు కాలేదు.
2) "తెలంగాణ ప్రాంతీయ మండలి" విధానాలు అమలు కాలేదు.
3) ముల్కి నిబంధనలు ఉల్లంఘన
4) తెలంగాణ ఉద్యోగులను కించపరచడం.
5) తెలంగాణలో ఆంధ్రవారిని నియమించడం.

తెలంగాణ వాదులు అనేక విధాలుగా నష్టపోతున్న కారణంగా ఆందోళన చేపాట్టారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చర్యలు ఉద్యమాన్ని రెచ్చగొట్టాయి. బండ్లు, ధర్నాలు, నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార

దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం వారిని నిర్బంధించి అణచివేసే ప్రయత్నం చేసింది. ఆనాటి ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర అగ్రభాగాన నిలిచింది. విద్యార్థులతో మొదలైన ఉద్యమం తారాస్థాయికి చేరింది! తెలంగాణ తొలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు, సాహిత్యరంగంలో అనేక సేవలు చేశారు.

**డా॥. దాశరథి రాసిన రచనల్లో**

- నా తెలంగాణ తల్లి కలజాతవల్లి
- నా తెలంగాణ కోటి అందాల జాన
- నా తెలంగాణ లేమ సౌందర్య సీమ
- నా తెలంగాణ ఆనంద పడగ
- నా తెలంగాణ కోటి రతనాల వీణ..

అని పులకించి పోయిన తెలంగాణ అస్థిత్వం కోసం దాశరథి ఒక మహాంధ్రోదయం కావ్యాన్ని వ్రాశారు.

కాళోజి తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలో తన రచనలతో ఉద్యమానికి ఊపందించారు.

ప్రత్యేక తెలంగాణము / ప్రాప్తి ఒక్కటే ఒక్కటి
ప్రత్యేక తెలంగాణ / ప్రాప్తించేదాక ప్రజల
ఉద్యమం ఆగబోదు / ఉవ్వెత్తున లేచసాగు
కోటిన్నర మేటి ప్రజల / గొంతుక్కటి గొడవొక్కటి

**కాళోజి** : ప్రధాని ఇందిరా గాంధిని ప్రస్తావిస్తూ తన కవితలో

కోటిన్నర ప్రమాణలమేటి / కోర్కె ఇప్పుడు వేరమ్మా
వేర్పాటు తప్ప ఇపుడు / వేరు మాట లేదమ్మా
ఒప్పందాలను నమ్మి / ఒప్పుకుంది చాలమ్మా
ఎవరి ప్రాంతాలను వారిని / ఏలనియ్య ఇందిరమ్మా..

**కసిరెడ్డి వెంకటరెడ్డి** : ఉద్యమంలో యువతలో స్ఫూర్తినింపే పదాలను తన కవిత్వంతో ఉత్తేజ పరిచాడు.

రుద్రమ్మ శౌర్యమ్మ భద్రంగ ఎంచుకో
గోనగన్నారెడ్డి గుర్తుకొనుము
సర్దారు పాపడ్ని సోరుగా తలుచుకో
పండుగ సాయన్న పటిమను పెంచుకో
కదలిరావమ్మా తెలంగాణ బిడ్డ

**ఎస్వీ సత్యనారాయణ** : తనదైన కవిత్వంలో తెలంగాణ ఉద్యమంలో తనపాత్ర పోషించాడు.

ఇది నా తెలంగాణ సంజీవ దీవిరా
ఇది నా తెలంగాణ పుణ్యాల దేవిరా
ఇది నా తెలంగాణ పీయూష వాణిరా
ఇది నా తెలంగాణ రుద్రమ్మ రాణిరా

అని సత్యనారాయణ తన కవిత్వంలో తెలంగాణ పవిత్రతను తెలియజేశాడు. వీరితోపాటు 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ముఖ్యమైన కవులు సింగిరెడ్డి నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ తెలంగాణ ప్రజల గొంతుకల్లో నిలిచిపోయారు. అనేక తెలంగాణ యువ కవులు వారి కలం ద్వారా చైతన్య పరిచారు.

విడదీయరా తెలంగాణ చిక్కు
విడచివేయండి 'విశాలాంధ్ర' వట్టి తుక్కు
ఇక ప్రత్యేక తెలంగాణయే మాకు దిక్కు
ప్రత్యేక తెలంగాణయే మా జన్మ హక్కు
నా రక్తము ప్రమిదల్లాపోసి, నా దేహం వత్తిగా చేసి
తెలంగాణకే బలి అవుతాను, తెలంగాణనే వెలిగిస్తాను

**ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమం :**

1991లో తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్శిటీలో ఆందోళన చేపట్టారు. 1998లో డా॥. జయశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఐక్యవేదికను ఏర్పాటు చేశారు. 2001 ఏప్రిల్ తెలంగాణ రాష్ట్ర సమితిని కేసీఆర్ ఏర్పాటు చేయడం జరిగింది. రాజకీయంగా ఎన్నికల్లో పాల్గొని టిఆర్ఎస్‌ను బలంగా ఒక శక్తిగా రూపొందించారు. 2009 నవంబర్ 29న సిద్దిపేటలో కెసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టడం జరిగింది. ఆమరణ నిరాహారదీక్షలో "తెలంగాణ వచ్చుడో కెసీఆర్ చచ్చుడో" అన్న నినాదం ప్రజల్లోకి వెళ్ళింది. ఎల్.బి. నగర్ చౌరస్తా శ్రీకాంతచారి ఆత్మహత్య చేసుకోవడం ద్వారా తెలంగాణ ప్రజల్లో ఆవేశం కట్టలు తెంచుకొని ఆందోళనలు చేపట్టారు. తద్వారా 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు కేంద్రమంత్రి చిదంబరం ప్రకటించారు.

**తెలంగాణ ఉద్యమంలో భాగంగా..**

- 2010లో వరంగల్‌లో తెలంగాణ మహాగర్జన

- 2011 లో సహాయ నిరాకరణ ఉద్యమం
- 2011 లో మిలియన్ మార్చ్
- 2011 లో కరీంనగర్‌లో సింహ గర్జన
- 2011 లో 42 రోజుల సకల జనుల సమ్మె
- 2011లో ఢిల్లీలో కొండా లక్ష్మణ్ బాపూజీ సత్యాగ్రహం
- 2012 లో తెలంగాణ మార్చ్
- 2012 లో సూర్యాపేటలో సమరభేరి
- 2013 లో ఇందిరాపార్కులో సమరదీక్ష
- 2013 లో సడక్ బంద్

మొదలైన అనేక ఆందోళనలతో తెలంగాణ ఉద్యమం కొనసాగి చివరకి 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మలిదశ తెలంగాణ రాజకీయ ఉద్యమాలతోపాటు సాహిత్య ఉద్యమం కీలకపాత్ర పోషించింది. మలిదశ ఉద్యమంలో కవులు నిరంతర కృషితో సంకల్పంతో తెలంగాణ ప్రజలను చైతన్యపరిచినారు. తెలంగాణలో ప్రజల జీవితంతోపాటు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను, వనరుల దోపిడీని, అన్ని రకాల వివక్షను, సాంస్కృతిక అణచివేతను, ప్రత్యేక రాష్ట్ర కోరికను పల్లె పల్లెకు, గుడిసె గుడిసెకు, మనిషి మనిషికి చేరవేసి తెలంగాణ ప్రజలను జాగృతం చేయడంలో సాహిత్య కవులు అగ్రభాగాన వున్నారు. కవులు, పాట కవులు, రచయితలు, జర్నలిస్టులు పోషించిన పాత్ర అమోఘమైంది.

డా॥. నందిని సిద్దారెడ్డి తన మనస్సులోని మాటలతో ఏర్పడిన ధృడ సంకల్పం

మాటకు రంగులద్దిన మాయలోడా
నీ కొంచపు తనానికి
నా మాట మంచం పట్టిందిగదరా
దోసెడు రక్తమిచ్చి బతికించుకుంటా నా మాటను
నర్సిరెడ్డి తన భావకవిత్వంలో ఆంధ్రవారితో పోలుస్తూ
అసలు ఆనికి నాకు గల్వదని
నేనప్పుడే సెప్పితి
ఒక అయ్యకు పుట్టినోళ్ళంగాం
ఒక అమ్మ కన్నోళ్ళంగాం

జుపాక సుభద్ర గారి కవితలో
తేల్చుకోవాల్సింది చావో రేవో కాదు
ఖచ్చితంగా రేవే
కాల్చుకోవాల్సింది నిన్ను కాదు
ఖచ్చితంగా వాన్నే....
పోరాటంలో ఎప్పుడూ అంతం కావొద్దు
ఆయుధం కావాలి

**సహజకవి అందెశ్రీ :**

జయ జయహే తెలంగాణ తెలంగాణ రాష్ట్ర గీతం. ఈ గీతాన్ని అందెశ్రీ రచన చేశాడు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో తెలంగాణ సమాజాన్ని ఉర్రూత లూగించిన 'జయ జయహే తెలంగాణ' గీతం 9 చరణాలతో రాష్ట్ర గీతం ఉంటుంది.

జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

| | |
|---|---|
| జనజాతరలో మన గీతం | - అందెశ్రీ |
| ఎందుకు కాలిపోతావ్-ఎందుకు రాలి పోతావ్ | - విమలక్క |
| ఆడుదాం డప్పుల్ల - ఆడుదాం | -విమలక్క |
| జిల్లెడమ్మ జిట్ట | - గోరేటి వెంకన్న |
| ఉస్మానియా క్యాంపస్లో ఉదయించిన కిరణమా | - అభినయ శ్రీనివాస్ |
| నాగేటి చాళ్ళల్లో నా తెలంగాణ | - నందిని సిద్దారెడ్డి |
| అమ్మా తెలంగాణమా - ఆకలి కేకల గానమా | - గద్దర్ |
| పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా | - గద్దర్ |
| వీరులారా వందనం - అమరులారా వందనం | - దరువు ఎల్లన్న |

| | |
|---|---|
| రాజిగా ఓ రాజిగా | - రసమయి బాల కిషన్ |
| రాతి బొమ్మల్లోనా కొలువైన ఓ శివుడా | - మిట్టపల్లి సురేందర్ |
| తెలంగాణ గట్టుమీద సందమామయ్యా | - గూడ అంజయ్య |
| జై బోలో జై బోలో అమర వీరులకు | - గోరేటి వెంకన్న |

వీరితోపాటు సుద్దాల అశోక్ తేజ, జయరాజు, చంద్ర బోస్, వేణు సంకోచ్, కందికొండ అనేకమంది కవులు తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

**ముగింపు :**

ప్రపంచ ఉద్యమ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఆరు దశాబ్దాలపాటు తెలంగాణ ఉద్యమం జరిగింది. ఏ ఉద్యమం విజయం సాధించాలన్న దానికి సాహిత్య, సాంస్కృతిక మూలాలు తప్పనిసరి బలంగా ఉండాలి. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిందే సాహిత్య, సాంస్కృతిక బలం బలం రచయితలు, కవులు, పాట కవులు, సిద్ధాంత కర్తలు, ఉద్యోగులు, ఉద్యమకారులు, విద్యార్థులు మొదలైనవారు కొన్ని లక్షల పుటల సాహిత్యాన్ని సృజించారు.

అందులో భాగంగా ఉద్యమ భావజాల వ్యాప్తికి పాటలు, కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, ఆత్మకథలు, జీవిత చరిత్రలు, ప్రసంగాలు, వ్యాసాలు, కరపత్రాలు, నినాదాలు, ఇలా ఎన్నో ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. ఈ సాహిత్యం ఎన్నో పాయలుగా విడిపోయి ఉద్యమాన్ని పల్లెపల్లెకు తీసుకుపోయి తెలంగాణలో ప్రతి గుండెను కదిలించింది. తెలంగాణ ఉద్యమంలో కవులు తమ జీవితాలను ఫణంగా పెట్టి అనేక సాహిత్య కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని నడిపించి తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత కవులకే దక్కింది.

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# చంద్రబోస్ పాటల నుండి జీవిత పాఠాలు



– పెందోట వీణ

పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

**వ్యాస సంగ్రహం :**

ప్రతి జీవితంలో కష్టనష్టాలు ఎదురవుతాయి. ఉద్యోగ వ్యాపారాలలో అంచనాలు తలక్రిందులవుతాయి, బంధుత్వంలో ప్రేమ స్నేహం విషయంలో ఎప్పుడూ ఊహించని మోసం ఎదురైనప్పుడు ఒక్కసారిగా పైనుంచి తోసేస్తే పడిపోయినట్టు జీవితం దెబ్బతింటుంది, బ్రతకాలని ఆశ అడుగంటిపోయి మరణం మేలని పిస్తుంది. కానీ అలాంటి సమయంలో మన మనసుకు కావలసింది ఓదార్పు అంతకంటే ముఖ్యంగా ధైర్యం నింపే మాటలు చేయూత. అలాంటి స్ఫూర్తినిచ్చే మాటలు పాటలు అయితే ఇవి మరింత ప్రభావాన్ని చూపిస్తాయి. ఎంత కష్టం వచ్చినా ఏదో సాధించాలనే సంకల్పాన్ని కలిగిస్తాయి ఎవరు ఎలా బాధపెట్టి అణగదొక్కినా ఇంకా జీవితంలో ఎదగాలని ఆశ, సాధించగలను అనే నమ్మకం కలుగుతుంది. అలాంటి పాటలు మన తెలుగు సినిమా లలో చాలా ఉన్నాయి కానీ స్ఫూర్తి నింపి మానసిక వికాసాన్ని కలిగించే వ్యక్తిత్వ వికాస గ్రంధాల సారాన్ని అందించిన పాటలు రాసే రచయితలు చాలా తక్కువనే చెప్పవచ్చు. ఆశావాదాన్ని అక్షరాలలో నింపి స్ఫూర్తినిచ్చే పాటలు రాసిన రచయితల్లో ఎక్కువగా సిరివెన్నెల సీతా రామశాస్త్రి గారు చంద్రబోస్ గారు ముందు వరుసలో ఉంటారు.

మన తెలంగాణ ముద్దుబిడ్డ తెలుగు సినిమాకు, పాటకు ఆస్కార్‌కు ఆస్కారం కలిగించిన రచయిత చంద్రబోస్ గారు. ఇలాంటి స్ఫూర్తి గీతాలు రాయడంలో అందవేసిన చేయి చంద్రబోస్ గారిది. అతను ఎన్నో స్ఫూర్తి చైతన్య గీతాలలో మరెన్నో సందేశాలు అందించారు. వాటిని సంక్షిప్తంగా వివరించే వ్యాసమే ఇది.

**ముఖ్యాంశాలు :**

పాటలలో జీవిత పాఠాల విశ్లేషణ, ఆత్మవిశ్వాసం చైతన్య, దేశభక్తి, మానవత్వం, పట్టుదల స్ఫూర్తి.

**ఆత్మవిశ్వాస బోధన :**

చంద్రబోస్ అనగానే మనకు గుర్తొచ్చే మొదటి పాట "మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది ఎదిగిన కొద్దీ. ఇందులో" అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది, ఆకులన్నీ రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది. ఇది ఎంతో పెద్ద నిత్య జీవిత సత్యం. ఒక గమ్యం కోసం గెలుపు కోసం ప్రయత్నిస్తున్నప్పుడు అపజయం సహజం కానీ ఒకటి రెండుసార్లు ఓడిపోగానే ప్రయత్నం మానొద్దు పట్టుదలతో పట్టు వదలక ప్రయత్నిస్తే విజయం కలగక మానదు అని చెప్పే సారాంశం. కష్టపడ

కుండా ఏదీ రాదు, నీ లక్ష్యం కోసం ప్రయత్నం చేస్తూనే ఉండాలి చెమట చిందించాలి, అలా కష్టపడి విజయం సాధించినవారు ఎంతోమంది నీ కళ్ళముందే ఉన్నారు అది గుర్తించాలి, దేవుడు అందరినీ ఒకేలా సృష్టించాడు అందరూ నీలాంటి సామాన్యులే కానీ తమ లక్ష్యాల కోసం ఇష్టాలను సుఖాలను పక్కనపెట్టి పరితపించి సాధించు కున్న వాళ్ళే చరిత్రలో నిలుస్తారు అని తెలుపుతూ (చెమట నీరు చిందగా నుదిటి రాత మార్చుకో మార్చలేనిది ఏదీ లేదని గుర్తుంచుకో, పిడికిలే బిగించగా చేతి గీత మార్చుకో, మారిపోని కథలే లేవని గమనించుకో, తోచినట్టుగా అందరి రాతను బ్రమ్మే రాస్తాడు నచ్చినట్టుగా నీ తలరాతను నువ్వే రాయాలి) సాధకుడు సంకల్పం ఎంత గొప్పగా ఉండాలంటే విధి సైతం తలవంచేలా విజయాన్ని అందించేలా ఉండాలంటూ (నీ సంకల్పానికి ఆ విధి సైతం చేతులెత్తాలి, అంతులేని చరితలకు ఆది నువ్వు కావాలి) గొప్పవాళ్ళంటూ ఎవరూ లేరు తమ లక్ష్యాల కోసం ప్రాణాన్ని పెట్టి సాధించే విజయాలు సాధించిన వారి కథలే రేపటి చరిత్ర అవుతుంది. అలాంటి విజయగాథ నీదే కావాలని స్ఫూర్తిస్తుంది ఈ పాట.

డాడీ సినిమా కోసం రాసిన ("లక్కీ లక్కీ ఈ లోకంలో పుట్టడమే లక్కీ, వందేళ్లకి నీ ఊపిరి పోదా కొండెక్కి వెయ్యలైన వెలగాలి వార్తల్లోకి ఎక్కి..") మనం ఉన్నా లేకున్నా మన గురించి భవిష్యత్ చదివేలా తెలుసుకునేలా ఉన్నతంగా జీవించాలని చెప్తూ అదృష్టానికి టాటా చెప్పేయి, నీ కష్టానికి కోటా పెంచేయి, ఆవేశానికి బై బై చెప్పేయి, అనురాగానికి భాగం పెంచేయి, కష్టపడితేనే సాధించగలం అదృష్టాన్ని నమ్ముకుంటే ఏ పని జరగదని ఆవేశంతో అనర్థాలు తప్ప అనుకున్నది నెరవేరదు అనురాగంతో అందరినీ దగ్గర తీసుకుంటే విజయం మన సొంతమవుతుంది అంటాడు. (బాంబులు లేని జగతిని, బాధలు లని బతుకులను, చీకటిలేని గడపలని, ఆకలి లేని కడుపులని) చూడడం కోసం అందరూ పాటుపడాలని దానికోసం మనుషుల్లో మానవత్వం పరమళించాలి, ద్వేషాలు తొలగిపోవాలి ప్రాంతీయ బేధాలు కులమత తారతమ్యాలు ఉండకూడదు, వివిధ ద్వేషాలను అటుడికి ఇన్నన్న ఉగ్రవాదం అంతం కావాలి, అసూయలు లేకుంటే మనుషుల మనసుల్లో అసలు బాధ అనేది ఉండదు, ఆర్థికంగా ఎదగడానికి ధర్మబద్ధమైన అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని కష్టపడి ఎదగాలి అప్పుడు ఆకలి లేని దేశం మనదవుతుంది అన్న సందేశం ఉంది. ఆడు ఆడించు నవ్వు నవ్వించు నవ్వు నడువు నడిపించు పాడు పాడించు అనే ఒక ప్రోత్సాహగీతం ఇది.

ఠాగూర్ సినిమా కోసం చంద్రబోస్ రాసిన పాట చాలా ప్రసిద్ధి. ("కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి ఆడితే ఆడాలి రా రఫ్ ఆడాలి"....)

ఈ పాటలో.. చెయ్యి ఉన్నది చెయ్యి కలపడానికి, చూపు ఉన్నది మరొకరికి మార్గం చూపించడానికి, మాట ఉన్నది మాట ఇవ్వడానికి మనసు ఉన్నది ఆ మాటను నెరవేర్చడానికి, ఆరాటం ఉన్నది ఏ పనైనా చేయడానికి, దేహం ప్రాణం జీవం పరుల సేవ కోసమే ఉపయోగించాలని, మనసున్న మనిషి వీలైనంత వరకు ఏదో ఒక రూపంలో ఇతరులకు సహాయపడాలనే సందేశాన్ని ఇస్తాడు. విధిరాతని చెమటతోనే చెరిపేయాలి అంటాడు, పెద్దలకు శిరస్సు వంచాలి చిన్నలను ఆశీర్వదించాలి, లేనిఇ వారిని ఆదరించాలి ప్రతిభను ప్రోత్సహించాలి, శత్రువుల సైతం ప్రేమించాలని సందేశం ఇస్తాడు.

**చంద్రబోస్ పాటల్లో లౌక్యం :**

బాలు చిత్రం కోసం చంద్రబోస్ రాసిన ("ఇంతే ఇంతింతే పాటలో కన్ను ఇంతే కనుపాప ఇంతే లోకం లోతు చూడాలంతే..) మన కనుపాప చిన్నదే కానీ చూడాల్సిన లోకం ఎంతో ఉంది అంటూ మొగ్గల్లో దాగుంది కాయోపండో కనిపెట్టాలి, మబ్బుల్లో దాగుంది చినుకో తుఫాను పసిగట్టాలి, మనుషుల్లో మంచోడు ఎవరు? ముంచేదెవరో మనసు పెట్టి చూడాలని, మట్టిలో దాగిన వజ్రాన్ని బొగ్గులో దాగున్న అగ్ని చూడగలిగితే నీ వెంటే వస్తాయి నవగ్రహాలు నీ చుట్టూ తిరుగుతాయి ఇక ఏ జాతకాలని నమ్మాల్సిన పనిలేదని సందేశం ఇస్తాడు. దేశాన్ని శోకం నుంచి రక్షించే సైనికుడు అవ్వాలి, శ్రామికుడిలా కార్మికుడిలా నావికుడిలా ఈ జీవన

సముద్రంలో ముందుకు పోతుంటే జనం మెచ్చే నాయకుడు, ఉత్తముడు అవుతాడు ప్రపంచంలో దేవుడు అవుతాడు అనలైన మానవుడు అవుతాడు అని ప్రకటించాడు.

చెన్నకేశవరెడ్డి సినిమా కోసం 2002లో రాసిన పాట (నవ్వే వాళ్ళు నవ్వని ఏడ్చేవాళ్లు ఏడవని తిట్టే వాళ్ళు తిట్టని పొగిడే వాళ్ళు పొగడమే డోంట్‌కేర్...) ఈ పాటలు చేయలనుకున్న పని అవుతుందో లేదో అని అను మానాలు అన్ని పక్కనపెట్టి అనుకున్నది చేస్తే చెయ్యి పైన ఉంటుంది అని చెప్తూ (ఎంత ఎదిగిన ఒదిగుండా లని చెట్టును చూసి నేర్చుకో, క్రమశిక్షణతో మెలగాలన్నది చీమని చూసే నేర్చుకో, చిరునవ్వుతో బ్రతకాలి అన్నది పువ్వులు చూసి నేర్చుకో, ఓర్పు సహనం ఉండాలన్నది పుడమిని చూసి నేర్చుకో, ఎంత తొక్కితే అంత పైకి రావా లన్నది బంతిని చూసి నేర్చుకో). ఎన్ని అడ్డంకులు ఉన్నా ఎంత అణగదొక్కాలని చూసిన ధైర్యంతో ఎదురు కోవాలని, సమస్యలు అన్నిటిని అధిగమించడానికి ఒక టానిక్ లాంటి మాటలు అలా చెప్తూనే నేర్చుకున్నది పక్కన పెట్టకుండా పాటించి పనులు చేస్తే నీదేరా పైచేయి అంటాడు. (ఉన్నది ఉన్నట్టు చెప్పాలన్నది అద్దాన్ని చూసి నేర్చుకో పరులకు సాయం చేయాలన్నది సూర్యని చూసి నేర్చుకో, సోమరితనమును విడవాలన్నది గడియారం చూసి నేర్చుకో) ఈ మాటలు అన్ని వంద వ్యక్తిత్వ వికాస పాఠాల బోధనకు సమానవే కదా.

**స్ఫూర్తి చైతన్య సందేశం :**

నాదే చిత్రం కోసం చంద్రబోస్ రాసిన పాట ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపింది ఈ పాట కథలోని కథానాయికకు రెండు చేతులు లేని యువతి. ఇది సినిమా కోసం రాసిన పాట అయినప్పటికీ ఈ పాట విన్న తరువాత అంగవైకల్యం కలిగిన చాలామందిలో ఒక జీవిత ఆశయాన్ని సంకల్పాన్ని కలిగించుకొని నైపుణ్యాలు సాధన చేసి జీవితంలో విజయం సాధించేలా చేసింది. ఆ పాట.. ("ఆరాటం ముందు ఆటంకం ఎంత" సంకల్పం ముందు వైకల్యం ఎంత, దృఢచిత్తం ముందు దురదృష్టం ఎంత, ఎదురీతముందు విధిరాత ఎంత?... చేజారిన చేతులు - చెరగని గీతలు, ఎదిరించిన బాధలే - వివరించెను బోధలు, పాదాలను పిడికిలిగా మలిచేస్తా గెలిఏస్తా సంతోషపు సామ్రాజ్యాన్నంత.. నమ్మకము పట్టుదల నా రెండో రెక్కలుగా ఎగిరేస్తా ఏలేస్తా నా ఆశల ఆకాశాన్నంత.. "పడిలేస్తేనే పెరిగేది ధైర్యం, అడిగేస్తేనే తరిగేది దూరం, చిరునవ్వేస్తుంటే సెలవంది శోకం, సహనంతో ఉంటే దొరికేను సైన్యం, చెమటోడుస్తుంటే పిలిచేనే గమ్యం"..) ఈ పాట విన్నాక ఎంతోమంది తన జీవిత ఆశయాలను ఉన్నతంగా మార్చుకున్నాడు. ఈ పాట విని నిజంగా రెండు చేతులు లేని ఒక అమ్మాయి కాలితో కొంచెం పట్టుకుని బొమ్మల గీయడం సాధన చేసి మొదటిసారిగా చంద్రబోస్ గారి చిత్రాన్ని వేసి చంద్రబోసు గారికి పంపిం చారు. తన జీవితానికి ఒక ఆశను ఆశయాన్ని ఏర్పరచు కునే మార్గం చూపినందుకు కృతజ్ఞతగా.. ఇలా ఎవరైనా మాటలు రాకపోతే బొమ్మలు గీయవచ్చు, చేతులు లేకపోతే పాటలు పాడొచ్చు, విధిరాత వల్ల ఏ లోటు ఏర్పడినా పట్టుదలతో, ప్రతిభతో ప్రయత్నం విడవకుండా సాధనం చేస్తే ఏదైనా సాధ్యమే అనే స్ఫూర్తిని అందరిలో నింపే పాట ఇది...

**ఆత్మవిశ్వాస బోధన :**

మనకు ఏదైనా సమస్య వస్తే ఎవరి కోసమో ఎదురు చూస్తూ ఉండకుండా పరిష్కారాన్ని శోధించి సాధించాలని నేర్పిన పాట బడ్జెట్ పద్మనాభం సినిమాలో (ఎవరేమీ అనుకున్నా నువ్వుండే రాజ్యాన రాజు నువ్వే బంటు నువ్వే... ఏమైనా ఏదైనా నువ్ వెళ్లే బడిలోన ప్రశ్నా నువ్వే బదులు నువ్వే.. అన్ని నువ్వే కావాలి అనునిత్యం పోరాడాలి అనుకున్నది సాధించాలి..) అంటూ సాగే ఈ పాట. (అవమానాలే ఆభరణాలు, అనుమానాలే - అనుకూలాలు 'సందేహాలే - సందేశాలు, చిత్కారాలే - సత్కారాలు..') (ఎవరికి వారే లోకంలో ఎవరికి పట్టని శోకంలో నీతో నువ్వే సాగాలి) (నింగలోన తెల్ల మేఘం నల్లబడితేనే జల్లు కురిసేది, చెట్టు పైన పూలు మొత్తం రాలితేనే పిందెలు కాయలు కాసేది. ఒక ఉదయం ముందర చీకట్లో విజయం ముందర ఇక్కట్లు రావడం అన్నది మామూలు) ఎన్నో జీవితాలలోని కష్టసుఖాలను కాచి వడపోసిన

సారమిది, నువ్వు ఆశించిన సహాయం అందకపోవచ్చు, ఎప్పుడు ఒకరిపై ఆధారపడకుండా సమస్య నీది అయినప్పుడు పరిష్కారం కూడా నువ్వే కావాలి దాని కోసం వెతకాలి సాధించాలి. ఆ సాధనలో ఎంత శ్రమకైనా ఓర్చుకోవాలి అన్ని ప్రతికూలాలను ఎలా అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగాలో గొప్ప లోతైన భావం గల పాట. జన బాహుల్యం పొందలేదు. ఈ పాటలు ఖచ్చితంగా తెలుగు పాఠ్యాంశంలో ఉండదగినవి.

ఇక ఈ తరం యువత అంతా పాడుకున్న స్ఫూర్తి గీతం ("చీకటితో వెలుగే చెప్పెను.. ఓటమితో గెలుపే చెప్పెను నేనున్నానని..." తగిలే రాళ్ళని పునాది చేసే ఎదగాలని, తరిమే వాళ్ళని హితులుగా తలచి ముందుకెళ్లాలని, కన్నుల నీటిని కలల సాగుకై వాడుకోవాలని, కాల్చే నిప్పుని ప్రమిదగా మలచి కాంతి పంచాలని "... గుండెతో ధైర్యం చెప్పెను చూపుతో మార్గం చెప్పెను అడుగుతో గమ్యం చెప్పెను నేనున్నానని..) ఇలా చెప్పుకుంటూ పోతే ఆశయ సాధనలో ఎన్ని అవమానాలు అడ్డకుంలు ఉన్న వాటి ప్రభావం వల్ల కుంగిపోకుండా కసి పెంచుకొని అలాంటి మాటలే ఆశయ సాధనకు మెట్లుగా చేసుకుని నిరాశపడకుండా విజయం సాధించాలని చెప్పడమే చంద్రబోస్ ఉద్దేశం..

సైనికుడు సినిమాలో గో గో పాటలో ("వేమన నీతులు చదివినా - అవినీతిలో లోతులు చదవరా, వికాసం మాటున విషాదం ఉందిరా, విరామం వద్దురా విధానం మార్చరా, వంటి సైనికుడల్లే కవాతులే చేయరా, కోటి సూర్యుల మల్లె ప్రకాశమే పంచరా..) ఈ పాట మంచి నాయకుల లక్షణాలను తెలుపుతూ సాగింది.

**దేశభక్తి, మానత్వం బోధన :**

ఝుమ్మంది నాదం సినిమా కోసం చంద్రబోస్ గారు రాసిన పాట యావత్ భారతీయ ప్రజానీకానికి మాత్రమే కాదు విశ్వంలోని మానవాళికందరికీ ఒక భగవద్గీత బోధిస్తున్నట్లు ఉంటుంది. గురజాడ అప్పారావు గారి ఆలోచనల పరంపర మరింత ఉధృతంగా చంద్రబోస్ గారి ఆత్మగా మారినట్టు ఉంటుంది. (దేశం అంటే మతం కాదోయ్ గతం కాదోయ్... క్షుద్ర వేదం పాడుతున్న ఉగ్రవాదం కాదు కాదోయ్...) దేశంలో మతం అనేది జాతీయ సమైక్యతను దెబ్బతీస్తుంది వివిధ వివక్షలకు కారణం అవుతుంది. మత ద్వేషాలు రాజకీయం నుంచి రాజ్యాంగం దాకా అన్ని అంశాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. కొన్నిసార్లు బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలు మానవ హక్కులనే హరిస్తున్నాయి. మొన్న జరిగిన పెహల్గామ్ దాడి దానికి ప్రతిచర్య సింధూర్ ఆపరేషన్ వీటన్నిటికీ మూల కారణాలు మత ద్వేషాలు, దాన్ని పెంచి పోషిస్తున్న ఉగ్రవాదం. ఉగ్రవాదం వలన దేశంలో లెక్కలేనన్ని విధ్వంసాలు జరిగాయి. చంద్రబోస్ గారు దేశమంటే ఇలాంటి మతం కాదు ఆ మతం చేసిన గాయాల తాలుకు గతం కాదు అంటున్నాడు. (దేశమంటే అడవి కాదోయ్ గొడవ కాదోయ్ అన్న చేతి గన్ను కాదోయ్... తీవ్రవ్యాధిగా మారుతున్న తీవ్రవాదం కాదు కాదు కాదోయ్...) ఉగ్రవాదం అంతర్జాతీయంగా వివిధ దేశాల అమాయక ప్రజలను పైశాచికత్వంతో హింసిస్తుంటే. తీవ్రవాదం సొంత దేశంలోనే అభివృద్ధికి ఆటంకమై మరో రకంగా దేశానికి ముప్పు అవుతుంది. దేశమంటే అలాంటి నక్సలిజం, తీవ్రవాదం కాదని, దేశమంటే మంచి మనసు ప్రేమ ఉన్న మనుషులని కవి చెప్తున్నాడు. (గడ్డి నుండి గగనం అంటిన కుంభకోణం కాదు కాదోయ్, చట్టసభలో పట్టుకున్న జుట్టు కాదు కాదోయ్..) పసికందు తాగే పాలు పాలపొడి నుంచి తాగే నీరు ఆహారం అన్ని కల్తీలతో ఆరోగ్యాన్ని హరించే కుంభకోణం ఓవైపు వందల నుంచి లక్షలు కోట్లల్లో అవినీతి పరులు అన్ని రంగాలలో లంచాలు, నాణ్యతలేని నిర్మాణాలు, నైపుణ్యం లేని చదువులు ఇలా లెక్కలేనన్ని కుంభకోణాలు, ప్రపంచంలో మన దేశం యొక్క రూపాయి విలువ పెరిగేలా దేశం ఆర్థికంగా ఎదిగేలా నిర్ణయాలు తీసుకొని ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారాలను తేవాల్సిన చట్టసభలలో అనవసరమైన అసంబద్ధమైన చర్చలు గొడవలతో సమయం వృధా చేయడం కాదు దేశమంటే అని బుద్ధి చెప్తున్నాడు. (అబలపై ఆమ్లాన్ని చల్లే ఆరాచకమే కాదు కాదోయ్, పరిధి దాటిన గాలి వార్తల ప్రసారాలు కాదు కాదోయ్..., సంతు దొరికితే మంది చేసే సమ్మె కాదు బంధు కాదు.., ప్రాణ ధన

మానాలు తీసే పగల సెగల పొగలు కాదోయ్.. దేశమంటే..) స్త్రీని గౌరవించి పూజించే భారతీయ సాంప్రదాయాన్ని మర్చిపోయి ప్రేమించలేదని ఆసిడ్లు పోయడం, పశువులా మారి పసికందుల నుంచి పండు ముసలి వరకు మానవత్వం లేకుండా అత్యాచారం చేయడం, అమ్మలా, ఆదిశక్తిలా భావించాల్సిన స్త్రీలను అణగదొక్కడం అవమానించడం కాదు దేశం అంటే, స్వార్థమైన కొందరి రాజకీయాల కోసం చేసే బందులో సమ్మెలో కాదు దేశమంటే, సమాజానికి ఏమాత్రం ఉప యోగం లేని పిచ్చిపిచ్చి వార్తల యొక్క ప్రసారాలు కాదు దేశమంటే.

దేశమంటే మానవత్వం ఉన్న స్వచ్ఛమైన మనసు కలిగిన మనుషులు అంటాడు చంద్రబోస్ గారు (ద్వేష మెందుకు సాటి మనిషిని సోదరుడిగా ఆదరించు, హింస లెందుకు సమస్యలను నవ్వుతూ పరిష్కరించు, క్రోధ మెందుకు కరుణ పంచు, స్వార్థమెందుకు సహకరించు, పంతమెందుకు పలకరించు, కక్షలెందుకు కౌగలించు.., ప్రేమించు ప్రేమ పంచు ప్రేమగా జీవించు.. మల్లెపువ్వు లాంటి బాలల, తెల్ల కాగితమంటి బ్రతుకులు రక్త చరితగ మారకుండా రక్ష కలిగించు, కొత్త బంగారు భవిత నేడే కానుకందించు..) సొంత కుటుంబాలలోనే మానవ సంబంధాలు సరిగా ఉండడం లేదు మాట పట్టింపులు, అహంకారాలు, ఆర్థిక బేధాలు ఇలా ఎన్నో కారణాలతో అన్నదమ్ములు మాట్లాడుకోకపోవడం అయిన వాళ్లను దూరం చేసుకోవడం, కనీసం వేడుకలలో కూడా పలకరించుకోకుండా ముఖం తిప్పుకొని ఎవరికివారు బాధపడుతూ ఉంటారు, మరింత ద్వేషాలను పెంచు కుంటారు, అలా కాకుండా మనసువిప్పి మాట్లాడుకుని పలకరించి కౌగిలించుకుంటే మానవ బంధాలు ముడి పడతాయి, బలపడతాయి, స్వార్థంతో నేనొక్కన్నే ఎదగా లని చెడు ఆలోచన లేకుండా తోచిన, చెయ్యగలిగిన సహాయాన్ని అందరికీ అందిస్తే, క్షమించగలిగే గుణం ఉంటే సమాజం ఎంత అందంగా ఆనందంగా ఉం టుంది అది దేశమంటే, అలాంటి మనషులతో ఉండాలి దేశమంటే. కుటుంబంలోని వ్యక్తులు వ్యక్తిగతంగా ప్రేమ, క్షమ, సహకార గుణంతో ఉంటూ ఉంటూ అలాంటి విలువల్ని పిల్లలకు నేర్పిస్తూ వస్తే ఆ పిల్లలు రేపు ఉగ్ర వాదులు, తీవ్రవాదులు కాకుండా మంచి దేశ పౌరులుగా ఉజ్వల ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుంటారు. ఈ పాటలో ఎంత విశ్వజననమైన ప్రేమ, మరింత దేశభక్తి, ఇంకెంత సామాజిక స్పృహ అమృతం లాంటి ప్రేమతో నిండినది మన కవి చంద్రబోస్ గారి హృదయం.

**ముగింపు :**

చంద్రబోస్ గారు ఒక సినిమాలోని ఒక సన్నివేశానికి సంగీత దర్శకుడు ఇచ్చిన సంగీతానికి రాసిన ఈ పాటలు ఎన్ని తరాలకైనా మానవ నైతిక జీవన విలువలను నేర్పిస్తాయి, తమ తప్పులను ఒప్పుకోవడం, సమస్యలు స్వీకరించడం, తిరస్కరణలను ఎదుర్కోవడం వాటిని అధిగమించడం, మహిళలను గౌరవించడం, మనుషు లందరినీ సమానంగా ప్రేమించడం, ఆత్మవిశ్వాసంతో ఉండడం, మానసిక ఒత్తిడి మన దరిచేరకుండా ఉం డడానికి సరిపడే ఒక 100 మానసిక వ్యక్తిత్వ వికాస గ్రంథాల సారం అంత ఒక్క పది పాటలతోనే చూస్తే ఇంకా ఆయన అందించిన సందేశాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి పాటలు కౌమార యవ్వన దశలో ఉన్న విద్యార్థులకు పాఠ్యాంశాలుగా వస్తే అందులోని సారాన్ని అర్థం చేసుకోగలిగితే వారు చిన్న చిన్న సమస్యలకు కృంగిపోకుండా జీవితంలో ముందుకు ఎదగగలుగు తారు. ఇలాంటి పాటలు పాఠ్యాంశాలుగా రావాలని చంద్రబోస్ మరిన్ని అద్భుతమైన చైతన్య గీతాలను మనకు అందించాలని కోరుకుందాం. ఈ పాటల పైన సవివరమైన లోతైన పరిశోధనలు జరగాలని ఆశిద్దాం.

**ఆధారములు :**


1. ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే - చంద్రబోస్ గారితో ముఖాముఖి.
2. ఐ డ్రీమ్ మీడియాలో (యూట్యూబ్) పార్థసారథి చంద్రబోస్ గారి కార్యక్రమం. 3. అచ్చంగా తెలుగు కార్యక్రమం.
4. నమస్తే తెలంగాణలో "నాటు నాటు" పాటకు ఆస్కార్ అవార్డుకు సన్మాన కార్యక్రమం.
5. సాక్షిలో "పెళ్ళి వ్యక్తిగత అంశాలు పీటలు కలిపాయి" వ్యక్తిగత అంశాలు.


★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# రాసాని రచనల్లో దేవర్ల సంస్కృతి



- మల్లెల సునీత
పరిశోధకురాలు (పూర్తికాలం),
తెలుగు భాష & అనువాద
అధ్యయనశాఖ, ద్రావిడ
విశ్వవిద్యాలయ, కుప్పం.

- ఆచార్య కె. వేణుగోపాలరెడ్డి
తెలుగు భాష & అనువాద
అధ్యయనశాఖ, ద్రావిడ
విశ్వవిద్యాలయ
కుప్పం.



**ప్రవేశిక :**

జానపద సంస్కృతిలో గ్రామదేవతలను, ప్రకృతి శక్తులను పూజించడమనేది తరతరాలుగా అనుసరిస్తున్న ఒక సంప్రదాయం, సనాతన ఆచారము. గ్రామంలోని ప్రజలకు జ్వరాలు, వొరుపులు వచ్చినప్పుడు, కలరా, ప్లేగు వంటి అంటు రోగాలు ప్రబలినప్పుడు వీటన్నింటికి కారణం గ్రామదేవతలకు ఆగ్రహం కలగడమే అని భావించి ఆ దేవతలను శాంతింపజేయడం కొరకు పొట్టేళ్ళను, మేకపోతులను లేదా పశువులను బలిచ్చి ఉత్సవాలను జరపడాన్ని దేవర్లు అంటారు. రాయలసీమ ప్రాంతంలో ఒక్కొక్క కారణానికి ఒక్కో దేవరను జరుపుతారు. కులదేవర్లు, ఇంటి దేవర్లు, వివాహ దేవర/గురివి దేవర, ఊరిదేవర్లు/పొలి దేవర్లు, వలస దేవర్లు, చల్ల దేవర్లు, కప్ప దేవర్లు మొదలగునవి నేటికీ రాయలసీమ ప్రాంతంలో దేవర్ల సంస్కృతిని ఆచరిస్తున్నట్లు రాసానిగారు తన రచనలైన కపిరి, పరస, చీకటిరాజ్యం నవలలోను; గాలిచెట్టు, తెల్లగుర్రం కథలలోను పలుచోట్ల ప్రస్తావించడం జరిగింది.

జానపదులు దేవర్లను జరుపడానికి క్రింది అంశాలను ముఖ్య కారణాలుగా పేర్కొనవచ్చు.

- ☞ పంటలు బాగా పండి ఊరు సుభిక్షంగా వుండాలని (పొలిమేర దేవతలైన విరూపాక్షమ్మ, నల్ల గంగమ్మ, రగుదూలమ్మ, కుంటి గంగమ్మ, కలికిరెల్లమ్మల మొ॥న),
- ☞ కరువులు వచ్చినపుడు వర్షాలు పడాలని (కప్ప దేవర),
- ☞ పిల్లలు కలగనివారు పిల్లలు పుట్టాలని (ఇంటి దేవర),
- ☞ గ్రామంలో కలరా, ప్లేగు, మశూచి వంటి అంటు రోగాలు ప్రబలినపుడు,
- ☞ పెండ్లిండ్లు ఏ ఆటంకం లేకుండా జరిగి వారి సంసారం సవ్యంగా జరగాలని (గురివిదేవర),
- ☞ ఆధ్యాత్మిక మరియు భక్తి సంబంధిత విషయాలకు (దేవుడి పేరు మీదుగా కోడె దూడలను దేవరెద్దుగా వదలడం)

కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, నాటకకర్తగాను, సాహిత్య విమర్శకుడిగాను, నాటక ప్రయోక్తగానూ రాసాని ప్రసిద్ధులు. రాయలసీమవాసి కావడం మూలాన వీరి రచనల్లో రాయలసీమ సంస్కృతి ప్రతిఫలనం నిండుగా కనిపిస్తుంది. అందుకే వీరికి తెలుగు సాంస్కృతిక రచయిత

గానూ పేరుంది. శూద్రకులాలలో వున్న అనేక సంప్రదాయాలు, నమ్మకాలు, ఆచారవ్యవహారాలు వంటివి వీరి రచనల్లో సందర్భానుసారంగా, అతి సహజంగా చెప్పబడి ఆయా రచనలకు వన్నె తెచ్చి పెడుతున్నాయి. పైగా చాలామంది దృష్టికి రాని, చాలా వరకు తెలియని బసివిని, ఉలిగమ్మలు, బైరాగులు, గొరవయ్యలు, నెత్తిమోపు గంగమ్మను మోసేవాళ్ళు, బుడిగె జంగములు, పాములు పట్టే యానాదులు, నక్కలోళ్లు, పూసలోళ్లు, వారి సంస్కృతి నేపథ్యాలు వీరి రచనల నిండా పరచుకుని వుంటాయి. అలాంటి వాటిలో జానపదులు నిర్వహించే దేవర్లు ఒక ప్రధానమైన శూద్ర సాంస్కృతిక సంప్రదాయాలు.

రాసానిగారు రాయలసీమలోని చిత్తూరు జిల్లావాసి కావున అక్కడి జనుల జీవన విధానాలనే రచనల్లో చిత్రిస్తుంటారు. పైగా ఇతర ప్రదేశాలకు వెళ్లి పరిశోధనలు కూడా చేసి రచనలు చేస్తూ ఆయా ప్రాంతాల సాంస్కృతిక జీవనానికి చిత్రిక పడతారు. ఈ దేవర్లు చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలో కొన్ని ప్రాంతాల లోను ఎక్కువగా జరుగుతుంటాయి. ఆ మాటకొస్తే పేర్లు వేరైనా రాయల సీమలోని చాలా ప్రాంతాలలో వేడుకగా, నిబద్ధతగా జరుపబడుతుంటాయి. అలాంటి దేవర్లలో కులదేవర్లు, ఇంటి దేవర్లు, వివాహ దేవర్లు, వలస దేవర్లు, ఊరు దేవర్లు అని అయిదు రకాలుగా కనిపిస్తుంటాయి.

కొన్ని కులాలవారికే పరిమితమైన దేవర్లను కులదేవర్ల కింద చేర్చవచ్చు. కురవలకు సంబంధించిన బీరప్ప, యాదవులకు చెందిన కాటమరాజు కొలుపులు వంటివి ఈ కోవకు చెందినవి. కొన్ని శూద్రకులాలలో మగపిల్లల్లో పెద్ద కుమారుడికి, లేదా చిన్న కుమారుడికి వివాహం జరిపేటప్పుడు, వివాహానికి రెండు మూడు రోజులకు ముందు ఒక పొట్టేలును దేవుడి పేరుతో కొట్టి మాంసాన్ని వండి ఊర్లో అందరికీ విందు భోజనం పెడతారు. దీన్ని 'గురువి దేవర' అంటారు. ఇది వివాహ దేవర.

కరువుకాటకాలు సంభవించినప్పుడు ఊరి పొలిమేర దగ్గరకు ఊర్లో పిల్లాజల్లా అందరూ వంట సామగ్రిని, ధాన్యాన్ని తీసుకుని వలసలాగా వెళ్ళి వేటలు కొట్టి అక్కడే ఆరోజంతా వుండి, వేట కూరలతో భోజనం చేసి వస్తే వర్షాలు పడతాయని నమ్మకం. దీన్నే వలస దేవర అంటారు.

ఇక ఊరు మంచికోసం ఊర్లో అందరూ కలిసి చేసే కొన్ని దేవర్లుంటాయి. వీటిని ఊరి దేవర్లుగా చెప్పుకోవచ్చు. పల్లెల్లో జ్వరాలుకానీ, వొరుపులుగానీ వచ్చినప్పుడు, కలరా, ప్లేగు వంటి వాటితో 'గాబ' లేచినప్పుడు అవి ఊరి దేవర్ల వల్లనే వస్తుంటాయని నమ్మి, గ్రామ దేవతల ఉపశమనం కోసం దేవర్లు చేస్తుంటారు. ఉదాహరణకు చల్లదేవర, గంగమ్మ దేవర్లు ఇలాంటివే. చివరగా పిల్లల పుట్టెంటికల కోసం చేసే దేవర ఇంటి దేవర. మునిదేవర ఈ కోవకు చెందిందే.

ఈ దేవర్ల గురించి అనుసంఘికంగాను, కథలో అవసరంగాను రాసాని తన రచనల్లో పలుచోట్ల ప్రస్తావించడం లేదా వివరించండం చేశారు.

రాసాని రాసిన 'కపిరి' నవలలో కురవల దేవుడైన బీరప్ప, లేదా బీరన్న దేవర గురించి, వారి గుడికట్ల ఉత్సవం గురించి వివరంగా చెప్పబడింది. అసలు ఆ నవల "అది బీరన్న పండుగరోజు... బీరన్న జాతర, ఊరి చివర బీరన్న గుడి." అని బీరప్ప జాతరతోనే ఆరంభ మవుతుంది. ఇండ్లు శుభ్రం చేసుకుని, ఇళ్లముందర ముగ్గులేసి, అందరూ తలస్నానాలు చేసి గుడి ముందరకొస్తే, ఆ గుడి ముందర శివభక్తులు, గొరవయ్యల చిందులు, ఆ ఊరి పహిల్వానులైన గొల్ల రామన్న, కురవ బీమన్నల బలప్రదర్శన, గుండ్లెత్తడం, ప్రధాన పూజారి గొలుసు తెంచి, భవిష్యత్తు చెప్పడం వంటివెన్నో ఆ గుడి ముందర జరుగుతాయి. అలాగే కురవలకే పరిమితమైన కులసంప్రదాయం గొరవదీక్ష నేపథ్యంతో నడిచే ఈ నవలలో అక్కడక్కడ బీరప్ప దేవుని ప్రసక్తి, ఆ దేవుని పుట్టుక వంటివి వొగ్గు కథలద్వారా తెలియచేయడం కూడా జరుగుతుంది. అలాగే ఈ కులానికే పరిమితమైన గుడికట్ల ఉత్సవం గురించీ, వారి కులదేవుడైన శివుడి అవతారంగా భావించే బీరప్ప దేవుళ్ళ కొలుపులు అన్నీ వివరంగా ఈ నవలలో చెప్పబడ్డాయి.

అలాగే 'దేవరమాన్యం' అనే నాటకంలో బీరప్ప దేవుడి గుడిమాన్యపు భూమిని ఆక్రమించుకోబోయే భూస్వామిపై గొరవయ్యల తిరుగుబాటును చిత్రించడం జరిగింది.

కులదేవర్ల తరువాత చెప్పుకోబడ్డవి ఇంటి దేవర్లు. శూద్రకులాలన్నింటిలోను దాదాపుగా చిత్తూరు జిల్లా, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన అరక్కోణం, తిరుత్తణి వంటి ప్రాంతాలలోను ఇంట్లోని పిల్లలలకు ఒక సంవత్సరం నుంచీ అయిదారు సంవత్సరాల వయసు లోపల మునిదేవర చేసి పుట్టెంటికలు తీసే ఆచారం ఉంది. ఇది ఇంటి దేవరకు సంబంధించిన విషయం. ఈ మునిదేవర ఆచారమున్న ఇంటి వ్యక్తులకు మునికృష్ణ, ముని సుందరం, మునస్వామి, మునెమ్మ, మునిలక్ష్మి లాంటి పేర్లు పెట్టబడతాయి. ఈ పేర్లలో వున్న 'ముని' పదం ఆ యింటి దేవుణ్ణి సూచించేదే.

ఊరికి కొంత దూరంలో మామిడితోపుల్లోగాని, వ్యవసాయ బావుల దగ్గరున్న చింత, ఊడగ వంటి చెట్లకింద గాని, పెరిగిన పుట్టదగ్గరగానీ మునీశ్వరుని శిల పేరుతో శివలింగం వంటి ఒక చిన్న రాయిని ప్రతిష్టించి, అక్కడ పూజలు నిర్వహించి, నల్లమేకపోతునో, లేదా నల్ల కోడిపుంజునో కోసి, పిల్లలకు పుట్టెంటికలు తీసి, బలిజీవి మాంసంతో ఇంటిల్లపాదీ విందులు చేసుకుంటారు. ఇలాంటి ముని దేవర నేపథ్యంతో రాసాని 'గాలిచెట్టు' కథ రాశారు. ఈ కథలో మునిలక్ష్మికి పుట్టిన చిన్న బిడ్డకు గాలిచెట్టు అనబడే ఊడగ చెట్టు కింద ఈ మునిదేవరను నిర్వహించినట్లు చెప్పబడింది.

అలాగే కొందరికి తలకోన సిద్ధేశ్వరుని పేరుతో ఊరికవతల ఏ చిగర చెట్టుకిందనో సిద్ధేశ్వర శిలను పెట్టి, పూజలు చేసి వేటను కొట్టి, పిల్లలకు పుట్టెంటికలు తీసే అలవాటుంది. ఈ దేవర ఉన్నవారి ఇండ్లల్లోని వ్యక్తులకు సిద్ధయ్య, సిద్ధమ్మ, సిద్ధముని, సిద్ధలింగం వంటి పేర్లుంటాయి. కొన్ని కథల్లో ఈ వివరాలున్నాయి.

వీటి తర్వాత వివాహ దేవర్లు  కూడా చెప్పుకోదగ్గవే. ఇది కూడా దాదాపు అన్ని శూద్రకులాలలోను ఉంది. ఇది పెళ్ళికొడుక్కి సంబంధించిన దేవర. పెళ్ళికి రెండు రోజుల ముందు పెళ్ళి కొడుకుకు అన్నీ మంచి జరగాలని చేసుకునే దేవర 'గురివి దేవర'. ఊరి వెలుపల ఏ మర్రిచెట్టు కిందనో, లేదా చిగర చెట్టుకిందనో ఒక నున్నటి రాయిని గురివిదేవుడు పేరుతో ప్రతిష్టించి పూజలు చేసి, పొట్టేలుని కొట్టి, దాని మాంసంతో ఊరంతా విందు భోజనం చేసుకుంటుంది. ఈ దేవర గురించి 'తెల్ల గుర్రమెక్కే దానికి అందురూ మొనగాల్లే' అనే కథలోనూ, 'తెల్ల గుర్రం' నాటకంలోనూ రాసాని చాలా బాగా వివరించారు. ఇందులో రచయిత అన్న కొడుకు చిన్నోడికి చేసే గురివిదేవర గురించి చెప్పడం జరిగింది.

వీటి తర్వాత వలస దేవర్లు. ఇందులో 'చల్ల' దేవర అనే సెమీ వలసకు చెందినది. ఆ తర్వాత ఊరి గేరి దగ్గరకెళ్లి వేటలు కోసి పల్లెల వాళ్ళందరూ చేరుకుని చేసే వలస దేవర ప్రధానంగా ఇందులో చెప్పుకో దగ్గవి. వీధి గంగమ్మ ముందర ఊర్లో పిల్లల్ని వరుసగా కూర్చోబెట్టి, కొత్త కడవలో ప్రతి ఇంటి నుంచి సేకరించిన అన్నంలో ఉప్పేసి, నీళ్ళుపోసి చల్ల తయారు చేస్తారు. ఆ తర్వాత పిల్లల దోసిళ్ళలో చల్ల పోసి తాపిస్తారు. ఆ తర్వాత పిల్లలు 'చల్లో చల్ల' అని అరుచుకుంటూ ఊరి ముందరున్న చెరువు దగ్గరకో, కుంట దగ్గరకో వెళ్ళి నీళ్ళల్లో మునిగి వస్తారు. ఇది పల్లె బాగుండాలని చేసే దేవర.

ఆ తర్వాత చెప్పుకోదగ్గవి ఊరి దేవర్లు. వాటిలో పొలి దేవర ఒకటి. వర్షాలు బాగా పడి పొలాలు పంటలపై నున్నప్పుడు ఊరి పొలిమేర్లలో ఒకచోట కుంబంకూడు పోసి పొట్టేళ్ళను కొట్టి ఆ కూటిని వాటి రక్తంతో తడిపి, ఆ అన్నాన్ని ప్రతి రైతుకూ పంచుతారు. ఆ రక్తపు కూడును రైతులు 'పొలో పొలి' అంటూ అరుచుకుంటూ పొలాల పైన చల్లుతారు. అలా చేస్తే పంటలు బాగా పండుతాయని జానపదుల నమ్మకం. వీటి తర్వాత వర్షాలు బాగా పడి పంటలు పండిన సందర్భంగా ఊర్లో ఉండే గ్రామ దేవతలయిన విరూపాక్షమ్మ, నల్ల గంగమ్మ, రగుదూలమ్మ, కుంటి గంగమ్మ, కలికిరెల్లమ్మ వంటి దేవతలకు పూజలు చేసి వేటలు కొట్టి, బంధుమిత్రులతో కలిసి వేడుక చేసుకుంటారు. వీటినే ఊరి దేవర్లు అంటారు. ఈ వలస, పొలి, ఊరి దేవర్ల గురించి రాసాని చీకటి రాజ్యం, వక్రగీతలాంటి నవలల్లో సందర్భానుసారంగా చెప్పడం జరిగింది.

ఇవే గాకుండా దేవరదున్న, దేవరెద్దు, కప్ప దేవర లాంటి సజీవ దేవరలు కూడా కొన్ని ఉన్నాయి. కొందరు

రైతులు అప్పుడే పుట్టిన కోడె దూడల్ని లేదా ఎనుబోతు దూడల్ని దేవుడి పేరుతో ఊర్లపైన వదిలేస్తారు. ఇవి పొలాల్లో సైతం యధేచ్ఛగా తిరుగుతాయి. అవి ఏ పొలంలోనైనా మేతకోసం మూతిపెడితే ఆ పంటకు సమృద్ధి లభిస్తుందని నమ్ముతారు. కాబట్టి దాన్ని భక్తితో దేవరదున్న పేరుతో గౌరవిస్తారు. ఈ దేవరదున్న 'కపిరి' నవలలోని ఆధ్యాత్మిక పాయను చిత్రించే పాత్ర. అలాగే యాదవులలో ప్రధానంగా ఒక కోడెను విష్ణుదేవుని పేరుతో దేవుడిలాగా పూజించడం కూడా వుంది. దీన్నే 'దేవరెద్దు' అంటారు ఈ దేవరెద్దు నేపథ్యంతో నడిచేదే రాసాని 'పరస' నవల. అలాగే కరువు కాలంలో ఒక కప్పను తెచ్చి ఒక కర్రకు కట్టి దాన్ని పల్లెలో ఇంటింటికీ తిప్పి నీళ్లు పోయించి, ఆ తర్వాత ఎండిన చెరువులోనో, కుంటలోనో వదిలేసి లబలబమని నోళ్లు కొట్టుకుని ఇండ్లకు చేరుకుంటారు. ఇదే 'కప్ప దేవర'. అలా చేస్తే వర్షం పడుతుందని పల్లీయుల నమ్మకం. దీన్ని కూడా రాసాని రచనల్లో చూడవచ్చు.

**ముగింపు :**

గ్రామదేవతలను పూజించి, దేవర్లు చేయడం మన జానపద సంస్కృతిలో ఒక భాగం. జానపద సంస్కృతులన్ని ఆధునిక ప్రపంచీకరణ ప్రభావం వలన కాలగమనంలో కలిసిపోయి, కనుమరుగు కాకముందే తన రచనల ద్వారా నిక్షిప్తం చేస్తున్నారు డా॥ రాసానిగారు. కాబట్టి వారు నికార్సయిన సాంస్కృతిక రచయిత.

**ఆధార గ్రంథాలు :**


1. కపిరి (నవల), 2024, ఓంకార్ ప్రింటర్స్, బెంగుళూరు.
2. పరస (నవల) 2015.
3. చీకటిరాజ్యం (నవల) 1994.
4. గాలిచెట్టు (కథ) 2005, మెరవణి (కథల సంపుటి)
5. తెల్లగుర్రం (కథ) 2016, ముల్లుగర్ర (కథల సంపుటి).


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# దేశాభిమాన ప్రతీకలు – రాణాప్రతాప్, పురుషోత్తముడు



- ఎం. గాయత్రీదేవి
పరిశోధకులు, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప

**ప్రవేశిక**

భారతదేశం ఎందరో వీరులకు, వీరనారీమణులకు జన్మనిచ్చిన వీరగడ్డ. ఈ గడ్డపై వీరులు, శూరులు, త్యాగులు, దేశభక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, తాత్వికులు, పౌరుషవంతులు, శాస్త్రవేత్తలు జన్మించారు. ప్రపంచ విజేత కావాలనుకున్న అలెగ్జాండరును నిలువరించిన పౌరుషవంతులు త్యాగశీలురు ఈ నేలపై జన్మించి తమ సత్తా చాటి భరతమాత ముద్దుబిడ్డలనిపించుకున్నారు. వారి పౌరుషాన్ని మనకు అందించి పోయారు. అదే వారసత్వాన్ని మనము జాతీయోద్యమంలో కూడా చూపించాము. ఈ విషయాన్ని భావితరాలకు తెలియ జెప్పుటకు షేక్‌దరియా హుస్సేన్ గారు 'పురుషోత్తముడు' అనే చారిత్రక నాటకాన్ని, మండ్యాల శ్రీనివాసులు గారు 'స్వర్గాదపి గరీయసీ' అనే చారిత్రక నాటకాన్ని రాశారు. మొదటి నాటకంలో అలెగ్జాండరును ఎదిరించిన పురుషోత్తముని పరాక్రమాలు, రెండవ నాటకంలో రాణాప్రతాపుని శౌర్య ప్రతాపాలు చిత్రించబడ్డాయి. రాణా ప్రతాపుడు, పురుషోత్తముడు ప్రాచీన వీరాధివీరులు. వీరి దేశభక్తి నాన్యతో దర్శనీయమైనది. వీరు చిన్న రాజ్యాలకు రాజులే అయినా పెద్ద పెద్ద సైన్యసంపద కలిగిన వారిని ధీటుగా ఎదుర్కొన్నారు.

**కీలకపదాలు**

ఈ వ్యాసంలో పేర్కొన్న కీలక పదాలు ఇలా ఉన్నాయి.

1. ఆవిష్కర్తలు
2. జాతీయోద్యమం
3. కనుమదారి
4. స్వాతంత్ర్య సౌధము
5. కుప్పకూలిపోవుట
6. వాగ్గమనము
7. మార్తాండుడు
8. ధర్మనిరతి
9. వైభవప్రాభవం
10. యశోగీతిక
11. మిథ్యా విజయగర్వము
12. రవికుల తిలకా
13. అమూల్య సహాయము
14. సుదీర్ఘ పోరాటం

**గుర్వాజ్ఞ ఫలితము**

సువిశాల భారత దేశాన్ని ఆక్రమించుకోవాలని మొఘల్ పాలకులు నిరంతరం యత్నించారు. ఈ క్రమం లోనే 1567-1568లో చిత్తోర్‌ఘడ్ ముట్టడి తరువాత మేవాడ్‌పై అక్బరు దృష్టిపడింది. మొఘల్ చక్రవర్తి అక్బరు

మేవాడ్ ద్వారా గుజరాత్‌కు స్థిరమైన మార్గం ఒకటి ఉండాలనుకున్నాడు. 1572లో ప్రతాప్‌సింగ్ (రానా) కూడా తనకు సామంతుడిగానే ఉండాలని కోరుతూ అనేక రాయబారాలు పంపించాడు. అయితే అక్బరుకు లొంగడానికి రాణా నిరాకరించడంతో యుద్ధం అనివార్యమైంది. హల్దీఘాట్ యుద్ధం మహారాణాప్రతాప్‌కు, ప్రతాప్‌సింగ్ నేతృత్వంలోని అక్బరు సైనిక దళాలకు మధ్య 1576 జూన్ 18న జరిగింది. ఆ యుద్ధంలో మొఘలులు విజయం సాధించారు. మేవారు సైన్యానికి గణనీయమైన ప్రాణనష్టం కలిగింది. కానీ మహారాణాను పట్టుకోలేకపోయారు.

యుద్ధం జరిగిన ప్రదేశం రాజస్థాన్‌లోని ఆధునిక రాజ్‌సమంద్, గోగుండా సమీపంలోని హల్దిఘాట్‌వద్ద ఒక ఇరుకైన కనుమదారి. మహారాణాప్రతాప్ సుమారు 30000 అశ్విక దళాలు, 400 మంది భిల్‌విలుకాళ్ళను మొహరించాడు. మొఘల్ సేనలకు అంబర్‌కు చెందిన మాన్‌సింగ్ నాయకత్వం వహించాడు. అతని వెంట 5,000-10,000 మంది సైనికులున్నారు. ఆరుగంటలకు పైగా జరిగిన భీకరయుద్ధంలో మేవారు సైన్యం ఓడిపోయింది. రాణా గాయపడ్డాడు. అతను తప్పించుకొని కొండల్లోకి వెళ్ళిపోయాడు. ఆ సందర్భంలో రాణాదేశత్యాగం చేసికొనుటకు పూనుకుంటాడు. ఆ విషయాన్ని తన గురువు భామా సాహితో చెబుతాడు. ఆ సందర్భంలో వారి మధ్య జరిగిన సంభాషణ ఇలా ఉంది.

భామాసాహి : భారతదేశాన్ని వదలి పోతున్నారా ప్రభూ!

రాణాప్రతాప్ : అవును గురుదేవా! విడిచి పోవడానికే నిర్ణయించుకున్నారు. ఇరువది నాలుగు సంవత్సరాలు - కఠిన దీక్షతో - ఘోర తపస్సు చేసి నిర్మించుకున్న స్వాతంత్ర్య సౌధము - కుప్పకూలిపోయినది. సైన్యము నశించినది. కోశము శూన్యమైనది. సహకరించే సామంతులు దూరమయ్యారు. సామ్రాజ్యాధిపతియైన మొఘల్ పాదుషాను ఎదిరించలేని నాకు ప్రాణప్రదమైన మేవాడ రాజ్యాధిపత్యమును నిలబెట్టుకోలేని నాకు దేశపరిత్యాగ నిర్ణయమే శరణ్యమైనది.

భామాసాహి : తులలేని దేశభక్తులయందు మేటియైన రవికుల తిలకమా! మేవాడను విడిచి ఇంకే వాడలకైనా పయనించుట భావ్యమా!

రాణాప్రతాప్ : గురుదేవా! స్వరాజ్యలక్ష్మి మేవాడ నుండి తొలగిపోవుచున్నప్పుడు... ఈ అభాగ్యుడు... మేవాడ నీడలో నిలువడానికి కూడా అనర్హుడు.

భామాసాహి : నేను జీవించి ఉండగా - మేవాడ లక్ష్మి వైభవ ప్రాభవం తొలగుట కానీ, భామా కులగౌరవము చెడుట గాని జరగనివ్వను. మహా రాణా దైవములోనైనా పోరాడెదను కానీ మిమ్ములను దీనుడుగా సాగనివ్వను. ఈ సుదీర్ఘ పోరాటము ఆగక సాగి తీరవలసినదే...........................

రాణాప్రతాప్ : పవిత్ర భారత భూమిలో జన్మించి, ధన్యుడనైతిని. విశ్వవిఖ్యాతిగా, వీర స్థానముగా విరజిల్లే రాజస్థాన పౌరుష ప్రతాపాలకు ప్రాతినిధ్యం వహించే రాజపుత్ర వంశయశో గీతికాలాపనలో శ్రుతిని సవరించి ఆనందాబ్దిలో మునిగి తేలుతున్నాం. ఈనాడు ఎనుబది నాలుగు కోటలను మనం స్వాధీనము చేసుకున్నాము. ప్రజలందించిన అమూల్య సహాయము, మన వీరుల అద్భుత దైర్య సాహస పరాక్రమ శౌర్యాల త్యాగ ఫలితము ఈనాటి యీ విజయోత్సాహానికి కారణమైంది'' అంటాడు. (స్వర్గాదపి గరీయసీ - పు.30) రాణాప్రతప సింహుడు.

రాజ్యాన్ని కోల్పోయాక సామంతునిగా బతకడానికి రాణాప్రతాపుని ఆత్మాభిమానం అంగీకరించలేదు. దేశాన్ని

వదలి ఎక్కడికో వెళ్ళి శేషజీవితం గడపాలనుకున్న రాణా అభిమతం ఆయన గురువు భామాసాహికి తెలుస్తుంది. వెంటనే గురువురంగంలోకి దిగుతాడు. అలా దేశ పరిత్యాగం చేయడం భావ్యం కాదని హితబోధ చేస్తాడు. గురువు మాటలు అతనిలో మార్పును, ఆశను రేకెత్తించాయి. తిరిగి సైన్యాన్ని కూడగట్టుకొని యుద్ధం చేసి మేవాడను స్వాధీనం చేసికుంటాడు. దీని ద్వారా గుర్వాజ్ఞ ఎంత బలవత్తరమైనదో తెలుస్తున్నది. కాబట్టి ప్రతి ఒక్కరూ గురువు మాటను ఆలకించితే విజయ వంతులుగా నిలుస్తారని చెప్పవచ్చు.

**ఆత్మాభిమానం – విజయ సోపానం :**

రాణాప్రతాపునివంటి మరోమహావీరుడు భరతమాత ముద్దుబిడ్డ పురుషోత్తముడు. రాణాప్రతాపుడు అక్బరు సేనలతో యుద్ధం చేస్తే పురుషోత్తముడు అలెగ్జాండరుతో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో పురుషోత్తముడు ఓడి పోయాడు. అయినా తన ధైర్యసాహసాలను కోల్పోలేదు. అతని హావభావాలను దేశభక్తిని చూసి అలెగ్జాండరు అచ్చెరువొందాడు. బంధీగా వున్న పురుష్తోమున్ని తనవద్దకు పిలిపించుకొన్నాడు. ఆ సందర్భంగా వారి మధ్య జరిగిన సంభాషణ ఇలా సాగింది.

అలెగ్జాండరు : మీతోడనెట్టి మర్యాదలతో వ్యవహరింపవలయును.

పురుషోత్తముడు : (గంభీరముగ) మహారాజువలె

అలెగ్జాండరు : రాజా! మీ ధైర్య సాహసములు, గంభీరవాగ్గమనము, ప్రశస్తమైనవి. మిమ్మల సామాన్య బంధీగా గణించి వ్యవహరించిన మావారి ప్రవర్తనల మన్నింపుడు. మీ చెలిమి మాకు సర్వదా శుభప్రదము. స్నేహపు రస్సరముగా మీ రాజ్యము మీ కొసంగుచున్నాము. (అంభి శిరన్సు వంచును)

పురుషోత్తముడు : (గంభీరముగ) మా స్వేచ్ఛకు భంగము వాటిల్లని పక్షమున మాకభ్యంతరము లేదు.

గీ॥ స్వప్రకాశంబుచే నెల్లజగతి తలము
సతము వెల్గించు మార్తాండు చందమునను
తరుగని నృపాల తేజంబు ధర్మనిరతి
యొసగు మీకిదె మీ రాజ్యమిచ్చినవాడ

ఇదిగో నేడు నాకు పర్వదినము. నా విజయయాత్రకు మహోదయము. మీవంటి సాహసోపేతులు, గంభీరుడు, నాయండనుండ సమస్త భారతావనియే కాదు. ప్రపంచ మెల్ల నాముందు మోకరిల్లికపోదు.

పురుషోత్తముడు : మనసా, వాచా, కర్మణా స్వదేశీ సంరక్షణకై బద్ధకంకణులైన నావంటి వారు మీ ఉద్యమమునకు దోహద కారులై స్వజాతిపతనము నెప్పుడును కోరి తెచ్చుకొనరు. మీ స్నేహమున కిదియా తాత్పర్యము?

అలెగ్జాండరు : పురుషోత్తమా! మిమ్మవలీలగా గెలిచియు, దాక్షిణ్యముతో మీ రాజ్యమును మీకిచ్చినందుల కిదియా మీకృతజ్ఞతా సమాధానము.

గీ॥ మాకు గొడుగు పట్టియట్లు మంచినీడ
యొసగునని పెల్లగింపక వసుధ నిల్పి
నాడ నొక వృక్షమది నాకు నీడయిడక
విరుచుకొని మీదబడు తీరు వింతగాదె!

పురుషోత్తముడు : గెలిచినదెవరో, ఓడినదెవరో జగ మెరుగకున్నను, ఆ పరమేష్ఠి యెరుగును. మిథ్యా విజయ గర్వముతో మాటలాడుట సముచితము కాదు? అని స్పష్టం చేశాడు పురుషోత్తముడు. (పురుషోత్తముడు. పు.67)

పురుషోత్తముని ఆత్మాభిమానానికి ఆత్మవిశ్వాసానికి అలెగ్జాండరు అంతటి వాడే తలదించాడు. అది మన భారతీయుల (హిందువుల) గొప్పదనం. దేశమాతను రక్షించుకొనుటకు ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డారేగాని

పరాయి వారికి తలవంచలేదు. వారిసైన్యం ముందు తమది అల్పసైన్యమే అయినా భీరువులా పారిపోలేదు. ఢీ అంటే ఢీ అన్నారు.

**నాటకాలు – సందేశం :**

ఇలాంటి వీరుల, దేశభక్తుల చరిత్రలు బాలలు తెలుసుకోవాల్సిన అవసరం చాలా వుంది. అలా తెలుసు కుంటే వారిలో దేశభక్తి, త్యాగం, సంస్కృతి పరిరక్షణ వంటి గుణాలు అలవడతాయి. భావిభారత పౌరులకు ఇవి ఎంతో అవసరం. ఈ ఇరువురే కాదు. ఇంకా భారత పౌరులకు ఇవి ఎంతో అవసరం. ఈ ఇరువురేకాదు. ఇలా ఎందరో దేశమాత ముద్దుబిడ్డలున్నారు. రాణీరుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, కొమరంభీం, బిర్సాముండా, అల్లూరి సీతారామరాజువంటి పూజ్యనీయు లెందరో ఉన్నారు. వీరి జీవిత చరిత్రలు చదివితే నేటిబాలలు - రేపటి దేశ భక్తులుగా, ఉత్తమ పౌరులుగా, ఆదర్శమూర్తులుగా, పరోపకారులుగా, నీతివంతులుగా జీవనం సాగిస్తారు. అపుడు సమాజం ఎలాంటి అరాచకాలు లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. మన వేదాది గ్రంథాలు, ఋషులు వేలాది సంవత్సరాలకు ముందు అభిలషించిన సమాజం రూపుదాలుస్తుంది. ఆ లక్ష్యసిద్ధికోసం తల్లి దండ్రులు పిల్లలకు ఈ దిశగా తోడ్పాటు నందించాలి.

**ముగింపు :**

రాణాప్రతాప్, పురుషోత్తముల చరిత్రలను బాల బాలికలు అధ్యయనం చేస్తే వారు ఉత్తమ దేశభక్తులుగా తయారవుతారు. తమలో ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం పెంచుకుంటారు. భీరువులా కాకుండా సాహసవంతులుగా జీవితాన్ని గడుపుతారు. భారతదేశ అఖండత్వాన్ని కాపాడగలుగుతారు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. పురుషోత్తముడు - షేక్‌దరియా హుస్సేన్
2. స్వర్గాదపి గరీయసీ - మండ్యాల శ్రీనివాసులు
3. తెలుగు నాటక కవులు - శ్రీనివాసచక్రవర్తి
4. నాటకోపన్యాసములు - రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
5. ఆంధ్రలో నాటకం, నాటకరంగం - డి.వి.ఎ.ఆచార్య
6. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి - ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందు శేఖరం
7. ఆంధ్రనాటక పితామహుడు - డా॥దివాకర్ల వేంకటావధాని


★★★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# జాషువా క్రీస్తు చరిత్ర - క్రైస్తవ సందేశం



- సుజిత రెడ్డి
పరిశోధకురాలు, తెలుగు
అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి
మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి.

- వై. సుభాషిణి
పర్యవేక్షకులు, తెలుగు
అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి
మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి.



**పరిచయం :**

ఆధునికాంధ్ర సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న కవి గుఱ్ఱం జాషువా. గుంటూరు జిల్లా వినుకొండ గ్రామంలో 1895 సెప్టెంబరు 28న జన్మించారు. లింగమ్మ, వీరయ్య వీరి తల్లిదండ్రులు. 1921లో మేరీతో వీరి వివాహం జరిగింది. వినుకొండలోని మిషనరీ, హిందూ పాఠశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1950 వరకు ప్రాథమిక ఉపాధ్యాయుడుగా, మూకీ చిత్రాల కథానాయకుడిగా, యుద్ధ ప్రచారకునిగా, ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసర్‌గా ఉద్యోగాలు చేసి గుంటూరులో స్థిరపడ్డారు. 24.7.1971లో పరమపదించారు.

జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాశాడు. వాటిలో హిమధామార్కధర పరిణయం పద్య కావ్యంగానూ, అనాథ - స్వప్న కథ, గబ్బిలం, కాందీశీకుడు, నేతాజీ, స్వయంవరం, రాష్ట్రపూజ, కొత్తలోకం, ముసాఫరులు, నాగార్జునసాగర్ వంటి ఖండకావ్యాలు. ఫిరదౌసి, గిజిగాడు, ముంతాజ్‌మహల్, క్రీస్తు చరిత్రము లఘుకావ్యాలు. కుశలవోపాఖ్యానం గద్య కృతులు, సత్యహరిశ్చంద్ర, రుక్మిణీ కళ్యాణం, చిదానందప్రభాతం, ధ్రువ విజయం, వీరబాబు, తెరబాట దృశ్య కావ్యాలు. నా కథ- పద్యరూప స్వీయ చరిత్ర మొదలైన రచనలు రచించాడు. జాషువా రచనల్లో ఒక విలక్షణత ఉంటుంది. అంతేకాక సమసమాజ స్థాపన, మానవత్వం, అంటరానితన నిర్మూలన, మూఢవిశ్వాసాలను పారద్రోలుట, దేశభక్తి ప్రబోధం, సమాజ రుగ్మతలను రూపుమాపుట ప్రధానంగా కనిపిస్తాయి. యాదవ కులంలో జన్మించిన వీరయ్య ,ఆది ఆంధ్ర కులానికి చెందిన లింగమాంబను ప్రేమించి పెళ్ళి చేసుకుని వీరయ్య కూడా క్రైస్తవ మతమును స్వీకరించాడు.

జాషువా చిన్నతనం నుండే అంటరానితనాన్ని అనుభవించాడు. అంటరాని వాడవని లోకం పలునిందలు వేసినా ఓర్చుకున్నాడే తప్ప మరొకటి లేదు. అగ్రవర్ణాలవారు గేలిచేసినా ఎప్పుడూ తన తల్లికి చెప్పి బాధపడేవాడు. మనలాంటి అస్పృశ్యులకు, కడుపేదలకు యేసుక్రీస్తు ఒక్కడే దిక్కు అని తల్లి చెప్పగా ఆ మాటల్ని హృదయంలో భద్రపరుచుకున్నారు.

జాషువా ఎన్నో బిరుదులు, మరెన్నో సత్కారాలు, అవార్డులు అందుకున్నాడు. 1933లో కవితా విశారద బిరుదును పొందాడు. 1936లో వినుకొండ వాసులచే కవితా విశారద బిరుదును, 1946లో చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిచే గండపెండేరంతో పాటు కవిదిగ్గజ, నవయుగ

కవిచక్రవర్తి అనే బిరుదులు పొందాడు 1952లో మధురకవి శ్రీనాథ బిరుదు పొందాడు. 1964లో విశ్వకవి సామ్రాట్ బిరుదు పొందాడు. అలాగే 1964లో క్రీస్తు చరిత్రకుగానూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1970లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతో సత్కరించింది. అదే సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని అందజేసింది.

వెలివాడల బ్రతుకుల్ని అక్కున చేర్చుకున్న మిషనరీ లన్నా, వారు పరిచయం చేసిన క్రైస్తవ మతమన్నా జాషువాకు అమితమైన గౌరవం. జాషువా చిరకాల వాంఛ అయిన క్రీస్తు చరిత్రను అక్షరీకరించాలన్న కోరిక కవిగా ఎదిగిన తర్వాత ప్రారంభించాడు. ఈ విషయాన్ని ముందు మాటలో చెప్తూ ఇలా అన్నాడు.“ క్రీస్తు చరిత్ర కావ్యంగా వ్రాయాలనుకున్న నా చిరకాల వాంఛితం తీరింది. మత గ్రంథాలను అందులో బైబిల్ని ఛందోబద్ధం చేయడం కత్తిమీద సామువంటిది. నిరంకుశ్శా కవయ్ణ ”అన్న ఆర్యోక్తి ఇక్కడ పొసగదు. తీగమీది నడక, ప్రత్యక్షర ప్రాధాన్యాన్ని పాటించే క్రైస్తవ మిత్రులు, కథకు తప్పక కవనానికట్టే చోటీయరు. రచనా సౌలభ్యం కోసం అద్భుతాలు, ఉప మానాలు, కొన్ని మాత్రమభివర్ణించ గలిగాను. తెలుగు బైబిలు భాష నీసడించు హైందవ మిత్రులకు, కళాభి రుచిగల ఆధునిక యువక్రైస్తవ లోకానికీ కావ్యం రుచిస్తుం దనే ధైర్యం నాకుందని ధీమా వ్యక్తం చేశారు జాషువా.

క్రీస్తుచరిత్ర కావ్యంలో యాభైమూడు ఉపశీర్షికలు, ఐదువందల ఇరవై పద్యభేదములతో క్రీస్తు జననం నుండి మరణం, పునరుత్థాన ఆరోహణం వరకు వ్రాశారు. ఈ కావ్యానికి 1965 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. క్రీస్తు చరిత్రను వివరించే బైబిలు గ్రంథాన్ని పదహారు వందల సంవత్సరాల పాటు నలభైమంది ప్రవక్తలు అరవై ఆరు పుస్తకాలు వ్రాసిన చరిత్రను సంక్షిప్తీకరించి రాశారు. సృష్టి ప్రారంభం గురించి అనేక గ్రంథాలు అనేక రకాలుగా చెప్తాయి. జాషువా బైబిలు గ్రంథం ఆధారంగా సృష్టి క్రమాన్ని గూర్చి పాతనిబంధన మొదటి అధ్యాయం, మొదటి వచనంతో ప్రారంభమౌతుంది. జాషువా కూడా ఈ కావ్యంలో మొదటి పద్యం కూడా సృష్టి క్రమాన్ని తెలిపింది.

‘ఆదియందు దైవ మాకసంబును - భూమి నహము
రాత్రి నర్కుతుహినకరుని-ఆరునాళ్ళసలిపి యవల
నేడవనాడు-విశ్రమించె, మహిమ విస్తరింప ’

సృష్టి ఆరంభకాలంలో దైవం ప్రపంచానికి తన శక్తి తెలిసేలా ఆకాశాన్ని భూమిని, పగటిని, రాత్రిని, సూర్యుని, చంద్రుని ఆరురోజుల్లో తెలిసేలా సృష్టించి, ఏడవ రోజు విశ్రమించాడు. బైబిలు గ్రంథము పాత నిబంధన, కొత్త నిబంధన అనే రెండు భాగాలుగా రాయబడింది. పాత నిబంధనలో ముప్పై తొమ్మిది పుస్తకాలు ఉన్నాయి. ఇందులో మొత్తం తొమ్మిది వందల ఇరవై తొమ్మిది అధ్యాయాలు ఉన్నాయి. ఇన్ని వందల అధ్యాయాల సారాంశం చెడిపోకుండా కేవలం పదహారు పద్యాలలోనే సంక్షిప్తం చేయడం జాషువా వారి ప్రతిభకు నిదర్శనం.

కొత్త నిబంధన ఇరవై ఏడు గ్రంథాలుగా రచించ బడింది. ఇందులో క్రీస్తు పుట్టుక, మరణం, పునరుత్థానం గురించి ఉంటుంది. కొత్త నిబంధన ప్రకారం క్రీస్తు జననంలో పాపుల రక్షకుడుగా పశువుల పాకలో జన్మించిన సందర్భాన్ని వర్ణిస్తూ......

ఘననక్షత్రమహామణిన్ దలను శృంగారించె నాకాశ గే
హిని, బంగారపు మెట్లకిన్నరలు మ్రోయించెన్ని లిం పొంగనా
జనమానంద పయోధిదేలె సకలాశల్, మేరి గర్భం బునన్
జనంబది ప్రభుండు దీనుడయి,కోష్టంబందు పన్నుండగన్

తల్లియైన మరియ గర్భంలో ప్రభువైన యేసుక్రీస్తు పశువుల పాకలో జన్మించాడు. ఆనాటి రాత్రి పొలాల్లో ఉన్న కొందరు గొల్లెల కాపరులకు తమకు సమీపంలో ఒక మహోజ్జ్వల కాంతి దేదీప్యమానంగా వెలిగింది. అంతలో దేవుని దూత వాళ్ళ సన్నిధిలో నిలిచి మీరు భయపడవద్దు. శుభవార్త తెచ్చాను. మహిమాన్వితుడైన లోకరక్షకుడు బెత్లెహేము అనే నగరములో జన్మించాడు వెళ్ళి చూడండని తెలియజేసింది.

తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడున్నాడు? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రము చూసి ఆయనను పూజింపవచ్చితిమని హేరోదు రాజును అడిగెను. ఆయన

కలవరపడి క్రీస్తు ఎక్కడ పుట్టాడో తనకు చెప్పమని కోరెను. వారు రాజు మాట విని బయలుదేరిపోవుచుండగా, తూర్పు దేశమునవారు చూచిన నక్షత్రము ఆ శిశువుండిన చోటికి వచ్చి ఆగెను. ఆ జ్ఞానులు అత్యానందభరితులై ఇంటిలోనికి వచ్చి తల్లియైన మరియను శిశువును చూచి సాగిలపడి ఆయనను పూజించి, తమ పెట్టెలు విప్పి బంగారమును, సాంబ్రాణిని, బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిన సందర్భమును అద్భుతంగా చిత్రించారు. బైబిలు మొత్తం సందేశాత్మక గ్రంథం ముఖ్యంగా క్రీస్తు బోధలు చేయడమే కాక అన్నింటిని ఆచరించి చూపించాడు. క్రీస్తు సందేశమే క్రైస్తవులకు ఆచరణాత్మకం. జాషువా చిన్నతనం నుండి అంటరాని తనాన్ని మరియు అవమానాలను పొందడంవల్ల 'సమరయ స్త్రీ' వృత్తాంతమును కడు హృద్యంగా కవిత్వీకరించాడు.

యేసు సమరయలోని ఒక బావి దగ్గర విశ్రాంతి తీసుకోవడానికి ఆగాడు. ఆయన శిష్యులు ఆహారం కొనడానికి పట్టణంలోకి వెళ్ళారు. ఇక్కడ యేసుతో మాట్లాడుతున్న స్త్రీ నీళ్ళు చేదుకోవడానికి బావి దగ్గరకు వచ్చింది. ఆయన ఆమెతో నాకు కొంచెం నీళ్ళు ఇవ్వు అని అడిగాడు. యేసు తనతో మాట్లాడడాన్ని చూసి ఆ స్త్రీ ఎంతో ఆశ్చర్యపోయింది. ఎందుకంటే యేసు యూదుడు, ఆమె సమరయ స్త్రీ. చాలా మంది సమరయులను ఇష్టపడేవారు కాదు. కనీసం వారితో మాట్లాడేవారు కాదు. కాని యేసు ప్రజలందరిని ప్రేమించేవాడు. అప్పుడు ఆ స్త్రీ అయ్యా! బావి లోతుగా ఉంది. నా దగ్గర చేద కూడా లేదు. మీరు ఆ జీవజలాన్ని ఎక్కడ నుండి తెస్తారని అడిగింది. అందుకే యేసు నీవు ఈ బావిలోని నీళ్ళు త్రాగితే మళ్ళీ దాహం వేస్తుంది. కాని నేనిచ్చే నీళ్ళు ఒక వ్యక్తి నిరంతరం జీవించేలా చేస్తాయని యేసు వివరించారు.

యేసు నిజమైన నీళ్ళ గురించి మాట్లాడుతున్నాడని ఆ స్త్రీ అనుకున్నది. కాని ఆయన దేవునికి, ఆయన రాజ్యానికి సంబంధించిన సత్యం గురించి మాట్లాడాడు. ఆ సత్యం జీవజలం లాంటిది. అది ఒక వ్యక్తికి నిత్య జీవాన్ని ఇవ్వగలదన్న సందేశాన్ని ఇచ్చాడు. ఈ సందర్భంలో అంటరానితనాన్ని ఈ విధంగా వివరించారు.

జలముల్, వాయువు, నగ్నియున్ వరవు రాజన్యుండు, భూలోకవా
సులకుం బంచి యొసంగిపోయిన స్థిరాస్తుల్, స్పృశ్యతాస్పృశ్యతల్
కులగోత్రాలు ప్రపంచసభ్యతకు సిగ్గుంజేటు జుమ్మిమ్మహా
కలుషంబెల్ల మహా పదార్థములకున్ గల్పింతుర ల్పాశయుల్

అని నీరు, గాలి, నిప్పు అనేవి భూలోకవాసులకు భగవంతుడు పంచి యిచ్చిన స్థిరాస్తులు. తాకనీయటం, తాకనీయకపోవడం, కులగోత్రాలు ప్రపంచ సభ్యతకు సిగ్గుచేటైన విషయాలు సుమా ! ఈ మహాపాపాన్ని పంచ భూతాలకు సైతం అల్పబుద్ధులు కల్పిస్తున్నారని జాషువా ఆవేదన చెందారు.

శాస్త్రులు, పరిసయ్యులు ఒక యువతిని క్రీస్తు చెంతకు తీసుకొని వచ్చి, చూపి ఈమె నిరంతరం పాపపు పని చేసి కలుషితమైనది. యూదుల ధర్మశాస్త్రాల ప్రకారం ఈమెను బండరాళ్ళతో కొట్టి చంపాలని అన్నారు. స్వార్థపూరితులైన ఆ శాస్త్రులు క్రీస్తుతో దీనికి నీవేమంటావు? అని ప్రశ్నించగా యేసు ప్రభువు ఆ మాటలు వింటూ మీలో మంచి వాళ్ళయిన వాళ్ళే మొట్టమొదటగా ఆమెపై రాయి విసరాలని నేలపైన తన చూపుడు వేలుతో ఏదో రాస్తూ తలవంచుకొని ఉన్నాడు. ఒక్కరు కూడా ఆమెపై రాయి విసరలేదు. ఆ స్త్రీ కన్నీరు కారుస్తూ నన్ను కాపాడమంటూ పాదాలపై పడింది.

ఏనును నిను శిక్షింపను
మానిని దుర్వృత్తినింక మానుము పొమ్మం
చానితి నిచ్చెంబ్రభుయే
సానాతియు బ్రతుకు జీవుడాయని చనియన్" అని

యేసు ప్రభువు నేను కూడా నిన్ను శిక్షించను. ఇకనుండి పాపపు వృత్తిమాని జీవించు, వెళ్ళిపో అని ఆజ్ఞాపించాడు. ఆమె బ్రతుకు జీవుడా అని వెళ్ళిపోతుంది. సమాజానికి క్రీస్తు అందించే సందేశాన్ని చాలా చక్కగా కవిత్వీకరిం

చాడు. బైబిలు గ్రంథములో యేసుక్రీస్తు అధికశాతం ఉపమానాల ద్వారా అర్థమయ్యేలా చేశారు. ఒక వ్యక్తి యెరూషలేము నుండి యెరికోకు వెళ్తుండగా దొంగల చేతికి చిక్కాడు. వాళ్ళు అతన్ని నిలువునా దోచుకొని కొట్టి, కొన ప్రాణంతో వదిలేసి వెళ్ళిపోయారు. దారి దోపిడీ దొంగలు కొట్టడంతో బాటసారి ఒకడు రక్తంతో పడి దొగుతూ శరీరావయవాలకు తగిలిన బాణాల దెబ్బలకు తీవ్రవేదనను అనుభవిస్తూ అరుస్తున్నాడు. అదే సమయంలో పురోహిత వర్గానికి చెందిన డబ్బున్న వాడొకడు ఆ వైపే పోతూ బాధపడుతున్న బాటసారిని చూచి రవ్వంతైనా దయలేకుండా కులంపట్టింపుతో ఒంటె నెక్కి నెమ్మదిగా జారుకున్నాడు. అలాగే అదే సమయంలో ఆ దారినే పోతున్న మతబోధకుడొకడు ఆ బాధితుడిని చూచి దయలేక పలుకరించకుండా చూసీ చూడనట్లు త్వరత్వరగా వెళ్ళిపోయాడు. అదే సమయంలో సమర యుడైన ఒక వ్యక్తి ఆ దారినే పోతూ ప్రమాదానికి గురై క్షతగాత్రుడై దు:ఖంతో పొర్లాడుతున్న ఆ బాటసారిని చూచి...

కరుణానంగ మనస్కుడై అతని ప్రక్కంజేరి యోదార్చి,య
క్కరకున్ గంటుల గోస్తనీరసము చుక్కల్ బిండి మైమీదియం
బరమున్ జించి స్రవించు రక్తమును సమ్మార్జించి యుష్ట్రంబుపై
పురికిన్ దోడ్కొనిపోయి చేర్చె రుచిరంపు బూట కుంటింటికిన్

దయగల హృదయంతో బాధితుని చెంతచేరి ఓదార్చి, ప్రాథమిక చికిత్సగా గాయాలతో ద్రాక్షారసపు చుక్కల్ని పిండి తన శరీరంమీది వస్త్రాన్ని చించి, రక్తాన్ని తుడిచి, కట్టుకట్టి ఒంటెపై పట్టణానికి తోడ్కొని పోయి మంచి పూటకూళ్ళ ఇంటిలో ఉంచాడు. ఈ సన్నివేశాన్ని యేసు ఎంతో అద్భుతంగా బోధించాడు.

యూదులు కాని వారు కూడా పొరుగువాళ్ళే అని యేసు సూటిగా చెప్పివుంటే ఆ వ్యక్తి మిగతా యూదులు ఒప్పుకునే వాళ్ళు కాదేమో అందుకే వాళ్ళకు తెలిసిన విషయాలతోనే ఒక చిన్న కథ చెప్పడం ద్వారా ప్రేమను, దయను చూపించాలన్న సందేశాన్ని తెలియజేశాడు.

క్రీస్తు ఈ లోకానికి అరుదెంచడానికి ప్రధాన కారణం ప్రజలను రక్షించడం. అంతేకాక సేవ చేయుటకే ఈ లోకా నికి పిలువబడితినని ప్రభువే ప్రత్యక్షంగా చెప్తారు. యేసు క్రీస్తు ఏదైతే చెప్తారో అదే చేసి చూపించారు. బోధలు అందరూ చేస్తారు. కానీ ఆచరణ మాత్రం కొందరే చేస్తారు. యేసు సేవ చేసి చూపించారనటానికి క్రింది పద్యాన్ని ఉదాహరణగా చూద్దాం....

సేవా ధర్మమె యుత్తమోత్తమమగుగున్ సేవ్యంబు హీనంబగున్
దైవాభీష్టము నిద్దియే, యెదిరి పాదంబంటి యెవ్వాడు ప్రే
మావిర్భూత మనస్కుడై కడిగి ఆత్మానందమున్ జెందునా
సేవాతత్పరుడప్పరాత్పరుని దృష్టిన్ దొడ్డవాడయ్యెడిన్

అన్నిటికంటే కూడా సేవా ధర్మమే ఉత్తమోత్తమమైన ధర్మంగా క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. సేవలను అందు కోవడం హీనమైన లక్షణం. దేవునికి ఇష్టం కూడా అదే ప్రేమగల మనసుతో ఎదుటి వాళ్ళ పాదాలను తాకి, కడిగి ఎవడు ఆత్మానందాన్ని పొందుతాడో అటువంటి వాడు ఆ పరలోక ప్రభువైన పరాత్పరుని దృష్టిలో మంచి వాడవుతాడు అనే సందేశాన్ని జాషువా చక్కగా వివరిం చాడు.

సృష్టిలో అన్నిటికంటే ఉత్కృష్టమైనది ప్రేమే. ప్రేమే శాశ్వతమైనది. క్రీస్తు సర్వలోకానికి ఇచ్చిన సందేశం కూడా అదే. ఒకరినొకరు ప్రేమించుకొనుడి నిన్ను వలే నీ పొరుగువానిని ప్రేమించుము అనే విషయాన్ని జాషువా గారు ఇలా వివరిస్తారు.

ప్రేమించుకొనుండొండొరు
ప్రేమించితి మిమ్మునట్లు ప్రేమించుటయే
క్షేమంబగు నా తండ్రిన్
బ్రేమించిన వాడు నన్ను ప్రేమించునిలన్”

అని యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకంలో ముప్పై

మూడున్నర సంవత్సరాలు జీవించి ఎన్నో సందేశాలను ఇవ్వడం జరిగింది. క్రీస్తు ఈ లోకానికి ఇచ్చిన సందేశాన్ని గుఱ్ఱం జాషువా క్రీస్తు చరిత్ర అనే కావ్యంలో కడు రమణీయంగా చిత్రించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.

**ఆధారగ్రంథాలు :**


1. క్రీస్తు చరిత్ర - ఒక మనవి
2. గుఱ్ఱం జాషువా జాషువా సాహిత్యం - సామాజిక న్యాయం, టి వరప్రసాద్
3. క్రీస్తు చరిత్ర ప్రాశస్త్యము
4. జాషువా కవి జీవిత పరిచయం


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ప్రపంచ భాషలలో తెలుగు గొప్పదనం



- వంజరి రాజేశ్వరి

తెలుగు అధ్యాపకురాలు, గిరిజన గురుకుల మహిళ డిగ్రీ కళాశాల, షాద్‌నగర్, హైదరాబాద్.

**వ్యాస సంగ్రహణం :**

ప్రపంచ భాషలలో తెలుగు భాషకు ఉన్న స్థానం విశిష్టమైనది. ఇది ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది మరియు సాంప్రదాయిక, సాంస్కృతిక, సాహిత్యపరంగా సమృద్ధిగా ఉంది. తెలుగును “ఈశాన్య ద్రావిడ సిరి”గా పిలుస్తారు. ఎందుకంటే ఇది తన మాధుర్యంతో, లయతో మరియు భావవ్యక్తీకరణలోని సౌందర్యంతో ప్రసిద్ధి పొందింది.

తెలుగు ప్రపంచంలోని ప్రాచీన భాషలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలకు అధికార భాషగా ఉన్నప్పటికీ, ఇది భారత దేశంలోని అనేక ప్రాంతాలలో, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వలసవాసుల మధ్య విస్తృతంగా మాట్లాడ బడుతోంది. తెలుగు భాషలో ప్రాచీన సాహిత్యం, గేయ రచన, నాటకరంగం, కావ్య రచన వంటి అనేక రూపాలు పురాతన కాలం నుండే అభివృద్ధి చెందాయి. నన్నయ, తిక్కన, ఎర్రప్రగడ వంటి కవులు మహాభారతాన్ని తెలుగులో రూపాంతరం చేసి భాషకు నూతన ఆభరణం చేర్చాయి. తెలుగు వ్యాకరణం, లిపి, ఉచ్చారణ విధానం శాస్త్రీయంగా, సమతుల్యంగా ఉండటం వలన ఇది నేర్చుకోడానికి అనువైన భాషగా నిలుస్తుంది.

ప్రపంచ భాషలతో పోలిస్తే తెలుగుకు ఉన్న ప్రధాన గుణం దాని ఆచార విలువలు మరియు సాంస్కృతిక అంతరార్థం. ప్రతి పదంలో భావోద్వేగం, ప్రతి వాక్యంలో సౌందర్యం ప్రతిబింబిస్తాయి. నేటి గ్లోబలైజేషన్ యుగంలో కూడా తెలుగు భాష తన అస్థిత్వాన్ని కాపాడుకుంటూ, సాంకేతిక రంగాలలో కూడా తన దాదాపు స్థానం ఏర్పరచు కుంటోంది.

తెలుగు భాష కేవలం ఒక సంభాషణ సాధనం మాత్రమే కాదు; అది తెలుగు ప్రజల ఆత్మ, వారి జీవన విధానం, వారి సంస్కృతికి ప్రతిబింబం. అందుచేత ప్రపంచ భాషలలో తెలుగు భాషకు ఉన్న మహత్కార్యం ఎల్లప్పుడూ గౌరవప్రదమైనదే.

**కీలక పదాలు :**

మహత్కార్యం, విస్తారం, మేధోకళ, గ్లోబలైజేషన్, అస్తిత్వం, సమతుల్యం.

**పరిచయం :**

తెలుగు భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన అత్యంత ప్రాచీన, సంపన్న భాష. ఇది ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాతృభాషగా మాట్లాడ బడుతుంది. తెలుగు ప్రపంచంలో దాదాపు 1 కోటి మందికిపైగా మాట్లాడే భాషగా ఉంది. భారతదేశంలో

22 అధికార భాషలలో రెండో స్థానంలో ఉంది. తెలుగు భాషా చరిత్ర, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వం భారతీయ సంస్కృతీ స్తంభంగా నిలిచింది. 2008లో సాంప్రదాయ భాషగా భారత ప్రభుత్వం గుర్తించింది. తెలుగు భాష తేనెలా మధురమైన పలుకులతో మనుసుకు హత్తుకునే భాష. ఇది ద్రావిడ భాషా కుటుంబంలో అత్యంత విస్తారమైన భాష, మరియు భారతదేశంలో హిందీ తర్వాత రెండవ అత్యధికంగా మాట్లాడే భాష. ప్రపంచవ్యాప్తంగా సుమారు 95 మిలియన్ల (9.5 కోట్ల) మంది తెలుగును మాట్లాడుతున్నారు. తెలుగు కేవలం ఒక సంభాషణ భాష కాదు... అది ఒక సంస్కృతి, కళ, భావన, మరియు ఆత్మీయతకు ప్రతీక. శ్రీకృష్ణదేవరాయల "దేశ భాషలంఉ తెలుగు లెస్స" అనే వాక్యం తెలుగు గర్వగీతంలా నిలిచిపోయింది.

**తెలుగు భాషా చరిత్ర మరియు పరిణామం :**

తెలుగు భాషకి 1000 నుండి 1500 సంవత్సరాల చరిత్ర ఉంది. ద్రవిడ కుటుంబంలో ఉద్భవించిన తెలుగు క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి శాతవాహన వంశం భాష అభివృద్ధికి దోహదపడింది. కాకతీయులు, విజయనగర సామ్రాజ్యకాలంలో తెలుగు సాహిత్యం పుష్పించిందని చెప్పవచ్చు. నన్నయ, తిక్కన్న, ఎర్రన్న వంటి మహాకవులు తెలుగు సాహిత్యానికి అటు వేదిక ఇచ్చారు. భాష వ్యాకరణం, పద్యకళ, శైలిపరంగా తెలుగు సాహిత్యం అభివృద్ధి చెందింది.

**అజంత మాధుర్యం :**

"ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" తెలుగు భాష ప్రత్యేకతలో ఒక ముఖ్య అంశం అజంత స్వభావం, అంటే ఎక్కువ పదాలు అచ్చులతో ముగియడం.

**ఉదా :**

'రామ, కృష్ణ, మనసు, ప్రేమ, చందమామ'. ఈ ధ్వన్యనుసారం, తెలుగు పలికినపుడు మాధుర్యం ఉట్టిపడుతుంది. ఈ కారణంగానే 16వ శతాబ్దపు ఇటాలియన్ యాత్రికుడు నికోలో డి కాంటి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని అభివర్ణించాడు. మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ తెలుగును "భారతదేశంలో అత్యంత మధురమైన భాష"గా ప్రశంసించారు. ఇంకా ప్రసిద్ధ భారతీయ భాషావేత్త జార్జ్ గ్రియర్సన్ తన లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియాలో తెలుగును "సంగీతానికి అత్యంత అనుకూలమైన భాష" అని పేర్కొన్నారు.

**సాహిత్య సంపద మరియు ప్రాచీనత :**

తెలుగుకు ప్రాచీన భాషా హోదా 2008లో భారత ప్రభుత్వం ఇచ్చింది. ఈ హోదా పొందడానికి కనీసం 1500 సంవత్సరాల ప్రాచీన లిఖిత చరిత్ర, మరిము ఉన్నత సాహిత్య సంప్రదాయం ఉండాలి - ఇవి రెండూ తెలుగులో సమృద్ధిగా ఉన్నాయి.

**ప్రాచీన సాక్ష్యాలు :**

క్రీ.శ. 575లోని రేనాటి చోళుల శాసనం తెలుగులో లభించిన తొలి శాసనంగా గుర్తింపు పొందింది. 7వ శతాబ్దం నాటికి తెలుగు పరిపాలనా భాషగా ఉపయోగించబడింది.

**సాహిత్య యుగం :**

11వ శతాబ్దంలో నన్నయ భట్ట మహాభారతాన్ని తెలుగులోకి అనువదించడం ద్వారా తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టారు. తర్వాత తిక్కన, ఎర్రన ఆ కృషిని కొనసాగించి "కవిత్రయం"గా నిలిచారు. వేమన తన సూక్తులతో ప్రజాజీవితానికి తాత్త్విక దార్శనికతను అందించాడు. పోతన, శ్రీనాథుడు, క్షేత్రయ్య, తాళ్ళపాక అన్నమాచార్యులు వంటి మహాకవులు తెలుగు సాహిత్యాన్ని ఆధ్యాత్మికంగా, సాహిత్యంగా మలిచారు. ప్రపంచంలో అరుదైన అవధాన ప్రక్రియ తెలుగులో అత్యంత ఉన్నతమైన మేధోకళగా ప్రసిద్ధి చెందింది.

**లిపి సౌందర్యం మరియు శాస్త్రీయత :**

తెలుగు లిపి ప్రపంచంలో అత్యంత అందమైన లిపిగా పేరు గాంచింది. దీని గుండ్రని ఆకారాలు దానిని దృశ్యపరంగా సుందరంగా, చదువుకోవడానికి సులభంగా చేస్తాయి.

**శాస్త్రీయ నిర్మాణం :**

తెలుగు అక్షరమాల సంస్కృతానికి సమానంగా శాస్త్రీయంగా అమర్చబడి ఉంది. ప్రతి అక్షరం ధ్వన్యనుసారం కంఠ్యం, తాలవ్యం, మూర్ధన్యం, దంత్యం,

ఓష్ఠ్యం అనే ఉచ్చారణ స్థలాలకు అనుగుణంగా ఉంది. ఉచ్చారణలో స్పష్టత ఉన్నందున తెలుగును "ధ్వన్యాత్మక భాష"గా పిలుస్తారు.

**తెలుగు సాహిత్యం మరియు సాంస్కృతిక వారసత్వం :**

తెలుగు సాహిత్యం ప్రాచీన నుంచి ఆధునిక కాలం వరకు విస్తృతంగా ఉంటుంది. నన్నయ మహాభారతం సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించడం తెలుగు సాహిత్యంకు మైలురాయి. విజయనగర రాజవంశ కాలంలో అల్లసాని పెద్దన్న, తెనాలి రామకృష్ణ వంటి మహాకవులు సాహిత్యాన్ని మరింత అభివృద్ధి చేశారు. కూచిపూడి నృత్యం, సంగీతం వంటి కళల వికాసానికి తెలుగు భాష మద్దతు పలికింది. తెలుగు పండగలు, ఉగాది, సంక్రాంతి వంటి సంప్రదాయాలు సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శిస్తాయి.

**ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాషా వ్యాప్తి :**

ప్రపంచంలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య సుమారు కోటి పైగా ఉంది. అమెరికా, కెనడా, యునైటెడ్ కింగ్డమ్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తెలుగు డయాస్పొరా విశాలంగా ఉంది. ఈ వర్గాలు తమ సంస్కృతి, భాషా సంరక్షణను ప్రేరేపిస్తూ, తెలుగు భాషను ప్రపంచానికి పరిచయం చేస్తుండడం గర్వకారణం. టాలీవుడ్ సినీ పరిశ్రమ తెలుగు భాషను విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధి చెందించింది.

**ఆధునిక తెలుగు సాహిత్యం :**

19వ శతాబ్దం నాటికి గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి రచయితలు ఆధునిక సామాజిక అంశాలను తెలుగు సాహిత్యంలో ప్రవేశ పెట్టారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా సమస్యలు, సామాజిక విప్లవాలు, సమకాలీన జీవన విధానాలు ప్రతిబింబించబడ్డాయి. యువ రచయితలు కొత్త వ్యాసశైలి, కవిత్వ రూపాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు.

**యునెస్కో గుర్తింపు :**

తెలుగు భాష యొక్క ప్రాచీనత, సాహిత్య వైభవానికి గౌరవం తెలిపింది. 1999లో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రకటించింది. భగవద్గీత, నాట్యశాస్త్రం వంటి భారతీయ సాంస్కృతిక వారసత్వాలు యునెస్కో మెమోరీ ఆఫ్ ది వరల్డ్‌లో చోటు దక్కించు కున్నాయి. కాకతీయుల రామప్ప ఆలయం యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది.

**అంతర్జాతీయ గుర్తింపు :**

2012లో International Alphabet Association నిర్వహించిన పరిశోధనలో, తెలుగు లిపిని ప్రపంచంలో రెండవ అత్యంత అందమైన లిపిగా (కొరియన్ తర్వాత) గుర్తించారు.

**సంగీత సాహిత్యాలలో తెలుగు పాత్ర :**

తెలుగు భాష కేవలం సాహిత్యంలోనే కాదు, సంగీతం లోనూ సజీవంగా ఉంది. కర్ణాటక సంగీతంలో అత్యధిక కీర్తనలు తెలుగులోనే ఉన్నాయి. త్యాగరాజు, అన్నమా చార్యులు, రామదాసు, క్షేత్రయ్య వంటి మహానుభావులు తెలుగు భాషలో వేలాది కీర్తనలు రచించారు.

**ఉదా :**

త్యాగరాజు రచించిన "ఎందరో మహానుభావులు... అందరికీ వందనము" అనే కీర్తన ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

తెలుగులోని అజంత ధ్వనులు మరియు అక్షర మాధుర్యం రాగాల సౌందర్యాన్ని మరింత పెంచుతాయి. అందుకే దానిని సంగీత భాష అని కూడా పిలుస్తారు.

**తెలుగు పరులు మెచ్చిన భాష – జాతీయ కీర్తి :**

సుబ్రహ్మణ్య భారతి వంటి తమిళ మహాకవి తెలుగును "సంగీతానికి సజీవమైన భాష" అని కొని యాడారు. బ్రిటీష్ అధికారులు మడన్, కాండేల్ మొదలైన వారు తమ పుస్తకాలలో తెలుగును "ద్రావిడ భాషల్లో అత్యంత మధురమైనది" అని పేర్కొన్నారు.

**ప్రపంచవ్యాప్తి :**

నేడు తెలుగువారు అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి దేశాల్లో స్థిరపడి ఉన్నారు. అమెరికాలో "తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (TANA), "ATA", "NATA" వంటి సంఘాలు తెలుగు భాష, సంస్కృతి ప్రచారంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

దక్షిణాఫ్రికాలో తెలుగును రక్షిత భాషగా గుర్తించారు. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రం 2019లో తెలుగు భాషను పాఠశాల పాఠ్యాంశంలో చేర్చింది.

**ముగింపు : భవిష్యత్తు సవాళ్లు మరియు మన కర్తవ్యం**

తెలుగు గొప్పతనం కేవలం గతంలో కాదు నేటికీ దాని ప్రాముఖ్యత అమోఘం. అయితే, ఆంగ్ల ప్రభావం, మాతృభాష వినియోగం తగ్గడం, మరియు డిజిటల్ రంగంలో తెలుగు ప్రాధాన్యం తగ్గిపోవడం వంటి సవాళ్లు ఉన్నాయి. తెలుగు భాషని మనసారా గౌరవించడం, తెలుగు భాషని విస్తృత ప్రచారం చేయడం మరియు తెలుగు భాషా ఖ్యాతిని ప్రపంచమంతా వినిపించడం ప్రతి తెలుగువాడి ప్రధాన తక్షణ కర్తవ్యం.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. తెలుగుభాషా చరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి.
2. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య లకంసాని చక్రధరరావు.
3. ద్రావిడ భాషలు - పి.ఎస్. సుబ్రహ్మణ్యం.
4. ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం.
5. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - దివాకర్ల వెంకటావధాని.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం



– గౌరెడ్డి పవిత్ర

తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల (మహిళ), నాగర్ కర్నూల్.

**తెలుగు స్త్రీవాద సాహిత్య పుట్టుక**

భారతదేశంలో స్త్రీవాద ఉద్యమాలు 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ప్రారంభంలో విద్య, స్త్రీ విద్యా ప్రచారం, ద్వివివాహాల వ్యతిరేక పోరాటాలు, బాల్య వివాహ నిరోధ వంటి సామాజిక సంస్కరణలతో కలసి ముందుకు వచ్చాయి. తెలుగు భాషా ప్రదేశంలో కందుకూరి వీరేశలింగం వంటి సంస్కరణ వాదులు స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం, సతి వంటి దురాచారాల నిర్మూలనపై రచనలు చేయడం ద్వారా స్త్రీ చైతన్యానికి సాహిత్య మద్దతు కలిగించారు. ఈ నేపథ్యంతోనే మొదటగా స్త్రీలే తమ అనుభవాలను, బాధలను, స్థితిగతులను కవితలు, కథలు, వ్యాసాలు, ఆత్మకథల రూపంలో చెప్పడం మొదలుపెట్టడంతో తెలుగు స్త్రీవాద సాహిత్యానికి పునాది పడింది.

ప్రాచీన కవయిత్రుల నుంచి ఆధునికత దాకా, మధ్య యుగ తెలుగు సాహిత్యంలో ముద్దుపలిని, తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు ఉన్నా, వారి రచనలు భక్తి, శృంగారాల్లోనే ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటాయి. ఈ రచనల్లో స్త్రీ అనుభవం ఉంది కానీ పురుషాధిక్య సామాజిక వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తే స్పష్టమైన “ఉద్యమాత్మక” స్త్రీవాద రూపం మాత్రం తరువాత కాలంలో, ముఖ్యంగా 20వ శతాబ్దం మధ్యన బలంగా ఆవిర్భవించింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో బంధారు అచ్చమాంబ, భండారు అచ్చమాంబ వంటి రచయిత్రులు స్త్రీ విముక్తి, విద్య, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ వ్యాసాలు, జీవిత చరిత్రలు, కథలు రాసి స్త్రీ చైతన్యానికి వేదిక కల్పించారు. తెలుగు పత్రికా ప్రపంచంలో ఆంధ్రలక్ష్మి, భారత మహిళ, ఆంధ్ర మహిళ, గృహలక్ష్మి వంటి పత్రికలు వచ్చి స్త్రీల రచనలకు స్థలం ఇచ్చి కొత్త తరపు స్త్రీ రచయితల్ని తీర్చిదిద్దాయి. ఈ కాలంలోనే స్త్రీలు ‘మహిళ’ అనే వర్గ గుర్తింపుతో సంస్కరణ, విద్యా విస్తరణ, స్వీయ గౌరవం వంటి అంశాలను ప్రధానంగా ఉంచుకుని రచనలు చేయడం ద్వారా తరువాతి స్త్రీవాద తరాలకి దారితీశారు.

స్వాతంత్ర్యానంతర కాలం (1950-1975): కుటుంబం, దాంపత్యం, లింగ అసమానతల ప్రతిబింబం 1950-1975 మధ్య తెలుగు స్త్రీ రచయితలు సామాన్య మధ్యతరగతి కుటుంబాల్లో స్త్రీ పాత్ర, భార్యభర్త సంబంధాలు, కోడలు-అత్త సంబంధాలు, ఆర్థిక ఆధారపడుదల, మానసిక బంధనాలు వంటి అంశాలను కథలు, నవలల ద్వారా బలంగా ప్రతిబింబించారు. కొంత వరకూ వీరి రచనలను “స్త్రీవాదం” అనే పర్యాయ పదంతో పిలవడంపై

విమర్శలు ఉన్నప్పటికీ, వీటి ద్వారా గృహజీవితం, దాంపత్య బంధం వెనుక దాగిన అధికార సంబంధాలు బయటపడుతున్నాయి. ఈ కాలం మహిళా రచయితలపై విమర్శకులలో కొందరు "మహిళా రచనలు గృహపరిధి వరకే పరిమితం" అంటూ తక్కువ అంచనా వేసినా, గృహం అనే స్థలాన్ని రాజకీయసామాజిక గొడవల కేంద్రంగా చూపడం స్త్రీవాద ఆలోచనకు పునాది అయింది.

**ప్రముఖ స్త్రీవాద రచయిత్రులు**

1970-80 దశకాల్లో రంగనాయకమ్మ వంటి రచయితలు మార్క్సిస్టు - స్త్రీవాద దృక్పథంతో వివాహ వ్యవస్థ, కుటుంబ నిర్మాణం, ఋషితత్వం, దేవతా యనం, పురాణాలు వంటి వాటిని తీవ్ర విమర్శతో సమీక్షించి తెలుగు సాహిత్యంలో ధైర్యమైన స్త్రీవాద స్వరాన్ని ప్రతిష్ఠించారు. ఆమె రచనలు అనేక సందర్భాల్లో వాదప్రతివాదాలకు దారి తీసినా, స్త్రీని "ఆధీన పాత్ర"గా కాకుండా "విమర్శించే, నిరాకరించే, సృష్టించే వ్యక్తి"గా ఆవిష్కరించాయి. ఇదే సమయంలో ఇతర మహిళా రచయితలు కూడా గృహం, దాంపత్యం మాత్రమే కాకుండా వృత్తి జీవితం, విద్యా వ్యవస్థ, రాజకీయ సంస్థలు, మీడియా వంటి రంగాల్లోని పితృస్వామ్యాన్ని చూపించే ప్రయత్నాలు చేశారు.

పోకూరి లలిత కుమారి "వోల్గా" పేరుతో రచనలు చేస్తూ ఆధునిక తెలుగు స్త్రీవాద సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని పొందారు; ఆమె నవలలు, కథలు, వ్యాసాలు స్త్రీ స్వేచ్ఛ, వివాహంపై విమర్శ, శరీరమనసు స్వాధీనం వంటి అంశాలను ముందుకు తెచ్చాయి. 'సహజ', 'స్వేచ్ఛ', 'ఆకాశంలో సాగం', 'పరవశం' వంటి నవలల్లో వివాహం స్త్రీపై ఎలా బంధనంగా మారుతుందో, స్త్రీ తన విద్య, వృత్తి, శరీరం, భావోద్వేగాలపై తాను నిర్ణయం తీసుకునే హక్కు ఎలా నెమ్మదిగా చర్చల కేంద్రంగా మారుతుందో ప్రతిబింబించారు. ఆమె కథా సంపుటి 'విముక్త'కు 2015లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం ద్వారా తెలుగు స్త్రీవాద కథా సాహిత్యానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

1990 దశకంలో తెలుగు స్త్రీవాద కవిత్వానికి కొత్త తరం వచ్చిందిబీ 1993లో వెలువడిన 'నీలిమేఘాలు' వంటి సంకలనాలు స్త్రీ శరీరం, పీడన, ప్రతిఘటన, ఆకాంక్షలను నేరుగా, ఘాటుగా, రూపకాలకు బంధించ కుండా వ్యక్తపరిచాయి. ఈ కవిత్వంలో గృహహింస, లైంగిక హింస, కులజాతి ఆధారిత అధికారం, దళితస్త్రీ దోపిడీ, మద్యం దుశ్చర్యల వల్ల నాశనం అయిన కుటుంబాల అనుభవాలు సాక్షాత్కార రూపంలో కని పిస్తాయి. కవయిత్రులు "స్త్రీ శరీరం"ను లజ్జ, మౌనం, పాపం అనే పరికల్పనల నుంచి బయటకు తీసుకుని, జ్ఞాపకాల, రాజకీయాల, చరిత్రల వేదికగా చూపిస్తూ తెలుగు కవిత్వ భాషను మార్చాయి. ప్రధాన అంశాలు పితృస్వామ్యం, హింస, శ్రమ, గృహహింస, లైంగిక వేధింపులు, దాంపత్యంలో ఒక్కపక్షాధికారం. స్త్రీల గృహ శ్రమకు ఆర్థికసామాజిక గుర్తింపు లేకపోవడం. విద్య, ఆస్తి, వారసత్వ హక్కులలో వివక్ష. మద్యం దుష్ప్రభావం, వేశ్యావృత్తి వంటి రంగాల్లో స్త్రీ శరీరం ఉపయోగించబడే విధానం. ఈ అంశాలను కేవలం బాధ నివేదనగా కాకుండా, సామాజిక నిర్మాణాలపై విమర్శగా, ప్రత్యా మ్నాయ విలువల ప్రతిపాదనగా చూపడం తెలుగు స్త్రీవాద సాహిత్య ప్రత్యేకత.

**స్త్రీవాద ఇతివృత్తాలు**

**కథ :**

స్వల్ప పరిమాణంలోనే కుటుంబ సంఘటనల ద్వారా తీవ్ర లింగ రాజకీయాలను తెరపైకి తెచ్చే సాధనంగా స్త్రీ రచయితలచే విస్తృతంగా ఉపయోగించబడిందిబీ వోల్గా మొదలైనవారి కథల్లో చిన్న సంఘటనలలోనే పెద్ద ప్రశ్నలు దాగి ఉంటాయి.

**నవల :**

దీర్ఘరూపంలో స్త్రీ జీవితపథాన్ని, వివిధ వయస్సు దశలలో ఎదురయ్యే బంధన%-%విముక్తి సంకలనాలను చూపడానికి రంగనాయకమ్మ, వోల్గా వంటి రచయితల నవలలు ఆదర్శ ఉదాహరణలుగా నిలిచాయి.

**వ్యాసం – వ్యాఖ్యానం :**

పశ్చిమ స్త్రీవాద సిద్ధాంతాలు, మొదటి, రెండో తరంగ స్త్రీ ఉద్యమాలు, భారతీయ సామాజిక వాస్తవం మధ్య

ఉన్న సంబంధాన్ని వివరించే వ్యాసాల ద్వారా తెలుగు పాఠకులకు సిద్ధాంతాత్మక చర్చల పరిచయం లభించింది.

**నాటకం, సినిమా కథ :**

కొంతమంది రచయితలు నాటకాలు, సినిమా కథల రూపంలో కూడా స్త్రీవాద అంశాలను ప్రజాదరణ పొందే భాషలో ప్రవేశపెట్టారు. తెలుగు స్త్రీవాద రచయితలు పాశ్చాత్య స్త్రీవాద సిద్ధాంతాలను పేరిట అనుకరించ కుండా, భారతదేశం, ఆంధ్రప్రదేశ్తెలంగాణ సామాజిక వాస్తవాల నుంచి బయలుదేరి "ఇంటిపనిదేవత" అనే మూడు వలయాల మధ్య ఇరుక్కునిపోయిన స్త్రీ జీవితాన్ని విశ్లేషించారు. కాదుబీ స్త్రీకి మనిషిగా, పౌరుడిగా సమానత్వం కావాలి" అనే అభిప్రాయాన్ని తమ రచనల్లో స్పష్టంగా వ్యక్తపరిచారు. మరికొందరు మార్క్సిస్టు, దళిత, ఆంబేడ్కర్, ఫ్రాయిడ్ తదితర సిద్ధాంతాల ప్రభావంతో లైంగికత, శ్రమ, కులం, వర్గం, జాతి రాజకీయాల పరస్పర సంబంధాలనూ విశ్లేషించారు.

తెలుగు స్త్రీవాద సాహిత్యంపై వచ్చిన ప్రధాన విమర్శల్లో ఒకటి మధ్యతరగతి, పట్టణ, విద్యావంతు రాలైన స్త్రీ అనుభవం మాత్రమే అధికంగా ప్రతిబింబించ బడిందనే అంశంగ్రామీణ, దళిత, ఆదివాసీ, మైనారిటీ స్త్రీల అనుభవాలు తక్కువగా కనిపిస్తున్నాయని విమర్శ కులు అంటున్నారు. కొందరు స్త్రీ రచయితలే "స్త్రీవాద" అన్న పర్యాయపదం తమకు ఇష్టం లేదని, తమ రచన లను సామాజిక వాస్తవం ప్రతిబింబంగా మాత్రమే చూడాలని అభిప్రాయపడుతుంటారుబీ దీనివల్ల "స్త్రీ రచన" - "స్త్రీవాద రచన" మధ్య కనబడే రేఖపై చర్చలు కొనసాగుతున్నాయి. అలాగే, "స్త్రీవాద సాహిత్యం చాలా వాదాత్మకంగా, సందేశాత్మకంగా మారి కళాత్మకత తగ్గి పోతుంది" అన్న విమర్శలకూ ప్రతిస్పందనగా కొందరు రచయితలు రూపంలో, భాషలో, ప్రయోగాత్మక శైలిలో కొత్త మార్గాలు వెతుకుతున్నారు.

**ముగింపు**

ఇంటర్నెట్, సోషల్ మీడియా, బ్లాగులు, ఆన్లైన్మేగజైన్ల ద్వారా పుటపత్రికల అవరోధాలు తగ్గడంతో, కొత్త తరపు రచయితలు తమ అనుభవాలు, మానసిక ఆరోగ్యం, క్వియర్ ఐడెంటిటీ, ఒంటరి జీవితం, ప్రేమవివాహం పునర్ధారణ వంటి కొత్త అంశాలను స్త్రీవాద దృష్టితో రాస్తున్నారు. దళితస్త్రీవాద, కూలీస్త్రీవాద, "బహుళత" రూపంలో తెలుగు కవిత్వం, కథా సాహిత్యంలో ప్రత్యక్ష మవుతూ పాత స్త్రీపురుష ద్వంద్వాన్ని దాటే ప్రయత్నాలు చేస్తాయి. అలాగే, అనువాదాల ద్వారా ప్రపంచ స్త్రీవాద రచనలు తెలుగులోకి రావడం, తెలుగు రచనలు ఇతర భాషల్లోకి వెళ్లడం వల్ల సిద్ధాంత, అనుభవ, శైలి పరమైన పరస్పర ప్రభావం గణనీయంగా పెరిగింది. మొత్తం మీద తెలుగు సాహిత్యంలో స్త్రీవాద రచయితలు స్త్రీని కేవలం తల్లి, భార్య, సోదరి, "అమ్మాయి" అనే పరిసర పాత్రల్లో కాకుండా, స్వతంత్ర ఆలోచనలున్న సామాజిక - రాజకీయ వ్యక్తిగా చూపే ప్రయత్నం చేశారు. వీరి రచనలు గృహపు గోడల మధ్యలాగే, జైలు గదులు, వేశ్యాశాలలు, ఫ్యాక్టరీలు, కాలేజీలు, సినిమా స్టూడియోలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి అనేక స్థలాల్లో స్త్రీ అనుభవాన్ని చిత్రిస్తూ పితృస్వామ్య వ్యవస్థల అసమానతను బయట పెట్టాయి. ఇంకా, ఈ రచనలు స్త్రీలకు మాత్రమే కాకుండా, మొత్తం సమాజానికి న్యాయం, సమానత్వం, గౌరవం అనే విలువలను ప్రశ్నించేటట్లు చేసాయి; ఈ కారణంగానే తెలుగు స్త్రీవాద సాహిత్యం ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది.

**ఆధార గ్రంధాలు :**


1. స్త్రీవాద వివాదాలు - ఎస్వీ సత్యనారాయణ
2. స్త్రీవాదం పురుష రచయితలు - డా.సిహెచ్ సుశీలమ్మ
3. స్త్రీవాదతాత్వికత - ఓల్గా సాహిత్యం - డా. పి. శ్రీదేవి


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# గద్దర్ పాట : ప్రజా చైతన్యానికి ప్రతిధ్వని



- బలుగూరి నవత

**సారాంశం**

ఈ పరిశోధన వ్యాసం గద్దర్ పాటల సాహిత్య, సామాజిక, రాజకీయ మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతను విశ్లేషిస్తుంది. గద్దర్ పాటలు తెలుగు ప్రజా సాహిత్యంలో విప్లవాత్మక దిశను సృష్టించాయి. ఆయన గానం కేవలం కళాత్మకతతో నిండి ఉండక, సమాజంలో అణచివేత, అసమానత, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచిన శక్తిగా నిలిచింది. 1970ల నుండి తెలంగాణా ప్రాంతంలో గద్దర్ గానం ప్రజల గళంగా మారింది. గద్దర్ తన పాటల ద్వారా రాజకీయ చైతన్యం, సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఉద్యమ పిలుపునిచ్చాడు. ఈ పాటలు ప్రజా చరిత్రలో విప్లవాత్మక సాంస్కృతిక మార్పుకు కారణమయ్యాయి. అదేవిధంగా, గద్దర్ కళాత్మకత ప్రజా ప్రదర్శనలో ఒక సజీవ శక్తిగా నిలిచింది. ఆయన వేషధారణ, శబ్దం, నృత్యం, డప్పు లయు ప్రేక్షకులలో ఉత్సాహం, ఆత్మగౌరవాన్ని రగిలించాయి. గద్దర్ పాటలు గ్రామీణ సంస్కృతికి దగ్గరగా ఉండి, సామాజిక చైతన్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేశాయి. ఈ వ్యాసం గద్దర్ గీతాల ద్వారా సాహిత్యం మరియు ఉద్యమం మధ్య ఉన్న అనుబంధాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఆయన గానం ప్రజలలో న్యాయం, సమానత్వం, స్వతంత్ర ఆలోచన వంటి విలువలను నాటింది. మొత్తం మీద, గద్దర్ పాటలు సమాజాన్ని మార్చే శక్తిగా నిలిచి, ప్రజా సాహిత్యానికి కొత్త దిశను చూపించాయి.

**కీలక పదాలు :**

గద్దర్, ప్రజా సాహిత్యం, తెలంగాణా ఉద్యమం, దళిత చైతన్యం, ప్రజా గీతం

## 1. పరిచయం

ఒక సమాజం యొక్క జీవన విధానం, భావజాలం, ఆచారాలు, అనుభవాలు ప్రతిబింబించే అద్దం సాహిత్యం. కానీ ప్రజా సాహిత్యం మాత్రం కేవలం ఆ ప్రతిబింబం కాదు, అది సమాజాన్ని కదిలించే, మార్పు కోరుకునే శక్తి. ప్రజా గీతాలు అంటే పల్లెజీవితపు మౌన కథలు, పేదరికపు నిశ్శబ్ద కేకలు, న్యాయం కోసం గళమెత్తిన మాటలు. అలాంటి గళాల మధ్య గద్దర్ గళం ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది. ఆయన పాటలు పీడితులకు ప్రేరణ, బాధితులకు బలం, మరియు ప్రజాస్వామ్య ఆత్మకు నూతన ఉత్సాహం ఇచ్చాయి. గద్దర్ పాటలు అణగారిన ప్రజల గళం - చీకట్లో వెలుగు, బాధలో బలమూ అయ్యాయి. 1970లలో తెలంగాణా మరియు ఆంధ్ర ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రరూపం దాల్చిన సందర్భంలో ఆయన గానమొక ఉద్యమ శబ్దంగా

మారింది. రైతు ఆత్మహత్యలు, దళిత హింస, భూస్వామ్య దోపిడీ, నిరుద్యోగం, వలస బాట పట్టిన పల్లెల కష్టాలు ఇవన్నీ గద్దర్ పాటలలో స్వరమై మార్మోగాయి. "బాధ ఉన్న చోట గానం పుడుతుంది, గానం ఉన్న చోట చైతన్యం పుడుతుంది" అనే సూత్రాన్ని ఆయన జీవితం ఆచరణలో చూపించింది. ఈ పరిశోధన వ్యాసం గద్దర్ పాటల విశ్లేషణ ద్వారా ప్రజా గీతాల పాత్రను అర్థం చేసుకోవడమే లక్ష్యంగా ఉంది. ప్రజా గీతాలు కేవలం వినోదానికి పరిమితం కాకుండా, ప్రజల్లో ఆలోచనాత్మక మరియు విప్లవాత్మక చైతన్యాన్ని ఎలా పెంచాయో ఈ అధ్యయనం పరిశీలిస్తుంది. ముఖ్యంగా గద్దర్ గీతాలు సామాజిక అసమానతలపై, దళిత, బహుజన హక్కులపై, తెలంగాణా గుర్తింపు కోసం జరిగిన ఉద్యమాలపై చూపిన ప్రభావం ఈ పరిశోధనలో విశ్లేషించబడుతుంది. ఈ అధ్యయనం ద్వారా గద్దర్ గీతాలు కేవలం సంగీత సృష్టిగా కాకుండా, సాంస్కృతిక విప్లవానికి చిహ్నంగా, ప్రజా రాజకీయాల సాధనంగా, మరియు సామాజిక మార్పు కోసం శక్తివంతమైన మాధ్యమంగా ఎలా నిలిచాయో వెలుగులోకి తెస్తుంది.

## గద్దర్ జీవిత నేపథ్యం

గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. ఆయన 1949లో తెలంగాణాలోని మెదక్ జిల్లా తూక్కుగూడ గ్రామంలో జన్మించారు. బాల్యం నుంచే ఆయన జీవితంలో పేదరికం, అసమానతలు, అన్యాయం ప్రత్యక్షంగా అనుభవించారు. అదే అనుభవాలు ఆయనలో సామాజిక చైతన్యానికి విత్తనాలు వేశాయి. విద్యార్థి దశ లోనే ఆయనలో విప్లవ భావాలు మేల్కొన్నాయి. హైదరా బాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో చదువుతున్న సమయంలో సమాజంలోని దళిత, కార్మిక, రైతు వర్గాల కష్టాలు ఆయన మనసును కదిలించాయి. 1970లలో తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో నక్సలైట్ ఉద్యమం మెలకువలోకి వస్తున్న కాలం. అదే సమయంలో గద్దర్ ప్రజానాట్యమండలిలో చేరి కళను ప్రజా ఉద్యమానికి అంకితం చేశారు. ఆయన పాటలు, నృత్యం, వేషధారణ, ఎరుపు రుమాలు, తెల్ల దుస్తులు, తాళాలు, చప్పట్లు ఆయన కళాత్మక వ్యక్తిత్వానికి చిహ్నాలు అయ్యాయి. గద్దర్ కేవలం కళాకారుడు కాదు. ఆయన ప్రజా చైతన్యగాయకుడు, సామాజిక తత్త్వవేత్త. ఆయన గానం పీడితుల ఆత్మధ్వని. "రక్తం రాసిన రాజ్యాంగం, పీడితునికి ఎందుకు దూరం?" వంటి పాటలు ప్రజల మనసుల్లో న్యాయం, సమానత్వం పట్ల చైతన్యం నింపాయి. దళిత ఉద్యమం, కార్మిక హక్కుల పోరాటం, తెలంగాణా రాష్ట్ర సాధన వంటి విభిన్న దశల్లో ఆయన పాటలు ప్రజలకు దిశానిర్దేశం చేశాయి. 1997లో ఆయనపై కాల్పులు జరిపినా గద్దర్ గళం ఆగలేదు. ఆయన జీవితమే ఒక పోరాట గాథ, ఒక సాంస్కృతిక విప్లవ చరిత్ర. చివరి వరకు ప్రజల మధ్య జీవించిన ఆయన, 2023లో మనలో లేకపోయినా, ఆయన గానం ఇంకా ప్రజల గుండెల్లో మార్మోగుతూనే ఉంది. గద్దర్ జీవితం సంగీతం, సామాజిక న్యాయం, ప్రజా చైతన్యం మూడు పరిమాణాలను కలిపిన ఒక శాశ్వత ప్రేరణగా నిలిచింది

## గద్దర్ పాటల స్వరూపం

గద్దర్ పాటల స్వరూపం కేవలం గానం కాదు, అది ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆవేశం, ఆత్మగౌరవం కలిసిన సాంస్కృతిక విప్లవం. ఆయన పాటలు పుస్తక పాఠ్యాల మాదిరి కఠినమైనవి కాదు, పల్లెజీవితంలోని సరళమైన భాషలో పుట్టినవి. గద్దర్ పాటల ప్రధాన లక్షణం ప్రజల భాషలో ప్రజల మనసు చెప్పడం. ఆ పాటలలో కనిపించే భాష పల్లెటూరి వాడుక మాటలతో, స్థానిక జానపద పదజాలంతో నిండి ఉంటుంది. గద్దర్ గీతాలు కేవలం వినోదం కోసం కాదు, అవి చైతన్యానికి, ప్రతిఘటనకు పిలుపు. ఆయన పాటల్లో పీడితుల కష్టం, రైతుల చెమట, కార్మికుల నొప్పి, దళితుల గౌరవం అన్నీ ప్రతిబింబిస్తాయి. "రైతన్నా లేచి రా", "బందిపోటు బంధమైపోయిన పల్లె జనమా" వంటి గీతాలు సమాజంలోని అన్యాయాన్ని బట్ట బయలు చేస్తూ, ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని రగిలించాయి. గద్దర్ గీతాలు ఒకవైపు న్యాయపరమైన చైతన్యాన్ని కలిగిస్తే, మరోవైపు ప్రజల్లో సామాజిక ఐక్యతను పెంచాయి. ఆయన గాత్రం బలంగా, భావోద్వేగంగా, మరియు ఆత్మీయంగా

ఉండేది. అందుకే ఆయన పాటలు సభల్లో మాత్రమే కాక, హృదయాల్లో కూడా ప్రతిధ్వనించాయి. ఈ గీతాలు పల్లె వాతావరణంలో పుట్టి, పట్టణ చైతన్యంలో మార్మోగాయి.

**రాజకీయ చైతన్యం మరియు గద్దర్**

గద్దర్ గీతాలు కేవలం కళాత్మక సృష్టులు కాకుండా, రాజకీయ చైతన్యానికి వేదికలు. గద్దర్ పాటలు పీడిత వర్గాల సమస్యలను మాత్రమే కాకుండా, వాటి మూలంలో ఉన్న వ్యవస్థాత్మక అన్యాయాన్ని కూడా ప్రశ్నించాయి. ఆయన గీతాలు "ప్రజల పాలన ప్రజల చేతుల్లోనే ఉండాలి" అనే ఆలోచనను ప్రజల మనసుల్లో నాటాయి. 1970ల నక్సలైట్ ఉద్యమ సమయంలో గద్దర్ కళ రాజకీయంగా మారింది. ఆయన ప్రజానాట్యమండలి ద్వారా గ్రామాలు, పట్టణాలు చుట్టి ప్రజలకు రాజకీయ చైతన్యం కలిగించారు. ఆ కాలంలో ఆయన గానం రైతు, కార్మిక, విద్యార్థి ఉద్యమాలకు నూతన ఉత్సాహం ఇచ్చింది. "పల్లెలో పాడిన పాటలు మైదానంలో నినాదాలుగా మారాయి" అనే వాక్యం ఆయన ప్రభావాన్ని స్పష్టంగా చెబుతుంది.

గద్దర్ గీతాలు సామాజిక న్యాయం, దళిత హక్కులు, రైతు సంక్షేమం, మహిళా విముక్తి వంటి అంశాలపై రాజకీయ చర్చను ప్రేరేపించాయి. ఆయన పాటల్లో "రక్తం రాసిన రాజ్యాంగం పీడితునికి ఎందుకు దూరం?" వంటి పంక్తులు ప్రజాస్వామ్య వ్యవస్థపై లోతైన ప్రశ్నలు లేవనెత్తాయి. ఆయన గానం ప్రజల హక్కుల కోసం ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలిపింది. ఆయన పాటలు ప్రజలకు తమ స్వంత భూమి, నీరు, బతుకు మీద హక్కు ఉందని గుర్తు చేశాయి. రాజకీయ నాయకుల మాటల కంటే ఆయన పాటలే ప్రజల హృదయాలను కదిలించాయి. అందువల్ల గద్దర్ గీతాలు రాజకీయ చైతన్యానికి ప్రేరణ, ప్రజా రాజకీయాల మౌలిక స్ఫూర్తి. ఆయన గానం ప్రజాస్వామ్యాన్ని కేవలం ఓటుతో పరిమితం చేయకుండా, సామాజిక న్యాయం మరియు సమానత్వం సాధనంగా మార్చింది.

**తెలంగాణా ఉద్యమం మరియు గద్దర్ పాట**

తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమం సాంస్కృతిక, సామాజిక, రాజకీయ శక్తుల సమ్మేళనం. ఆ ఉద్యమానికి ఆత్మగా నిలిచిన గళం గద్దర్ గళం. గద్దర్ గీతాలు ఉద్యమంలో కేవలం వినోదం కాదు అవి ప్రజల చైతన్యం, ఆకాంక్ష, ఆవేశంకు ప్రతీకలు.'పల్లె వాడి బతుకే రాజ్యం కావాలి", "నెలలతల్లి నీళ్లతల్లి, తెలంగాణా మాతల్లీ" వంటి పాటలు ప్రజల మనసుల్లో స్వీయ గుర్తింపును బలపరిచాయి. ఆయన గీతాలు ప్రాంతీయ అసమానతలపై, వనరుల అన్యాయ పంపిణీపై, ఉద్యోగ అవకాశాల లోటుపై గళమెత్తాయి. ఈ గీతాలు ప్రజల్లో ఆత్మగౌరవ ఉద్యమంకు వేదికయ్యాయి. "పల్లె వాడి బతుకే రాజ్యం కావాలి!" అనే గీతం తెలంగాణా ప్రజా ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. 2000లలో తెలంగాణా రాష్ట్ర సాధన మరలా వేడెక్కినప్పుడు, గద్దర్ గళం ఉద్యమానికి జ్యోతి వెలిగించింది. "జై తెలంగాణా" అనే నినాదం వినబడకముందే ఆయన పాటల్లో తెలంగాణా హృదయ ధ్వని ప్రతిధ్వనించింది. గద్దర్ గీతాలు ఈ ఉద్యమాన్ని కేవలం రాజకీయ ఉద్యమంగా కాకుండా, సాంస్కృతిక పునరుద్ధరణగా మలిచాయి. ఆయన పాటలు తెలంగాణా ప్రజలకు తమ చరిత్ర, భాష, సంస్కృతి పట్ల గౌరవాన్ని మళ్లీ నేర్పాయి. గద్దర్ తన గానంతో తెలంగాణా భావజాలానికి బలమైన పునాది వేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన గళం మనకు గుర్తు చేస్తుంది.

**కళాత్మకత మరియు ప్రజా ప్రదర్శన**

కళాత్మకత అనేది సృజనాత్మక భావన, ఊహాశక్తి, భావప్రకాశం సమ్మేళనం. ఇది మనిషి అంతర్ముఖ అనుభూతులను బాహ్య ప్రపంచానికి తెలియజేసే శక్తివంతమైన సాధనం. ప్రజా ప్రదర్శన ద్వారా కళాత్మకత ప్రజల హృదయాలను తాకుతుంది. కవిత్వం, నృత్యం, సంగీతం, నాటకం, గానం వంటి రూపాలలో కళాత్మకత వ్యక్తమవుతుంది. ఆయన గళం, నృత్యం, వేషధారణ ప్రజల మనసుల్లో ఆలోచనను రేపాయి. గద్దర్ పాటల్లో తాళం, లయ, నాట్యరూపకాలు కలసి ఒక సమగ్ర కళాత్మక అనుభవాన్ని అందించాయి.

**గద్దర్ పాటకు పురస్కారాలు**

గద్దర్ తన ప్రజా గానం ద్వారా సమాజంలో మార్పు

తీసుకురావడానికి చేసిన కృషికి అనేక పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయన గానం, రచన, ప్రజా చైతన్యం అన్నీ కలిసిన ఒక విప్లవాత్మక సాహిత్య రూపం కావడంతో, గద్దర్‌ను సాహిత్యవేత్తలు మాత్రమే కాదు, సామాజిక ఉద్యమకారులు, రాజకీయవేత్తలు కూడా గౌరవించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం: తెలంగాణా రాష్ట్ర స్థాపన తర్వాత గద్దర్ పాటలు తెలంగాణా అస్మితకు ప్రతీకగా గుర్తింపుపొందాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సాంస్కృతిక ప్రతినిధిగా గౌరవించింది.

జానపద కళారత్న అవార్డు: గద్దర్ ప్రజా గీతాలు, బుర్రకథ, డప్పు కళ వంటి జానపద కళారూపాలను సమాజ చైతన్యానికి ఉపయోగించినందుకు జానపద కళారత్న పురస్కారం పొందారు.

తెలుగు విశ్వవిద్యాలయం సత్కారం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గద్దర్ గీతాలను ప్రజా సాహిత్యంలోని ప్రత్యేక కృతి అని గుర్తించి ఆయనను సత్కరించింది.

**సాహిత్య అకాడమీ గుర్తింపు :**

గద్దర్ రచనలలో ఉన్న ప్రజా చైతన్యం, సామాజిక వాస్తవికత సాహిత్య అకాడమీ చర్చలలో గుర్తింపు పొందింది. ఆయన పాటలు సాహిత్య చరిత్రలో అధ్యయన విషయాలుగా చేర్చబడ్డాయి.

**సాంస్కృతిక సంఘాల పురస్కారాలు :**

అనేక జానపద మరియు సాంస్కృతిక సంస్థలు తెలుగు యూనివర్సిటీ, ప్రజానాట్యమండలి, రేవల్యూష నరీ ఆర్టిస్ట్స్ ఫోరమ్ వంటి సంస్థలు ు గద్దర్ గానం మరియు ప్రజా కృషిని గుర్తించి ఆయనకు ప్రత్యేక పురస్కారాలు అందజేశాయి.

గద్దర్ ప్రధానంగా అధికారిక అవార్డులకన్నా ప్రజల హృదయాల్లో పొందిన గౌరవమే ఆయనకు నిజమైన పురస్కారం. ఆయన పాటలకు వచ్చిన చప్పట్లు, కన్నీళ్లు, చైతన్యోదయం ఇవే ఆయనకు శాశ్వత బహుమతులు. గద్దర్ గానం ప్రజల గుండెల్లో నిండిపోయిన అమరగీతంగా నిలిచిపోయింది.

**గద్దర్ గారి పాటకు గౌరవార్థం – గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులు :**

'నంది' పురస్కారాలు అనేవి ఆంధ్ర రాష్ట్రాలు తెలుగు సినిమాలకు ఇచ్చే ఉత్తమ పరస్కారం. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ గారి యొక్క గౌరవార్థంగా తెలంగాణకు అందించినటువంటి ఉద్యమ స్పూర్తి, కృషికి తమ పాటకు ప్రతీకగా నంది అవార్డులను గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులుగా మార్చి తెలంగాణ చలన చిత్రాలకు అందించారు. ఇలాంటి మహనీయునికి ఫిల్మ్ అవార్డ్స్ ద్వారా గౌరవం లభించడం కేవలం ఒక బహుమతి కాదు. అది తెలంగాణ ప్రజల ప్రేమకు ప్రతీక. ఫిల్మ్ అవార్డ్స్ గద్దర్ గారి ప్రతిభను మాత్రమే కాదు, ప్రజల పోరాట గాధను కూడా స్మరింపజేస్తాయి. ఆయన పాటల ద్వారా తెరమీదికి వచ్చిన సత్యం, న్యాయం, సమానత్వం వంటి విలువలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి. గద్దర్ గారి పేరుతో అవార్డులు అందించడం అంటే ప్రతి కార్మికుడి చెమటకు, ప్రతి రైతు కన్నీటికి గౌరవం లభించినట్లే. ఆయన గళం ఎప్పటికి పుజల హృదయాలలో మారుమోగుతూనే ఉంటుంది. ఈ అవార్డుల ద్వారా ఎందరో గద్దర్ వంటి యువ గాయకులకు, కవులకు ప్రోత్సాహం లభిస్తుంది. ఎందరో చైతన్య భావాలు కలిగిన కవులు గాయకులు తమ భావాలను వ్యక్తపరుచుటకు ఇది ఒక ముఖ్యమైన మార్గం. ఎందరో ఇది ఆదర్శంగా నిలుస్తుంది.

**ముగింపు :**

గద్దర్ పాటలు తెలుగు జానపద సాహిత్యంలో ఒక విప్లవాత్మక అధ్యాయం. ఆయన గానం కేవలం సంగీత రీతిగా కాకుండా, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రతి పాటలో ఆయన ప్రజల బాధలను, ఆశలను, అణచివేతకు వ్యతిరేకమైన ప్రతిఘటనను వ్యక్తపరిచాడు. అందుకే గద్దర్ గానం ఒక కవితా విప్లవం, ఒక ఉద్యమం, ఒక జ్ఞాపకం. ఈ పరిశోధనలో గద్దర్ పాటల సాహిత్య విలువ, సామాజిక ప్రాముఖ్యత, రాజకీయ చైతన్యం, కళాత్మకత, ప్రజా ప్రదర్శన వంటి అంశాలను పరిశీలించాం. గద్దర్ గీతాలు ఒక వ్యక్తి గానానికి మించి, ప్రజల

ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచాయి. ఆయన పాటల్లో కనిపించే న్యాయం కోసం పిలుపు, సమానత్వం కోసం పోరాటం, దోపిడీ వ్యతిరేకత ఇవన్నీ సమాజంలో కొత్త ఆలోచనలను, చైతన్యాన్ని రగిలించాయి. గద్దర్ తన కళను ప్రజల ఆయుధంగా మలచిన గాయకుడు. ఆయన గానం వల్ల వేలాది మంది ప్రజలు సామాజిక మార్పు కోసం కదిలారు, తెలంగాణా ఉద్యమానికి ఆయన గానం జీవం పోశింది. ఆయన పాటలు నేటికీ పల్లెల్లో, కళాశాలల్లో, ఉద్యమ వేదికల్లో వినిపిస్తూ ఉంటాయి. గద్దర్ పాటలు తెలుగు సాహిత్యంలో ప్రజల భావజాలాన్ని ప్రతిబింబించిన శాశ్వత గీతాలు. అవి వినోదం కోసం కాదు, మార్పు కోసం పుట్టిన పాటలు. గద్దర్ గానం మన సమాజంలోని అణగారిన వర్గాల గళం, న్యాయం కోసం లేచిన శబ్దం. ఆయన పాటలలో మన చరిత్ర ఉంది, మన పోరాటం ఉంది, మన ఆశయాలు ఉన్నాయి. ఈ విధంగా గద్దర్ గీతాలు ప్రజా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి. "గద్దర్ గళం - చీకట్లో వెలుగు, గద్దర్ పాట ప్రజల హృదయధ్వని!" అని చెప్పడం తప్పుకాదు.

**ఆధార గ్రంధాలు :**


1. గద్దర్, జనగీతాలు, హైదరాబాదు: ప్రజా సాహిత్య ప్రచురణలు, 1998.
2. కీర్తి, చంద్రమౌళి. తెలంగాణా సాంస్కృతిక ఉద్యమాలు, విశాఖపట్నం: సారథి పబ్లికేషన్స్, 2015.
3. శశిధర్, ఎం. ప్రజా గీతాల సాంఘిక విశ్లేషణ, తెలంగాణా యూనివర్సిటీ జర్నల్, 2019.
4. Gaddar: The Voice of the Voiceless-The Hindu, 2023.
5. రామచంద్ర, ఎన్. విప్లవ కవుల సాహిత్యం, కవిశ్రీ పబ్లికేషన్స్, 2012.


★★★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# "నవ్య సంప్రదాయ సాహిత్యం – "భూతదయ"



- తమ్మెర లక్ష్మీనరసింహారావు

పరిశోధక విద్యార్థి, 13-70/ఏ1, తొర్రూరు, మం॥ తొర్రూరు, జి॥ మహబూబాబాద్.

భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను సాహిత్య కళాధర్మాలను, దర్శనాలను లాక్షణిక నియమాలను దేశీయతను, అంతర్లీనంగా ఆకళింపు చేసుకున్న సంప్రదాయాల సాహిత్యాన్ని భూమికగా చేసుకొని, సమ కాలీనత సాధారణ ధర్మంగా వస్తునవ్యత, భావనవ్యత, శైలీనవ్యత విశ్వమానవ చైతన్యాన్ని తాత్త్వికతను కలిగియుండి, సామాజిక అవగాహనతో వివిధ ప్రక్రియ రూపంలో వచ్చిన సాహిత్యం నవ్యసంప్రదాయసాహిత్యం. ఈ నేపథ్యభావజాలమంతా 1930 నుండి సాహిత్య రంగంలో ఉద్యమస్ఫూర్తితో ప్రవేశించింది. జీవనదిలా కొనసాగుతూనే యున్నది. ఒకవైపు సామాజిక, రాజకీయ ఉద్యమ చైతన్యం కావచ్చు. సాంఘిక దురాచార సంస్కరణాభిలాషతో కావచ్చు, సాహిత్యంలో వివిధ వస్తు ప్రదర్శన జరిగింది.

అలాగే మరోకోణంలో విచారిస్తే, సాధారణంగా కవి కరుణామయుడు, ఆర్ద్రత ఆయన కవితా సృజనకు ఆయువుపట్టు. భూతదయ కలిగినవాడు అని మనం అనుకోవచ్చు. భూతదయ అంటే మానవులేకాక సర్వప్రాణ కోటి యందు ప్రేమ అనురాగములు, సౌహార్ద్రత కలిగి యుండడం. ఈ భూతదయపదం మొదటిసారిగా పోతన భాగవతంలో వినిపిస్తుంది. "నీ పాదకమలసేవయు", నీపాదార్చకులతోడి నెయ్యము, నితాంతాపారభూత దయయును" అని. అంటే ఏ ఒక్కరోజో, ఏ ఒక్క క్షణమో కాదు, ఎల్లకాలము ఎడతెగకుండా అపారమైన ప్రేమాను రాగాలు కలిగియుందురు అని అర్థం. తోటి మానవుల యెడల ప్రేమ-సరే, మానవేతరసను పక్ష్యాదులయందు -మన కవులు. ఈ 'భూతదయను' ఎలా కావ్యవస్తువుగా తీసుకున్నారో, కావ్యరసావిష్కరణకు-ఎలా కారణమైందో తెలుసుకుందాం. కావ్యంలో రెండే రసములలు ప్రధాన మైనవి. సహృదయును రసానందము కారణములని, రాయప్రోలువారు - ''కరుణశృంగారములు రెండె కావ్యమందు నిజరసవిపాక భోగమందించగలవు" అని అన్నారు.

శ్రీమద్రామాయణ మహాకావ్య ఆవిష్కరణకు మూల భూతమైంది క్రౌంచ పక్షి. విడిపోయిన జంటపక్షులు వియోగము పొందిన సందర్భంగా వాల్మీకి హృదయ స్పందన రామాయణం. ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన కావ్యాల్లో పల్లాదుర్గయ్యగారు గంగిరెద్దు, కరుణ రసార్ద్రత, బాధగా కలిగిన కావ్యం. పల్లెల్లో రైతులు, సాధుజంతువుల పట్ల ఎంతటి అవ్యాజమైన ప్రేమాను రాగాలు కలిగియుంటారో, అవినాభావసంబంధం కలిగి యుంటారో ఎంతో ఆర్తితో అభివర్ణించారు. నోరులేని పశు

వులయెడల ఎలా మనం దయకలిగియుండాలో తెలియ జేస్తారు.

"గుంజకుకట్టినన్ నిలుచు గొట్టిన కంచకుబోవు నింటికిన్
సంజలనేగుదెంచు కడు చల్లనినీరముబోయిద్రావురే
గం జన నిచ్చినన్ గడుపు కమ్మనిపాలెద చేపగొట్టిరే
నింజన నేమి చేయు కరుణింపవలెన్ పశుజాతిపై నిరుల్"

ఇంతటి అమాయకమైన పశుప్రాణిపై ఎంతటి సానుభూతిని కలిగియుండాలి. దయచూపండి అని కవి వేడుకుంటున్నాడు. చల్లని నీరు పోస్తే చాలు కమ్మని పాలిస్తుంది. పూర్వకాలంలో వ్యవసాయమునకు నీరు అందించుటలో మోటగొట్టుట యుండేడిది. బావిలోని నీరు బయటకువిచ్చేవిధానంలో రెండు పశువులను జంటగా, వెనుక ముందుకు త్రోయుచు 'మోట' కడు తాడు. ఆపనిఎంత బాధలో యుంటుందో చూడండి.

"జారిపడితివి ముందుకుసాగునపుడు
చేరిగొట్టెడియావగ చెప్పరాదు
ముందుచనగోయి, వెనుకకుపోవసూయి
మోట పనియెద్దులకు చాలమోసమమ్మా"

అది ఎంత ప్రమాదకరమైనదో, ఎంతకష్టతరమైనదో తన విషాదగాధ ఇలా తెలయజేస్తుంది. మరొక కవి వల్లాదుర్గయ్యగారు ప్రతి అడుగునా పశువుల జీవనాన్ని ఎలా నిశితంగా కరుణార్ద్ర హృదయంతో పరిశీలించారో ఈ పర్వం చూడండి.

"ముక్కునకుత్రాడు బిగియించెముందువెనుక
కాళ్ళాబంధించి నాల్గుడెక్కలకు నినుప
నాడెములుగొట్టె నంతపారనాడకకట
ఎందుకక్కరరాకుండ యెద్దుగొట్టె" ఇది ఎంత హృదయ విదారకమైన దృశ్యమంటే, పల్లెటూళ్లలో రైతుల భూమి దున్నడానికి ఎద్దులను నాగలికి కడతారు. బాల్యం నుండి అనగా దూడ ప్రాయం నుండి, యవ్వన దశకు అనగా కోడెప్రాయం వరకు వచ్చిన మగ కోడెలను ఎద్దులుగా మార్చుటకు "ఎద్దుకొట్టుడు" అంటారు. అంటే వాటి వృషణాలను చితకకొడతారు. ఒక ఇనుప సుత్తెతో, అటుపై అవి సంతానోత్పత్తికి పనికిరాకుండా పోతాయి. భూమి దున్నడానికి మాత్రమే పనికి వస్తాయి. అలా చేస్తున్న క్రమంలో ఎలా అరుస్తాయో చెప్పలేము. ఈ ఆక్రందనను వింటే హృదయం ద్రవించి పోతుంది.

ఇదే సందర్భంలో మనొక కవి గుఱ్ఱం జాషువాగారు వీరికి వినుకొండలోని కొండపై శివాలయాన్ని చూసినపుడు అందులో నివాసమున్న గబ్బిలాలు కన్పించాయి.

"నాడుకన్నీటి కథ సమన్వయముసేయ
నార్ద్ర హృదయంబుగూడ కొంతవసరంబు"

అశ్రు సందేశాన్ని పంపడానికి గబ్బిలాన్ని ఎంచు కుంటాడు.

"నరుని కష్టపెట్టి నారాయణునిగొల్చు
ధర్మశీలురున్న ధరణిమీద
కాలుమోపగ లేక గబ్బిలమొక్కటె
చరణయుగళి దివికి సాచినాడుచు" సాధారణంగా పక్షిజాతిలోని అందమైన పక్షులను చిలకాగోరెంకలను, కనుల విందుగా నాట్యం చేసే నెమళ్లను రంగురంగుల సోయగాలతో కనిపించే సీతాకోకచిలుకలను, ఎంతో ఆనందంతో వాటితో ఆడుకుంటారు. అని అదే పక్షిజాతి యైన గబ్బిలంను ఈసడిస్తారు. ఛీకొడతారు, దగ్గరకు రానివ్వరు. ఎక్కడనో పాడుబడ్డ శివాలయాలలో తల క్రిందులుగా వ్రేలాడుతూ కనిపిస్తాయి గబ్బిలాలు, జాషువా ఏమంటాడంటే ? ఈ భూమిమీద అధర్మం తాండవిస్తున్న తరుణంలో నేను ఈ ధర్మభూమిమీద కాలుమోపను అని గబ్బిలం అనుకుంటుంన్నట్లుగా, జాషువా గబ్బిలంపై సానుభూతిని అభిమానాన్ని చూపిస్తాడు. ఇంకా గబ్బిలాన్ని ఓ తవిసిపిట్టా, పక్షికళ్యాజీ అని ఎంతో అందంగా సంబోదిస్తాడు.

జాషువా గారు వ్రాసిన మరోఖండకావ్య ఖండిక గిజిగాడు. గిజిగాని గూటి రచనా సౌందర్యం గూడు నిర్మాణం - ఎంత అద్భుతంగా ఉందో చూడండి. తేలిక గడ్డిపోడలినిత్రెచ్చి రచించేద వీవు తూగుటుయ్యేల గృహంబు మానవులకేది సాధ్యముకాదు. బీదుల ఎంతగా ఊయల ఎంతగా ఊగినా హాయిగానిద్రించే "అలఘు

సుఖము మాకుగలదా ? ఒకరాజుకు ఉంటుందా అని ఆ దేవేంద్రునికి కూడా ఇంతటి వైభవములేదని కొని యాడుతాడు.

"నీ పైగల సోయగంబు అవని మానవికోటికి ముద్దునేయు
నోయీ, అని వేనుళ్ళో దొగిడి గింజుగాని, కావ్యశాఖ తోగు
మానకోటికి వేనోళ్ల పొగిడి, గిజిగానికి

కావ్యశాఖలో రసరమ్య ఊయలలో ఊపుతాడు. అంతెందుకు, కవయ:క్రాంతదర్శయ: అన్నట్టు రవి కాంచనిచోట కవికాంచగలడు. అని అంటారే అలాగే జాషువా దృష్టి 'సాలీడు' పైబడింది. సాలీడు ప్రాణకోటిలో భాగమేకద. కీటక ప్రాయమైంది. సాలీడు కడుపులో నూలుతాడు చేనే మరగాని, ప్రత్తి వడికేరాట్నముగాని, ఉన్నదా అని అక్కడ ఏదోవిధంగా సాలీడుగూడు "నీ నూలుపోగుల సింగారం పున్నమినాటికి వెన్నల తలపించు నని, నీ అసమానకేశలము నిన్ను మించిన పనివాడే లేడని, నేతపనివాండ్రు నీముందు 'బలాదూర్ అని సాలీడుపైన కవి దృష్టిసారించి, అర్ధత" భావనను అభి వ్యక్తం చేశాడు. ఇది మానవీయం మహనీయం కదా !

ఇలా ఎన్నియో విధాలుగా నవ్యసంప్రదాయకవులు తమ కావ్యములందు, పశుపక్ష్యాదుల ప్రస్తావనలో, భూతదయను ప్రదర్శించినారు.

తుమ్మల సీతారాంమూర్తి చౌదరి గారు రైతులకు పశు వులకు తల్లీబిడ్డల సంబంధం ఉంటుందని అంటారు. 1930లో దిలీపమహారాజు నందినీధేనువునునేవించిన కథను."సేవాధర్మము" అని పేరుతో వచ్చిన కావ్యఖండిక. పశువుల పట్ల ఆయనకు ఎలాంటి వాత్సల్య దృష్టియిందో తెలుస్తుంది. ఆవులను అమ్మ తల్లుని, నక్షత్రాలుగా అవతరిస్తాయని కొనియాడినాడు.

"అమృతప్రసువులు యాజన
క్రమకర్షణమూలములు సురధ్యేదాములు
గ్నిమయమ్ములే ధేనుప్రాలీ
రమణీయాకృతులు విరాజిల్లునొకో" గోసేవు చాలా గొప్పదని తెలియజేస్తూ పశువైద్యులను భూతదయా మయులని కర్షక బాంధవులని పురాణ కథలను ప్రస్తావించి నాడు. తుమ్మల వారు. ఈ విధంగా, నవ్య సంప్రదాయ కవులు, తమ కావ్యములలో, పశుపక్ష్యాదులపై నుండే మమకార్యాన్ని ఎంతో సౌందర్య వంతంగా ప్రేమతో ప్రస్తావించినారు.

**ఉపకరించిన గ్రంథాలు :**


1. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశములు
1. గబ్బిలం - గుఱ్ఱం జాషువా గారు
2. గంగిరెద్దు - పల్లాదుర్గయ్య గారు
3. తుమ్మలవారి ఖండకావ్యం.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# జనగామ జిల్లాలో రైతాంగ ఉద్యమాలు



– అలంశెట్టి పర్శరాములు
పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

**పరిచయం :**

జనగామ ప్రాంతంలో ప్రజ్వరిల్లిన ఉద్యమాలు చరిత్రాత్మకమైనవి. ప్రాచీన కాలమే అయినా ఈ ప్రదేశానికి తొలి ఉద్యమ రుచిని చూపించిన విప్లవయోధుడు సర్దార్ సర్వాయి పాపారాయుడు 17వ శతాబ్దానికి చెందిన ఈ యోధుడు ఢిల్లీ మొగల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. గోలకొండ అధికారాన్ని ఢీ కొట్టాడు. రాజ్యాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకున్నాడు. పాలన చేసింది కొద్ది కాలమే అయినా అసలైన సమర సూరులుగా అనంతర తరాలకు ప్రేరణ అయ్యాడు. జనగామ ప్రాంతం నుండి ఎగసిన మరొక ఉద్యమం 1948 నాటి తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో ప్రత్యేకమైన ఈ తిరుగుబాటు కడవెండి దొడ్డి కొమురయ్య వీర మరణంతో ప్రారంభమై పదునెక్కింది. బందగీ హత్యతో పదునెక్కింది చాకలి అయిలమ్మ వీర విజృంభణ ఉద్యమానికి అగ్నికి ఆజ్యమైంది.

**ఉద్దేశ్యం :**

"1930లో ఏర్పాటు చేసిన ఆంధ్ర మహాసభ నాయకులైన సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, మహిళాసభ నాయకురాలు బూర్గుల అనంతలక్ష్మి, మాడపాటి మాణిక్యమ్మ, నడింపల్లి సుందరమ్మ, రంగమ్మ, ఓబుల్‌రెడ్డి, శ్రీమతి విఠోబాబు, తదితరులతో ప్రభావితమైన తెలంగాణా ప్రజానీకం, 1934లో ఏర్పాటు చేసిన ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ ప్రభావం వల్ల, 1938లో ఏర్పాటైన హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకత్వ ప్రభావం వల్ల, 1939లో ప్రారంభమైన కామ్రేడ్ అసోసియేషన్ నాయకులు జవ్వాద్ రజ్వీ, రాజ బహదూర్ గౌర్, సయ్యద్ ఇబ్రహీం అలంకుంద్ మీర్‌ల ప్రోత్సాహంతో మరియు 1939లో స్థాపించిన హైదరాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ నాయకులు రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వేంకటేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, వి.డి. దేశ్‌పాండే, శ్రీనివాసరావు, యస్.వి.కె. ప్రసాద్, పెరవెళ్ళి వేంకట రమణయ్య, చిర్రావురి లక్ష్మీనరసయ్య, ముఖ్దూం మొహియుద్దీన్, డి.వి. సుబ్బారావు, బి. ధర్మభిక్షం, భీమ్‌రెడ్డి, నరసింహారెడ్డి, డి. రాఘవేంద్రరావు, సి. తిరుమలరావు, సి. యాదగిరిరావు, హఫీజుద్దీన్, అరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి తదిరుల ప్రభావం వల్ల ఇంకెందరో మహిళా కమ్యూనిస్టు నాయకురాళ్ళు అందించిన సహాయ సహకారాలతో శాంతియుతమైన రైతాంగ ఉద్యమాలను భూస్వాములకు వ్యతిరేకంగా నిర్వహించారు. అందులో కొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి. వాటి

గురించి తెలుసుకుందాం. (తెలుగు అకాడమీ - తెలంగాణ చరిత్ర సంస్కృతి - పుట 534)

భూస్వామ్య వ్యవస్థలో నిర్బంధశ్రమ దోపిడి అనేది ఒక అన్యాయమైన పద్ధతి. ఆనాడు తెలంగాణ ప్రతిపల్లెలో ఇది సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఈ విధానాన్ని భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జమీందారులు, మక్తా దారులు చివరికి గ్రామాధికారులు వారి ఏజెంట్లు కూడా అమలు చేసేవారు. వారికి వ్యతిరేకంగా వచ్చిందే రైతాంగ ఉద్యమం.

**షేక్ బందగి సాహెబ్ ప్రతిఘటన :**

బందగి సాహెబ్, జనగామ తాలూకాలోని విసునూరు దేశ్‌ముఖ్ రాపాక వేంకటరామచంద్రారెడ్డి అధికార పరిధిలో గల కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన నిజాయితీ పరుడైన ఒక పేద ముస్లిం రైతు. అయితే తనకున్న 4 ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో పాలివార్లైన ఫకీర్ అహ్మద్, అబ్బాస్ అలీ, అతని సోదరులతో వివాదం మొదలైంది. అప్పటికే "దేవరుప్పుల కామారెడ్డి గూడెంలకు పోలీస్ పటేల్‌గా అధికారాలు చెలాయిస్తున్న అబ్బాస్ అలీ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డిని ఆశ్రయించిగా, న్యాయమైన హక్కుగల బందగి సాహెబ్ దేశ్‌ముఖ్‌కు కూడా లొంగ లేదు. చివరికి ఈ భూమి వివాదం కోర్టు కేసుదాకా వెళ్ళడమే కాకుండా, తీర్పు బందగిసాహెబ్ గెలిచినట్లు రావడంతో భరించలేని పాలివారైన అబ్బాస్ అలీ సోదరులు, దేశ్‌ముఖ్ మద్ధతుతో జూలై 26, 1940లో బందగిని అతి దారుణంగా నరికి చంపేశాడు. ఈ భయంకరమైన సంఘటన అప్పటి వరకు నివురుగప్పిన నిప్పులాగా ఉన్న తెలంగాణా ప్రజానీకంలో ఒక ప్రశ్నించే తత్త్వాన్ని ఎదిరించి పోరాడే ధైర్యాన్ని ఇచ్చింది.

**ధర్మపురం – మొండ్రాయి లంబాడాల తిరుగుబాటు :**

జనగామ తాలూకాలోని ధర్మపురం పూసుకూరు రాఘవరావు మక్తేదారు ఆధీనంలో ఉండగా, మొండ్రాయి మాత్రం కఠారు నరసింహారావు మక్తేదారు పరిధిలో ఉం డేది. ఈ రెండు గ్రామాల పరిధిలోని గిరిజన లంబాడాలు తాను సాగుచేసుకుంటున్న దాదాపుగా 200 ఎకరాల బంజర లంబడా నాయకులపై కేసులు కూడా పెట్టిం చారు. చివరికి "ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ సంఘం నాయకుల నాయకత్వంలో తిరుగుబాటు చేసి తిరిగి తమ భూములను దక్కించుకున్నారు".

**ఆకునూరు – మాచిరెడ్డిపల్లి సంఘటనలు :**

జనగామ తాలూకాలోని ఆకునూరు గ్రామ ప్రజలు 1943లో బలవంతపు లేవీ పన్నుకి వ్యతిరేకంగా గ్రామ పోలీస్ పటేల్ సీతల్ ప్రసాద్ నాయకత్వంలో గొప్ప తిరుగు బాటును లేవదీశారు. దీన్ని పోలీస్ అధికారులు ప్రభుత్వంపై తిరుగుబాటుగా భావించి తీవ్రమైన అణచి వేత విధానాలను అవలంభించారు. దీనిలో భాగంగానే సాయుధ పోలీస్ బలగాలు గ్రామంపై విరుచుకుపడి, దొరికినవారిని చితకబాదడం, ముఖ్యంగా లైంగిక దాడు లకు పాల్పడి కసి తీర్చుకొన్నారు. సీతల్ ప్రసాద్‌తో పాటు 12 మందిపై కేసుపెట్టి జైలుకు పంపించారు. అయినా కూడా ప్రజలు తమ పోరాటాన్ని ఆపలేదు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించలేదు. అందుకే ఈ సంఘటనకు చరిత్రలో చాలా ప్రాధాన్యత ఉంది.

ఇక ఇలాంటి ఘోరమైన మరొక సంఘటన మాచిరెడ్డి పల్లిలో జరిగింది. ఈ గ్రామం ఆనాడు బీదర్ తాలూకా లోని తెలుగు మాట్లాడే ప్రాంతం. లేవీపన్ను వసూలుకు సంబంధించిన మాచిరెడ్డిపల్లి సంఘటన కూడా తెలం గాణలో గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ ప్రజలు సందర్భాను సారంగా ఏ విధంగా సంఘటితం కాగలరో, ప్రభుత్వాధి కారులను ఎంత తీవ్రంగా ప్రతిఘటించగలరో అని చెప్ప డానికి ఇది ఒక మంచి ఉదాహరణ. ఆనాటి బీదర్ తహశీ ల్దార్ అయిన ఖాజా మొహియుద్దీన్ 1945 సంవత్సరంలో గ్రామంలోని కొందరు రైతులు లేవీ పన్ను చెల్లించలేదని మరికొందరు తమ వద్ద వున్న ధాన్యం నిల్వల లెక్కలు సరిగా చూపలేదనే కారణంతో గ్రామ పోలీస్ పటేల్ హన్మంతరెడ్డిని బాధ్యుడ్ని చేసి ఆయన ధాన్యాన్ని జప్తు చేసుకొన్నాడు. దీన్ని గమనించిన హన్మంతరెడ్డి సహాయ కుడు రామ్‌రెడ్డి 100 మంది రైతులతో తమ ధాన్యం తమకివ్వాలని డిమాండ్ చేయడమేగాక, చట్టరీత్యా లెవీ పన్ను ధాన్యపు వసూలును ఎకరానికి ఒక మణుగు (10 కిలోలు)గా కాకుండా, ఎకరానికి అరమణుగు చెల్లించే

టట్లుగా ఉత్తర్వులు జారీ చేయమని విన్నవించుకొన్నారు. అయినా మొండి వైఖరి గల తహశీల్దారు రైతుల విన్న పాన్ని భేఖాతరు చేయడమే కాకుండా తన సహాయకుడైన గిర్దావర్‌తో కలిసి ఇది చాలా సమస్యాత్మకమైన గ్రామమని పై అధికారులకు తెలియజేశాడు. "తహశీల్దారు ద్వారా విషయాన్ని తెలుసుకొన్న తాలూక్దార్ (కలెక్టర్) డి.ఎస్.పి. అర్ధరాత్రి సమయంలో 30 మంది సాయుధ పోలీసులతో గ్రామాన్ని ముట్టడించి విచక్షణా రహితంగా మగవాళ్ళను చిత్రహింసలకు గురి చేయడమే గాక, చాలామంది స్త్రీలపై లైంగిక దాడులకు పాల్పడ్డారు. అయినా గాని, ప్రజలు తమ పోరాటాన్ని ఆపలేదు. లక్ష్యాన్ని మరువలేదు" (తెలుగు అకాడమి - తెలంగాణ చరిత్ర సంస్కృతి - పుట - 538)

ఈ సంఘటన రైతులు ఇక ఎక్కువకాలం అణిగి మణిగి ఉండరనే విషయాన్ని రుజువు చేసింది. రైతుల ఉద్దేశంలో లేవీ పన్ను వసూలనేది ఒక పాపం, నేరం అందువల్ల వారు దాన్ని చెల్లించడానికి నిరాకరించేవారు. ఆ సమయంలోనే రాజ్యం ఏమి చేయాలనుకుందో అదే చేసింది. ప్రజలను అతిక్రూరంగా వేధించింది. రైతులు తాము స్వయంగా నేలను దున్ని విత్తనాలు వేసి పైరును పెంచి, తమ రక్తాన్ని చెమటగా మార్చి పంటను పండిస్తున్నందుకు ఆ పంటపై సర్వహక్కులు తమవేనన్న గట్టి నమ్మకంతో ఉండి, క్రూరులైన భూస్వాములు, ప్రభుత్వాధికారులు తమకు కలిగించే హాని గురించి ఎప్పుడూ వీరు పట్టించుకోలేదు. అయితే, ఆకునూరు, మాచిరెడ్డిపల్లిపై జరిపిన సాయుధ దాడులపై, మానభంగాలపై తీవ్రంగా స్పందించిన మహాత్మగాంధీ లేఖను అందుకొన్న కుమారి పద్మజా నాయుడు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జనగామ తాలూకా పార్టీ ఆర్గనైజర్ సాధినేని ధర్మయ్య సహకారంతో పై రెండు గ్రామాలను సందర్శించి నిజ నిర్ధారణ చేసి, నిజాం పోలీసుల ప్రభుత్వ దమన నీతిని, నిశితంగా విమర్శించింది.

పై రెండు సంఘటనలతో పాటు మరొక సంఘటనతో కడవెండి గ్రామంలోని ఒక ఆంధ్రమహాసభ కార్యకర్త ద్వారా గ్రామంలె జానమ్మ దొరసాని (విసునూరు రామచంద్రారెడ్డి దేశ్‌ముఖ్ తల్లి) అనే మహిళా భూస్వామి తన గదిలో 100 పుట్లు, అంటే 800 బస్తాల ధాన్యానిన (ప్రజల నుంచి లెవీ పన్ను రూపంలో వసూలు చేసింది) నిలువ ఉంచిందని ప్రభుత్వానికి తెలిసి కూడా ఆ ధాన్యాన్ని కాపలా కాస్తోంది. కాబట్టి చివరికి, ఆంధ్ర మహాసభ కార్యకర్త చెబితే తప్ప ధాన్యం స్వాధీనానికి కదలని కాపలా కాస్తోంది. కాబట్టి చివరికి, ఆంధ్ర మహాసభ కార్యకర్త చెబితే తప్ప ధాన్యం స్వాధీనానికి కదలని అధికారుల తీరునుబట్టి భూస్వాములకు, ప్రభుత్వాధికారులకు మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలెలాంటివో ఈ సంఘటన చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ విధంగా ఆకునూరు, మంచిరెడ్డిపల్లి, కండవెండి, పెద్ద పడిశాల, దేవరుప్పుల, పాత సూర్యాపేట, రామన్నపేట, హుజూర్‌నగర్, కల్లూరు, మధిర వంటి గ్రామాల్లోని రైతుల్లో కనిపించిన సంఘటిత శక్తి కొత్త స్ఫూర్తిని నింపింది. ఈ క్రమంలోనే 1946 నాటికి ఉద్యమం ఊపందుకొని విస్తృతంగా వ్యాప్తి చెందింది. అదేవిధంగా వివిధ గ్రామాల్లోని క్రూరులైన జమీందారులకు వ్యతిరేకంగా ప్రజలను తిరగబడేలా చేయడంతో పాటు, అప్పటికే రైతు సంఘాలు ఏర్పాటై ఉన్న గ్రామాల్లోని జమీందార్లను గ్రామాల నుంచి వెళ్ళగొట్టేంత స్థాయికి ఉద్యమం ఎదిగింది. శాంతియుత ఆర్థిక ఉద్యమంగా మొదలైన ఈ ప్రజా చైతన్యం. క్రమం రాజకీయ పోరాటంగా మారి, ప్రజలు భూస్వాముల కబంధ హస్తాల నుంచి తమ గ్రామాలను విముక్తం చేసుకొని తమ భూములపై తామే హక్కులు పొందేలా, మిగులు ఉత్పత్తిని తామే సొంతం చేసుకొనేలా గ్రామ స్వరాజ్యం స్థాపించుకొనే దశకు చేరుకొంది.

1945-46 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం రైతుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపైన, రైతాంగానికి ఉండే సహజ, సామాజిక, సంప్రదాయక హక్కులపైన తెగబడి, రైతులకు వ్యతిరేకంగా అనేక దుశ్చర్యలు చేయడమనేది గ్రామీణ సమాజంలోని వివిధ ప్రభావిత వర్గాలను సమైక్యపర్చింది.

**వీరభైరాన్ పల్లి మారణహోమం :**

నిజాం నిరంకుశ, దోపిడి, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఆనాటి జనగామ తాలూకాలోని బైరాన్‌పల్లి

ప్రజలు సాగించిన వీరోచిత పోరాటం చరిత్రలో ఎంతో ప్రాధాన్యతను పొందింది. "కమ్యూనిస్టుల నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా ఎంచుకొన్న నిజాం ప్రభుత్వం, రజాకర్లు, పోలీసులు మూకుమ్మడిగా 1948 మార్చి నుండి 1948 ఆగష్టు 27 శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయాన గ్రామంపై పడి మారణహోమాన్ని సృష్టించారు. ఆనాటి దాడిలో 84 మంది అమరులయ్యారు" (3. తెలుగు అకాడమి - తెలంగాణ చరిత్ర సంస్కృతి - పుట - 545) గాయాలతో తప్పించుకొన్నవారు ఎక్కడ మరణించారో, ఎందరు మరణించారో ఖచ్చితంగా చెప్పలేనటువంటి పరిస్థితి ఏర్పడింది.

భైరాన్‌పల్లిపై జరిగిన దాడిరోజే పక్కనే గల కూటిగల్లులో కూడా రజాకార్, పోలీస్ బలగాలు మరొక భయంకరమైన మారణహోమాన్ని సృష్టించి కసితీర్చుకొన్నాయి. ఇది కూడా డిప్యూటి కలెక్టరైన ఇక్బాల్ హుస్సేన్ నాయకత్వంలో 1948 ఆగష్టు 27న జరిగింది. ఈ దుర్ఘటనలో 31 మంది అమరులయ్యారు. ఈ రెండు సంఘటనల తర్వాత కమ్యూనిస్టు గెరిల్లా దళాలు, బైరాన్‌పల్లి, కూటిగల్లు గ్రామాల సమీపంలో గల రజాకార్ల క్యాంపులకు కేంద్రాలైన లద్నూర్, మద్దూరు, సలాక్‌పూర్, చేర్యాలపై గెరిల్లా దాడులు జరిపి రజాకార్ క్యాంపులను తుదముట్టించాయి.

**కోలుకొండ అమరవీరులు :**

"1948వ సంవత్సరంలో విసునూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి అనే బాబుదొర రజాకార్ల, నిజాం పోలీసుల సహాయంతో కోలుకొండ గ్రామంపై పలుమార్లు దాడి చేసి రెండుసార్లు ఊరు తగలబెట్టి చివరికి 18 మందిని అతిక్రూరంగా కాల్చి చంపారు" (4. తెలుగు అకాడమి - తెలంగాణ చరిత్ర సంస్కృతి - పుట - 546) ఇందులో ఇద్దరు స్త్రీలను పోలీసులు చెరచడానికి ప్రయత్నించినప్పుడు తమ మాన రక్షణ కోసం బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నారు. ఇంకా అక్కిరాజుపల్లిలో 11 మంది తమ్మడపల్లిలో 11 మంది అమరులయ్యారు.

**దేవరుప్పుల దేశభక్తులు :**

జనగామ తాలూకాలోని ముఖ్యమైన కేంద్రాలైన దేవరుప్పుల గ్రామంపై 1948 మార్చి - ఏప్రిల్ నెలల్లో బాబుదొర నాయకత్వాన రజాకార్లు, నిజాం పోలీసులు దాడులు జరిపి, దొరికిన వారిని దొరికినట్లు గడ్డివాముల్లోకి తోసి దాదాపు 11 మందిని సజీవదహనం చేశారు.

**ధర్మాపురం ధర్మవీరులు :**

జనగామ తాలూకాలో ఈ గ్రామం లంబాడి ప్రజలు అధికంగా ఉన్న గ్రామం. విసునూరు బాబుదొర, రజాకార్లు పోలీసులు ఊరిపై దాడిచేసి దోచుకొని చివరికి 12 ఏళ్ళ పసిబాలుడితో సహా ఎనిమిది మందిని పట్టుకొని వారితోనే వారి గుడిసెలను పీకించి, వాటితోనే కాష్ట పేర్చి, ఒకరితో ఒకరి చేతులు కట్టించి సజీవంగా మంటల్లో పడేసి చంపారు. వారు - బానోతు సోమ్లా, బానోతు రెడ్డా, బానోతు సాంక్రు, బోడా గోలియా, బోడా ధావుర్యా, అజ్మీరా చంద్రూ, అజ్మీరా బలరామ్, అజ్మీరా రాము, ధారావత్ కిషన్, జాటోత్ దావులు, జాటోత్ ఠాను, కుందూరు వెంకులు.

ఈ విధంగా రజాకార్ల నిజాం పోలీసుల దొరల దాష్టీకానికి బలైన గ్రామలు తెలంగాణలో, జనగామలో ఎన్నో ఉన్నాయి. అయితే ప్రజలు రైతు కూలీలు ఎంతమాత్రం భయపడకుండా గెరిల్లా దళాలతో కలిసి రజాకార్ క్యాంపులు, పోలీసు ఔట్‌పోస్టులు, రేల్వేస్టేషన్లు, ప్రభుత్వ అధికారులు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, వారి గుండాలపై తీవ్రమైన దాడులు చేసి శత్రు నిర్మూలన చేసి, ప్రజావిముక్తికి పునాదులు వేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు అకాడమీ - తెలంగాణ చరిత్ర, సంస్కృతి.
2. తెలుగు అకాడమీ - తెలంగాణ చరిత్ర, సంస్కృతి.
3. తెలుగు అకాడమీ - తెలంగాణ చరిత్ర, సంస్కృతి.
4. తెలుగు అకాడమీ - తెలంగాణ చరిత్ర, సంస్కృతి.

★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# ఆచార్య కసిరెడ్డి పొడుపు కథలలో - సంస్కృతి



- శోల్కం రాములు
పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాదు.

**వ్యాస సంగ్రహం :**

పొడుపు కథలు అంటే తెలుగులో పజిల్స్ లేదా చిక్కు ప్రశ్నలు అని అర్థం. ఏదైనా ఒక భావన గురించి కాని సంఘటనను గురించి కానీ సూటిగా చెప్పకుండా లక్షణాల ద్వారా కాని, గుర్తుల ద్వారా కాని ఇచ్చే ఆలోచించే ప్రశ్నలే పొడుపు కథలు. భాష నైపుణ్యంను పొంపొందించడానికి, వినోదంను కలిగించడానికి తోడ్పడే ఒక ప్రాచీన జానపద కళ సాహిత్యం ఇది.

పొడుపు కథలు అనగా జ్ఞానోదయంను కలిగించేవి, నిగూఢమైన అర్థాన్ని ప్రకాశింపచేసేవి, మనస్సుకు సూటిగా తగిలేవి ఎదలో నాటుకునేవి. అర్థం తెలియక మనల్ని చిక్కులో పడేసేవి అనీ మనం గ్రహించవచ్చు.

(గోడమీది బొమ్మ - వెలగా వెంకటప్పయ్య - పుట - 4)

**కీలక పదాలు :**

పొడుపు కథలు, నిగూఢం, ఎద, ఊతకర్ర, గంభీరం, గాదెలు.

**ప్రవేశిక :**

జానపద సాహిత్యంలో పొడుపు కథలు గంపలకొద్ది పుట్టాయి గాదెలు నింపాయి. అందులో విషయాలు శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాస, శాస్త్ర, ప్రబంధాల్ని సృజించాయి. జానపదుల జీవితాన్ని, సంస్కృతిని, ఆచార వ్యవహారాల్ని, అలవాట్లను, అభిరుచులను, సాంప్ర దాయాలను స్పర్శించాయి.

(తెలుగు పొడుపు కథలు - కసిరెడ్డి - పుట - 5)

తెలుగు పొడుపు కథలు ఇది కసిరెడ్డి సిద్ధాంత గ్రంథం కేవలం డిగ్రీ కోసమే తెచ్చిన సిద్ధాంత గ్రంథం కాదు. కొన్ని యేండ్ల పరిశ్రమ విస్తృతమైన క్షేత్ర పరిశోధన అతి విస్తృతమైన విషయ పరిజ్ఞానం ఇవన్నీ ఈ గ్రంథం నిండా పరుచుకొన్నట్లు కనిపిస్తాయి. తెలుగు నేలలో ఏ వేదికను అడిగిన అది కసిరెడ్డి చిరునామ చెబుతుంది. ఏ సభను అడిగినా వారి వాక్ ప్రవాహం గురించి వారి ఉపన్యాస కళ సంభాషణ చాతుర్యంను వివరిస్తుంది.

ప్రతి పొడుపు కథ ఒక శ్రుతి తప్పిన జీవితాన్ని సరిచేసే స్వరంగానో, ఓ ధర్మాన్ని నిర్దేశించే ధార్మిక జ్ఞానిగానో, గతి తప్పిన జీవితానికి సద్గతిని కలిగించే చైతన్యంగానో, గత కాలపు తప్పిదాల నుండి వర్తమాన కాల సన్మార్గ వేదోక్తిగానో, జీవిత విలువల నుండి పతనమౌతున్న వ్యక్తికి జ్ఞానోదయంను కలిగించే ఊతకర్రగానో భాషిస్తాయి. జీవితాలను నిలబెట్టాయి.

పైన పటారం - లోన లోటారం (మేడిపండు)

మనిషి పైకి మహా గంభీరంగా ఉన్నప్పటికీ లోపల భయపడే మనసత్వాన్ని వివరించే సందర్భంలో ఈ పొడుపు కథను వాడుతారు. మునుపటికి ఎవరో లేని ఆడంబరాలకు పోయి అష్టకష్టాలు పడ్డారని ఆడంబరాలకు పోతే మనుషులకు కష్టాలు తప్పవనే జీవిత నగ్న సత్యాన్ని వివరించారు రచయిత.

మూల మూల నుండు ముట్టు తమరి గాడు
దండ మిడును నేల తాకి తాకి
ఎచట తాక నచట ఎగనాకినట్లుండు
దీని భావమేమి దేవ దేవ!

(పొడుపు పద్యాలు - కసిరెడ్డి - పుట - 52)

ప్రజల జీవితంలో చీపురు స్థానం ముఖ్యమైనది. ఉదయం, సాయంత్రం చీపురు లేకుండా ఇళ్లు శుభ్రం కాదు. కార్మికులు చీపురు పట్టుకొని వీధులు మురికి పట్టకుండా శుభ్రం చేస్తూనే ఉంటారు. ఈ విధంగా ప్రజల జీవితానుభంతో నలిగి నాని నానుడులుగా, సామెతలుగా, జాతీయాలుగా, పొడుపు కథలుగా ప్రచారంలో ఉన్న వాటిలో ప్రజల సామాజిక స్థితిగతులు, సంస్కృతీ సాంప్రదాయాలు అణువణున మనకు గోచరిస్తాయి.

అతను నల్లనివాడైన యముడు కాదు
అతడు చక్రము దాల్చు కుమ్మరియుకాదు
అతడు శంఖము దాల్చు జంగమ్ము కాదు
అతడు పింఛము ధరియించు చెంచు కాదు
అతడు రాజ్యాలు నిలబెట్టే రాజు కాదు
అతడు వస్త్రాల నందించే సాలె కాదు
జీవమే లేని మేనల్లుడతని జంపె
తెలుపు మాతడు ఎవ్వడో తెలుగు బాల

- (శ్రీకృష్ణుడు)

(పొడుపు పద్యాలు - కసిరెడ్డి - పుట - 49)

కసిరెడ్డి నుండి జాలువారిన పై పొడుపు పద్యంలో భాగవత పురనా పురుషుని పేరుని సమాధానంగా గ్రహించి ఆలోచన శక్తిని పెంచి, మాటకారితనంను నేర్పి, శ్రీకృష్ణుని ఆచార వ్యవహారాలను, జీవన కథ సౌందర్యాన్ని, బాల బాలికల హృదయాలు వికసించే విధంగా మనోవికాసం కలిగే విధంగా తెలియజేశాడు కసిరెడ్డి.

గుండు మీద గుండు
పదహారు గుండ్లు
పదహారు గుండ్ల మీద
పట్టు కుచ్చు - (మొక్కజొన్న కంకి)

(తెలుగు పొడుపు కథలు - కసిరెడ్డి - పుట - 141)

గృహస్థ జీవనంలో వివాహం ఒక మధుర ఘట్టం. వధూవరులు తమ సంతోషకర సందర్భంను గూర్చి ఎంతగానో ఆలోచిస్తారు. స్నేహితులంతా వారి చుట్టూ చేరి వారిని నవ్విస్తారు. కవ్విస్తారు. పెండ్లి సందర్భంలో వధువు మెడ నిండా వివిధ ఆభరణాలతో అలంకరిస్తారు. మొక్కజొన్న కంకి అని పైకి అర్థం ఉన్న నిగూఢంగా అలంకరణ సౌందర్యాంను గూర్చి ఈ పొడుపు కథలో వివరించాడు కసిరెడ్డి.

వంక లొంలక మఱ్ఱి వంకల్ల మఱ్ఱి
వడ్లోని దగ్గర కోయి వంక దీపిచ్చిన
కమ్మరోని దగ్గర కోయి కట్టేపిచ్చిన
ఈరపట్నం తీస్కపోయి రంగేపిచ్చిన - (పల్లకి)

(తెలుగు పొడుపు కథలు - కసిరెడ్డి - పుట - 154)

వివాహంలో ఉపయోగించే పల్లకిని గూర్చి రచయిత ఈ పొడుపు కథలో తెలియజేశాడు. ప్రౌఢులకు దీనిలోని మర్మం తొందరగా తెలియదు. దీనిలోని మర్మంను విశ్లేషిస్తే వంకరలు కలిగిన కట్టెను వడ్రంగి దగ్గరకు తీసుకెళ్ళి దాంట్లోని కొన్ని వంకరలు తీసేసి మానును సిద్ధం చేసి అవి విరిగి పోకుండా వంకరలు పోకుండా ఇనుప రేకులతో కట్టు వేసి, నగరం నుండి తెచ్చిన రంగులు వేసి ముస్తాబు చేస్తే అది పల్లకిగా మెరుస్తుంది.

**పొడుపు కథల ప్రయోజనం :**

పొడుపు కథల వల్ల లోకజ్ఞానం అబ్బుతుంది. వాటిని వినడం వల్ల మానసిక ఆనందం, సమస్యలను అర్థం చేసుకొనే నైపుణ్యం దానిని పరిష్కరించే మార్గం అలవడుతాయి. ఆయా కాలాలకు సంబంధించిన విషయాలు తెలుస్తాయి. వీటిలో జ్యోతిష్యం, ఆరోగ్యం,

వైద్యం, గణిత, తార్కిక సంబంధిత పొడుపు కథల వల్ల విషయం, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం లభిస్తుంది. మానిసక వికాసానికి తోడ్పడి ఏకాగ్రతను పెంపొందిస్తాయి. క్రీడల పైన ఆసక్తిని కలిగిస్తాయి.

**ముగింపు :**

పొడుపు కథలు జఠిలమైనవి దీనికి జవాబు చెప్పాలంటే కొంత ఆలోచించాలి. మన జీవితంలో అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. వాటిని దాటుకొని ముందుకు వెళ్ళటానికి ఈ ఆలోచన సామర్థ్యం ఎంతగానో తోడ్పడుతుంది. జానపద సాహిత్యంలో కసిరెడ్డి గారికి అనేక యేండ్లు అనుభవం ఉంది. ఒక జ్ఞానపదునికి జానపదునికి ఉండే లక్షణాలు అన్నియు ఇతనిలో గోచరిస్తాయి. ఒక జానపదునిగా జానపద సాహిత్యాన్ని పదిమందికి అందించిన వారి కష్టం, వారి కృషికి నిదర్శనం వారు రచించిన రచనలే. అదే ప్రామాణికాలుగా మన ముందు నిలబడ్డాయి.

**ఆధార గ్రంథాలు :**


1. గోడమీద బొమ్మ - వెలగా వెంకటప్పయ్య.
2. తెలుగు పొడుపు కథలు - కసిరెడ్డి.
3. జానపద కవిత్వం - కసిరెడ్డి.
4. పొడుపు పద్యాలు - కసిరెడ్డి.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# రాష్ట్ర గీతం ప్రదాత – శంకరంబాడి సుందరాచారి



– యస్. రాజేంద్రుడు
పరిశోధక విద్యార్థి, కర్నాటక స్టేట్ ఓపెన్ యూనివర్శిటీ, మైసూరు, కర్నాటక.

**ప్రవేశిక :**

చిత్తూరు జిల్లా కవులకు, విమర్శకులకు, తత్వవేత్తలకు, రాజనీతిజ్ఞులకు ఆలవాలమైంది. వీధినాటక కళ ఒక్క చిత్తూరు జిల్లా సొంతం. ఈ జిల్లాలో ఊరూరా గంగజాత అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ క్రమంలో చూసినపుడు ధూర్జటి, తరిగొండ వెంగమాంబ వంటి కవి, కవయిత్రులు, కట్టమంచి రామలింగారెడ్డి వంటి విమర్శకులు, జిడ్డు కృష్ణమూర్తి వంటి తత్వవేత్తలు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ వంటి పండితులు ఈ జిల్లాలో జన్మించారు. ఈయన కవి, తార్కికుడు, స్వతంత్రుడు, భావుకుడు. ఈయన కలం నుంచి అనేక కావ్యాలు, గేయాలు, వెలువడ్డాయి. ఈ గేయాల్లో మణిపూస వంటిది 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ'. ఇది రాష్ట్రగీతంగా గుర్తించబడింది. ఇంతటి జ్ఞానవంతుడైన మహాత్ముని గురించి ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

శంకరంబాడి సుందరాజారి (ఆగష్టు 10, 1914 - ఏప్రిల్ 8, 1977) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' రచయిత.

**జీవిత విశేషాలు :**

సుందరాచారి, 1914 ఆగష్టు 10న తిరుపతిలో జన్మించాడు. అతని మాతృభాష తమిళంను మదనపల్లెలో బిసెంట్ థియోసాఫికల్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివాడు. చిన్నతనం నుండే ఆయన స్వతంత్ర భావాలు కలిగి ఉండేవాడు. బ్రాహ్మణోచితమైన సంధ్యా వందనము వంటి పనులు చేసేవాడు కాదాయన, తండ్రి మందలించగా జంధ్యాన్ని తెంపివేశాడు. తండ్రి మందలింపునకు కోపగించి, పంతానికి పోయి, ఇంటి నుండి బయటికి వెళ్ళిపోయాడు.

భుక్తి కొరకు ఎన్నో పనులు చేశాడు. తిరుపతిలో హెూటలు సర్వరుగా పనిచేశాడు. రైల్వేస్టేషనులో కూలీగా కూడా పనిచేశాడు. ఆంధ్రపత్రికలో అచ్చు దోషాలు దిద్దేవాడిగా, ఉపాధ్యాయుడిగా, పాఠశాల పర్యవేక్షకుడిగా ఎన్నో వైవిధ్యభరితమైన పనులు చేశాడాయన.

అమితమైన ఆత్మవిశ్వాసం కలవాడాయన. ఒకసారి ఏదైనా పని వెతుక్కుందామని మద్రాసు వెళ్లాడు. ఆంధ్ర పత్రిక ఆఫీసుకు వెళ్ళి పని కావాలని అడిగాడు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు "నీకు తెలుగు వచ్చా" అని అడిగాడు. దానికి సమాధానంగా "మీకు తెలుగు రాదా" అని అడిగాడు, నివ్వెరపోయిన పంతులుతో నేనప్పిటి వరకు తెలుగులోనే కదా మాట్లాడాను. అందుకే మీ ప్రశ్నకు సమాధానం ఎలా ఇవ్వాలో తెలియలేదు అని అన్నాడు. ఆంధ్రపత్రికలో ఉద్యోగం చేస్తుండగా,ఒక

ప్రముఖునిపై పద్యం రాయవలసి వచ్చింది. నేను వ్యక్తులపై పద్యాలు రాయను అని భీష్మించుకుని, దానికోసం ఆ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు సుందరాచారి. తరువాత విద్యాశాఖలో పాఠశాల పర్య వేక్షకుడిగా పనిచేశాడు. నందనూరులో ఉండగా ఒకసారి పాఠశాల సంచాలకుడు వచ్చాడు. ఆ సంచాల కుడు సుందరాచారిని బంట్రోతుగాను, బంట్రోతును సుందరా చారిగాను పొరపడ్డాడు. దానికి కోపగించి, సుందరాచారి ఆ ఉద్యోగానికి తక్షణమే రాజీనామా చేశాడు.

**రచనల నుండి ఉదాహరణలు :**

'సుందర రామాయణం' రాస్తున్నప్పుడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మకు ఒక సందేహం కలిగి ఇతడిని "అయ్యా! సుందరాచారీ! తాటకి భయంకర స్వరూపిణి. నీ తేట గీతులలో ఇముడుతుందా?" అని ప్రశ్నించాడు. ఆయన దానిని ఒక సవాలుగా తీసుకుని తన సుందర రామా యణంలో తాటకిని ఇలా ప్రవేశపెట్టాడు.

నల్లకొండల నుగ్గుగా నలగగొట్టి
చిమ్మచీకటిలోగల చేవబిండి
కాళసర్పాల విసమెల్ల గలిపినూరి
కాచిపోసిన రూపుగా గానుపించె
పచ్చి రక్కసి, నడగొండవలెను, వదన
గహ్వరము విచ్చి మంటలు గ్రక్కి, నాల్క
సాచి, కనులెఱ్ఱవార, చేయూచికొనుచు
నురము ముందుకునెట్టి, శిరమునెత్తి
కాలభైరవియై వల్లకాటికెల్ల
దానె గాపరి యనమించి తలల మాల
మెడను వ్రేలాడ, ద్రాచులు పడగలెత్తి
భూషలయి మేన బుసకొట్టి, ఘోషలిడుచు

- అని చిత్రించాడు.

ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్య వేదమ్మాళ్ మనోవ్యాధిగ్రస్తురాలైన కారణంగా ఆయన వేదన అంది, జీవిత చరమాంకంలో ఒక రకమైన నిర్లిప్త జీవితం గడిపాడు. తాగుడుకు అలవాటు పడ్డాడు. సుందరాచారి 1977 ఏప్రిల్ 8న తిరుపతి, గంగుండ్ర మండపం వీధిలో నివాసముంటున్న ఇంట్లో మరణించాడు.

2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి పట్టణం తిరుచానూరు రోడ్డులోని అన్నపూర్ణేశ్వరి సర్కిల్ల సుందరా చారి జ్ఞాపకార్థం, ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పింది తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన పట్ల కృతజ్ఞతా సూచకంగా విగ్రహం దగ్గర ధ్వనివర్షకం ద్వారా నిరంతరం మా తెలుగు తల్లికీ పాట నిరంతరంగా ధ్వనించే ఏర్పాటు చేసింది.

**సాహితీ వ్యాసంగం :**

శంకరంబాడి సుందరాచారి గొప్ప కవి. పద్య కవిత్వం ఆయనకు ప్రీతిపాత్రమైన కవితా ప్రక్రియ. పద్యాలలోనూ తేటగీతి ఆయన ఎంతో ఇష్టపడ్డ ఛందస్సు. తేటగీతిలో ఎన్నో పద్యాలు వ్రాశాడు. "నా పేరు కూడా (శంకరంబాడి సుందరాచారి) తేటగీతిలో ఇమిడింది. అందుకనే నాకది బాగా ఇష్టం" అనేవాడు ఆయన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతమైన మా తెలుగుతల్లికి.. కూడా తేటగీతిల రాసిందే. ఈ పద్యం ఆయన రచనలలో మణిపూస వంటిది. రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని రమ్యంగా వర్ణించిన నాలుగు పద్యాలు అవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది.

మహాత్మా గాంధీ హత్య జరిగినపుడు ఆవేదన చెంది, 'బలిదానం' అనే కావ్యం రాశాడు. ఆ పద్యాలను పాఠశాలలో పిల్లలకు ఆయనే చదివి వినిపించాడట. ఆ పద్యాలలోని కరుణ రసానికి పిల్లలు రోదించారని ప్రముఖ రచయిత పులికంటి కృష్ణారెడ్డి అంటుండేవాడు.

సుందర రామాయణం అనే పేరుతో రామాయణం రచించాడు. అలాగే సుందర భారతం కూడా రాశాడు. తిరుపతి వెంకటేశ్వర స్వామి పేరు మకుటంగా శ్రీనివాస శతకం రచించాడు. ఇవే కాక జపమాల, బుద్ధగీతి అనే పేరుతో బుద్ధ చరిత్ర కూడా రాశాడు.

రవీంద్రుని గీతాంజలిని అనువదించాడు. మూలం లోని భావాన్ని మాత్రమే తీసుకుని, భావం చెడకుండా, ఏకలవ్యుడు అనే ఖండకావ్యం, కెరటాలు అనే గ్రంథం కూడా రచించాడు. సుందర సుధా బిందువులు అనే పేరుతో భావ గీతాలు వ్రాశాడు. జానపద గీతాలు వ్రాశాడు. స్థల పురాణ రచనలు చేశాడు. ఇవేకాక అపవాదు

పేదకవి, నా స్వామి, నేటి కవిత్వము, బలిదానము, కార్వేటి నగరరాజ నీరాజనము మొదలైనవి వీరి ఇతర రచనలు.

సినిమాలకు కూడా పాటలు రాశాడు. మహాత్మగాంధీ, బిల్హణీయం, దీనబంధు అనే సినిమాలకు పాటలు రాశాడు. దీనబంధు సినిమాలో నటించాడు కూడా. సుందరాచారి "మా తెలుగు తల్లికి" గీతాన్ని 1942లో దీనబంధు సినిమా కోసం రచించాడు. కానీ ఆ చిత్ర నిర్మాతకు యుగళగీతంగా - వాడానికి నచ్చకపోవటం వల్ల ఆ సినిమాలో చేర్చలేదు. టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం ఆ పాటను మధురంగా పాడిన తరువాతనే ఆ గీతానికి గుర్తింపు లభించింది.

ఒకసారి ఢిల్లీ వెళ్లి అక్కడ నెహ్రూని కలిశాడు. తాను రచించిన బుద్ధ చరిత్రలోని ఒక పద్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించి ఆయనకు వినిపించాడు. నెహ్రూ ముగ్ధుడై ఆయన్ను మెచ్చుకుని 500 రూపాయలు బహూకరించాడు.

**ఇతర కవుల అభిప్రాయాలు :**

శంకరంబాడి సుందరాచారి గురించి వివిధ కవులు ఇలా పేర్కొన్నారు.

**స్వర్గీయ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి -** "మృదువైన పదములు, మధురమైన శైలి, మంచి కల్పన కలిగి వీరి కవిత్వము ఆనందము నాపాదించకలిగి ఉంది."

**కీ.శే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ -** "తెలుగు పలుకు, కవితాశక్తి, సౌకుమార్యము, ఈ మూడు గుణములు మూటగట్టి వీరు పొత్తములను రచించు చున్నట్లున్నది. ఈ యుగములో వీరిదొక ప్రత్యేక వాఙ్మయముగా ఏర్పాటు కాబోవుచున్నట్లున్నది. వీరిశైలి సంస్కృత సమాసములనుండి, మారుమూల పదముల నుండి విడివడి సరళమైనది.

**శ్రీగడియారం వేంకటశేషశాస్త్రి -** "ఈతని శైలి మిక్కిలి సరళమైనది. భాష సుగమమైనది. ధార సహజమైనది. పోకడ్తలు, ఎత్తుగడలు, అలంకారములు, చమత్కారములు, మున్నగు ప్రసాధనములన్నియు సమచిత సన్నివేశములే భావశ్రుతిలో మేళవించినవి.

శ్రీరాయప్రోలు సుబ్బారావు గారి మాటలలో - "సుందరాచారి గారి సూక్తి ఎంత తేటగా సూటిగా విన బడుతుందో అంత స్ఫురితంగా సుదూరంగా ధ్వనిస్తుంది. ఇది ఈ కవి రచనలలోని అనన్య విశిష్టత".

**శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ -** "తేటగీతుల తెలుగు తీదిపిరుచుల యూట.. కొంకుల కొసరుల కాటుపడక సారతమరమిది సుందరాచారి కవిత".

ఒక పద్యం ఇలా ఉంటుంది సుందరాచారి - వీకీపీడియా

హరులు, తరులును, గిరులను, దరువులొకట
వెంట బడిమూగ, నడుగులు, పిడుగులగుచు
నిడిన చోట్లల్ల గోతులు వడుచునుండ
నచటి కరుదెంచి వికటాట్టహాసముగను - అంటూ

తేటతెనుగు తనము పుణికిపుచ్చుకుని ఎదుటపడిన సుందరాచారి తాటకిని చూసి రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ ముక్కున వేలు వేసుకున్నాడు.

**బిరుదులు :**

శంకరంబాడి సుందరాచారిని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము ప్రసన్న కవి అని గౌరవించింది. ఆయనను భావకవి అనీ, అహంభావ కవి అనీ కూడా అనేవారు. సుందరకవి అన్నది ఆయన మరోపేరు.

డా॥. కె.రెడ్డప్ప, డా॥. ఎం. నరసింహులు, డా॥. ఎన్. శ్రీమన్నారాయణ, డా॥. ఎం. దేవరాజుల సహాయ సహకారాలతో డా॥. డి. మస్తానమ్మ అధ్యక్షురాలిగా శంకరంబాడి సుందరాచారి చేసిన సేవలకు గుర్తింపుగా 'శంకరంబాడి సాహిత్య పీఠం" 2012 ప్రాంతంలో స్థాపించ బడింది. ఈ సంస్థ ద్వారా వివిధ సభలు, సమావేశాలు, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించబడు తున్నాయి.

భాషాభేషజాల జోలికి పోకుండా అలతి అలతి పదాలతో తేటైన తేటగీత తియ్యదనంతో హృద్యంగా, ముగ్ధమనోహరంగా పద్యాలల్లి సీమ కవితా వినువీధిలో విహరించి ప్రసన్నకవిగా, ప్రజాకవిగా, రాష్ట్రకవిగా సాహిత్యలోకంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్న కవికుల తిలకుడు శ్రీ శంకరంబాడి సుందరాచారి.

1975 ఏప్రిల్ 12న హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ గీతికగా టంగుటూరి సూర్యకుమారి లండన్ నుంచి వచ్చి ఆలపించిన “మా తెలుగు తల్లికి మల్లెపూదండ” గీతం శంకరంబాడిని తెలుగు కళామతల్లి మెడలో మల్లెల హారంగా చేసింది. ఒక సినిమా కోసం రూపొంది, దర్శకుని తిరస్కారానికి గురైన ఆ గీతం ఆ తరువాత తెలుగువారికి అత్యంత ప్రియమైపోయి, ప్రతి నిత్యం స్కూలు పిల్లల నోళ్ళపై మారుమ్రోగుతూ ఉంది.

మదనపల్లె దివ్యజ్ఞాన కళాశాలలో ఇంటర్ వరకు చదివిన సుందరాచారి స్వతహాగా సౌందర్యోపాసకుడు. కనుకనే ఆయన చిన్నతనం నుంచే ప్రాచీన నవీన, పాశ్చాత్య కవుల గ్రంథాలను అధ్యయనం చేస్తూ సంస్కరణలపట్ల మక్కువను పెంచుకొని పద్నాలుగేళ్ల వయసులోనే కవితా రచనకు ఉపక్రమించారు. సనాతన సంప్రదాయానికి విరుద్ధంగా జందెం తీసివేసి తండ్రికి ఎదురు తిరిగి ఇంటి నుంచి దూరమై కొంతకాలం రైల్వే కూలీగానూ, మరికొంతకాలం ఒక హోటల్లో పిండిరుబ్బే పనివాడిగానూ జీవితం వెళ్లబుచ్చిన శంకరంబాడి మద్రాసులోని ఆంధ్రపత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేరి సహాయ సంపాదక స్థాయి వరకు ఎదిగారు. మద్రాసులో చిత్తూరు నాగయ్య ప్రోత్సాహంతో అతి తక్కువకాలం సినీ కవిగా కూడా వున్నారు. అయితే ఆ వృత్తి ఆయనకు అచ్చిరాలేదు. అనంతరం చిత్తూరులో ఉపాధ్యాయవృత్తిని చేపట్టారు. ఆ తరువాత స్కూళ్లకు జూనియర్ డిప్యూటీ ఇన్స్పెక్టర్‌గా పనిచేశారు.

ఏడు సంపుటాల ‘సుందర భారతం’, ‘సంగ్రహ వాల్మీకి సుందర రామాయణం’, ‘బుద్ధగీత’, ‘ఏకలవ్యుడు’, ‘అగ్నిపరీక్ష’, ‘గీతాంజలి’ (రవీంద్రుని గీతాంజలికి అనువాదం), ‘సుందర సుధా బిందువుల’, ఫిరదౌసి జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకున్న ‘పేదకవి’, గాంధీజీ, గౌతమ బుద్ధుల జీవితాల్ని జానపద కళారూపమైన బుర్రకథ రూపంలో దృశ్యమానం చేసిన ‘శాంతి దూతలు’ ఇత్యాధి కృతులు 24 వరకు రచించారు. వాటిలో చాలా వరకు సరళమైన తేటగీతి పద్యాలతోనే కూర్చడం వల్ల అవి సాహితీలోకాన్ని అమితంగా ఆకట్టుకున్నాయి. ఆ రోజుల్లో సుందరాచారి తన పుస్తకాలను చేతబట్టుకొని ఊరూరా తిరిగి వాటిని విద్యార్థుల చేత చదివింపజేయడానికి నిరంతరం శ్రమించేవారు. ఆధునిక కవిత్వం పట్ల అంతగా మక్కువ చూపని సుందరాచారి పద్య కవిత్వాన్నే అభిమానించి, ముఖ్యంగా సున్నితంగా పద్యాలు రచించడంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి శైలిని బాగా పుణికిపుచ్చుకున్నారు. అందుకే తన కవిత్వంలో కరుణరసానికి పెద్దపీట వేశారు.

శంకరంబాడి 600 పద్యాలతో భాగవత కథను తీసుకొని రచించిన ‘సుందర నంద నందనము’ వెలుగు చూడలేదు. పోతన భాగవంతోల ఉన్న తత్వం తన కావ్యంలో కనిపించలేదన్న అసంతృప్తితో పోతన మీద వున్న అచంచలమైన భక్తి శ్రద్ధలతో తన కావ్యాన్ని తానే చించి వేసిన సంఘటన సుందరాచారిలోని నిబద్ధతకు ఒక ప్రబలమైన ఉదాహరణగా పేర్కొనవచ్చు.

సుందరాచారి బుద్ధుని జీవిత చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని రచించిన ‘బుద్ధగీత’లో గౌతమ బుద్ధుడు కరుణామూర్తిగా, ప్రేమమూర్తిగా పరివర్తన చెంది నడచి వెళుతున్న సన్నివేశాన్ని ఇలా వర్ణిస్తారు.

‘కలుషమెరుగని పసిలేళ్ల కనులు చూచి, పాపమెరుగని పశువుల పరువుజూచి బారులు దీరిన చీమల దారులరసి, తొక్కకుండగ మెత్తగ త్రోవబట్టి’ - అంటూ మృదు మధురంగా చిత్రించారు.

ఇక్కడ శంకరంబాడి కరుణరసాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. అందుకనే బుద్ధుడు పడగవిప్పిన పాముకు కూడా పాలుపోసి అనునయించాడని వర్ణించారు. ‘ఏకలవ్వుడు’ కావ్యంలో ఏకలవ్యుడు తన గురువైన ద్రోణాచార్యులని ఆజ్ఞ మేరకు బొటనవ్రేలే కోసి ఇచ్చిన సన్నివేశంలో ఆ బొటన వ్రేలి నుంచి జారిపడిన రక్తపు మరకల దృశ్యాన్ని గురించి -

‘మన్ను తడిపిన నెత్తుటి మరకలచట మంచికెంపులుగా
వెలిగి మండలేడగి’.

అని వర్ణించి ఏకలవ్యుడి ఔన్నత్యాన్ని స్ఫురింపజేశారు.

ఏకలవ్యుని రక్తపు బొట్లు కెంపులుగా ప్రకాశించాయని చక్కని ఉపమానంతో పోల్చి చెప్పాడు. 1914 ఆగష్టు 10న జన్మించిన శంకరంబాడి 1980 జూన్ 6న తిరుపతిలో స్వర్గస్థులయ్యారు.

**ముగింపు :**

హేతువాదిగా, ఆత్మాభిమానిగా, ఆత్మవిశ్వాసిగా, పండుతునిగా, ఉత్తమ కవిగా, నిరాడంబరుడిగా ఖ్యాతి గాంచిన కవీశ్వరుడు శంకరంబాడి సుందరాచారి. బాల్యం నుంచి అనేక సమస్యలు ఎదుర్కొన్నా తలవంచకుండా జీవించిన ధీశాలి సుందరాచారి. ఆ మహనీయుని జీవితం నేటి పిల్లలకు ఆదర్శంగా నిలిచి సన్మార్గంలో పయనింప జేస్తుందని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర - సం॥. డా॥. ఎస్. రామచంద్ర.
2. శంకరంబాడి సుందరాచారి - ఆముదాల మురళి.
3. తెలుగు సాహిత్య సమీక్ష - రెండో సంపుటం - ఆచార్య జి. నాగయ్య.
4. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి.
5. శంకరంబాడి సుందరాచారి రచనలు.


★★★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# రావి నూతల ప్రేమ కిషోర్ వచన కవిత్వం – చైతన్య దృక్పథం



– చెరుకూరి వేణు
పరిశోధకులు, ఆచార్య ఎస్. చిన్న రెడ్డయ్య, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

**ప్రవేశిక :**

రావినూతల ప్రేమ కిషోర్ వృత్తి రీత్యా ప్రభుత్వ విద్యా శాఖలో ఉద్యోగి. ప్రవృత్తి రీత్యా కవి, నాటకకర్త, నవలా కారుడు, విమర్శకుడు, పరిశోధకుడు. ఈయన సమాజాన్ని నిశితంగా పరిశీలించి అందులోని మంచి చెడులను తర్కించుకుంటాడు. అలా ప్రజలు చెడును తొలగించుకొని మంచి వైపు నడుచుటకు వచన కవిత్వాన్ని ఆయుధంగా చేసికున్నాడు. సామాజిక స్పృహతో చక్కని కవితలు రాశాడు. అందులో వివిధ సామాజికాంశా లున్నాయి. వాటిలో కొన్నింటిని పేర్కొని ఈ వ్యాసంలో విశ్లేషించడం జరిగింది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో రూపుదాల్చిన సాహితీ ప్రక్రియ వచన కవిత్వం. ఇది పద్యానికి కొనసాగింపుగా అవతరించిందని చెప్పవచ్చు. దీనిని వచన పద్యం అని కూడా అంటారు. ఆధునిక సాహిత్యంలో ఇది విశేష ఆదరణను పొందింది. వచన కవుల సంఖ్య కూడా విశేషంగా పెరిగింది. ఈ క్రమంలోనే ప్రతి పత్రిక వచన కవితలను ప్రచురిస్తున్నది.

ఒక అంశాన్ని సమగ్రంగా సులభ శైలిలో వ్యక్తం చేయడానికి వచన కవిత్వం చక్కగా దోహద పడుతుంది. ఈ అంశాన్ని గుర్తించిన యువ కవి రావినూతల ప్రేమ కిషోర్ సమకాలీన ప్రజల సమస్యలను వచన కవితల్లో చిత్రించాడు. వాటిలో కొన్నింటిని ఈ వ్యాసంలో విశ్లేషించడం జరిగింది.

**మాదిగ పల్లె :**

మన దేశంలో అందులోనూ ముఖ్యంగా ఆంధ్ర దేశంలో మాదిగ పల్లెలు ప్రత్యేకంగా ఉంటాయి. అవి ఇతర సామాజిక వర్గాల ప్రజలకు దూరంగా ఉంటాయి. ఈ మాదిగ పల్లెలో వేరే సామాజిక వర్గం ప్రజలు నివసించరు. వీరితో మరో సామాజిక వర్గమైన మాలలూ కలవరు. మాల మాదిగలు ఇరు వర్గాల వారూ దళితులే. ఈక్రమంలో చూసినపుడు మాదిగ పల్లెలు ఒంటరిగా ఉన్నాయంటాడు కవి రావినూతల ప్రేమ కిషోర్. ఒంటరిగా ఉండమంటే పేదరికంతో దుర్భర జీవనం గడపడమని అర్థం. ఈ అంశాన్ని కవి ఈ కింది కవితలో ఇలా తెలిపాడు.

"ఒక్కసారి అటు చూడు -
జాతి జాతంతా
ఎలా దిగులు పడిందో...
మాదిగ పల్లె
ఒంటరిగా రోదిస్తోంది
ఏడ్చి ఏడ్చి

కంటి కొలకుల్లో
కనీసం నీటి బొట్టురాలని
విధ్వంసక దృశ్యం''
- (గుండె దరువు - దళిత దీర్ఘ కావ్యం - పు : 3)

అంటాడు కవి. మంచి పోషకాహారం, ఉన్నత విద్య, మంచి వసతులు, మంచి గృహాలు లేక ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల ప్రజలు ఏడుస్తున్నారంటాడు కవి రావినూతల ప్రేమ కిషోర్. ఈ దృక్కోణంతో సమాజాన్ని చూసినపుడు కవి ఆవేదనలో వాస్తవముందని తెలుస్తుంది.

అంతేగాకుండా మాదిగలు వారి సామాజిక వర్గమైన మాలలతో పోటీ పడలేక అన్ని రంగాల్లో వెనుకబడి ఉంటున్నారు. వారు రెండు, మూడు దశాబ్దాలకు ముందు మేల్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు ఐదు దశాబ్దాల కాలం అన్ని సామాజిక వర్గాల వారి వద్ద ఊడిగం చేసి దుర్భరమైన జీవితాన్ని గడిపారు. అందువల్లె వాళ్ళు ఇటీవల చైతన్యవంతులయ్యారు. తాము పురోగతి వైపు నడవాలనుకుంటున్నారు. అందుకు కొన్ని అడ్డంకులున్నాయి. వాటిని తొలగించుకొనుటకు ఏర్పడినదే' మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి'. దీని రూపకర్త తెలంగాణ రాష్ట్రానికి చెందిన మంద కృష్ణ మాదిగ. అతడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించి మాదిగల్లో చైతన్యం తెచ్చాడు. ఆ ఉద్యమం ద్వారా మాదిగల్లో ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానం విశేషంగా పెరిగాయి. తమ హక్కులు అడుగుతున్నారు. తమ జాతి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం వైపు దూసుకుపోతున్నారు.

**గద్దర్‌పై పోలీసుల కాల్పులు :**

గద్దర్ తెలంగాణ ప్రాంతానికి చెందిన విప్లవ గాయకుడు. పీపుల్స్ వార్ - పార్టీలో చేరి అజ్ఞాత వాసం గడిపాడు. దాదాపు మూడు దశాబ్దాలు దేశమంతా తిరిగి తన ఆట పాటతో ప్రజల్లో చైతన్యం తెచ్చాడు. అతని పాటకు ఆటకు ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉర్రూతలూగాయి. అలాంటి గాయకుడు, పోరాట యోధుడు 2003లో జరిగిన చర్చల సందర్భంగా చట్టబద్ధంగా బయటకు వచ్చాడు. ఆ తరువాత అడవిలోకి వెళ్ళ లేదు. ఈ క్రమంలో తే॥ 10-04-1997 లో ఆయన ఇంటిలోనే సాయంత్రం వేళ గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి నింపాదిగా వెళ్ళారు. ఆ కాల్పులు జరిపింది పోలీసులని సమాజం గట్టిగా నమ్మింది. అయినా ఆయన ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. వైద్యులు ఐదు బుల్లెట్లు బయటకు తీశారు కానీ ఒక్క బుల్లెట్ తీయలేకపోయారు. చివరి వరకు అది అతని వెన్నుముకలోనే ఉండిపోయింది. ఈ అంశాన్ని కవి రావినూతల ప్రేమ కిషోర్ ఇలా తెలిపాడు.

''పాట మీద తూటా
నెత్తుటి మడుగులో జనం పాట
------------------
------------------
మరణాన్ని గెల్చిన వీరుడతడు
అతని పాటే
తూటా అయినప్పుడు
------------
పాట గాయ పడిందని ఆట ఆగిపోదు
--------------
పాటంటే చైతన్యం
చైతన్యం ముందు ఖాకీలెంత
కాకి రెట్టంత.....
--------------
అ పాట సజీవం
ఆ ఆట అజేయం'' - అంటాడు కవి.
(నలుగురమవుదాం-సజీవం - పు : 4)

ఈ ఘటనను కవి ఇలా విశ్లేషించాడు.

- గద్దర్ మరణాన్ని గెల్చిన వీరుడు
- అతని పాటే ఒక తూటా
- పాట గాయపడిందని గానం ఆగిపోదు
- గజ్జకు రక్తం అంటుకుందని ఆట ఆగిపోదు.
- పీడిత గొంతుకలన్నీ ఒక్కటై కోరస్ ఇచ్చాయి
- చైతన్యం ముందు ఖాకీలు కాకి రెట్టంత

■ గద్దర్ పాట సజీవం, అజేయం.

అయితే గద్దర్ పోలీస్ తూటాలకు అదర లేదు. బెదరలేదు. ఇంకా రెట్టించిన ఉత్సాహంతో ఆట ఆడాడు, పాట పాడాడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఊరూరా తిరిగి అలాయ్ - బలాయ్ కార్య క్రమంలో పాల్గొన్నాడు. 'అలాయ్-బలాయ్' ద్వారా తెలంగాణ ప్రజలను ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వైపు ఆబాలగోపాలం వెళ్ళడానికి దోహదపడిన మహాగాయకుడు గద్దర్. ఆ ప్రజాకవి, కళా కారుడు 6 ఆగష్టు 2023లో హైదరాబాదులో చని పోయాడు.

**ఎన్‌కౌంటర్లు :-**

దోపిడీ లేని, కుల మతాలు లేని, సర్వ సమానత్వం కలిగిన సామ్యవాద సమాజం కావాలని మావోయిస్టులు గత 1968నుంచి ప్రజా యుద్ధ పంథాలో సాయుధ పోరాటం చేశారు, చేస్తున్నారు. పెట్టుబడి దారులు, భూస్వాముల రాజ్యం వారిని అణచి వేయడానికి నిత్యం కృషి చేస్తున్నది. ఇప్పటికే దాదాపు పది వేల మందిని కాల్చి చంపిందని అంటున్నారు. ఇప్పుడు ఈ 'ఆపరేషన్ కగార్' పేరుతో 30 వేల మంది సైన్యం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం లోని అంబూబ్‌మద్, దండకారణ్యం, మహా రాష్ట్రలోని గడ్చిరోలి వంటి ప్రాంతాలను జల్లెడ పడుతున్నది. జనవరి 2025 నుంచి ఇప్పటి వరకు దాదాపు వెయ్యి మందిని సైన్యం కాల్చి చంపింది. వారిలో అగ్రనాయకుల మొదలు మిలీషియా సభ్యుల వరకు ఉన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న త్యాగశీలురను పట్టుకొని పిట్టల్ని కాల్చినట్టు కాల్చి వేస్తున్నారని ప్రజా సంఘాల వారంటున్నారు. అయితే మార్చి 2026 నాటికి ఒక్క మావోయిస్ట్ కూడా లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం శపథం చేస్తున్నది. ఈ అంశాన్ని గర్హిస్తూ కవి రావినూతల ప్రేమ కిషోర్ ఇలా అంటాడు.

ఖాకీ + ఖద్దరు - రాజ్యం
ఖద్దరు + ఖాకీ - రాజ్యం
లెక్కలు కరెక్టే .....
ఈ ఇద్దరే రాజ్యమైన చోట
ఎన్ కౌంటర్లలో పేలిన
కపాలాల లెక్కే తేలడం లేదు
అమరుల ఆనవాళ్ళు తెలియక
అడవి తల్లి తల్లడిల్లుతోంది
బలి పెట్టిన ఖాకీకి తెలుసు
అరణ్య మెంత ఆక్రోశిస్తుందో...
చంపించిన ఖద్దరుకి తెలుసు
వీరుని అమరత్వం నిలువెంతో
----------------
-----------------
నేడు దేశ మొక శవాల దిబ్బ
ఖాకీ ఖద్దర్లే కాటేసిన రాబందులు" - అంటూ

పోలీసులు, రాజ్యం కలిసి చేస్తున్న ఎన్‌కౌంటర్లను కవి గర్హించాడు. మావోయిస్టులు నిస్వార్థ పరులు. వారికి సొంత ఆస్తులు లేవు. ఆభరణాలు లేవు. సకాలానికి తిండి ఉండదు. క్షణక్షణం అభద్రతతో జీవిస్తుంటారు. అయినా చావంటే భయం లేదు. దోపిడీ లేని సమ సమాజ స్థాపనకు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు. దట్టమైన అడవుల్లో ఉంటున్నారు. భవ బంధాలకు అస్కారం ఇవ్వరు.

**ముగింపు :**

ఇలా రావి నూతల ప్రేమ కిషోర్‌గారు సమాజంలోని సమస్యలను ఉద్యమాలను తన వచనకవితల్లో చిత్రిం చాడు. అదేవిధంగా ఎన్‌కౌంటర్ల గురించి, గద్దర్ గురించి సామాజిక దృక్కోణంతో అద్భుతమైన కవితలు రాశాడు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు - ప్రయోగాలు - ఆచార్య సి. నారాయణ రెడ్డి
2. ముద్ర - వనితల కవితలు - సం॥ శీలా సుభద్రాదేవి, భార్గవీరావు.
3. రాయలసీమ సాహిత్యం - శశిశ్రీ.
4. గజ్జల మల్లారెడ్డి గేయాలు - మల్లారెడ్డి
5. సీమ సాంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర - సం॥ డా॥ ఎన్. రామచంద్ర.
6. మహా ప్రస్థానం - శ్రీశ్రీ


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# డా॥. ముదిగొండ శివప్రసాద్ ‘ఆవాహన’ నవల–ఒక అవలోకనం



- చీరబోయిన తిరుపతి

తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు.

**ఉపోద్ఘాతం :**

సంప్రదాయం కాదొక తమాషా
అది సదా నిలిచే వుంటుంది హమేషా

- ఆరుద్ర

చరిత్ర అంటే మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కళలు, ప్రజల జీవన విధానం మొదలైన అనేక అంశాలను తెలియచెప్పేది. ఆ క్రమంలో ఆచరిత్ర వర్తమానానికి, భవిష్యత్‌కు ఉపయోగపడేలా వుండే రచనలే ఉత్తమ రచనలు. ఆలాంటి ఉత్తమ రచనలలో ముదిగొండ శివ ప్రసాద్ ‘ఆవాహన’ నవల ఒకటి. ఆ నవలలో కాకత్రీయుల కాలంలో జరిగిన ఒక అద్భుతమైన ప్రేమకథ, శిల్పనైపుణ్యం చిత్రలేఖనం, ఊహలు, అపోహలు మత సామరస్య, మత ద్వేషానికి సంబంధించిన సంగతులు, ప్రజల జీవన విధానం, కాకతీయుల ప్రజా పరిపాలన, సంస్కరణలు వర్ణించ బడినాయి. వాటిని అవలోకనం చేయడమే నా ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

**కాకతీయుల క్లుప్త పరిచయం :**

కాకతీయ రాజులు క్రీ.శ. 12వ శతాబ్దం నుండి 14వ శతాబ్దం వరకు నేటి తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలను పాలించారు. మొదట చాళుక్యులకు సామంతులుగా వుండి తర్వాత స్వరాజ్యాన్ని స్థాపించారు. హన్మకొండ నుండి ఓరుగల్లుకు (వరంగల్)కు రాజధానిని మార్చారు. పోలరాజు-2 కాకతీయ రాజ్యాన్ని స్వతంత్ర రాజ్యంగా స్థాపించినవాడు. తర్వాత రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసి, పరిపాలనలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టాడు. హన్మకొండలో వేయి స్తంభాల గుడిని ప్రారంభించాడు. ఇది కాకతీయ వాస్తు శిల్పానికి ప్రతీక. తర్వాత రాజుల్లో ముఖ్యమైనవాడు గణపతిదేవుడు. కాకతీయ సామ్రాజ్యంలో అత్యంత శక్తి మంతుడైన పాలకుడు ఇతను. రాజ్యాన్ని బాగా విస్తరించి, ప్రజలకు సంక్షేపు పథకాలు ప్రవేశపెట్టాడు. వ్యవసాయం, వాణిజ్యాలకు ప్రాధాన్యత నిచ్చి రామప్ప, పాకాల వంటి అనేక చెరువులను నిర్మించాడు. గణపతిదేవుని కుమార్తె అయిన రుద్రమదేవి భారత దేశ చరిత్రలో పేరు గాంచిన మహిళా పాలకులలో ఒకరు. తన పరిపాలనా దక్షతతో, సైనిక నైపుణ్యంతో రాజ్యాన్ని విజయవంతంగా పాలించారు. రుద్రమదేవి కూమార్తెలు, రుయ్యమ్మ, ముమ్మడమ్మ. రుద్రమదేవికి మగ సంతానం లేకపోవడం వల్ల ముమ్మడమ్మ కుమారుడు అయిన ప్రతాపరుద్ర-2 కాకతీయ రాజ్యసింహాసనం అధిష్టించాడు. అయితే

కాకతీయ రాజ్యంలో చివరి పాలకుడు తన రాజ్య పరిరక్షణ కోసం ఢిల్లీ సుల్తానుల దండయాత్రలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. కానీ 1323లో ఓటమి పాలై కాకతీయ సామ్రాజ్యం పతనమైంది.

**నవల ఇతివృత్తం :**

మాధవరావుకి వరంగల్‌లోని హన్మకొండ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయింది. మాధవరావు భార్యపేరు లక్ష్మీ వీరికి ఒక కుమార్తె పేరు ఇందిర. మాధవరావు స్నేహితుడు రామచంద్రరావుకి ఒక ఇల్లు చూడమని ఉత్తరం రాస్తాడు. రామచంద్రరావు హిస్టరి లెక్చరర్. ఇతని భార్యపేరు కాత్యాయనీ. రామచంద్రారావు వీరికి ఒక ఇల్లు చూస్తాడు. మాధవరావు హన్మకొండకు వచ్చి ఆఫీస్‌కు పోయి రిపోర్టు చేస్తాడు. తర్వాత ఒక రోజు మాధవరావు హన్మకొండ చౌరస్తాలోని వేయిస్తంభాల గుడికి వెళ్తాడు. గుడిలోని డిజైన్లు, సన్నటి లతలు చూస్తూ, ఒక శిథిల మండపంలోకి వెళ్తాడు. అక్కడొక నర్తకి బొమ్మను చూస్తూ పరవశించి పోతూ, తాను ఒక రాతి బొమ్మలా చలనం లేకుండా నిలబడిపోయి గతంలోకి వెళ్తాడు. రచయిత కామసాని అనే పాత్ర ద్వారా మాధవరావు గత జన్మవృత్తాంతం చెప్పిస్తాడు. కామసాని ప్రతి పౌర్ణమి రోజు ప్రత్యక్షం అవడం, 15 నిమిషాలు వృత్తాంతం చెప్పడం అదృశ్య మౌవడం జరుగుతుంది.

పాలమూరులో సోమేశ్వరుడు పుట్టగానే తల్లిదండ్రులు చనిపోతారు. మల్యాల గుండయ్య, కుప్పమ్మ ఇతని పెంచుకుంటారు. ఇతడే భళ్ళాల సోమేశ్వరుడు. తర్వాత కాలంలో మల్యాల గుండమ్మ రుద్రమదేవికి దండ నాయకుడౌతాడు. ముదిగొండ అగ్రహారంలో విశ్వేశ్వర మందిర నిర్మాణంలో అతను చెక్కిన లతలను విశ్వంభర శివాచార్యులు వారు చూస్తారు ఒకనాడు. విశ్వేశ్వర శివాచార్యుల వారు సోమేశ్వరున్ని గణపతి దేవుల వారికి పరిచయం చేస్తూ, కాకతీయ సామ్రాజ్యపు దేవాలయ వైభవం కోసం పరమశివుడే ఈ చిన్నవాణ్ని కైలాసం నుండి పంపించాడు అంటాడు. గణపతిదేవుడు సోమేశ్వరున్ని స్వయంగా భూమందిరంలో పద్మాకార శిల్పాల నిర్మాణంలో ప్రవేశపెట్టారు. రుద్రమదేవి స్వయం భూదేవాలయ పూజలకు రుయ్యమ్మ, ముమ్మడమ్మలతో వచ్చారు. వారితో పాటు కామసాని వచ్చింది. ఆమె చామ కాంబ అనే ఆస్థాన నర్తకి కుమార్తె. కామసాని సోమేశ్వరున్ని చూసి, ఏమి చేస్తున్నారు అని అడుగుతుంది. అప్పుడు అతడు భరతాన్ని, అభినయాన్ని శిల్పంగా నాట్యశాస్త్రాన్ని శిలలతో నిక్షిప్తం చేస్తున్నాను అంటాడు.

రుయ్యమ్మను ఇందులూరి అన్నయ్యగారికిచ్చి వివాహం చేయలనుకుంటారు రాజుగారు. ఇది సంభావ్యంకాదని కొన్ని వర్గాలు వ్యతిరేక ప్రచారం మొదలు పెట్టారు. ఎందుకంటే అన్నయ్య బ్రాహ్మణుడు. శివాచార్యుల వారు ఇతనికి వీరశైవ దీక్ష ఇస్తాడు. తన బ్రాహ్మణ కులాన్ని కోల్పోతాడు. కామసానితో సోమేశ్వరుడు కొంత వరకూ ఇది వీరశైవ వివాహం. మరికొంత వరకూ రాజకీయ వివాహం అంటాడు. ఇది ప్రేమ వివాహం అంటే నేను అంగీకరించను అంటాడు. ప్రేమ, పెళ్ళి రెండూ వేరువేరు పదాలు కావు, ఒకటే అంటాడు. "సోమేశ్వరా ఎవరినైనా ప్రేమించావా" అని కామసాని అడిగితే, తాను గిరిజను ప్రేమించాను అంటాడు.

కామసాని అమ్మ ఒకరోజు అక్కలవాడకు పోయి మహురయ్య వద్ద మేనకా విశ్వామిత్రుల చిత్రాన్ని గీయించి, తీసుకొని రమ్మంటుంది. కామసాని అతని వద్ద చిత్రాన్ని తీసుకొని, గిరిజ అనే పిల్ల మీకు తెలుసా అని అడుగుతుంది. అతడు రాతి నుండి వచ్చిన ప్రతి శిల్పం గిరిజయె కదా అని అంటాడు. కామసాని సంతోషించింది. అప్పుడు రుయ్యమ్మ మహురయ్య అంతరంగిక మందిరంలో వున్నది. కామసానిని ఇటుగా రమ్మని పిలుస్తుంది. నేనిక్కడికి రాజకీయ కార్యం మీద వచ్చాను. ప్రస్తుతం నా వివాహం ఆగిపోయింది, అప్పటికి సోమేశ్వరుడు కళ్యాణ మంటపం సిద్ధం చేస్తున్నాడు. రుయ్యమ్మ కామసానితో హన్మకొండ నుండి పారిపోయిన, జైనులు, బౌద్ధులూ, శత్రు రాజ్యంలో చేరి మన పతనానికై ప్రచారం చేస్తున్నారు. మొన్నటికి మొన్న దేవగిరి రాజు పరాజితుడైనాడే కాని పూర్తిగా పరాన్ముకుడు కాలేదు. కాంచీపురపాలకుడు విజయ గండ గోపాలుడు విప్లవం తీసుకొని రావాలని ప్రయత్నిస్తున్నాడు. రుయ్యమ్మ కామసానికి

రెండు బొమ్మలు ఇస్తూ, రెండు దేశాలకు పంపబోతు న్నాము, జూదమాడి శత్రువులను లొంగదీసుకోమని చెప్పడం ఒక బొమ్మలోని భావం, యుద్ధం రాబోతున్నది సిద్ధంగా వుండమని చెప్పడం రెండవ బొమ్మలోని భావం. ఈ చిత్రాలను నీవు ఒకచోటికి చేరవేయాలని అంటుంది.

మరునాడు కామసాని సోమేశ్వరుడిని సంపెంగ తోటలో కలుస్తుంది. తాను ఒక రాజకీయ కార్యం మీద కాంచీపురం పోతున్నాను అంటుంది. ఎందుకు అని అతడు అడిగితే 'రహస్య ప్రయాణం' అంటుంది. "కళలను రాజకీయాలతో ముడిపెట్టడం నాకిష్టం లేదు కామసాని" అని అతడు అంటాడు. కాంచీపురంలోని ఏకామ్రేశ్వరాలయంలో కొత్త నిర్మాణాల కోసం తాను కూడా వస్తున్నాను అంటాడు. అయితే అది కామసానికి రాజకీయ యాత్రకాదు. ప్రేమయాత్ర అనుకుంటుంది. ముచికుందను దాటి, మోటుపల్లి, బెజవాడ మీదుగా పినాకినిలో స్నానం చేసి, శ్రీకాళహస్తి చేరి కాంచీపురం చేరుతారు. చొక్కనాథుడిగా సోమేశ్వరుడు పేరు మార్చుకొని నూతన శిల్ప నిర్మాణం చేస్తాడు. కామసాని కాంచీ రాజును తన నృత్య నాట్యంతో వారిని మైమరిపించి, వారి రాజ్యంలో కలహాలు సృష్టించి, తన రాజ్య కార్యాన్ని పూర్తి చేస్తుంది. అంబదేవుడు సజీవంగా మనుమగండణ్ణి పట్టు కున్నాడు. విజయగండ గోపాలుడు యుద్ధం నుండి పారి పొయ్యాడు. కాంచి కాకతీయుల స్వాధీనమైంది.

సోమేశ్వరుడు, కామసాని అంబదేవున్ని కలిసి వారు వరంగల్లుకు పయనమైనారు. దారిపొడుగునా వారు ఎన్నో ముచ్చట్లు చెప్పుకున్నారు. ఏకశిలలో రుయ్యమ్మ అన్నయ్య లతో పాటే తమ వివాహం జరుపుకోవాలని, ఒక అంద మైన మందిరం నిర్మించి, చాళుక్య, పల్లవ శిల్ప కళా రీతుల్ని, లతలు, పుష్పాలు, పద్మాలు చెక్కాలనీ అను కున్నారు. రాణి గారిని ఒప్పించి గృహస్థ జీవితంలో స్థిర పడాలనీ సోమేశ్వరుడు, కామసానితో అన్నాడు. ఓరుగల్లుకు ముందస్తుగా వర్తమానం అందింది. పూర్ణ కుంభాలతో, వేదమంత్రాలతో వారికి కోటలోకి రాజ లాంఛనాలతో అధికారికమైన స్వాగతోత్సవం నిర్వ హించారు. అంతటితో ఆగకుండా రుద్రమదేవి కామ సానిని ఆస్థాన నర్తకిగా నియమించింది. కామసాని గుండె బరువైంది. సోమేశ్వరున్ని వివాహం చేసుకొని జీవితాన్ని గడుపుదామంటే, తనను ఆస్థాన నర్తకిని చేశారు. వారి విషాద గాథ ప్రారంభమైంది.

రుయ్యమ్మ కళ్యాణ మంటపానికి సోమేశ్వరుడు తుది మెరుగులు దిద్దినాడు. రుయ్యమ్మ, అన్నయ్యల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వచ్చిన వారంతా కళ్యాణ మంటపం నిర్మాణంలోని శిల్ప చాతుర్యాన్ని పొగిడారు. అది విని సోమేశ్వరుడు ఎంతో సంతోష పడ్డాడు. కామసాని తన తల్లి చామ కాంబతో ఆస్థాన పదవి తనకు వద్దనీ సోమేశ్వరుడితో తన ప్రేమ విషయం చెప్పుతుంది. కాంచీపుర విజయయాత్ర తర్వాత మేము బాలా త్రిపుర సుందరి సమక్షంలో మానసికంగా వివాహం చేసు కున్నాము అని చెప్పుతుంది. తన తల్లి రాణి గారితో మాట్లాడి వివాహం చేస్తానని అన్నది. ఈ లోగా రాజు గారు సోమేశ్వరుడికి కొన్ని ఆజ్ఞలు ఇస్తారు. అందులో మందడలో గోళకీ మఠ నిర్మాణం, వేయి స్తంభాల గుడిని పూర్తి చేయాలని వుంది. ఈ విషయం అతడు కామసానికి చెప్పుతాడు. "మంచిదే వివాహమైనాక నేనూ నీతో మందడ వస్తాను. నేను అభినయం చేస్తూ వుంటాను. మా భంగిమలను నీవు చెక్కు" అని కామసాని సోమేశ్వ రుడితో అంటుంది.

కామసానికి చెప్పకుండానే మందడకు అతడు వెళ్ళి పోతాడు. కామసాని బోరున ఏడ్చింది. తన కోసం ఎదురు చూస్తూ, దినాలు గడిచాయి, వారాలు, నెలలు దొర్లాయి. ముమ్మడమ్మకు కొడుకు పుట్టాడు. నామకరణ వేడుక నృత్యానికై కబురు వచ్చింది. ఉత్సవానికి సోమేశ్వరుడు రాలేదు ఎందుకని రుద్రమదేవి రుయ్యమ్మను అడిగింది. అతన్ని నిర్మాణ కార్యక్రమం నుండి భంగం చేయడం నాకు ఇష్టం లేదు అని రుయ్మమ్మ చెప్పింది. రాణితో రుయ్యమ్మ కామసాని వివాహం ఆపింది తానేనని ఏమి చేయను నా ఆదర్శం వేరు అన్నది. ఇది విని కామసాని దుఃఖించింది. కామసానికి మనోవ్యాధి పట్టుకుంది. అన్నం, నీరు, హితవు తప్పిపోయాయి. చివరికి తన ఆస్థాన నర్తకి పదవి పోయింది. కామసాని ఇల్లు మోహరివాడకు

మార్చబడింది. ఒకరోజు రుయ్యమ్మ కామసాని ఇంటికి వచ్చి, సోమేశ్వరుడు దైవాంశ సంభూతుడు, కారణ జన్ముడు. లలిత కళలన్నింటిలోకి కవిత్వం ఎక్కువ కాలం నిలుస్తుంది. తర్వాత నిల్చేది శిల్పం మిగిలినవి చిత్ర లేఖనం, సంగీతం, అభినయం మూడు శాశ్వతాలు కావు. సోమేశ్వరుడు అమరుడు కావాలి. కాకతీయ శిల్పం చిరస్థాయిగా చరిత్రలో మిగిలిపోవాలి. ఇందు కోసం తాను ఒక జంటకు తీరని బాధను గురి చేశాను అన్నది. కామసాని దుఃఖించింది.

మండడలో గోళకీమఠ నిర్మాణం కొంత ముగిసింది. పద్మాక్షి మందిరం పక్కకున్న దిగంబర జైన విగ్రహాలను, వీరభద్ర విగ్రహాలుగా మార్చాలని రుద్రమదేవి సోమేశ్వ రుని పిలిచినట్లు కామసానికి తెలిసింది. గుడి వద్ద కామ సాని సోమేశ్వరుడిని చూసి దుఃఖించి రుయ్యమ్మను తిట్టుకుంది. అప్పుడు అతడు "దేవీ రుయ్యమ్మ కోరిక వెనుక ఒక ఉదాత్త ఆశయం వుంది. మన ప్రేమ జీవితం వల్ల మరో చిన్న సోమేశ్వరుడు పుడతాడు. కానీ ఆ బంధా లలో పడి కొట్టుకుంటాము. కానీ శిల్పాలకు తండ్రిని కావాలని రుయ్యమ్మ కోరిక. "దేవి నేను యశోధర చిత్రాన్ని వేయిస్తంభాల గుడిలో చిత్రిస్తాను" అని సోమేశ్వరుడు అన్నాడు. కామసాని వీరశైవం అధికార మతంగా వునా రాజ్యంలో బౌద్ధమత శిల్పమా అని, యశోధర పేర తన మూర్తిని వేయిస్తంభాల గుడిలో చెక్కుతున్నాడని ఆమె గ్రహించింది. పద్మాక్షి శిల్పాలు పూర్తి చేసి తిరిగి మండడకు అతడు వెళ్ళిపోయ్యాడు.

ఒకనాడు చామకాంబ కామసానితో మండడలో శిల్పాలు పూర్తి అయినాయి. కానీ రుయ్యమ్మ ఆశించిన ఫలితం మాత్రం తలకిందులైంది అని అన్నది. వారి ఇద్దరినీ వేరు చేసి కళా తపస్సులుగా చేద్దామని ఆమె సంకల్పం కానీ, రుయ్యమ్మ కోరిక తీరలేదు. కామసాని రోగిష్టిదైనది. సోమేశ్వరుడు అన్యమనస్కుడై శిలల మీద ధ్యానం నిలుపలేదు.

తర్వాత రచయిత నవలను వర్తమానంలోకి నడిపాడు. జ్వాలాపతి లింగ శాస్త్రి తన దివ్యదృష్టితో చూసి, కామసాని సోమేశ్వరుడిని అమరుణ్ణి చేయడం కోసం తనను తాను ఆత్మ సమర్పణ చేసుకుంది. అతని శిల్పంలో తనని ప్రాణ ప్రతిష్ట చేయండి అని శివాచార్యుల వారిని సోమేశ్వరుడు అర్థిస్తాడు. శివాచార్యులవారు శాస్త్ర సమ్మతంగా కామ సానిని జీవసమాకర్షణ చేసి ఆ శిలలో ప్రతిష్టాపన చేశాడు. పూజలోనో మంత్రంలోనో లోపం వల్ల పూర్ణిమనాడు 15 నిమిషాలు మాత్రమే కామసాని మాధవరావుతో మాట్లాడు తుంది. కామసాని స్మరణలో పడి పిచ్చివాడై పోయి తనువు చాలించి వుంటాడు అని శాస్త్రి గారు అర్థం చేసుకుంటారు.

మాధవరావు ద్వారా రామచంద్రరావు చరిత్ర పరిశీ లించే క్రమంలో నిమగ్నమైనట్లు డా. ముదిగొండ శివ ప్రసాద్ ముగిస్తాడు.

**విషయ విశ్లేషణ :**

రచయిత డా॥ ముదిగొండ శివప్రసాద్ సోమేశ్వరుడు, కామసాని పాత్రల ద్వారా కాకతీయుల కాలం నాటి శిల్ప సంపద, నైపుణ్యం, చిత్రలేఖనం, నృత్యనాట్య గురించి నాటి సామాజిక పరిస్థితులు, మత విషయాలు, రాజకీయ వ్యవహారాలు తెలియజేయడం జరిగింది.

సోమేశ్వరుడు అనే పాత్ర ద్వారా కాకతీయుల శిల్ప సౌందర్యం రూపుదిద్దుకుందాని, తాను గొప్ప శిల్ప కారుడిగా, శిల్పలు చెక్కడమే తనవృత్తిగా జీవితం గడిపి నప్పటికి సోమేశ్వరుడికి కొంత వరకు రాజకీయ పరిజ్ఞానం వున్న వ్యక్తిగా మనకు తెలుస్తుంది. "ఇది కేవలం ప్రేమ వివాహమని నేను అంగీకరించను. కొంతవరకూ వీరశైవ వివాహం. మరికొంత వరకు రాజకీయ వివాహం"(పుట: 79) అని సోమేశ్వరుడు అంటాడు. వివాహ సంబంధాల ద్వారా రాజకీయ బాంధవ్యాలను పెంపొదించుకోవడం ఒక వ్యూహం. దీని ద్వారా రాజ్యాన్ని సుస్థిరం, విస్తీర్ణం చేయడం మరియు వీరశైవ ప్రభావం ఆరోజుల్లో రాజు లలో, ప్రజలలో ఎక్కువగా వుందని చెప్పవచ్చు. అలాగే ఆలయాల ద్వారా, కళల ద్వారా ప్రజలలో సమైక్యతను సాధించడం కూడా చూడవచ్చు. సోమేశ్వరుడు, వీరశైవ మత ప్రభావం, రాజకీయ వ్యవహారాలను అవగతం చేసు కున్నాడు. భారతాన్ని, అభినయాన్ని శిల్పం కింద మార్చడం, నాట్యశాస్త్రాన్ని శిలలో నిక్షిప్తం చేయడం, భవిష్యత్ తరాలకు నాటి కళలను అందించడం

అంటాడు. ప్రేమ, పెళ్ళి రెండు వేరు వేరు కావు. మనస్సూ, బుద్ధి, ఆత్మ ఎప్పుడు మనం మరోకరిలో లీనం చేస్తామో అదే ప్రేమ అంటాడు.

"కళలను రాజకీయాలతో ముడిపెట్టడం నాకిష్టం లేదు" (పుట: 89) రాజకీయాలలో కళాకారులను పావులుగా వాడకూడదు. ఏ రాజ్యానికో, ఏ రాజుకో కళాకారులు తమ కళలను పరిమితం చేయకూడదని, కళాకారుడు విశ్వకళాకారుడిగా వుండాలంటాడు సోమేశ్వరుడు. "ఒక్కొక్క సామ్రాజ్యానికి ఒక్కొక్కరాజు, రాణి. ఆ రాణికో కూతురు. ఆ కూతురు పెళ్ళి, ఆపెళ్ళికి మనం మంటపాలు చెక్కడం ఏమిటిదంతా? ఆ రాణీ, ఆమె పెళ్ళి ఏమీ మిగలవు. మనం చెక్కిన మంటపాలు మాత్రం మిగులుతాయి చరిత్రలో" అంటే రాజులు, రాణులు మరణిస్తారు, కానీ కళాకారులు కట్టిన కట్టడాలు మాత్రం చరిత్రలో నిలిచివుంటాయి. దేశం కోసం నాది భారతీయ దృష్టి, విశ్వజనీయ దృష్టి అని సోమేశ్వరుడు గూఢాచారిగా మారి కాంచీపురంలో శిల్పాలు నిర్మిస్తాడు. అతడు అఖిల భారత క్షేమాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని, ఒక మతానికి కట్టుబడకుండా శైవమైనా, బౌద్ధమైనా సరే అది పూర్తిగా దేశ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వుండాలి అంటాడు. తన శిల్ప వృత్తి కోసం తన ప్రేమను, జీవితాన్ని త్యాగము చేసి, చరిత్రలో నిల్చిపొయ్యాడు.

"రాజు మరణించె నొక తార రాలిపోయే
కవి మరణించే ఒక తార గగన మెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు" (పిరదౌసి కావ్యం) అన్న మహాకవి జాషువా మాటలు సోమేశ్వరుడికి అతికినట్లుగా సరిపోతుంది.

సోమేశ్వరుడిని ప్రేమించి, జీవితం మీద ఏన్నో ఆశలను పెట్టుకున్న కామసాని రుయ్యమ్మ ఉదాత్త ఆశయం కోసం తన ప్రేమను త్యాగం చేసి, చరిత్రలో నిల్చిపోయిన ప్రేమమూర్తి, ప్రేమకై తపించి, ప్రేమికుని కోసం శతాబ్దాల కాలం వేచి చూసిన అమర ప్రేమికురాలు కామసాని. కామసాని కథ చదువుతుంటే కన్నుల్లో నీరు రాకమానదు.

శిల్పకళ, నాట్యకళ యుగయుగాల వరకు నిలిచి వుండాలని, కాకతీయ కళావైభవం తరతరాలుగా నిలిచి వుండాలని రుయ్యమ్మ ఆశయం, ఆమె ముందు చూపు మనకు కనబడుతుంది. కాకతీయుల చరిత్ర, చరిత్రలో నిలిచిపోవాలని రుయ్యమ్మ సోమేశ్వరుడిని, కామసానిని ప్రేమ నుండి దూరం చేస్తుంది. కానీ ఆమె ఆశయం పూర్తిగా పూర్తి కాలేదు. మహురయ్యగొప్ప చిత్రకారుడిగా తన బొమ్మలతో సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ, బొమ్మలతో సంకేతాలు పంపించే చాతుర్యం తనలో వుందని తెలుస్తుంది. ఆరోజులో కాకతీయులు చిత్రకారులను కూడా ఆదరించడం తెలుస్తుంది. కాకతీయులు జైనులు, బౌద్ధ మతాలను వ్యతిరేకించినట్లు, కనబడినప్పటికి అన్ని మతాలను ఆధరించారు. ఇక కథా కాలానికి వస్తే రామచంద్రరావు చరిత్రలో అంతుచిక్కని ప్రశ్నలకు మాధవరావు ద్వారా కామసాని నుంచి తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తూ మిత్రుని బాధ చూడలేక అనుభవించే సంఘర్షణ, కామసానిని విముక్తిరాలిని చేసే ప్రయత్నంలో స్నేహధర్మం కనిపిస్తుంది. ఇలా ప్రతి పాత్రను తగిన రీతిలో రచయిత మలిచారు. సోమేశ్వరుడు కామసాని ఇతర చారిత్రక పాత్రల ద్వారా చివరి దశ ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తిని పాఠకులలో రేకెత్తించడం రచయిత రచన శైలికి నిదర్శనం.

**ముగింపు :**

డా॥ ముదిగొండ శివ ప్రసాద్ రచించిన "ఆవాహన" నవల మనలను ఈ నవలలో ప్రధాన పాత్రతోపాటు కాకతీయుల కాలానికి తీసుకెళ్తొంది. కాకతీయు సామ్రాజ్యంలోని కళలు, సంస్కృతి, శిల్పకళానైపుణ్యం, మత పరిస్థితులు ఈ నవలలో ఆవిష్కరించబడినాయి. లోతుగా తరచి చూస్తే కాకతీయులు అవలంబించిన పరమత సహనాన్ని కూడా మనం గమనించవచ్చు. యశోధర చిత్రాన్ని వేయిస్తంభాల గుడిలో సోమేశ్వరుడు చిత్రిస్తాడు. వారు మతాలమధ్య అభేధాన్ని చూస్తారు. ఇంకా ప్రజల జీవనవిధానం, ప్రభువుల పరిపాలన పద్ధతులు ఈ నవలలో చిత్రించబడినాయి. ముదిగొండ శివప్రసాద్ రచించిన ఈ 'ఆవాహన' నవల తెలంగాణ చారిత్రక నవలలకు ఒక మంచి చేకూర్పు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' -ఆరుద్ర-తెలుగు అకాడమి

2. ఆవాహన నవల-డా.ముదిగొండ శివ ప్రసాద్-నవోదయ బుక్ హౌస్

3. శాస్త్రి, ద్వా.నా. తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాదు

4. తెలుగు వైజ్ఞానిక మాస పత్రికలు

★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# డాక్టర్ మన్నవ భాస్కరనాయుడు – స్వేద సూర్యోదయం – పద్య కావ్యం



– ఎరికంబట్ల రాజేష్

పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఆధునిక కాంతి ప్రస్థానమందు కూడ
చీకటి జ్వలించి శ్రమను భస్మించు చుండ...
జాగృత సమైక్య జీవన శ్రమపథాన
ఉజ్వలించాలి స్వేద సూర్యోదయాలు!

అనే పద్యం స్వేద సూర్యోదయం పద్యకావ్యం మొదటి పేజీలో ఉంటుంది. రచయితగా డాక్టర్ మన్నవ భాస్కర నాయుడు గారి ఉద్దేశాన్ని ఈ పద్యం పట్టిస్తుంది. లోపల కథలో ఉండే సారాంశం ఏమిటో ఈ పద్యాన్ని చూస్తే తెలిసిపోతుంది.

ఇందులో 439 పద్యాలు ఉన్నాయి. ఈ కావ్యంలోని విలక్షత ఏమిటంటే పీఠికలు, ముందుమాటలు కూడా కవి భాస్కరోదయమని ఆచార్య చేకూరి రామారావు గారు, ఆధునిక కథా కావ్యమని ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు పేర్కొన్నారు. ఇది మన్నవ సుజనపదం, ఇది మనోజ్ఞక కృతజ్ఞ హిమధామనదం వంటి పేర్లు చూడవచ్చు. ఇక కావ్యంలో కథాంశాన్ని, జీవనామోదం, క్రూరవినోదం, ఉదయపాదం, మేధోన్మాదం, హృదయనాదం, అసుర వేదం, జాగృతి స్వేదం అనే ఏడు అంకాలుగా విభజించారు.

తెలుగు పద్యం పుట్టింది రాయలసీమలో కాకపోవచ్చు గాని, బతికి బట్టకట్టింది అక్కడే. మరీ ముఖ్యంగా ఈ శతాబ్దంలో పద్యప్రాభవం విలసిల్లింది. పద్యం అనేకాధునికావతారాలెత్తిందీ రాయలసీమలోనే. అటు మొన్నటి గడియారం వేంకటశేష శాస్త్రి గారి శివభారతము, దుర్భాక రాజశేఖర శతావధాని గారి రాణా ప్రతాప చరిత్రము అట్లా ఉంచండి. మొన్నటి దువ్వూరి రామిరెడ్డి గారి కావ్యాల వైవిధ్యం చూడండి. రాయలసీమ కడగండ్లను కళ్లకు కట్టించిన నిన్నటి విద్వాన్ విశ్వం గారి పెన్నేటిపాట చూడండి. ఈ సంప్రదాయంలోదో నేటి మన్నవ భాస్కర నాయుడు గారి 'స్వేద సూర్యోదయం' అన్నారు ఆచార్య చేకూరి రామారావు. (స్వేద సూర్యోదయం, పుట 1)

రాయప్రోలు సుబ్బారావు, జాషువా, దువ్వూరి రామిరెడ్డి, విద్వాన్ విశ్వం లాంటివారు. కొత్త కథను కావ్యంలోకి చొప్పించే ప్రయత్నం చేశారు. తమ కాలపు సామాజిక సమస్యలతో కథా కావ్యాలల్లారు. అదిగో ఆ కోవలోదే భాస్కరనాయుడు గారి స్వేద సూర్యోదయం అని కూడా అన్నారు. (స్వేద సూర్యోదయం, పుట 1)

ఇందులో 'మూలపల్లి' అనే గ్రామాన్ని కథా కేంద్రంగా తీసుకొన్నారు. ఈ ఊరి కలిగిన కుటుంబంలో భానుమూర్తి అనే యువకుడు విదేశాలకు వెళ్లి అభ్యుదయ భావాలతో తిరిగివస్తాడు. ఇక్కడ నాగరికత అంటని మూలపల్లిలో

తన అన్న ఈశ్వరయ్య ఆ ఊరి మొతుబరి రైతు. ఒక సంఘటనలో భానుమూర్తి శారద అనే హరిజన యువతిని కలుసుకుంటాడు. భానుమూర్తి అన్న పక్కా భూస్వామి. శారద అనే దళిత యువతిని బలాత్కరించటానికి చేసిన యత్నంలో తమ్ముడి కంటపడతాడు. అంతటితో ఊరు కోక అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్నట్లుగా శారదను, ఆమె తాతను ఊళ్లోనుంచి వెలివేయటానికి పంచాయితీ పెట్టిస్తాడు. ఈ సందర్భంలో భానుమూర్తి నిజాన్ని వెల్లడించి శారదను ఆమె కుటుంబాన్ని రక్షించ డానికి పూనుకున్నాడు. దళితులను ఆ విధంగా చైతన్య వంతులను చేస్తాడు. భర్తపై విసిగిన అన్నపూర్ణ, బాలయ్య అనే మరో ఉద్యోగి భానుమూర్తి ఉద్యమంలో భాగ స్వాములవుతారు. ఇదీ కథ.

ఇందులో మనల్ని మొదటగా రచనలో ఆకర్షించేది ఆధునిక భాషా ప్రయోగం. ఈనాటి పద్యకావ్యాలు నన్నయ తిక్కనల కాలంనాటి భాషలో ఉండక్కరలేదని, ఈనాటి భాషా రూపాలు, నుడికారం యథావిధిగా పద్యాల్లో కెక్కినా బాగుంటాయని ఈ కావ్యం ఇంకోసారి ఋజువు చేసింది.

ప్రాసలో వేసిన ఆధునిక క్రియారూపాలు ఈ పద్యంలో చూడండి.

వైశాఖము వైతరణిగ
చేశాడట తరణి - ధరణి చీలకలగుటన్
చూశాడట - నిప్పులతో
రాశాడట శాసనాలు, రాళ్లు పగులగా,

ఇది కథనంలో చేసిన పని. సంభాషణల్లో ఈ పద్ధతి అతిసహజంగా ఒదిగిపోయింది. అన్నపూర్ణ సంభాషణలో చూడండి.

నిన్న సరే - పగలంతా
వెన్నలగా తిరిగినావు - వేళాపాళా
అన్నది లేదా? - ఈ దిన
మన్నా వదినమ్మ కొరకు ఆగవు కాదా!

అదే సందర్భంలో సంభాషణలో అసంపూర్ణ వాక్యాలను పద్యంలో ఇమిడ్చిన పద్ధతి అపూర్వం.

"అదికాదుర బాబూ, నీ..."
"వదినా ఆలస్యమించ వద్దు, త్వరగ ఇ
చెచ్చదవా? మనింట మెతుకులు
కొదవా, నిలబెట్టుమొక్క కూలే మొక్కన్"

విస్తరణ భయం వల్ల ఎక్కువ ఇవ్వలేకపోతున్నాను గాని కావ్యం చదివేవారు వీటిని గుర్తిస్తూ చదివితే ఎక్కువ కావ్యానందం పొందుతారు అంటారు ఆచార్య చేరా. (స్వేద సూర్యోదయం, పుట 5)

ఒక నవలకు సరిపోయే ఇతివృత్తంతో నాలుగు వందల నలభై (439) పద్యాల కావ్యం రచించారు. యధార్థగాథ కనుక సంఘటనల కల్పనలూ వగైరాలు లేవు. కథనానికే అగ్రతాంబూలం ఇచ్చిన మూలాన వర్ణనాబాహుళ్యం కూడా కనిపించదు. సూటిగా చకచకా కథ నడిచిపోతుంది. ఆదునిక సమాజానికి చెందిన కథ కాబట్టి వీరు ఉప యోగించిన భాషలోనూ ఆదునికత కనిపిస్తోంది.

ఆంగ్ల పదాలను చాలా స్వేచ్ఛగా ఉపయోగించారు. అంతేకాదు ఆధునిక విజ్ఞానశాస్త్ర ఫలాలను హాయిగా పొదుపుకున్నారు.

మీటనొక్కి కంప్యూరు - మింటికెగురు
శాటిలైటును కంట్రోలు చేయగలము.
వేల ఉద్రేకముల కవాటాలు తెగిన
అశ్రవార్థుల నేమాట లాపగలవు (402)

ఇది అచ్చంగా ఇవేల్టి పద్యం. వాక్య విన్యాసంలోనూ ఆధునికత కనిపిస్తుంది. క్రియాపదరహితాలు మెండుగా ఉన్నాయి. వచన కవిత్వం చదివే అలవాటు ఉన్నవారికి ఫర్వాలేదు గానీ ప్రాచీన పద్య కవిత్వంతోనే ఆగిపోయిన వారికి ఈ తరహా వాక్య విన్యాసం చాలా కొత్తగా అని పిస్తుంది. పద ప్రయోగంలో కూడా ఆధునికత తొణికస లాడుతోంది. వ్యావహారిక రూపాలూ సంధులూ వైరి సమాసాలూ పుష్కలంగా తగులుతున్నాయి. గాదెలు నింపే (12) చేరుకోవాలి (20) ఇత్యాదులు అనేకం అంటారు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు. (స్వేద సూర్యోదయం, పుట 11)

కథను అనవసరంగా పొడిగించకపోవడం, చివరన

'మోద కిరణాల పులకించె మూలపల్లి చెమల కొలిమిలో మొలిచిన జీవవల్లి' (439) అనే ముగింపు పాదాలతో కావ్యనామధేయానికి సార్థకత చేకూర్చారు. అత్యాధునిక వస్తువుతో పద్యకావ్య ప్రక్రియకు మరింత పరిపుష్టి కలిగించిన మన్నవ భాస్కర నాయుడు గారిని మనసారా అభినందిస్తున్నారు అని కూడా అన్నారు తన ముందు మాటలో.

ఇది మన్నవ సుజనపదం అన్న శీర్షికలో... సూర్యోదయం, మాతృహృదయం ఎన్నటికీ పాతబడవు. తెలుగు పద్యకవిత్వం.. కూడా! అందుకే ఈ పద్యకావ్యం.

పద్యం ప్రాచీనులదీ, పండితులది మాత్రమే కాదు. రసజ్ఞులైన ప్రజలు  నేటికీ పద్యాన్ని ఆదరిస్తున్నారు. ఆధునికోత్తర శకం ఆరంభమయ్యాక కూడా పద్య కావ్యాలు వస్తున్నాయి. సహృదయులు చదువుతున్నారు. పద్య విద్యా హృద్విమర్శకులు, సద్విమర్శకులు పద్య కవిత్వాన్ని గాఢంగా పరామర్శిస్తున్నారు. పద్యాన్ని ప్యూడలిజానికి అంటగట్టడం అర్థంలేని రిడక్షనిజం - అని చేరా గారు ఈ దశాబ్దంలోనే అన్నట్లు గుర్తు.

చరిత్రకందని మానవుని కరములతో మేళవించిన కంఠం నుంచి ఉత్పాదక మంత్రమై కవిత్వం ఉద్భవించింది. ఈ యంత్రయుగంలో ఎక్కడ చూసినా కవిత్వమే! ఈ కావ్య ఇతివృత్త కుల సమస్య, ప్రేమ సమస్య కాదు, కేవలం శ్రమ సమస్య అంటారు మన్నవ భాస్కర నాయుడు.

రండి - కిటికీలు తెరచి చూడండి - మనసు
తెరలు తొలగించి జీవన దీప్తిలోని
తిమిరకోణాలు చూడండి - చమురెరుగని
ప్రమిదల ప్రమోదములు చూడ రండు. లెండు..

అంటూ రచయిత పాఠక లోకానికి పిలుపునివ్వడం ఫలశ్రుతిగా ఈ కావ్యం పఠితులను అలరిస్తుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. స్వేద సూర్యోదయం - మన్నవ భాస్కర నాయుడు.
2. కవిత్వానుభవము - చేకూరి రామారావు.
3. సాహిత్య శిల్ప సమీక్ష - పింగళి లక్ష్మీకాంతం.
4. తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటము - జి. నాగయ్య.
5. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి.
6. తెలుగు కవితా వికాసం - కడియాల రామ్మోహన్ రాయ్.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వాడ్రేవు చినవీరభద్రుడు పాఠాంతరం కథలో సామాజిక జీవన చిత్రణ



- కొత్తకోట శ్రీనివాసరావు
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రి అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**రచయిత పరిచయం :**

వాడ్రేవు చినవీరభద్రుడు గారు 1962 మార్చి 28వ తేదీన తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) రాజవొమ్మంగి మండలంలో ఒక చిన్న గిరిజన పల్లె 'శరభవరం'లో జన్మించారు. తల్లి దండ్రులు సత్యవతి, విశ్వేశ్వర వెంకట చలపతి.

చినవీరభద్రుడు గారు సాహిత్యలోకంలో మంచి కవిగా, రచయితగా, అనువాదకుడిగా, వక్తగా, విమర్శ కుడిగా, చిత్రకారుడిగా తనదైన ముద్ర వేశారు. సాహిత్య రచనలో కేవలం ఒక ప్రక్రియకు మాత్రమే పరిమితం అవ్వాలన్న ఆలోచన లేకుండా విస్తృతమైన జీవితాను భవాల్ని తన సృజనతో విస్తృతమైన సాహిత్య ప్రక్రియల ద్వారా తెలియజేశారు.

**పాఠాంతరం :**

ఈ కథ మొదటిసారి 2010లో ఆంధ్రజ్యోతిలో ఆది వారం సంచికలో ప్రచురించబడింది. తరువాత 'కథ 2010' సంకలనంలో ఒక కథగా ప్రచురించబడింది. అటు తరువాత రెండువేలా ఇరవైమూడులో ఎమెస్కో వారు ప్రచురించిన 'వాడ్రేవు చినవీరభద్రుడు కథలు' సంపుటంలో ఓ కథగా ప్రచురించబడింది.

**కథా సంగ్రహం :**

కథలో ముఖ్యపాత్ర ఓ పత్రికకు అధిపతి. పేరొందిన వ్యక్తి నిర్వహణలో ఉన్న ప్రముఖ కళాశాలలో ఇంటర్మీడి యెట్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పత్రికాధిపతికి కొన్ని రోజుల వ్యవధిలో మూడుసార్లు ఫోన్ చేసింది. కారణం వాళ్ళ కాలేజిలో సహాధ్యాయులు కొంతమంది తనను వేధిస్తున్నారని (ఈవ్ టీజింగ్) ఆ విషయాన్ని పత్రికలో ప్రచురించవలసిందిగా కోరుతూ ఫోన్ చేస్తుంది. ఆ విద్యార్థిని చదువుతున్న కాలేజీ నగరంలో పేరొందిన ప్రముఖుడిది అవడం వల్ల పత్రికాధి పతి వెంటనే విద్యార్థిని వేధింపుల విషయాన్ని పత్రికలో ప్రచురించడు. ఈ విషయం గురించి మాట్లాడటానికి విద్యాసంస్థల యజమానిని ఒకసారి వాళ్ళ ఆఫీసుకు రావలసిందిగా కోరతాడు. విద్యాసంస్థల యజమాని తను రాకుండా తన తరపున బంధువైన ఓ యువకుణ్ణి పత్రికాధి పతి దగ్గరికి పంపిస్తాడు. బంధువైన ఆ యువకుడు యు.ఎస్.లో ఇంగ్లీషు సాహిత్యంలో మాస్టర్స్ చేసి, అక్కడే

ఉన్న ఒక ఇంటర్నేషనల్ ఇంగ్లీషు లెర్నింగ్ సైట్ మీద వర్క్ చేస్తుంటాడు.

విద్యానంస్థల యజమాని ఆ యువకుడ్ని ఇండియాకు రప్పించి, తన విద్యా సంస్థలన్నింటికీ మేనేజర్ని చేశాడు. అలా చేయడం వల్ల విద్యాసంస్థల మేనేజర్ హెూదాలో ఆ యువకుడే ఓ రోజు పత్రికాధిపతిని కలుస్తాడు. పత్రికాధిపతి ఆ యువకుడి ఆకారం, ముఖంలో కళ చూసి, ఈ యువకుడ్ని గతంలో ఎక్కడో చూచామేమోనని అనుకుంటాడు. ఆ సమయంలో తన మనసులో కలిగిన భావన గురించి ఆ యువకుడితో ప్రస్తావిస్తే, అలా చూసే అవకాశమే లేదంటాడు. అందుకు తగిన కారనం కూడా చెబుతాడా యువకుడు. ఆ సమయంలో ఇద్దరి మధ్యా ఇంగ్లీషులో షేక్సిపియర్ రాసిన 'హేమ్లెట్' నాటకం గురించి మంచి ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. చర్చానంతరం పత్రికాధిపతి ఆ యువకుడితో గతవారం రోజులుగా ఇంటర్మీడియట్ విద్యార్థిని నుండి వచ్చిన ఫోన్ కాల్స్ గురించి తెలియ జేస్తాడు. విద్యార్థిని ఫోన్ చేసిన విషయాన్ని పత్రికాధిపతి నోటి నుండి విన్న వెంటనే ఆ ఆరోపణలు కుటుంబం మీదనే చేస్తున్నట్లు భావించుకుని బాధపడిపోతాడు. వెంటనే కొంచెం తేరుకొని ఇది 'రెచ్చెడ్', నేనిది భరించ లేకపోతున్నానంటాడు. ఆ విషయాన్ని పరిశీలిస్తానని చెప్పి వెనుదిరుగుతాడు.

యువకుడు పత్రికాధిపతిని కలిసి వెళ్ళిన తరువాత మళ్ళీ కొన్ని రోజుల వ్యవధిలో పత్రికాధిపతికి మరో రెండు ఫోన్ కాల్స్ వస్తాయి. యువకుడైన విద్యాసంస్థలు మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో పత్రికాధిపతి అనుకో కుండా ఓ విద్యానంస్థల అభివృద్ధి విషయంలో యువకుడు వెళ్ళాడని, కొన్ని రోజులలో వస్తాడనీ, పత్రికాధిపతికి విద్యాసంస్థల యజమాని చెబుతాడు. యు.ఎస్. నుంచి వచ్చిన వెంటనే యువకుడు పత్రికాధి పతిని రెండోసారి కలుస్తాడు. పత్రికాధిపతి మళ్ళీ తనకు వచ్చిన ఫోన్ కాల్స్ గురించి చెబుతాడు. సమాధానంగా ఆ యువకుడు వచ్చిన ఫోన్ కాల్స్ గురించి వాళ్ల విద్యాసంస్థల యజమానితోబాటు, ఒకరిద్దరు బోర్డు మెంబర్స్‌తో ప్రస్తావిస్తే అవి కేవలం ఆరోపణలేననీ, వాటి గురించి అంత సీరియస్‌గా పట్టించుకోనవసరం లేదన్నారని జవాబిస్తాడు. ఆ మాటలు విన్న పత్రికాధిపతి మనసులో ఎంతో కోపం పుడుతుంది. ఇద్దరి మధ్యా కొంచెంసేపు వాడీ వేడీ చర్చ జరుగుతుంది ఆ యువకుడు చెప్పిన జవాబులు పత్రికాధిపతిని సంతృప్తి పరచవు. ఇలా ఇద్దరి మధ్యా చర్చలు జరిగి వారంరోజులు తిరక్కముందే పత్రికాధిపతికి ఫోన్లు చేసిన విద్యార్థిని యాసిడ్ దాడికి గురౌతుంది. ఈ విషయంలో స్త్రీ చైతన్య సంఘాలు ఖండించిన విషయాలు టి.విలో చూచిన పత్రికాధిపతి ఈ పాపంలో తన వాటా కూడా ఉందని బాధపడు తుండటంతో కథ ముగుస్తుంది.

**కథా సమీక్ష :**

విద్యాసంస్థలో ముఖ్యంగా ప్రైవేటు యాజమాన్యా లకు సంబంధించిన ఆలా విద్యాసంస్థలలో విద్యార్థినుల పరంగా జరిగే వేధింపుల (ఈవ్ టీజింగ్) గురించిన అంశాన్ని రచయిత ఇతివృత్తంగా గ్రహించి ఈ హృదయ విదారక సామాజిక కథ రచించారు. మన దేశంలో విద్యనందించే విద్యాసంస్థల గురించి పరిశీలిస్తే కె.జి టు పిజి వరకు ఒక పక్క ప్రభుత్వం ఆధ్వర్యలో నడిచే విద్యా సంస్థలు పని చేస్తుంటే మరోపక్క ప్రైవేటు యాజమాన్యాల కింద నడిచే విద్యాసంస్థలు మరియూ ప్రభుత్వ ధన సహాయంతో నడిచే (ఎయిడెడ్) విద్యాసంస్థలున్నాయి. వీటిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థలు సమాజంలో సేవాదృక్పథంతో పని చేస్తుంటే ప్రైవేటు యాజమాన్యాల నిర్వహణలో పనిచేసే విద్యాసంస్థల ధోరణి వ్యాపార దృక్పథంతో పనిచేస్తున్నాయన్న విషయం జగమెరిగిన సత్యం.

మరో గమనించదగ్గ అంశమేమిటంటే మన దేశంలో చాలామంది ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల వాళ్ళు సమాజంలో గొప్ప వ్యక్తులుగా పరిగణింబడడమే కాకుండా, స్థానిక రాజకీయ నాయకులతో సత్సం బంధాలు కలిగి వుంటారు. విద్యాసంస్థల యాజమాన్యాలు తమ సంస్థల అభివృద్ధి విషయంలో రాజకీయ నాయకుల సహాయ సహకారాలు అందుతుంటే, రాజకీయ

నాయకులకు ఎన్నికల సమయంలో విద్యాసంస్థల యజమానుల నుండి ఎన్నికల ఖర్చుల నిమిత్తం చందాల రూపంలో ఆర్థిక సహకారం అందించబడుతుంది. ఈ కథలో కనిపించే విద్యాసంస్థల యజమాని సమాజంలో బాగా పరపతి, పలుకుబడుతున్న వ్యక్తి. ఆయన ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యాభ్యాసానికి సంబంధించని పాఠశాలలో బాటు పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులుండే ఉన్నత విద్యా సంస్థలు కూడా ఉన్నాయి.

కథా కథనానికి సంబంధించిన ప్రస్తుత చర్చ నీయాంశం పైన పేర్కొన్న విద్యాలయాల నిర్వాహకుడికి సంబంధించిన జూనియర్ కాలేజీలో రెండో సంవత్సరం ఇంటర్మీడియెట్ చదువుతున్న ఓ విద్యార్థిని తరగతి గదిలో ఒకే కోర్సులోనున్న (మగ) సహ విద్యార్థుల నుంచి ఎదుర్కొంటున్న వేధింపుల సమస్య గురించి, సాధారణంగా ఏ విద్యార్థిని అయినా తరగతి గదిలో ఎవరైనా విద్యార్థి వేధిస్తే ఆ విద్యార్థులకు పాఠాలు బోధించే అధ్యాపకుల దృష్టికి తీసుకొని వస్తారు. ఇక్కడ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని (పేరు లేదు) తన వేధింపుల విషయం పాఠ్యాంశాలు బోధించే అధ్యాపకు లకు చెప్పినా పట్టించుకోలేదు.

సాధారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలలో 'ఈవ్‌టీజింగ్' వారీగా జరుగుతున్నా 'ర్యాగింగ్'లు జరుగుతున్నా ఆ విషయాన్ని బయటకు రానివ్వరు అలాగని వాటిని కంట్రోల్ చెయ్యడంలో ఏదైనా తేడా వస్తే వాళ్ళ విద్యాసంస్థల పేరు ప్రఖ్యాతులకు, ఆర్థిక వ్యవహారాలకు ఏ విధంగానైనా నష్టం వాటిల్ల వచ్చునే భయం వల్ల, అందువల్ల ఇక్కడ ఇంటర్మీడియట్ విద్యార్థిని విషయంలో కాలేజ్ యాజమాన్యం పట్టించుకోకపోయే సరికి ఆ విద్యార్థిని సరాసరిగా ఓ పత్రికాధిపతికి ఫోన్లో తన వేధింపుల విషయం చెప్పి, దానిని పత్రికలో వార్తగా ప్రచురించవలసిందిగా కోరుకుంటుంది. అయితే సదరు విద్యార్థిని చెప్పిన విషయాన్ని వెంటనే పత్రికలో ప్రచురించ లేదు. కారణం పేరొందిన విద్యాసంస్థలకు, వాటిని నిర్వహించే యాజమాన్యాలకు కానీ ఏదో రూపంలో నష్టం కలుగవచ్చు లేద ఆ యాజమాన్యాలు పలుకబడి, పరపతి గలవాళ్ళు కాబట్టి, అలాంటి వాళ్ళ వల్ల పత్రికా యజమానికి బెదిరింపులు రావడానికి అవకాశముంది. అయితే పత్రికాధిపతి వయా మీడియాగా (అంటే విద్యార్థిని ఎదుర్కొంటున్న వేధింపుల సమస్యకు పరిష్కారం ఒకపక్క, మరోపక్క విద్యాసంస్థల యాజమాన్యానికి పత్రిక ద్వారా ఎలాంటి కష్టనష్టాలు వాటిల్ల కూడదన్నా ఉద్దేశంతో) ఆ విద్యా సంస్థల యజమానికి కబురు పెడతాడు.

ఈ సందర్భంగా గమనించదగ్గ అంశం వేధింపులకు గురవుతున్న విద్యార్థిని చాలా తెలివిగానూ, ముందు చూపుతోనూ వ్యవహరించి తన సమస్య గురించి పత్రికాధి పతికి తెలియజెయ్యడం, అలా చెయ్యడంలో ఆ విద్యార్థిని ఉద్దేశం వేధింపుల విషయం పత్రిక ద్వారా సమాజానికి తెలిస్తే కాలేజీ యాజమాన్యం అలాగైనా వేధింపుల నివారణకు తగిన శ్రద్ధ కనబరుస్తుందేమోనన్న అభి ప్రాయం. ఎందుకంటే నేడు మన సమాజంలో కొన్ని పేరొందిన విద్యాసంస్థల యాజమాన్యాలు తమ విద్యా సంస్థలలో జరిగే వేధింపుల వ్యవహారాలు కానీ, ర్యాగింగ్ విషయాలు కానీ బయటకు పొక్కనివ్వరు. అదీకాకుండా ఎలాంటి పత్రికైనా ప్రైవేట్ యాజమాన్యాల విద్యా సంస్థలలో జరిగే పై తరహా అంశాల్ని తమ పత్రికలలో ప్రచురించడానికి సాహసించరనే చెప్పవచ్చు. నిజానికి పత్రిక యొక్క గొప్పదనం, పత్రికవల్ల సమాజానికి జరిగే ఎన్నో రకాలుగా విలువైన ప్రయోజనాల్ని దృష్టిలో ఎంచుకొనే ప్రసిద్ధ పాత్రికేయులు నార్ల వేంకటేశ్వరరావు పత్రిక గురించి వెలిబుచ్చిన విలువైన అభిప్రాయాలు ఇలా వున్నాయి. నార్ల వారు పత్రిక యొక్క గొప్పదనం గురించి రాసిన 'పత్రికొక్కటున్న' కవితలో "ప్రజల పక్షాన నిలబడి వారిని సరియైన దారిలో నడిపించడం పత్రికల ప్రధాన కర్తవ్యం. ప్రజల పక్షాన లేని పత్రిక అది పత్రిక కానేరదు. ఒక పత్రిక పదివేల సైన్యంతో సమానం. ఒక పత్రిక ఒక కోటి మిత్రులతో సమానం. పత్రిక లేకుంటే ప్రజలకు రక్షణ ఎక్కడిది. పత్రిక నియంత పక్కలో బల్లెం లాంటిది. ప్రజలకు అండదండలు ఇస్తుంది పత్రిక. పత్రిక లేకపోతే ప్రభుత్వం వక్రమార్గంలో నడిచే ప్రమాదం ఉంది" అని

ఆ కవిత తాత్పర్యం. పత్రిక యొక్క బాధ్యతలు కానీ, ప్రయోజనాలు కానీ పైన చెప్పిన రీతిలో ఉండాలి. కాని నేడు చాలా వరకు పెద్ద పెద్ద పత్రికలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏదో ఓ రాజకీయ పార్టీని సపోర్ట్ చేస్తుంటాయి. దానివల్ల వార్తల ప్రచురణలో పత్రికల విశ్వసనీయత అనుమానించదగిందిగా తయారయింది. అందువల్ల ఇవాళ పత్రికల ప్రయోజనం సమాజం ఆశించినంతగా లేదని చెప్పవచ్చు. ఏదైనా ప్రమాదం కాని విషయమైతేనే తప్ప తమ పత్రికకు, తనకు ప్రమాదం ఎదురు కావచ్చు అన్న అంశాల గురించి వాస్తవాల్ని పత్రికలు ప్రచురించలేకపోతున్నాయని చెప్పవచ్చు.

పైన పేర్కొన్న ప్రకారంగా చూస్తే కథాకథనంలో పేర్కొన్న పత్రికాధిపతి వేధింపులకు గురైన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థిని ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారాన్ని పత్రికలో ప్రచురించడానికి ముందుకు రాలేదు. కరెక్టా? కాదా? అని చెక్ చేసుకొన్న తరువాతనే ప్రచురించడానికి ముందుకొస్తారు పాత్రికేయులు. కథలో పత్రికాధిపతి వయా మీడియాగా చేసిన ప్రయత్నం వృధా అయిపోయింది. పత్రికాధిపతి సంబంధిత యాజమాన్యాన్ని తన కార్యాలయానికి పిలిపించుకొని విసయం చెప్పినా ఆ విద్యాసంస్థల కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఆ వేధింపుల విషయాన్ని చాలా తేలికగా తీసుకొన్నారు. ఫలితంగా ఆ విద్యార్థిని ఈసారి వేధింపులకు గురిచేసిన వాళ్ళ చేతిలో ఘోరమైన ప్రమాదానికి గురయింది. భయంకరమైన యాసిడ్ దాడికి గురైంది. నేటి సమాజంలో ఇప్పటికీ ఈ తరహా దాడులు అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకొంటున్నా ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాలలో చిత్తశుద్ధి పత్రికలలో రాజకీయ లేదా పానా పార్టీల పట్ల పక్షపాతం లేనిరోజున యదార్థ విషయాలు ముఖ్యంగా ఇలాంటి వేధింపులు, ర్యాగింగ్ విషయాలు ప్రచురించబడతాయని చెప్పవచ్చు.

కథా రచయిత వాడ్రేపు చినవీరభద్రుడు గారు విద్యాసంస్థలలో విద్యార్థినులపై వేధింపులు అనే అంశాన్ని ఇతివృత్తంగా స్వీకరించి, దానికి ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరుల్ని, విద్యాసంస్థల అభివృద్ధిలో వాళ్ళ స్వార్థాన్ని చేర్చి మంచి సామాజిక చిత్రనాత్మక కథ రచించారు. ఈ కథలో గమనించదగ్గ మరో అంశం విద్యాసంస్థల మేనేజర్ మరియూ పత్రికాధిపతి మధ్య పాశ్చాత్య కవి రచయిత రచించిన "హేమ్లెట్" నాటకం గురించి మంచి రసవత్తర చర్చ జరిగింది. ఆ చర్చ ద్వారా ఆ నాటకం యొక్క గొప్పదనంతోపాటు విమర్శకుల దృష్టిని బట్టి విమర్శ కూడా మారిపోతుందన్న విషయం అర్థమౌతుంది. ఏది ఏమైనా సమకాలీన సమాజంలో దురదృష్టవశాత్తు కొంతమంది విద్యార్థినులు అరుదుగా ఎదుర్కొంటున్న సమస్యని ఇతివృత్తంగా స్వీకరించి ఓ హృదయ విదారకకథ రచించారు. ఈ కథ ద్వారా రచయిత విద్యార్థినుల వేధింపుల పట్ల ప్రైవేట్ విద్యాసంస్థల నిర్లక్ష్యాన్ని, వాళ్ళ వ్యాపార దృక్పథాన్ని సోదాహరణంగా చిత్రించి చూపారు రచయిత. అందువల్ల ఈ కథ కూడా చక్కని సామాజిక స్పృహ గల కథగా పేర్కొనవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. ప్రశ్న భూమి కథా సంకలనం - వాడ్రేపు చినవీరభద్రుడు.
2. కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య.
3. విమర్శిని - ఆచార్య కొలకలూరి ఇనాక్.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# సారంగ కథలు – ముస్లిం స్త్రీ జీవిత చిత్రణ



- భాగం సైదారావు

పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,

ఆంధ్ర విశ్వకళాపరిషత్,

విశాఖపట్టణం.

- ఆచార్య జర్రి అప్పారావు

తెలుగు శాఖ,

ఆంధ్రవిశ్వకళాపరిషత్,

విశాఖపట్టణం.



**వ్యాస సంగ్రహం :**

20వ శతాబ్దంతో పోలిస్తే 21వ శతాబ్దంలో స్త్రీలు అన్ని రంగాలలో ముందంజలో ఉండటం జరుగుతుంది. అంతరిక్షం నుండి అన్ని రంగాలలో, అన్ని వృత్తులలో స్త్రీలు తమదే పైచేయి అన్నట్లుగా ఉంటుంది. అటువంటి ఆధునిక కాలంలో కూడా ముస్లిం సమాజంలో స్త్రీ ఇంకా చీకటి వలయంలో బంధీగా ఉండటం గమనార్హం. వీరు ధరించే దుస్తుల నుండి వారి ఆహారం, విద్య, వృత్తి అంటూ అన్నింటా పురుష పెత్తనం స్త్రీని ఎదగనివ్వడం లేదు. ఇప్పటికినీ స్త్రీని ఒక బానిసగా చూస్తూ ఆమెను, ఆమె ఎదుగుదలను నియంత్రించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ముస్లిం సమాజంలో మహిళలు బురకా మాటున నాలుగు గోడల మధ్య జీవశ్ఛవంలా గడుపుతున్నారు. ఈ పరిస్థితిని ఎంతోమంది ముస్లిం మహిళా రచయిత్రులు, ముస్లిం రచయితలు పేర్కొంటూ సాహిత్య పరంగా ఉద్యమిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ముస్లిం స్త్రీ విద్యకు దూరం అయ్యి, వంటింటి కుందేలుగా, భర్త చేతిలో బానిసగా మారుతున్న వైనాన్ని ఈ వ్యాసంలో పేర్కొంటున్నారు. ముస్లిం సమాజంలో స్త్రీల యొక్క జీవిత చిత్రణ మరియు స్త్రీ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు సంబంధించి సారంగ అంతర్జాల పత్రికలోని ఒక కథను పరిచయం చేస్తూ, ముస్లిం స్త్రీ జీవితాన్ని సంపూర్ణంగా తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**కీలక పదాలు :**

డయాస్పోరా, స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వం, అస్థిత్వం, స్త్రీ సాధికారత, అంతర్జాల పత్రిక, మైనారిటీ వాదం, స్త్రీవాదం.

**ఉపోద్ఘాతం :**

సారంగ అనేది అంతర్జాల సాహిత్య పక్ష పత్రిక. ఇది 2013 నుండి నేటి వరకు నిర్విరామంగా వస్తుంది. మొదట్లో వారపత్రికగా వచ్చినప్పటికీ తరువాత 2018 నుండి పక్షపత్రికగా మారింది. దీని వ్యవస్థాపకులు, సంపాదకులు అఫ్సర్, కల్పన రెంటాల మరియు రాజు కారంచేడు. ఈ పత్రిక కథలు, కవిత్వం, కాలమ్స్, సాహిత్య వ్యాసాలు, విమర్శ వ్యాసాలు, పుస్తక సమీక్షలు, పుస్తక పరిచయాలు, రచయితల పరిచయాలు, యాత్ర సాహిత్యం వంటి విభాగాలలో ప్రచురణలు ఇస్తుంది. ఇందులో ప్రధానంగా డయాస్పోరా సాహిత్యంతో పాటు నూతన రచయితల అన్వేషణే ధ్యేయంగా ఈ సారంగ పత్రిక పనిచేస్తుంది. ఈ పత్రికలో ప్రచురించబడిన ముస్లిం స్త్రీ జీవన చిత్రణ గల కథ "పరువు". వ్యాస పరిధిని

దృష్టిలో ఉంచుకుని కేవలం ఒక కథను మాత్రమే గ్రహించడం జరిగింది. ఈ కథను రచించింది హుమయూన్ సంఘీర్. ఈ కథ ప్రథమ పురుషలో రాయబడింది. ఈ కథ సారంగలో 2022 మే 15 సంచికలో ప్రచురించబడింది. ఈ "పరువు కథ" ద్వారా రచయిత ముస్లిం సమాజంలో స్త్రీల జీవిత చిత్రణను మరియు స్త్రీ విద్య, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ చైతన్యం వంటి అంశాలను తెలియజేశారు.

**వివరణ :**

పరువు కథను సంక్షిప్తంగా తెలుసుకున్నట్లయితే యూసుఫ్ సంగీత అనే హిందూ యువతిని పెళ్ళి చేసుకుని ఆమె పేరును మాలన్‌బీగా మార్చి, మతం మార్చి నమాజ్‌లు నేర్పి, ఆమెను ఒక బానిసగా చూడటం జరుగుతుంది. యుసుఫ్ మాలన్‌బీలకు ముగ్గురు పిల్లలు. వారిలో జబీన్ పెద్దమ్మాయి. ఆమె చదువుకుని డాక్టర్ అవ్వాలని ఎంతో ప్రయత్నిస్తుంది. ఆమెను చదువు మాన్పించి ఇంటర్ తరువాత సంబంధం చూసి పెళ్ళి నిశ్చయించగా జబీన్ వెంకటేష్ అనే యువకునితో ప్రేమ వివాహం చేసుకుని తన చదువును కొనసాగిస్తుంది. జబీన్ మతం పేరు కూడా మార్చని వారి సహృదయతని చూసి ఆమెకు వారి పట్ల గౌరవభావం ఏర్పడుతుంది. అమీనమ్మ తన ఇంటికి వచ్చి జబీన్ చేరవలసిన చోటుకే వచ్చి చేరిందని చెప్పగా యూసుఫ్ కోపంతో వెంకటేష్‌ను చంపేస్తాను అని అనగానే కొడుకు చెంప పగులగొట్టి ప్రేమ వివాహం పేరుతో ఇక్కడ యూసుఫ్ జరిపిన తతంగానికి, వెంకటేష్ కుటుంబం యొక్క సహృదయతను రెండింటినీ భేరీజు వేసుకోమని కొడుకుతో గట్టిగా చెపుతుంది. తరువాత యూసుఫ్‌కు గుండెపోటు వస్తే డాక్టర్ జబీన్ వెంకటేష్ వైద్యం చేస్తుంది. యుసుఫ్‌కు తన తప్పు తెలిసొచ్చి తన భార్య పేరును మళ్ళీ సంగీతగా మార్చి, మత స్వేచ్ఛ ఇస్తాడు యూసుఫ్.

సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. కులమత దేశ సరిహద్దులు దాటి కులాంతర, మతాంతర, దేశాంతర వివాహాలు కూడా జరుగుతున్న తరుణంలో ముస్లిం సమాజంలో జరుగుతున్న పరిణామాలను మనం ఈ కథ ద్వారా గమనించవచ్చు. ఈ కథలో ముస్లిం కుటుంబాల్లో స్త్రీల యొక్క పరిస్థితిని రచయిత స్పష్టంగా తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా ముస్లిం సమాజంలో స్త్రీ ఎల్లప్పుడూ తండ్రి, భర్త, కొడుకు చేతుల్లో బంధీగా ఉంటూ తన జీవిత స్వేచ్ఛను కోల్పోవడం జరుగుతుంది. ముఖ్యంగా స్త్రీ తను జీవించే హక్కును కూడా కోల్పోతున్న వైనాన్ని ఈ కథలో చూడవచ్చు. స్త్రీ, స్వేచ్ఛ, స్త్రీ విద్య విషయంలో ప్రపంచంలో సమూలమైన మార్పులు వస్తూనే ఉన్నాయి. అన్ని సమాజాలు, దేశాలు స్త్రీ స్వేచ్ఛను, స్త్రీ విద్యను ప్రోత్సహిస్తున్నాయి. ఇల్లాలే ఇంటికి దీపం అంటూ సభ్య సమాజం స్త్రీ గొప్పతనాన్ని అంగీకరించిన తరునంలో ముస్లిం సమాజం మాత్రం స్త్రీని నాలుగు గోడల మధ్య బంధించాలని నిత్యం ప్రయత్నిస్తూనే ఉంది. స్త్రీకి శత్రువులు బహిర్గతంగా లేరని ముఖ్యంగా తండ్రి, భర్త, కొడుకు రూపంలో ఆమెను నియంత్రిస్తూ నిరంకుశత్వంతో ప్రవర్తిస్తున్నారని తెలుస్తుంది. ముస్లిం సమాజంలో స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ విద్య పూర్తిగా వెనుకబడ్డాయి. స్త్రీని బురఖాకు పరిమతం చేస్తూ యూసుఫ్ మాటలను గమనిస్తే "మన ఆడపిల్లలు బురఖాల్లోనే ఉంటే మంచిది డాక్టరఖ్ అయి ఎవర్ని ఉద్దార్కం జేసేదుంది చెప్పు, అప్పుడుదాక మంచి సంబంధం సూశి ఎత్తిస్తం అటు. మొగోడు, పిల్లలు, సంసారం, ఇంత ఇబాదత... ఆడదాని బతుకుకు ఇంతకన్నా ఏం గావాలె మీ అమ్మ జేస్త లేదా సంసారం" అంటూ తన కూతురు జబీన్‌తో యూసుఫ్ అంటున్న మాటల్ని గమనించినట్లయితే ముస్లిం సమాజంలో స్త్రీలకు కేవలం ప్రాథమిక విద్య మాత్రమే చాలు అనుకునే మనస్తత్వం పురుషుల్లో ఇప్పటికీ పేరుకుని పోవడం గమనించదగిన విషయం. అదే విధంగా ముస్లిం స్త్రీలను పట్టిపీడిస్తున్న మరొక అంశం బురఖా. ఈ బురఖా చిన్న పిల్లల నుండి పండు ముసలి వరకు ధరించాల్సిందే. ఆ బరఖాతో అలా మగ్గిపోవలసిందే కానీ అన్ని త్యజించే సాహసం చేయట్లేదు. ఎండయినా, వానయినా, బడి, పని ప్రదేశం మరే ఇతర ప్రదేశం అయినా వారు బురఖా మాటున ఉండాల్సిందేననే సాంప్రదాయం ముస్లిం సమాజంలో స్త్రీల హక్కులను కాలరాసే ఆచారంగా ఎంతోమంది మైనారిటీ రచయితలు,

రచయిత్రులు సైతం తమ కలం, గళం ద్వారా పోరాటం చేయడం గమనించవచ్చు. ముస్లిం యువతులు పాఠశాలకు వెళ్ళినా పండుగలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నా తమ బురఖాను త్యజించడానికి అవకాశం లేదని యూసుఫ్ తన మాటల్లో తెలియజేశాడు. అదేవిధంగా ముస్లిం సమాజంలో స్త్రీకి పూర్తిగా స్వేచ్ఛ కరువైంది. తను భర్తతోనో, తండ్రితోనూ, కొడుకుతోనూ స్వేచ్ఛగా మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. యూసుఫ్ తన భార్య మాలన్‌బీను, తల్లి అమీనమ్మను, కూతురు జబీన్‌ను కూడా నియంత్రిస్తున్న వైనమే ముస్లిం సమాజంలో స్త్రీ స్వేచ్ఛకు గల పరిమితులకు అద్దం పడుతున్నాయి. పురుషాధిపత్యం ప్రదర్శిస్తూ స్త్రీలను కేవలం వంటింటికి పరిమితం చేస్తూ భర్త, పిల్లల్ని చూసుకోవడమే స్త్రీ జీవిత ధ్యేయంగా యూసుఫ్ పలికిన మాటలు అర్థం చేపుతున్నాయి. ఇంక స్త్రీ విద్య విషయంలో ఇంకా దారుణమైన పరిస్థితులు చోటు చేసుకోవడం జరుగుతుంది. 10వ తరగతి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన జబీన్‌ను యూసుఫ్ ఇంటర్ చదివించడానికి కూడా నిరాకరిస్తూ 'నీకేం తెల్వదమ్మ ఊకో. అది సదివి నన్ను నడిపేదుందా? చేసుకున్న మొగున్ని నడిపేదుందా? ఏమద్దు ఇంట్లోనే ఉండి కుట్టు మిషను నేర్చుకుంటది. రెండేండ్లు అయినంక అటు ఎత్తిస్తే నాకో బరువు దిగిపోతది'' అంటూ యూసుఫ్ స్త్రీ విద్యను గూర్చి అంటున్న మాటలు ప్రపంచ స్త్రీల సాధికారతకే గొడ్డలి పెట్టుగా మారుతున్నాయి. మరీ ముఖ్యంగా స్త్రీని కేవలం ప్రాథమిక విద్యకు పరిమితం చేసేలా ఉన్న ముస్లిం సూత్రాల్లో మార్పులు తీసుకురావాలి. పురుషుల్లో మార్పు రావాలి. ముస్లిం స్త్రీ ఉద్యమించాలి. అప్పుడే ముస్లిం సమాజంలో స్త్రీ విద్య మేలుకుంటుంది. లేదంటే ముస్లిం మహిళ అక్షరానికి దూరం అయ్యే ప్రమాదముంది. ముస్లిం కుటుంబంలో కేవలం ఇంటి పనులు చేసుకుని భర్త పిల్లల్ని చూసుకుంటే చాలా అన్న చందాన స్త్రీని చూడటం జరుగుతుంది. పురుషాధిపత్యం ఎంతలా ప్రభావం చూపుతుందంటే స్త్రీ విద్యను వ్యతిరేకిస్తూ ''ఇష్టమున్నట్టు బతకమని మన దీన్ చెప్తలేదు. అల్లా, రసూల్ సూపిచ్చిన తోవ్వల నడవాలె'' అంటూ మత సూత్రాలను, ఖురాన్‌ను కూడా వక్రీకరించి చెప్తున్న వైనం నేటి సమాజంలో ఉంది. ఏ మత సూత్రాలు అయినా మత గ్రంథాలు అయినా మత పెద్దలు అయినా మనిషిని మానవత్వం గల మనిషిగా బ్రతకమంటున్నాయి. మనిషిని చైతన్యవంతంగా, జ్ఞానవంతంగా బ్రతకమని చెపుతున్నాయి. మనిషి జ్ఞానదీపంలో తనే తన సమాజాన్ని ఉద్ధరించమని చెపుతాయి. కానీ మానవుడు ఆ మత సూత్రాలను సైతం తన స్వార్థం కోసం విపరీత ధోరణిలో వ్యాఖ్యానం చేయడం జరుగుతుంది. మత సూత్రాలు, మత పెద్దల మాటలు వక్రీకరణ జరుగుతున్న విషయాన్ని మనం ఈ మాటల ద్వారా గమనించవచ్చు. అంటే స్త్రీ చదువుకున్నా ఎలాంటి ఉపయోగం లేదని, ఆమె ఎవరో ఒకరి కింద బతకవలసిందే అన్న చందాన యూసుఫ్ మాటలు తెలియజేస్తున్నాయి. అయితే జబీన్‌ను గమనిస్తే ఆమె నాన్నమ్మ సహాయంతో ఇంటర్ కూడా ప్రభుత్వ కళాశాలలో చదువు పూర్తి చేయగానే ఆమెకు ధనవంతుడు, ఎదురు కట్నం ఇస్తున్నారని చెప్పి రెండో పెళ్ళివాడినో, మూడో పెళ్ళివాడినో ఇచ్చి వివాహం ఏర్పాటు చేయడం జరుగుతుంది. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం ఏంటంటే ఆడపిల్ల చదువు, వివాహం విషయంలో సమాజం కొంత వివక్ష చూపుతోంది. మగపిల్లవాడికి ఒక న్యాయం, ఆడపిల్లకు ఒక న్యాయం మన సమాజంలో అమలుపరచడం సమానత్వ సూత్రాలకు గొడ్డలిపెట్టు. మగపిల్లవాడి చదువు కోసం, అతని ఉద్యోగం కోసం కలలు కనే తల్లిదండ్రులు ఆడపిల్ల విషయంలో మాత్రం 10, 12 తరగతుల వరకు చదివించి ఆ తరువాత పెళ్ళి చేయడం జరుగుతుంది. ఇంకా నిజం చెప్పాలంటే లేబర్ రూంలో నుండే ఆడపిల్ల అని తెలియగానే భారం అనే మనోభావన నేటి సమాజంలో బలంగా నాటుకునిపోయింది. ఆడపిల్లలు ఒక వయస్సు రాగానే వివాహం చేయాలని ఆలోచించడంలో ఉండే శ్రద్ధ ఆడపిల్ల చదువు విషయంలో లేకపోవడం ఆలోచించవలసిన విషయం. ఈ పరిస్థితుల్లో పురుషుడు తండ్రిగా, భర్తగా, కొడుకుగా, కూతురు, భార్య, తల్లి మాటలను వినే అవకాశం లేకపోవడం శోచనీయం. ఏమైనా అంటే

"నీకేం తెలీదు" అంటూ మహిళ నోరు నొక్కడం జరుగుతుంది. సమాజంలో ఇప్పటికీ స్త్రీకి వాక్ స్వాతంత్ర్యం లేకపోవడం విచారకరం. అయితే కథలో జబీన్ తాను డాక్టర్ చదవాలనే ధృఢమైన ఆశయానికి తండ్రి అడ్డుకట్ట వేయడంతో తనకు భరోసా ఇచ్చిన వెంకటేష్ అనే హిందూ యువకునితో ప్రేమ వివాహం చేసుకోవడం జరిగింది. అంటే ఇక్కడ స్త్రీ తన జీవితం కోసం, తన సాధికరత కోసం, తన ఆశయం కోసం ప్రేమ వివాహం చేసుకోవడం జరిగింది. అంటే ఇక్కడ స్త్రీ తన జీవితం కోసం, తన సాధికారత కోసం, తన ఆశయం కోసం తన వ్యక్తిత్వం కోసం సాహసం చేసిందనే చెప్పవచ్చు. ఎందుకంటే తండ్రి చదివించడు సరికదా ఒక నడి వయస్సు వ్యక్తితో వివాహం కూడా నిశ్చయం చేసిన తరువాత ఆమె విలువలు కట్టుబాట్లు అంటూ, పరువు ప్రతిష్టలంటూ తన జీవితాన్ని అక్కడితో ముగించుకుని, నాలుగు గోడల మధ్య జీవశ్ఛవంలా జీవించడం కంటే పెద్దలను ఎదిరించిన తన లక్ష్యం కోసం తాను ఇష్టపడ్డ వాడితో వివాహం చేసుకోవడమే ఉత్తమమని రచయిత వాదించారు. అందుకు రచయిత తెలుపుతూ ఆమె వ్యక్తిత్వం, సాధికారణ, స్వేచ్ఛ అన్నీ ఆమె చేతుల్లోనే ఉన్నాయని, హిందూ యువకునితో వివాహం తరువాత తన పేరు కానీ, మతం కానీ మారలేదని రచయిత అమీనమ్మ చేత చెప్పించడం జరిగింది. వెంకటేష్‌తో పాటు వెంకటేష్ తల్లిదండ్రులు కూడా జబీన్ చదువుకు మతస్వేచ్ఛకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలియజేయడం గమనించదగిన విషయం. ఇదే విషయాన్ని రచయిత తెలుపుతూ హిందూ ముస్లిం కుటుబాల్లోని తేడాలను సున్నితంగా వివరించడం జరిగింది. ఎందుకంటే తన కూతురు చదువు కంటే ఆమె వివాహానికి, పరువులే ప్రాధాన్యం ఇచ్చాడు జబీన్ తండ్రి. అందుకు తగ్గట్టుగానే ధనవంతుల సంబంధం అని రెండవ పెళ్లి, పిల్లలు ఉన్నారని తెలిసి కూడా పెళ్ళికి ఒప్పుకోవడం, పెళ్ళి ఖాయం యూసుఫ్ నైజంగా తెలుస్తుంది. ముఖ్యంగా "ఎదురుకట్నం ఇచ్చి నిఖా చేసుకుంటాం. ఇరవై తులాల బంగారం పెళ్ళికి అంగీకరించడం పల్ల స్త్రీ విద్య కంటే స్త్రీ వివాహానికీ, డబ్బుకే ఈ రోజుల్లో ప్రాధాన్యం ఎక్కువగా ఉందనే తెలుస్తుంది. డబ్బు మీద ఉన్న వ్యామోహం ఆడపిల్ల చదువు పట్ల, ఆమె స్వేచ్ఛ పట్ల లేకపోవడం దురదృష్టం. అయితే ఈ విలువైన సంఘటనలు అన్ని కుటుంబాల్లోనూ మనం గమనించవచ్చు.

తమ కూతురు చదువు, భవిష్యత్, సాధికారత కన్నా తమకు డబ్బే ప్రధానమన్న కుటుంబంలో ఉండలేని జబీన్ తన ఆలోచనలకు, లక్ష్యానికి, తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎటువంటి గౌరవం భంగం కలిగించనని మాటిచ్చిన వెంకటేష్‌తో జబీన్ ప్రేమ పెళ్ళి చేసుకోవడం సబబనే చెప్పవచ్చు. అంతేకాదు ఆమెకు అత్తవారింట్లో అన్ని రకాలుగా మద్దతు లభించింది. జబీన్ అత్తవారు అమీనమ్మతో "ఇయాలటి సంది మీ పిల్ల మా పిల్ల. కష్టపడి మీ కోడలను డాక్టర్‌ను జేసినంక గీ బయట ఒర్రేటోళ్ళ పనిజేప్త" అంటూ వెంకటేష్ నాన్న అన్న మాటలు ఎటువంటి వారికైనా గుండె ధైర్యం ఇవ్వక మానవు. మతం వేరు, కులం వేరు అయినా సరే ఒక స్త్రీ ఆలోచనకు, స్త్రీ లక్ష్యానికి, ఆశయానికి ఆ కుటుంబం ఇచ్చిన విలువ వెలలేనిది. సొంత కూతురునే చదివించడం భారంగా, పరువు తక్కువగా భావించిన యూసుఫ్ వంటి వారికి గోపాల్ మాటలు చెంపపెట్టు. స్త్రీ తన వ్యక్తిత్వం కోసం, అస్తిత్వం కోసం, స్థిరత్వం కోసం, తన సాధికారత కోసం ధైర్యంగా ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జమీన్ చర్యలే చెపుతున్నాయి. స్త్రీ తన సాధికారత కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని దానికి భర్త లేదా తండ్రి సహకారం అవసరమని రచయిత తెలియజేశారు. ఇక్కడ తండ్రి సహకారం లేకపోవడంతో జబీన్ తన భర్తను ఎంచుకుని తన సహకారం తీసుకోవడం జరిగింది. జబీన్ కుటుంబాన్ని, సంఘాన్ని ఎదురించి వేసిన అడుగు ఆమెకు మంచి ఫలితాన్ని ఇచ్చింది. కానీ సమాజంలో మాత్రం మార్పు రాకపోవడం గమనించదగిన విషయం. ముస్లిం సమాజంలో ఇప్పటికీ స్త్రీని పరువుగా భావించడం జరుగుతుంది. అందుకే స్త్రీకి అడుగడుగునా ఆంక్షలు, బందిఖానాలు తప్పడం లేదు. మరీముఖ్యంగా ముస్లిం కుటుంబంలో స్త్రీల పట్ల చులకన భావం, నియంతృత్వ

ధోరణి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా మతాంతర వివాహాలు, ప్రేమ పేరుతో మతమార్పిడిలను, స్త్రీని బానిస లెక్క చూస్తున్న వైనాలను రచయిత ఈ కథలో తెలియజేశారు. మనం అమీనమ్మ మాటలను గమనిస్తే "మాలన్‌ను నువ్వు బానిస లెక్క సుశినట్టు నీ బిడ్డను వాడు అట్ల సూస్తలేరు. నువ్వు సంగీతను తెచ్చి మాలన్ బీ అని పేరు మార్సినవు. కల్మ సదివిచ్చినవు. ఖురాన్ ఇస్లాం నమాజ్ అన్నీ నేర్వాల్సిందేనని జద్దు పట్టినవు. అక్కడ నీ బిడ్డ ఊరు, పేరు, మతం ఏదీ మార్చనన్నాడు వెంకీ. పరువును కాపాడుకొనుట అంటే మానత్వం సూపిచ్చుట. ప్రేమను పంచుట" అంటూ అమీనమ్మ వెంకటేష్ ఇంటి స్థితిని యూసుఫ్ ఇంటి స్థితిని బేరీజు వేసిన ఈ సంఘర్షణ మొత్తం హిందూ ముస్లిం సమాజం మధ్య మరియు బలవంతపు మతమార్పిడులను, ముస్లిం సమాజంలో స్త్రీల పరిస్థితిని కూడా అద్దం పడుతుంది. ప్రేమ పేరుతో వివాహం చేసుకుని బలవంతపు మత మార్పిడులు చేసి, పేరు మార్చి ఆమెను బందీగా, బానిసగా చేసుకుంటూ పురుషాధిపత్యం చెలాయిస్తున్న వైనాన్ని ఈ కథలో తెలిపారు. ఇక్కడ ప్రేమకు, అభి మానానికి, బంధాలకు, బంధుత్వాలకు చోటు లేకుండా కేవలం మత మౌఢ్యం దర్శనమిస్తుంది. మతం మత్తులో అయినవారికి కూడా హింసిస్తున్న వైఖరి, కర్కశత్వం యూసుఫ్ వంటివారు చూపుతున్నారు. కానీ ఆ రకమైన వైఖరి, హిందూ సమాజంలో లేదని సహృదయత, సోదరభావం హైందవ సమాజంలో ఉన్నాయనే విషయాన్ని రచయిత ప్రస్తావించారు.

ముఖ్యంగా స్త్రీ విద్య అనే అంశంను గమనిస్తే ముస్లిం కుటుంబాల్లో ఇప్పటికీ స్త్రీ కేవలం కుటుంబ వ్యవహారాలు చూసుకునేందుకు సహాయపడే విద్య ఉంటే చాలు అనుకుంటున్న వైన్యం కనిపిస్తోంది. స్త్రీ తన భర్త, పిల్లల్ని చూసుకుంటే చాలు అంటూ ఆమెను పూర్తిగా నియంత్రిం చడం గమనించవచ్చు. స్త్రీ విద్యను, స్వేచ్ఛను ఏ మాత్రం సహించడం లేదు సరికదా మత సూత్రాలను దుష్ట వ్యాఖ్యానంతో వివరిస్తున్న వైనాలను రచయిత తెలిపారు. స్త్రీ వ్యక్తిత్వం, అస్థిత్వం కేవలం మగాడి చెప్పుచేతల్లో ఉండాలనే వివక్షాపూరితమైన ఆలోచన మొత్తం మహిళా లోకాన్నే విస్తుగొలిపే విషయం. సమాజంలో ఇటువంటి నియంతృత్వ, నిరంకుశత్వ, వివక్షాపూరిత భావజాలం వలన నేటికి స్త్రీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఏనాడైతే స్త్రీ ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా అభివృద్ధి చెంది తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంపూర్ణంగా వినియోగించుకున్నప్పుడే ఈ సమాజం అభివృద్ధి చెందుతుంది. "స్త్రీ ఇంట గెలిచి రచ్చ గెలవాలి" అన్న చందాన ముందుగా కుటుంబంలోని పరిస్థితులను మార్చే ప్రయత్నాలు చేయాలి. అప్పుడే స్త్రీకి కుటుంబం నుండి సంపూర్ణ మద్దతు లభించి కొండంత ఆత్మస్థయిర్యాన్ని పొందుతుంది.

ఏనాడైతే స్త్రీ ఉన్నతమైన ఆలోచనా విధానం, చైతన్య వంతమైన దృక్పథం ఉన్నత లక్ష్యాలు కలిగి ముందుకు సాగటంతో ఆనాడే ఆమె విజయం కూడా ప్రారంభం అవుతుంది. మరీ ముఖ్యంగా స్త్రీ తన సాధికారతను సవాలు చేస్తూ అడుగడుగునా ఆటంకం పరుస్తున్న అవరోధాలను అధిగమించాలి. ముఖ్యంగా పురుషుడు తన ఆధిపత్యం అహంకారంతో భర్త, కొడుకు, తండ్రి రూపంలో స్త్రీని నిత్యం అణగద్రొక్కే ప్రయత్నం చేస్తున్నారు. స్త్రీకి కుటుంబ ఆండదండలు ఉంటే ఎంతటి అసాధ్యాన్ని అయినా సుసాధ్యం చేస్తుందని రచయిత కథలో తెలిపారు. మరీ ముఖ్యంగా కథలో గమనిస్తే స్త్రీకి వాక్ స్వాతంత్ర్యం కరువయ్యింది. స్త్రీ ఏం మాట్లాడినా "నీకేం తేలీదు" అంటూ ఆమె నోటిని నొక్కివేయడం జరుగుతుందని, ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినప్పుడే సాధికారత సాధించినట్లు రచయిత అభిప్రాయపడ్డారు.

**ముగింపు :**

రచయిత హుమాయున్ సంఘీర్ పరువు కథ ద్వారా ముస్లిం కుటుంబాల్లో జరుగుతున్న స్త్రీ నియంతృత్వ నిరంకుశత్వ ధోరణులను తెలియజేశారు. పరువు పేరుతో స్త్రీని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని బందీగా చేస్తున్నారు. పరువు పేరుతో బురఖా మాటున ఉంచుతున్నారు. పరువు పేరుతో విద్యకు, ఉద్యోగానికి దూరం చేసి వంటింటికి

పరిమితం చేస్తున్నారని తెలియజేయడం జరిగింది. ఈ కథలో ముస్లిం మహిళ ఎదుర్కొంటున్న పీడనను మరియు పురుషాధిపత్యపు నీడలో తల్లిగా, భార్యగా, కూతురుగా ఆమె అణచివేయబడుతున్న వైనాన్ని రచయిత ఈ కథలో తెలియజేశారు. మరీ ముఖ్యంగా స్త్రీ తన అస్థిత్వం, వ్యక్తిత్వం, స్థిరత్వం కోసం, సాధికారణ కోసం ముందగుడు వేసి ఉద్యమించాలని, హక్కులను, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను పొందాలని రచయిత అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా స్వేచ్ఛ అనేది ఎవరో ప్రసాదించేది కాదని, దాన్ని సాధించి తీసుకోవాలని జబీన్ జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ తన వివాహం ద్వారా తను తన లక్ష్యం నెరవేర్చుకుని డాక్టర్ అయిన వైనాన్ని రచయిత తెలుపుతూ స్త్రీ సాధికారతను, స్త్రీ చైతన్యాన్ని ఆకాంక్షించారు.

**పాద సూచికలు :**

1. పుట - 2, పరువు, హుమయూన్ సంఘీర్, సారంగ.
2. పుట - 2, పరువు, హుమయూన్ సంఘీర్, సారంగ.
3. పుట - 2, పరువు, హుమయూన్ సంఘీర్, సారంగ.
4. పుట - 4, పరువు, హుమయూన్ సంఘీర్, సారంగ.
5. పుట - 7, పరువు, హుమయూన్ సంఘీర్, సారంగ.
6. పుట - 8, పరువు, హుమయూన్ సంఘీర్, సారంగ.

**ఆధార గ్రంథాలు :**


1. కథానికా స్వరూప స్వభావాలు - డా॥. పోరంకి దక్షిణామూర్తి.
2. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. తెలుగు కవితోద్యమాలు - తెలుగు అకాడమీ - హైదరాబాద్.
4. http:/magazine.saarangabook.com/పరువు/
5. Google కథనాలు


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# సామాజిక అంధకారంలో 'నిప్పు కణిక' ఆచార్య అయిలయ్య



- దండెం రాజశేఖర్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

ఆచార్య బన్న అయిలయ్య ప్రముఖ దళిత సాహితీ వేత్త, పరిశోధకుడు, విమర్శకుడు మరియు తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన వ్యక్తి. ఆయన జీవితంలో మరొక గొప్ప అధ్యాయాన్ని విద్యార్థి ఉద్యమాల నుంచి పదవి బాధ్యతల వరకు కవిత, విమర్శ, పరిశోదన రంగాల్లో తనదైన ప్రకంపనలను నిరంతరం రూపొందించారు.

**జీవితం, విద్యాభ్యాసం :**

బన్న అయిలయ్య తెలంగాణ రాష్ట్రంలోని నర్సం పేటలో పేదకుటుంబంలో జన్మించారు. కూలీ పనులు చేస్తూ ఇంటర్, డిగ్రీ విద్యను పూర్తి చేశారు. అనంతరం ఉన్నత విద్యను పొందుతూ విద్యార్థి ఉద్యమాల ద్వారా విప్లవ రాజకీయాలలో చేరారు. ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో భాషా సాహిత్యంలో దక్షుడుగా మార్చుకున్నారు. అయిలయ్య, మూడున్నర దశాబ్దాలు అక్కడ వ్యాసంగా, అధ్యాపకుడిగా, పరిశోధకునిగా కృషి చేశారు.

విశవిద్యాలయంలో తెలుగు శాఖకు ఆధునిక దృష్టి తెచ్చి సాంఘిక, దళిత, బహుజన ఉద్యమాలకు ఆధారమైన సాహిత్య పాఠ్య ప్రణాళికలను రూపకల్పన చేశారు. వైవిధ్యమైన రచనలు, మంచి పరిశోధన వ్యాసాలతో పాటు పాఠశాల నుంచి ఉన్నత విద్యా సంస్థల వరకు తెలుగు పాఠ్య గ్రంథాల సంపాదకత్వం కూడా అందించారు. ఆయన ప్రిన్సిపాల్, డీన్, తెలుగుశాఖ అధిపతి వంటి పదవులకు రుణపడి ఉన్నారు.

ఈ విధంగా బన్న అయిలయ్య విద్యాభ్యాసం పేద దుస్తుల్లో ఉండి విద్యార్థి ఉద్యమాలతో కూడిన విప్లవ మార్గంపై నడిచి, ఉన్నత విద్య సంపాదించి, నీడ అందిం చిన కాకతీయ విశ్వవిద్యాలయంలో సాహిత్య విద్యను ప్రేరేపించారు.

**ప్రముఖ రచనలు :**

బన్న అయిలయ్య ప్రముఖ రచనలు ఇలా ఉన్నాయి.

**1) దీర్ఘ కవిత :**

నిప్పు కణిక (1998) - ఇది దళిత దీర్ఘకవిత్వం.

**2) కవితా సంకలనాలు, వ్యాసాలు :**

- తెలుగు కవిత అభినవ దృక్పథం
- సవ్వడి
- సాహితీ కిరణాలు
- సాహితీ వాహిని

**3) విమర్శ గ్రంథాలు :**

- తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చైతన్యం

- తెలంగాణ సాహిత్య సంస్థలు
- తెలంగాణ పత్రికలు
- తెలంగాణ కథ - పరామర్శ

**4) పాఠ్య గ్రంథాల సంపాదకత్వం :**

తెలంగాణలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు తెలుగు పాఠ్య గ్రంథాలు సంపాదకుడు

ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పుస్తకానికి సంపాదకత్వం.

అనేక పరిశోధనా వ్యాసాల రచనలు చేశాడు. ఇది ప్రొఫెసర్ బన్న అయిలయ్య గారి సాహిత్య, సాంఘిక, విద్యా ప్రస్థానాల్లో ప్రముఖ రచనలు ఆయన బహుజన ఉద్యమాల సాహిత్యాన్ని తెలుగు భూభాగంలో మరింత బలోపేతం చేసిన రచయితగా గుర్తింపు పొందారు.

**నిప్పుకణిక రచన విశ్లేషణ :**

నిప్పుకణిక అనేది దళిత సాహిత్యంలో ఒక కీలక కవిత్వమని చెప్పవచ్చు. ఈ కవిత్వం ప్రత్యేకంగా సాంఘిక అన్యాయాలకు వ్యతిరేకంగా జ్వాలలు వంటి తీవ్ర అగ్నితో స్పందించే భావాల సమాహారంగా ఉంటుంది. ఇది దళితుల పరిస్థితులు, వివక్ష, అన్యాయం, సామాజిక అవమానాలకు నిజమైన ఆవేదనను వ్యక్తం చేస్తూ సమాజంలో మార్పుకు పిలిచే శక్తివంతమైన పాఠం కలిగిన కవిత్వం.

కవిత్వంలో ప్రొ॥. బన్న అయిలయ్య గారు తమ వ్యక్తిగత జీవిత అనుభవాలను మరియు దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రభవాలను అంతర్గతంగా ఆవిష్కరించారు. ఇది కేవలం ఒక కవిత్వం కాకుండా దళితుల ప్రజల భావోద్వేగాలకు, ఆత్మహుంక్రుతికి ప్రతీకగా నిలుస్తుంది. కవిత్వ శైలి లోపలి భావనతో నిండినది, సామాజిక విప్లవానికి ఒక ఇంధనంగా పనిచేస్తుంది.

ఈ కవిత్వం విప్లవాత్మక భావాలు మరియు మానవత్వానికి సంబంధించిన ఆత్మ పరిశీలనలతో కూడి, దళితుల మార్గదర్శకత్వాన్ని తెలిపే సాహిత్యానికి అద్భుత మైలురాయిగా నిలుస్తుంది.

ప్రొఫెసర్ బన్న అయిలయ్య గారి "నిప్పుకణిక" కవిత్వంలో సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను వివరించి, దళితుల వేదనను సాహిత్య శైలిలో ఎలా చూపిస్తుందో వివరించింది.

**నిప్పుకణిక కవిత్వ నిర్మాణం మరియు పాత్రల విశ్లేషణ :**

"నిప్పుకణిక" కవిత్వం ఒక దళిత జీవితాన్ని, ఆవేదనను, సామాజిక అనాథత్వాన్ని గాఢంగా విరమించిన సాహిత్యకావ్యం. ఇది దళితుల పెదవి పెడుతూ, తమ, వేదన, త్యాగం, హక్కుల కోసమై చేసే పోరాటం ఎగురవేయడంలోముఖ్య ఉద్దేశంతో రూపొందిన కవిత్వ సమాహారం.

కవిత్వ నిర్మాణపరంగా ఇది సన్నివేశాల ద్వారా కవిత్వ శ్రేణులను ఏర్పరచి వ్యక్తిగత సామాజిక నేపథ్యాలలో దళితులక్కడికే వచ్చే వివక్ష అవమానాలు, సమాజంలో వారి తలుపులు మూసుకుపోవడం అవగాహన లోపం, నిరాకరణలను కవిత్వంలో ప్రత్యక్షంగా చూపిస్తుంది. ఈ కవిత్వంలో స్వేచ్ఛా, సమానత్వం కోసం చేసే పోరాట యోధుల జీవితం దృశ్యమానం అవుతుంది.

దళిత జనతకు ప్రతీకల రూపంలో వ్యక్తులు, సంఘాలు, ప్రధాన పాత్రలుగా ఉంటాయి. పాఠకుడి హృదయాల్ని స్పృశిస్తాయి. ఈ కవిత్వంలో దళితుల జీవనం యదార్ధ గాఢంగా, బాధ్యతగా వర్ణించబడింది.

సాంఘిక, రాజకీయ వివక్షలపై ఈ కవిత్వం తీవ్ర విమర్శను ప్రదర్శిస్తుంది. సమాజంలోని సాంప్రదాయ, హిందూ కుల వ్యవస్థ తను కవిత్వంలో మేల్కొలిపింది. ఈ కవిత్వం ఒక మానవత్వ పోరాటంగా, పరిణామం కోసం సంక్లిష్ట భావాలు, సమ్మేళిత భావోద్వేగాలతో, రచయిత ప్రొ॥. బన్న అయిలయ్య మదిలో వెలుగులు నింపింది.

ఇది కేవలం సాహిత్యం కాదు, సమాజ మార్పుకు, చైతన్యానికి పునాది వేసిన మార్గపుట అని చెప్పవచ్చు.

**భాషాశైలి :**

బన్న అయిలయ్య గారి "నిప్పుకణిక" కవిత్వంలో ఉపయోగించిన భాషాశైలి చాలా ప్రత్యేకమైనది. ఆ

కవిత్వం సాధారణ భాషా స్థాయికి అత్యంత భిన్నంగా ఉంటుంది. ఇది ఉద్వేగభరితమైన, ఆత్మీయతతో కూడిన శైలిలో ఉంటుంది.

కవిత్వంలో ఉపయోగించిన పదజాలం చాలా ప్రభావవంతంగా, తీవ్ర భావోద్వేగాలను వ్యక్తం చేయ బడ్డాయి.

అనేక సందర్భాల్లో అమానుషమైన పరిస్థితులను దృష్టిలో ఉంచి ఆ వేదన, నిప్పుతో వేడుకునే పదాలను వాడటం వల్ల రచనకి మరింత ఉగ్రత, తీవ్రత వస్తుంది.

శైలిలో సాధారణ సంభాషణల భాష కంటే ముఖ్యమైన సాహిత్య పదజాలం, విస్మయ, ఈశ్వర భావాలను ప్రతిబింబించే భాషలో ఉంది.

వాక్య నిర్మాణం సాధారణంగా ఉంటుంది కాని కొన్ని సార్లు కవిత్వానికి తగిన విధంగా అపస్మారక భావాలతో కూడి ఉంటుంది.

**భాషాశైలి విశ్లేషణ :**

**1. భాషా స్పష్టత మరియు ఉద్వేగపూరిత పదజాలం :**

"నిప్పు" మరియు "కణిక" అనే పదాలను ఉప యోగించి, అగ్నికి సంకేతాలుగా సమాజంలోని అన్యాయాన్ని సూచించారు. ఈ పదజాలం కథకి తీవ్ర భావోద్వేగ ప్రతిబింబన ఇస్తుంది. ఉదాహరణగా "వేడెక్కు తున్న - హృదయాలు", "ఆకుపచ్చ మట్టిలో పొడి మందు" వంటి పదబంధాలు భావాన్ని బలపరుస్తాయి.

**2. సూటి, స్ఫూర్తిదాయ వాక్యాలు :**

సామాజిక వివక్ష, దళితుల వేదన నింపిన అంశాలను సూటిగా, ప్రత్యక్షంగా చెప్పే విధానం.

**ఉదా** : "న్యాయం కోసం వెలగని దీపం ఎప్పుడూ ఆగదని".

**3. ప్రతీకాత్మక రూపకల్పన :**

పాత్రలు ప్రత్యక్షంగా కాకపోయినా, దళితుల సంఘం, వివక్షకులు, పోరాట యోధుల రూపకల్పనలో ప్రతిపదం ఒక సంకేతంగా ఉంటుంది.

**ఉదా** : "ఆవేదన మంటలు" అనేది దళితుల పోరాట దీపంగా ప్రకాశిస్తుంది.

**5. సంగ్రహాత్మక సందేశం :**

కథలో ఉపయోగించిన పద్ధతులు సమాజంలో చైతన్యాన్ని కలిగించడానికి, జ్వాలగా మారే పాఠాలను అందించడానికి ఉంటాయి.

ఈ ఉదాహరణలు "నిప్పుకణిక"లో భాషాశైలి, భావా లను వ్యక్తపరచటంలో, సంకేతాల ద్వారా సాంఘిక సందేశాలను బలవంతంగా ప్రసారం చేయడంలో ఉన్న విశేషాల్ని స్వయంగా చూపిస్తాయి. ఈ విధంగా బన్న అయిలయ్య వారి రచన యదార్థ దళిత జీవితాన్ని ప్రతి బింబిస్తూ సాహిత్యం నుండి సామాజిక మార్పుకు దారి తీస్తుంది.

ఈ భాషా శైలి "నిప్పుకణిక" కవిత్వం దళితుల వేదన పట్ల పాఠకునికి మేల్కొలుపు కలిగించబడుతుంది. ఇది సాధారణ వ్యక్తిగత అనుభూతికి కాకుండా, సమాజానికి, చైతన్యానికి పునాది వేసే రచనగా నిలుస్తుంది. ఈ భావనలు కవి పెదవుల నుండి వచ్చినవి కావు అవి సమాజ అణచివేత, హృదయాంతరాలలో దాగి వున్న, తను అనుభవించిన వేదన నుంచి పుట్టిన "నిప్పుకణికలు". అవి.

**సంకేతాలు :**

కవితలో "నిప్పు" అనేది దళిత వేదనకు సంస్కారంలో ప్రతీక 'నిప్పు' అంటే అగ్ని, అగ్నికణి అంటే చిన్న అగ్ని, దీని ద్వారా సమాజంలోని వీరి వేదనల్ని, వివక్ష వలయా లను ప్రతీకాత్మకంగా సూచించారు.

అగ్ని లేదా "నిప్పుకు" సంబంధించిన వివిధ రూపాల్లో ఎరుపు, వేడి, ప్రావీణ్యం భావాలను సంకేతాలుగా ఉప యోగించారు.

సాంఘిక వివక్ష, దళితుల దుఃఖాలు, వాటి ప్రాతి నిధ్యంగా బాధ్యతాయుత పదాలు, కొన్ని ప్రత్యేక భావా లను తెలియ చేసేందుకు "నిప్పుకణిక" ఒక సంకేతంగా సూచించారు.

కవిత్వంలో కుటుంబం, సమాజ, ఉద్యమం వంటి అంశాలకు ప్రతీకల రూపంలో జటిల భావాలు సంకేతాల రూపంలో ఉంటాయి.

ఈ భాషా శైలి మరియు సంకేతాల కారణంగా

"నిప్పుకణిక" కవిత్వం దళితుల వేదన పట్ల పాఠకునికి మేల్కొలుపు కలిగించబడుతుంది. ఇది సాధారణ వ్యక్తిగత అనుభూతికి కాకుండా సమాజానికి చైతన్యానికి పునాది వేసే రచనగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**


1. సాహిత్యస్ఫూర్తి ఆచార్య బన్న అయిలయ్య, నమస్తే తెలంగాణ.
2. ప్రముఖ సాహితీవేత్త - బన్న అయిలయ్య, వికీపీడియా.
3. మహోజ్వల నిప్పుకణిక ప్రొ॥. బన్న అయిలయ్య, మయూఖ మేగజైన్.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వ్యక్తి సంస్కారాన్ని ఆశించిన చలం కథలు



- బానోత్ అనిల్ కుమార్

తెలుగు సాహితీ చరిత్రలో ‘చలం’ అంత వివాదాస్పద మైన రచయిత మరొకరు లేరు. ఎనిమిది నవలలు, తొంభైకి పైగా కథలు, పది నాటకాలు, ముప్పై ఆరు నాటికలు, స్త్రీ బిడ్డల శిక్షణ, మ్యూజింగ్స్ లాంటి రచనలు, ఎన్నో వ్యాసాలు, అనువాదాలు చలం సాహిత్య సృష్టికి నిదర్శనాలుగా నిలుస్తాయి. చలం రచనలన్నింటికీ ప్రధాన వస్తువు స్త్రీల ఆర్తి.

స్త్రీ పురుషుడికి ఒక యంత్రం. పురుషులకు స్త్రీల జీవితం అంకితం. సృష్టిలో ఉన్న మావులలో సంగంమంది తక్కిన సగం మందికి ఎందుకు ఇట్లా బానిసలు కావాలో లోకం వివరించి చెప్పదు. ఆచారమనే బురదలో కుళ్ళి పోయి మనుషుల హృదయాలలో విచక్షణ నశించిం దంటాడు చలం (డా॥. ఎన్. రామచంద్ర - చలం సాహిత్యం - సామాజిక దృక్పథం - పుట : 3)

చలం కథలలో కామ ప్రాధాన్యత ఎక్కువనీ, స్త్రీ పురుష ప్రధానంగా ఉన్నాయనీ అంటారు. నిజమే, కాకపోతే కామ ప్రసక్తి లేనివి నాలుగో వంతు ఉన్నాయి. ఆనాటి రాజకీయ ఉద్యమాలు, గాంధీ సిద్ధాంతాలు, కొన్ని ఆదర్శాల గురించి వ్యంగ్య విమర్శలు వానిలో ఉన్నాయి. మరికొన్నింటిలో వ్యక్తిగత జీవితాలు, సామాజిక రుగ్మతలు విమర్శ చేయబడినవి. స్త్రీ పురుష సంబంధ కథలలో కూడా సామూహిక అపోహలను పోగొట్టడం కోసం రాసిన “దయ్యాలు”, “దోష గుణం” లాంటివి వున్నవి. ఎక్కువగా స్త్రీ పారతంత్ర్యాన్ని కుటుంబంలోనూ, సమాజంలోనూ పురుష పక్షపాతం వలన కలిగే స్త్రీ విషాదాన్ని చిత్రించినవి ఎక్కువ.

ప్రేమ ఇచ్చే ప్రోత్సాహాన్ని, సహజ ప్రవృత్తికీ, నీతికి వుండే వైరుధ్యాన్ని వివరించే కథలు కొన్ని చలం కథలలో రెచ్చగొట్టేవి వున్నాయి. ఆలోచింపజేసేవి వున్నాయి. ఉత్తేజపరిచేవి ఉన్నాయి. సంస్కరణోన్ముఖులను చేసేవి చాలా వున్నాయి. ఏడ్చి, ఏడ్పించే పాత్రలు, నవ్వి, నవ్వించే పాత్రలు, నవ్వకుండా నవ్వించేవి, వికృత వైరుధ్యంతో వున్నాయి. విశ్లేషణకు అందకుండా స్పష్టా స్పష్టంగా వాక్యాలను అల్లుకుని వుండే మార్మిక్ గుణం ఒకటి వీరి కథనంలో వుంది. (శతజయంతి సాహితీ మూర్తులు - పుట : 68 - సంపాదకులు డా॥. ద్వానా శాస్త్రి)

సాంస్కృతిక పునరజ్జీవం మత సంస్కరణ దృష్టితో ప్రారంభమైంది. మన జాతీయోద్యమంలో కూడా మతం ఒక భాగమై నిలిచింది. అప్పటికీ యూరోపులో ప్రజాతంత్ర ఉద్యమాల దశ అయిపోయింది. వెనుకటి అభ్యు దయాంశను కోల్పోయి ప్రపంచ ధనస్వామ్యం సామ్రాజ్య

వాద దశకు చేరుకుంది. తనకి యాంటీ థీసీస్‌గా శ్రామిక వర్గం రంగంలోకి రావటం దాని గమ్యం ఏమిటో దానికి తెలిసిపోయింది. అందకే అది మతాన్నీ, సైన్సునీ కలిపి తయారు చేసిన వంటకాన్ని అన్ని వలస దేశాల్లోనూ పంచిపెట్టడం ప్రారంభించింది. ప్రపంచ ధనస్వామ్యంలో భాగమైన మన జాతీయ పెట్టుబడిదారీ వర్గం సహజంగానే సామ్రాజ్యవాదంతో సంస్కరణాత్మక రాజీ విధానాన్ని అనుసరించి అవలంభించింది. బ్రహ్మ సమాజం లాంటివి ఉదార భావాలను కొంతవరకు వ్యాప్తి చేశాయి. కానీ, హిందూ పునరుద్ధరణ వాదమే ప్రధానంగా మన జాతి ఉద్యమాన్ని ప్రభావితం చేసింది. బెంగాల్లో విద్యాసాగర్ ఈ మత సంస్కరణ మార్గంలో సాగుతున్న సాంస్కృతిక ఉద్యమాన్ని దారి మళ్ళించగలిగాడు. చరిత్ర, సైన్సు, తర్కం వీటి పునాదిపై మానవతోద్యమాన్ని అభివృద్ధి చేశాడు. ఇది బలహీనంగానే సాగింది.

తెలుగు నెలలో కూడా ఈ సాంస్కృతిక పునరుజ్జీవం మత భావాలను వొదుల్చుకోలేదు. రాజకీయాలు సంఘ సంస్కర్తలకు ప్రధానం కాదు. అందుకే పాలకుల అండ దండలు కూడా లభించాయి. జాతీయోద్యమం రంగ ప్రవేశం చేశాక సంస్కరణోద్యమం వెనుకబడింది. రాజకీయాలు ప్రధానమైనాయి. 'చలం' తాను వీరేశలింగ వారసుణ్ణని చెప్పుకొన్నాడు. ఆ వీరేశలింగం జాతీయోద్యమాన్ని బలపరచలేదు. సంఘసంస్కర్తలు ప్రధానంగా వ్యక్తి సంస్కారాన్ని కోరారు. రాజకీయాలను ముఖ్యమైనవిగా భావించలేదు. చలం కోరింది కూడా సంఘ సంస్కారం కంటే వ్యక్తి సంస్కారమే.

చలం పదే పదే నేను ఏ సంఘ విప్లవాన్ని కోరలేదు. మనుషుల మనస్సులలో మార్పు రావాలనే అనటంలో అర్థం అదే. పరుల ప్రభుత్వం బానిసత్వమే కాని మన మీద బరువై కూచోదు. ఎవరో చెప్పిందాకా ఆలోచించుకొన్న దాకా బానిసత్యమనిపించదు. తెల్లవారితే పెద్దలకి కుటుంబానికి ఇంటి చుట్టుపక్కల మనుషులకి పురోహితులకీ చేసే దాస్యం ఎన్నడన్నా మనుశ్రీనషులకి తట్టిందా. నిజంగా స్వాతంత్ర్యాన్ని ప్రేమించి మనిషి మొదలు వ్యక్తిలో మార్పు తేవాలి. తర్వాత దేశం సంగతి అన్న సారాంశంలో మాట్లాడతాడు చలం దేశికాచారి. (వ్యాస మంజీర - పుట : 2 - డా॥. అమ్మంగి వేణుగోపాల్)

వివాహ ప్రాధాన్యంలేని స్త్రీ లైంగిక స్వేచ్ఛకై పెనుగులాడి ఆ ఏకాగ్రతలో కష్టాలను సైతం తృణప్రాయంగా భావించి తృప్తిననుభవించిన స్త్రీ పాత్ర "ఎందుకు" కథలో చిత్రించబడింది. వివాహం, హోదా, ధనం వీటి ప్రయోజనాన్ని ఎంత వరకు తగ్గించాలో అంతరవకూ తగ్గించి వివాహ రహిత ప్రేమ జీవితాన్ని స్థాపించిన తీరు ఈ కథలో చిత్రించబడింది. ఇటువంటిదే చలం రాసిన "ఆమె త్యాగం" అనే కథ. వివాహం లేకుండా మోహమే ప్రధానంగా బ్రతికిన ఒక జంట యొక్క స్వచ్ఛమైన లైంగిక జీవితాన్ని చిత్రించి సంప్రదాయాన్ని, వ్యవస్థ యొక్క ఆధిక్యాన్ని తగ్గించి చూపాడు చలం "ఆమె త్యాగం" కథలో.

"ఎందుకు" కథలో నాయిక జమీందారిణి. పెళ్లి అయిన కొద్దికాలంలోనే భర్త చనిపోతాడు. ఆరేళ్ళకాలం ఆమె నిర్లిప్తంగా వుండిపోతుంది. బంధువులు, స్నేహితులూ, అయినవాళ్ళూ, పోయినవాళ్ళూ వచ్చి తిని పోవటమే కానీ ఆమె మానసిక క్లేశాన్ని ఎవరూ ఆలోచించనైనా ఆలోచించరు. ఆ తరువాత ఆమెకూ ఆ ఇంటి కమతగాడికీ సంబంధం ఏర్పడి ఇద్దరూ లేచిపోతారు. వివాహం లేని ప్రేమ ప్రాబల్యంతో జమీందారిని కూడా తృణప్రాయంగా త్యజించి వెళ్ళిపోతుంది. పేదరికంలో, దుమ్ములో కంపుగా బ్రతకవలసి వస్తుంది. అయినా ఆమెకు పశ్చాత్తాపం లేదు. తిండి లేక కృశిస్తుంది. మురుగు కాల్వ ప్రక్కన దుమ్ములో చిరుగు పేలికలతో బ్రతుకువాడు తాగి తంతాడు. ఇంత పతనాన్ని కూడా సహిస్తుంది. ప్రేమలోని ఏకాగ్రతను, లైగింక జీవితంలోని స్వేచ్ఛను ఈ కథ సమర్థిస్తుంది.

"ఎందుకు నీవిలా దుర్భర జీవితాన్ని గడపడం?" అని సంప్రదాయ లోకం ప్రశ్నిస్తుంది ఆమెను. "రక్తాలు కక్కుకునేట్టు స్త్రీలను గుద్దడం, డొక్కలో తన్నడం చూశాను, మోకాళ్ళు కసితో కొరుక్కోవడాలు చూశాను" అని ఆమె సంప్రదాయ సంఘంలోని మనుషులను ద్వేషించి "నాకోసం మీరు పడే దిగులు చూసి నాకు

నవ్వుగా ఉంది. మాటలతో చెప్పటం కష్టం పురుషుడి నుంచి మిరేరిగిన ఆదరణ నగలు, చీరలు, భార్యలు వండి పడుకుని కనే మనుషులు, అంతే. ఎట్లా చెప్పను. నువ్వు ప్రత్యేకంగా నువ్వు అనే గుర్తు - తన్నడానికైనా నువ్వే కావాలని నిన్ను గుర్తించి, నిన్నే కోరి, మాటలతో సాధ్యం కాదు ఆ అనుభవం. నీ లోపల్నుంచి, నిన్ను తెలుసకుని బంధించనీ, చంపనీ, లాలించనీ ఎంతో గొప్ప తృప్తి. చెప్తే తెలీదు''. అని తన జీవితాన్ని, పురుషుడి ఆదరణను సమర్ధించుకొంటుంది. ప్రేమలోని ఈ ఏకాగ్రతను చలం తన యోగ వాసిష్టంలోని అహల్య - ఇంద్రద్యుమ్నుల కథతో సమర్ధించాడు. కామం తీర్చు కోవడం, లైంగిక స్వేచ్ఛను కలిగి వుండటం స్త్రీ హక్కు. ఆ ఉద్యమంలో స్నేహాలు, సంపదలు, అనురాగాలు త్యాగం చేయవలసి రావడం దుర్మార్గపు సంఘం నియమాల వల్లనే అని చలం అభిప్రాయం.

చలం సృజించిన కథలలో సంస్కరణ భావం అధికం. వరకట్న దురాచారం, పురుషుడి అశక్తత, కలియుగ ధర్మ మైన వంచన, కళను గుర్తించలేని మూర్కత, నాటక రంగంలోని అంపాలు, మతమౌఢ్యం, పత్రికారంగంలోను, సినిమారంగంలోనూ ఉన్న కృత్రిమత్వం తల్లిదండ్రుల అనవసర ఆధిపత్యం, విధవా వివామాలలోని అవకత వకలు, తద్దినాలపై విసుర్లు, సద్విమర్శనా దృష్టిలేని సామిత్య విమర్శ, కుహనా దేశభక్తులు, పురుషుడి బాధ్యతా రహితమైన ప్రవర్తన, అహంభావం, వ్యవస్థలోని లోపాలు ఇలా ఎన్నో అంశాలు వ్యంగ్య ధోరణిలోను, విమర్శ రూపంలోను ఆవిష్కరింపబడి చలం కల్పనా చాతుర్యాన్ని నిరూపిస్తాయి.

మోహం కలిగిన స్త్రీ పురుషులు కాల్పనిక సౌందర్య ప్రవృత్తితో, సహజాతాల ప్రకోపంతో శృంగారాను భూతులను అనుభవిస్తుంటారని, అయితే సహజ భయం చేత స్త్రీ మాత్రం ఆ కలల నుండి తేరుకొని సమాజంలో సంచరించేటప్పుడు ఏమీ తెలియనట్లు ప్రియుణ్ణి నిర్లక్ష్యం చేసి భర్త అండన హుందాగా తిరుగుచున్నదని, దీనికి కారణం నాగరికతని, తమకు నీతి మాత్రమే ఉన్నట్లు శరీరం లేనట్లు ప్రవర్తిస్తుంటారని చెప్పటానికి చలం ''హంపికన్యలు'' కథను రాశాడు.

సహజాతాలు, సౌందర్యానుభూతి కృత్రిమ నాగరికతకు బలికావడం వల్ల పురుషుడి కన్నా స్త్రీ చాలా జాగ్రత్త పడాల్సి వస్తున్నదనే విషయాన్ని ఈ కథలో చలం తెలియజేశాడు. రాజేశ్వరి పిల్లలతో కలిసి పద్మనాభం హంపీ శిథిలాలను చూడటానికి వెళ్తాడు. పద్మనాభానికి రాళ్ళలో మందిరలు, విగ్రహాల్లో వాఙ్మయాలూ, గాలిలో మృతుల కంఠాలు కనిపిస్తుంటాయి. పద్మనాభం మనస్తత్వం కథకుడికి, రాజేశ్వరికి నచ్చలేదు. పద్మనాభం రాళ్ళలో చరిత్రను చదివి ఆనందిస్తుంటే వీరిద్దరూ ప్రకృతి సౌందర్యంలో పరవశమై పోతారు. అక్కడ కథకుడికి ఇద్దరు స్త్రీలు పరిచయ మయ్యారు. వాళ్ళు హంపీకన్యలు. ఒకరు తెల్లపిల్ల, మరొకరు నల్లపిల్ల.

కథకుడితో నీళ్ళలోకి దిగి ఈత కొట్టాలని వున్నా లోకభయం వల్ల తెల్లపిల్ల ఆ ప్రయత్నం చేయలేదు. ఇలాంటి అనుభూతులు నెరవేరనందున ఆమె కాల్పనిక ప్రపంచంలో సంచరిస్తూ ఆకాశం మీద కథలు రాసే ప్రవృత్తి పెంచుకుంది. నీటిమీద కథలు రాసే రచయితతో ప్రేమగా తిరిగింది. అతనిని కలల్లోనే వుంచి వెళ్లిపోయింది.

కథకుడు దొంగలు వస్తారనే భయంతో నల్లపిల్లతో ఆ రాత్రి స్నేహం చేస్తాడు. ఇద్దరు దగ్గరవుతారు. ఇలాంటి సమయంలో ఆ నల్లపిల్ల, ఆ జడ్జి కూతురు ఆ చుట్టుల దొరను కాదని ఆ రాత్రి కథకుడి వద్ద వుండటం ఆమెలో కలిగిన మోహావేశమే తప్ప వేరు కాదు. కథకుడిది అలాంటి ప్రవృత్తి కాబట్టే ఈ అనుబంధమేర్పడింది. అతడు నిద్రలేవకముందే జాగ్రత్తపడి లేచిపోయింది. ఆమె పోయే ముందు ఎలంటి కృతజ్ఞతా భావం లేకుండానే వెళ్లి పోయింది. ఇలాంటి స్త్రీలు తమకు మాత్రమే నీతి ఉన్నట్లు భావించి, శరీరం లేదన్నట్లు ప్రవర్తిస్తుంటారు. అవినీతిని మగవాడికి అంటగట్టి ఏమీ తెలియనట్లు ప్రవర్తిస్తారని నల్లపిల్ల విషయంలో చలం వ్యాఖ్యానించాడు. ఆ నల్లపల్లి తర్వాత భర్తతో ఉన్నప్పుడు ''నన్ను పలకరించ వద్దు, పలకరించావా!'' అని బెదిరిస్తుంది. ఇట్లా ఆమెలో మోహం, కాల్పనిక దృష్టి మరుగున పడిపోవటానికి సంఘ భయమే కారణమని రచయిత చెప్పదలిచాడు.

ఆదరణ లేని ఆశయాలను, ప్రేమ పర్యవసానాలను వివరించిన చలం కథ ''ప్రేమ పర్యవసానం''. సుందర

శివరావు కాకినాడ కాంగ్రెస్ ఆఫీసులో నాయకుడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటుండేవాడు. హిందూ మతం, పురాణాలు, హిందూ మతోద్ధారకులైన నానక్, శివాజీ, తుకారాం, తిలక్ అంటే అభిమానం. శ్రీరాయుడు ఆరాధ్య దైవం. తన జీవితాన్ని హిందూమతానికి, దేశానికి అర్పించాలని అనుకున్న వాడు.

శివరావుకు బ్రహ్మచర్యం అంటే చాలా అభిమానం. కానీ తల్లిదండ్రుల బలవంతం మీద "కమల" అనే అమ్మాయిని పెళ్లాడతాడు. భార్యకు పాతివ్రత్యం బోధించి తనకు ఏకపత్నీ వ్రతాన్ని విధించుకున్నాడు. భార్య కమలను కూడా కాంగ్రెస్ వాలంటీర్ల దళంలో చేర్చాడు. కానీ కమలకు మతభక్తి, దేశభక్తి ఒంటబట్టలేదు.

శివరావుకు ఆడవాళ్లు స్వేచ్ఛగా తిరగడం ఇష్టం లేక దేశసేవకు 'స్త్రీశాఖ' వేరే ఉండాలని భావించాడు. మతం పట్టింపుల మీద వున్న ప్రేమ, అభిమానం భార్య మీద లేదు. వారి మధ్య దాంపత్యం ధర్మ పాలనగానే సాగింది గాని మోహం గాని, ప్రేమ గాని లేవు. ఇలాంటి స్థితిలో 'నిర్మల' అనే బ్రహ్మ సమాజపు పిల్లతో పరిచయ మవుతుంది. ఆమె హుషారుగా, చలాకీగా శివరావును ఆకర్షించింది. తన భార్య కమల ఘోష్‌తో తిరిగినప్పుడు అంతకుముందు తనకు కనిపించని అందం ఆమెలో వున్నట్లు భావించాడు. దానికితోడు భార్య పటకల కలిగే జెలసీకి గురైనాడు.

తనది సోదర ప్రేమ అని, అమలిన ప్రేమ అని భావించి సమర్థించుకోవాలనుకొన్నా, ఆ ప్రేమ పర్యవసానంలో అనుభవానికి దారితీసింది. అనుభవంలో ఆనందాన్ని పొందాడు కాని తన మతదృష్టి వలన ఆ అనుభవాన్ని నిలుపుకోలేకపోయాడు. ఇలాంటి వ్యక్తితో జీవితం సరిగా నడవదని నిర్మల ఘోష్‌ని పెళ్ళాడింది. శివరావు, నిర్మల, ఘోష్ ముగ్గురి విషయంలోనూ 'ప్రేమ'ను గురించి ఆలోచనలు కనబడతాయి. కానీ ఆచరణలో నిజాయితీ లేదు. ప్రేమ ఒక భ్రమ మాత్రమే. దాని అంతిమ లక్ష్యం శారీరక కోర్కెల సంతృప్తి మాత్రమే. తరువాత ప్రేమకు అస్తిత్వమే ఉండదు.

ఉన్నతమైన ప్రేమ, దేశభక్తి, గొప్ప ఆదర్శాలు వీటిని ఆచరణలో పట్టించుకోని వాళ్ళు ఒకళ్ళను ప్రేమించామనుకొంటారు. మరొకరిని పెళ్ళాడతారు. పెళ్ళయిన వాళ్ళు ఆ పేరు మీద తమ కోరికలను తీర్చుకుంటారు. అన్న విషయాన్ని శివరావు పాత్రపరంగాను, దేశభక్తిని కబుర్లతో మాత్రమే చూపేవాళ్ళు ఆచరణలో ఆ దేశభక్తులకు వ్యతిరేకంగా పోలీసు ఉద్యోగాలకు వెళ్ళటాన్ని గురించి ఘోష్ పాత్ర పరంగాను చెప్పి చలం యొక్క హిపొక్రసీని ఈ కథ ద్వారా బయటపెట్టాడు. సౌందర్యారాధనకు వున్న అనుకూల, ప్రతికూలాంశాలు విశదంగా ఈ కథ ద్వారా గ్రహించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**


1. చలం సాహిత్యం - సామాజిక దృక్పథం - డా॥ ఎన్. రామచంద్ర.
2. శత జయంతి సాహితీమూర్తులు - సంపాదకుడు : డా॥. ద్వానా శాస్త్రి.
3. వ్యాస మంజీర - డా॥. అమ్మంగి వేణుగోపాల్.
4. చలం సాహిత్యంలో స్త్రీ - సమగ్ర పరిశీలన - డా॥. పెన్నవరం ఈదారెడ్డి.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# సడ్లపల్లి చిదంబర రెడ్డి కథలో రైతు జీవన చిత్రణ



- సకిరెడ్డి సత్తిబాబు
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**ఉపోద్ఘాతం :**

సమాజం సజీవంగా వర్ధిల్లుతోందంటే అన్నదాత చేస్తున్న పని ఫలితమే. వ్యవసాయాన్ని వృత్తిగా చేసుకొని పంటలకై రాత్రీ పగలు రైతులు శ్రమిస్తున్నారు. ఇక భారతదేశం విషయానికి వస్తే ఇది వ్యవసాయక దేశం. దాదాపు డెబ్బయి శాతం ప్రజలు వ్యవసాయరంగాన్ని ఆశ్రయించి జీవిస్తున్నారు. వారి జీవనాధారం కొందరికి ఉపాధినివ్వడంతోపాటు సంఘజీవుల కడుపు నింపుతోంది. అలాగే వ్యవసాయానికి అనువైన నేలలు, వాతావరణ పరిస్థితులు, పల్లె జీవన విధానాలు నెలకొన్న చోట సేద్యాన్ని ఆశ్రయించి బతకడంలో విశిష్టత ఉంది. తమ కాయకష్టాన్ని నమ్ముకుని ఆత్మాభిమానంతో జీవించడం 'నాది' అనే సొంత నేలను కలిగి ఉండటం ఓ గౌరవాన్ని ఆపాదిస్తుంది. ఒకనాటి సమాజంలో ఈ వృత్తి ప్రధానమై విలసిల్లింది. రాజుల కాలంలో రాజు నేలకు అధిపతి అయినా శిస్తు చెల్లించి రైతులు పంటని సాగు చేయడం జరిగేది. అనంతరం భూస్వాములు, జమీందార్ల పెత్తనాల కింద అధిక వ్యవసాయం ఉండేది. ఇక పల్లెల్ని ఆశ్రయించిన వారు సొంత భూమినో, కౌలు భూమినో సాగుచేయడం, వ్యవసాయం కూలీగానో, అనుబంధ వృత్తికారునిగానో కొనసాగే వారు. ఇలా నాటి నుండి నేటికీ భూమికి అంటిపెట్టుకొని జీవిస్తున్నారు.

దేశాభివృద్ధిలో ప్రధానపాత్రను పోషించే రైతుల జీవన విధానం, శ్రమ కొనియాడదగినవి. వీరికి సమస్యలూ అధికమే, వాటిని వారు ఎదుర్కొనే పోరాటం కూడా క్లిష్టతరమే. ఇక రైతు లేనిదే రాజ్యం లేదన్నది వాస్తవం. ప్రాచీన సాహిత్యం రైతుని అంతగా గుర్తించకన్నా 'అనగనగా ఒక ఊరు.. అంటూ సాగే కథల్లో రైతు గురించి వృత్తాంతాలు కథనంలో భాగమయ్యాయి. కానీ ఆధునిక రచయిత మాత్రం రైతుపై ప్రత్యేక దృష్టిని ఉంచుతున్నాడు. సమాజ సంబంధిత ఇతివృత్తాలనే ఎంచుకొని ఆలోచింపజేసే సాహిత్యంలో కదులుతోన్న కథాకర్తలకు రైతు ఓ ప్రధాన వస్తువయ్యాడు. రైతు పంటల ద్వారా లోకానికి అన్నార్తిని తీరుస్తూ ఉన్నాడు. కానీ ఆ పంటల్ని పండించడంలోనూ, జీవనాన్ని కొనసాగించడంలోనూ అడుగడుగునా సమస్యలున్నాయి. వాటి ప్రభావాలు అతన్నే కాక అందరి మనుగడను ప్రశ్నార్థకం చేసేవే. నవీన రచయితలు సమాజ హితకారులు కనుక రైతు సంబంధిత సాహిత్యంలో అందరినీ ఆలోచింపజేస్తున్నారు. రైతన్నని మరచిపోతున్న సమాజాన్ని తట్టి లేపే క్రమంలో ఈ తరహా కథలుండటం విశేషం.

సడ్లపల్లి చిదంబరరెడ్డి కథల్లో కొన్ని రైతు జీవన చిత్రణకు సంబంధించి ఉన్నాయి. వాటిలో రైతు గొప్పతనాన్ని, సమస్యల్ని, చైతన్యాన్ని చర్చించిన కథ లున్నాయి. రచయిత రైతు కుటుంబీకుడు కావడం, రాయలసీమ వాసి కావడంతో అన్నదాత గురించిన అణు వణువునీ పరిశీలన చేశారు. రైతన్నల కష్టాలు, కాల మార్పులు, వారి జీవన శైలి, వారి హృదయాన్ని చక్కగా చదివి లోకానికి విశదపరిచారు. తన ప్రాంత రైతు గురించి ఉన్నది ఉన్నట్లు చెప్పడంలో తన స్వీయ అనుభవాలనూ కోడించి కథనానికి ఆత్మనూ జత చేశారు. వాటిని ఈ కథలో విశ్లేషిస్తున్నారు.

**కవి పరిచయం :**

ఈ కథను సడ్లపల్లి చిదంబర రెడ్డి రచించారు. ఈయన అనంతపురం జిల్లా హిందూపురంలో జన్మించారు. మంచి కథ రాయాలంటే పరిసరాలను పరికించి స్పందించే హృదయం కావాలనే సత్యాన్ని ఈయన తెలుసుకొని ఎన్నో కథలు రాశారు.

## రైతు హృదయం :

**కథా పరిచయం :**

అనంతపురం ఒడ్డున పెన్నేటి గట్టులోని ఒక పల్లెటూరిలో భూమయ్య పశువులమందను కాస్తూ ఉండేవాడు. అతని కొడుకైన పెన్నయ్యను పొలం పనులకు పంపుతూ ఉండేవాడు. పెన్నయ్య చెయ్యిపడితే పొలాలు కళకళలాడుతూ ఉండేవి. అతని భార్య గంగమ్మ భర్తకు తగిన భార్య. రైతు దంపతులుగా వారిరువురూ శ్రమజీవులు. పెన్నయ్య కొడుకులు తండ్రిలా వ్యవ సాయాన్ని కాకుండా బెంగళూరు పట్టణంలో ఏవో పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో స్థిరపడతారు. చినుకులు లేక నేల ఎండటంతో వృద్ధులైన కన్నవారిని తమ వెంట తీసుకెళ్తారు. అనారోగ్యంతో గంగమ్మ మరణిస్తుంది. పల్లెవాసి అయిన పెన్నయ్య పట్టణం నచ్చక తన ఊరిలో కరువు తీరితే తిరిగి వెళ్ళాలని కలలు కనేవాడు. ఓరోజు తన ప్రాంత సమాచారాన్ని కరువు తీరిందన్న విశేషాన్ని తెలుసుకుంటాడు. ఊరికి వెళ్ళి పొలాల పచ్చగా ఉం డటాన్ని చూసి ఆనందిస్తాడు. అంతా తిరుగుగుగూ, స్పృశిస్తూ, పంటల రుచిని, నేలమ్మని చూసి పులకించి పోతాడు. తన బట్టలతో ఒక దిష్టిబొమ్మను తనకు మారుగా పొలం మధ్య నిలబెడతాడు. అలాగే నగ్నంగా ఆ బొమ్మ చుట్టూ ఆనంద తాండవం చేసిన అరవై ఏళ్ల పెన్నయ్య ప్రాణాలు గాలిలో కలిసి ఆ మన్నులో మన్నుగా చేరిపోతాడు.

**విశ్లేషణ :**

రైతు గొప్పతనాన్ని అతనికి నేలపై పెనవేసుకొన్న బంధాన్ని ఈ కథనం చిత్రించిన తీరు మనసుకి హత్తు కొని హృదయాలను కదిలించేలా ఉంది. ఒక వ్యవసాయ దారునికి, పల్లెకు సంబంధం పుట్టినిల్లు కాగా, చేసుకొనే రైతన్న గొప్పవాడు. పుట్టి బట్ట కట్టక మునుపు నుండీ మట్టినే తనువుకి ధరించి మనసుని మట్టి పరిమళాలను అద్దుకుంటూ పెరిగేవాడు రైతు. నేలమ్మని నిండు ముత్తయిదవుని చేస్తూ ధాన్యరాశుల గలగలలతో సమాజానికి అన్నదాతై ఉన్నంతలో సంతృప్తిగా గడుపు తాడు. అలాంటి రైతు హృదయావిష్కరణ చేయడం అందరికీ రైతు వైశిష్ట్యాన్ని తెలియజేయడంగా ఎంచాలి. రైతు పుట్టిన తర్వాత మన్నులో మన్నుగా పెరిగి గిట్టేదీ ఆ మన్నులోనే తిరిగి జన్మించేదీ మొక్కై చిగురించేదీ ఆ మన్నులోనే. ఇదే రైతు కోరేది. దాన్ని నిరూపించే పాత్రగా పెన్నయ్యని మలచి రైతు మనోభావాలను, అతనికి నేలతో ఉన్న బంధాన్ని అపురూపంగా చిత్రిం చారు. ప్రతీ రైతన్న మనసు అదేనంటూ దర్శింపజేయడం రచయితకే చెల్లింది. సేద్యం వలన ఆర్థిక నష్టాలేగాని ఉపయోగం లేదంటూ పట్నానికి వెళ్ళిపోదామన్న పెన్నయ్య. కొడుకులతో పెన్నయ్య పలికిన మాటల్ని ఇందుకు నిదర్శనం చెప్పొచ్చు. ఆ మాటల్లో రైతు గొప్పతనాన్ని, ఆశావాదాన్ని, సమస్యలపై పోరాటాన్ని కలగలిపి పరిశీలించవచ్చు.

"ఎక్కడికి వెళ్లినా, మనం రూపాయి నోట్లని తిని బతకలేము. ప్రపంచానికి అధిపతి అయినా తినాల్సింది అన్నం వెతుకులే! ఆ తిండి రైతు భూమి నుండి మాత్రమే పండింగలడు. కష్టం మనిషికి కాక మానుకు రాదు కదా?! ఎన్నాళ్ళు ఎండినా పంటలు ఒకసారయినా

పండక పోతాయా?" అనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తాడు పెన్నయ్య.

ఈ వ్యక్తీకరణలో రైతు విశిష్టతలతో పాటు రైతు అందరికన్నా మిన్న ఎందుకయ్యాడో, అతని విలువలె లాంటివో, ఆత్మస్థలం ఎట్టిదో చూపించారు. ఈ వాక్యాలను ఓ మట్టిని, పంటల్నే ప్రాణం అని ఎంచిన అన్నదాత అయిన పెన్నయ్య ద్వారా పలికించి వ్యవసాయ ఔన్నత్యాన్నీ, ఆ వృత్తిని చేపట్టిన వారి ఉన్నతిని కొనియాడారు. అలాగే పెద్దతరం పల్లె జీవనమే ముద్దు అనీ, నేలను నమ్ముకుని బతకడమే గౌరవప్రదమని నమ్ముతుంది. దీనికి పెన్నయ్య, గంగమ్మలే ప్రతీకలు. ఇక పిల్లతరమైన అతని కొడుకులది. వ్యవసాయంతో లాభం లేదనడం, పట్టణానికి తరలితే పనులతో దర్జాగా బతకొచ్చుననే తత్త్వం కలవారు. ఈ వలసలు వద్దనేది పెన్నయ్య అభిమతం, ఎక్కడికి వెళ్లి ఎంత సంపాదించినా, ఎంతటి ధనవంతులైనా డబ్బును తినలేరు. ప్రపంచాన్ని ఏలే చక్రవర్తి అయినా, ఎంతటి అధికార అయినా తినాల్సింది అన్నం మెతుకుల్ని మాత్రమే. వీరందరి కడుపులూ రైతు చెమటని చిందిస్తూ, శ్రమని ధారపోస్తూ పండించే ధాన్యం మాత్రమే నింపుతుంది. అందుకే రాజు కన్నా, ధనవంతుని కన్నా, అధికారికన్నా, రైతే మిన్న ఈ విషయాన్ని నిర్వచిస్తూ, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్' అంటూ వినమ్రతనే జేజేలుగా పలికి చాటారు. ప్రకృతి సహకరించకున్నా, అప్పులు ముంచెత్తినా, ప్రభుత్వాలు చేయూతనివ్వకున్నా, దళారులు మోసం చేసినా రైతు కృంగిపోడు. తిరిగి మరో సాగులో మరో లాభం చూడగలరనన్న నమ్మకం అతనిది. కష్టాలు జీవితంలో ఒక భాగమేనన్న జీవన సారాన్ని గ్రహించిన కర్మయోగి అన్నదాత. అలా ఆశాజీవిగా, ఆత్మాభిమానిగా, ఆత్మవిశ్వాసంతో బతకడమే మిన్న అని తలచే రైతు హృదయం తెరిచిన పుస్తకం వంటిదని ప్రశంసించారు.

రైతు తాను చేసే పనిని విడిచి పెడితే ఈ ప్రపంచం ఆకలితో అలమటిస్తుంది. ఆహార కొరత ఏర్పడితే అది అభివృద్ధికి, సంతులతకు, సౌభాగ్యానికి ఆటంకం. అందరిలోనూ వ్యవసాయక దేశంలో ప్రధాన వృత్తి సంకట స్థితిలో పడితే అది ఒక ఓటమి. అలాగే పల్లెల్ని రైతు వీడితే వ్యవసాయం మూలపడుతుంది. ఇక అందరూ తినేవారే అయితే పండించేవారు ఉండరు. అందుకే అన్నదాత వీధిని వీడడు. అతనికి ఎన్ని సమస్యలున్నా నేలతో పెనవేసుకున్న ఆత్మీయత అతన్ని పంట పొలాల నుండి వేరు చేయదు. అందుకే పెన్నయ్య వృద్ధాప్యంలో కొడుకుల వద్దున్నా పల్లెవైపే అతని గుండె కొట్టుకునేది. తిరిగి అక్కడి పచ్చదనాల వైపు మరలాలని తపిస్తూ, తన ప్రాంతం గురించి, అక్కడ వానలు, పంటల పరిస్థితులు గురించి వాడలు చేసేవాడు వానలు పడ్డాయని తెలిసి బెంగళూరు నుండి అనంతపురం వెళ్లి పెన్నేటి గట్టుమీద పసివాడిలా ఆనందతాండవం చేసిన పెన్నయ్యది స్వచ్ఛ హృదయం. అతనిలాగే ఏ రైతు అయినా పసిడి పంటల నందించే భూమాత మీద భక్తి భావంతో వాలిపోతాడు. పెన్నయ్య పొలాల్లో దొర్లి మట్టిని రాసుకున్న మట్టిని నోటి నిండా జుర్రుకున్నా, పంటలను ముద్దాడినా, పైర్లను కౌగిలించుకున్నా, ప్రేమగా కళ్ళకు అద్దుకున్నా కమ్మని పంట పరిమళాలను శ్వాసించినా, ప్రసాదంటా సేవించినా అది రైతుకి, మట్టికి మధ్యనున్న ఆత్మీయతలోని ఆస్వాదన, పరిస్థితులకు తలవంచిన రైతు పట్నంలో పిల్లల చెంతకు చేరినా అతని పంచప్రాణాలు తన గ్రామంలోని పంట పొలాల మీద తిరిగి ఆ నేలను స్పృశించాలని అతని ఊపిరి తహతహలాడుతుంది. అక్కడ పెట్టే అడుగులు ప్రకృతిలో ఆటలాడి, నింగి, నేల, నీరులతో పోటీ పడుతూ ఊసులాడే ఉత్సాహం రైతుని పసిబిడ్డగా మారుస్తుంది. అలా అతను ఆ నేలతల్లి ఒడిలో ఒదిగి పోవడాన్ని జన్మ సార్థకతగా భావిస్తాడు. అలాంటి రైతన్న హృదయ పారదర్శకతని ఈ కథనం ద్వారా అద్దం పట్టారు.

రైతు తనకెన్ని కష్టాలున్నా వ్యవసాయాన్ని విడిచి బతకడం అతనికి ఆత్మలేని శరీరాన్ని తలపింపజేస్తుంది. జీవన వేగం పెరిగి, భూమి తల్లి నీటి పొదుగు వట్టిదై పోయింది. అందరి బతుకుల్లో మార్పులు, చేర్పులు, కూర్పులు అనివార్యాలయ్యాయి. ఎలాగో బతకాలన్నా తాపత్రయంతో పట్టణ దారి పట్టినా, తిరిగి ప్రకృతిని కరుణించిన రోజు రైతు తన పొలం బాట పడతాడు.

అలా పల్లెదారి పట్టాలని అభిలాష కథాకర్తకు ఉంది. అందుకే ప్రకృతి శాసించిన పరిస్థితులు ప్రతిఘటించిన రైతుని నేలను వేరు చేయలేవు. ఆ సమయం అతనికి పరీక్షాకాలమై సమస్యల్ని సృష్టించినా భీతిల్లక వ్యవసాయాన్ని కొనసాగిస్తాడు. తన బతుకెలా ఉన్నా ప్రపంచానికి తిండి గింజలే జీవమని నమ్మి తన జీవనాధారాన్ని విడువడు. ఈలోగా బతుకెండినా, ప్రకృతి మండినా అతని ఆశావాదతత్త్వం అవన్నీ సహజమని ఊరడించి ముందుకు కదులుతాడు. అలా అందరి బతుకుల్లోనూ సస్యశ్యామలతను నింపుతోన్న అన్నదాత విశిష్టతను గుర్తించి అతనికి అందరూ ప్రథమ స్థానాన్నివ్వాలి. తమ జీవితాలు నేలతో పెనవేసుకొని ధన్యం అయినట్లు మళ్ళీ రైతుగా జన్మించడానికన్నట్లు మట్టి తల్లి గర్భంలో పెన్నయ్య మానవబీజమై చేరిపోయే అన్నదాతల వలనే పంటల క్రమం కొనసాగుతోంది. అలాగే సమాజం కూడా వర్ధిల్లుతోందని రచయిత రైతుని సూక్ష్మ పరిశీలన గావించి హృదయావిష్కరణ చేశారని చెప్పవచ్చు.

**మట్టి బతుకులు :**

**కథా పరిచయం :**

రాళ్లపాడు మండలంలోని బీడు పల్లెలో సిన్నోడు (సన్నోడు) ఉన్నత పాఠశాలలో చదువుకుంటుంటాడు. తరగతికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు ఆ ఊరి పేరు, వారి వారి తాతతండ్రుల పేర్ల వెనకున్న విశేషాలను కనుక్కొని చెప్పమంటాడు. సిన్నోడు, తన తండ్రి పోతు రెడ్డిని, తల్లయినా మూగక్కని అడిగినా ఫలితముండదు. దీంతో ఊరి ముందు కానుగచెట్టు వద్దుండే సుక్కాయప్ప అనే వృద్ధుడిని అడుగుతాడు. దానికతను ముత్తాత మట్టిలో పుట్టి మట్టిగా కలిసిపోయాడు గనుక భూమయ్య అనీ, తాత ఎద్దుల్ని ప్రాణంగా చూసుకునే ఎద్దులయ్య అనీ వివరిస్తాడు. అందరికీ నీడనిచ్చే పల్లె గనుక "నీడ పల్లె" అనీ, అదే అతని తండ్రికాలంలో పొలాలు బీడుపడి "బీడుపల్లె" అయిందంటాడు. అంతా విన్న సిన్నోడు అసలైన పల్లెని, రైతుల్ని చూడాలని ఉందని చెప్పగా, ఒడ్డుపల్లె అనే ఊరిలో రైతుబిడ్డలుండవచ్చని పలుకుతాడు.

ఒడ్డుపల్లికి వెళ్ళిన సిన్నోడు అక్కడున్న పెద్దమ్మని కలుస్తాడు. ఆమె ఆ ఊరిలోని అవులప్ప, తిప్పక్క అనే రైతు దంపతులు గురించి చెప్తుంది. అవులను మేపే అవులప్ప రెండెకరాలు కొన్ని వ్యవసాయం చేస్తుండేవాడు. వారికి బుర్రోడు అనే కొడుకుండగా అతనిని బాగా చదివిస్తారు. అతను కన్న వారిని కాశీకి పంపి ఉన్న రెండు ఎకరాలను అమ్మి తెల్లబోయిన మండలంలో యాభై ఎకరాలు కొంటాడు. అవులప్ప దంపతులు కొడుకు వద్దకు వెళ్లక ఆ ఊరిలోనే బంజరు భూమిలో చెట్లను వాటి బతికేవారు. బుర్రోడు మొదట్లో వ్యాపార పంటల లాభాలతో దర్జాగా బతికినా, వరుసగా సోకిన చీడపీడలతో అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటాడు. అతని శవంతో పాటు అవులప్ప దంపతుల వద్దకు పెద్దమ్మతో పాటు సిన్నోడు కూడా వెళ్తాడు. కడుపుకు తిండి, నిలవడానికి నీడ, కంటికి వెలుగునిచ్చే చెట్లనే కొడుకుగా తలచామన్న మట్టి మనుషులైన అవులప్ప దంపతుల మాటల్లో కర్మసారాన్ని దర్శిస్తాడు.

**విశ్లేషణ :**

మట్టి మనిషి జీవనంలోని ఆత్మాభిమానాన్ని, కర్మసారాన్ని, గొప్పతనాన్ని ఈ కథనం విశదపరిచింది. యుగాలు దొర్లినా, తరాలు మారినా, అనేక మార్పులు సంభవించినా అసలైన రైతు మార్పును కోరడు. అతని జీవితాన్ని భూమికి, పచ్చదనాలకు ముడి పెట్టుకుని కాయకష్టంతో సంతృప్తిగా బతుకుతాడు. ఈ వాస్తవాన్ని భూమయ్య, ఎద్దులప్ప, అవులప్ప దంపతుల పాత్రల్లో తెలిపి అన్నదాత హృదయాన్ని పారదర్శకంగా రచయిత చూపడంలో వారి జీవనానంద ఆదర్శాన్ని అందిపుచ్చుకోమన్నారు. నేడు పల్లెలు నశిస్తూ, రైతనేవాడు కరువవుతున్నప్పుడు ఈ కథ ద్వార అన్నదాత ఆత్మను దర్శింపజేయడం అభినందనీయం మరియు అత్యవసరం. ఈ సర్వ సృష్టిలో లయకారుడెంత గొప్పవాడైనా అతనికన్నా అన్నదాత ఏమాత్రం తగ్గనివాడని పోల్చడం వాస్తవమైనది. ఈ సమాజం సజీవంగా ఉందంటే రైతు జీవన పోరాట ఫలితం. ఇదే విషయాన్ని సంకులప్ప, సిన్నోడి సంభాషణలో చోటు చేయించారు. సంకులప్ప ముత్తాత

పలుకులు ఈ యదార్ధ వాదననీ, రైతు వైశిష్టాన్నీ అద్దం పడుతున్నాయి. వాటిని గుర్తు చేసుకుంటూ సిన్నోడికి చెప్పిన మాటలు పరిశీలించదగ్గవి.

"ఆకాశం నుండి గంగమ్మ తల్లి భూమ్మీదకి దుముకినపుడు తడిసిపోతానని మూడు కండ్లస్వామీ భయం పడింటే ఆ తల్లిని జుట్టులో కట్టేసుకునే దానికి సాధ్యమయ్యేది కాదు, మనకి నీళ్లు చిక్కేవి కావు. యండ, వాన, సలి, గాలికి భయపడితే పైర్లు గింజలు కాసేట్లేదు. కాయలు కాసేట్లేదు. రైతు అనేవాడు ఎండి, తడిసి, కాసి, ఎండిపోవల్ల. లోకంలోని జనాలకి అయప్పే అన్నం మెతుకులు కావల్ల, అట్లా రైతుల్ను జూపి సోంబేరిగాళ్ళు సిగ్గుపడాలా".

ఈ వాక్యాలు పరమేశ్వరునికీ, అన్నదాతకీ ఉన్న సామ్యతని తెలపడంతో పాటు, రైతు కష్టాన్నీ, పట్టుదలని తెలియపరుస్తున్నాయి. అంతేకాకుండా ఆత్మాభిమానంతో బతికే రైతు ఆదర్శాన్ని ఓ గుణపాఠాన్ని చేస్తూ, బద్దకస్తులను, పనీపాటా లేని వారిని కడిగిపారేస్తూ కనువిప్పు నిచ్చారు. ఆత్మస్థయిర్యం, శ్రమించేతత్త్వం, మందడుగులనే ఎరిగిన అన్నదాత గొప్పతనాన్నిలా కొనియాడటం రచయితకు రైతులపట్లున్న ఆత్మీయతని కూడా. అద్దం పెట్టాయి. సంకులప్ప ఇలా భూమయ్య మాటల్ని సిన్నోడికి వినిపించడం ద్వారా పాత తరం రైతు జీవనగతిని ఈ తరానికి నూరిపోస్తున్నట్లుగా కూడా తలపించారు. భగీరథ ప్రయత్నానికి సాయంగా గంగమ్మ పరవళ్ళను జటాజూటంలో బంధించి భూమి మీదకు నదీమ తల్లిగా పంపిన శివుని యత్నంలో భయం లేదు మరియు అతని దృష్టి లోకహితం మాత్రమే. ఆ పరమేశ్వరుని స్థయిర్యాన్ని, మానవతను, సాయగుణాన్ని పుణికిపుచ్చుకున్న రైతు వ్యవసాయ విధిలో తన సమస్యల్ని గరళంగా దాచుకొని సమాజ కడుపుని నింపుతున్నాడు. సుడిగాలుల్ని, మండే ఎండల్ని, కుండపోత వానల్ని, ఎముకలు కోరికే చలిని లెక్కచేయక పొలాన్ని అంటిపెట్టుకుంటాడు. పంట సాగులో అతివృష్టి, అనావృష్టిలు ఎదురైనా నష్టాలు, కష్టాలు వస్తున్నా రాబోవునది మంచి కాలేమనన్న దృక్పథంతో నిజాయితీగా తన పనిని చేసుకుంటూ వెళ్తాడు. సంవత్సరంలో ఏ ఒక్కరోజూ ఖాళీగాలేని, క్షనం కూర్చోని, విరామెరుగని విధిచితుడు రైతు. ఈ రోజుల్లో పొలంలో పనులను, వ్యవసాయాన్ని చిన్నచూపు చూస్తూ, ఉద్యోగాలకై ఎదురుచూస్తూ, సమయాన్ని వృధా చేసే యువత ఉంటున్నారు. కొందరైతే ఏ పనీ చేయక ఎంత వయసుకు వచ్చినా కన్నవారిపై ఆధారపడి గాలి తిరుగుళ్ళు తిరుగుతుంటారు. అలాంటి వారు రైతు జీవనసారాన్ని గ్రహిస్తే సేద్యం యొక్క విశిష్టతను గుర్తిస్తే మంచిది. తనకోసం కాక పరుల ఆహార్తిని తీర్చే గుణాన్ని, ఆ శ్రమను చేబూనితే నిరుద్యోగం అన్నది ఉండదు. విజ్ఞానయుతంగా సేద్యాన్ని కొత్త పుంతలు తొక్కించగలరు. ఈ మార్గదర్శకతని రైతు ద్వారా అందించాలని కూడా కథాకర్త తపించారు. అందులో భాగంగా రైతు ఎంత స్థయిర్యవంతుడో, శ్రమజీవో తెలిపి ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మాభిమానాన్ని, శ్రమకారిత్వాన్ని అందుకోమన్నారు. ఆ శివుడు మూడవ కన్నుని తెరిస్తే సృష్టి బూడిదవుతుంది. అదే ఈ రైతన్న కన్నుమూస్తే సమాజంలోని జీవం అంతరించపోతుందని తెలియ పరిచారు.

రైతు అనేవాడు సమస్యల్ని ఎదురీదుతూ విధి నిర్వహణని తనకోసం కాకుండా ఈ సర్వ మానవ ప్రపంచం కోసం కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాడు. ఏరువాక నుండి తిండి గింజల్ని ఇంటిదాకా తెచ్చుకునేదాకా అతని శ్రమకు ఫలితాన్ని కళ్ళజూడలేదు. ఈలోగా ప్రకృతి సహకరించుకున్నా, అప్పుల కడగళ్ళు గుండెని తొలచినా, దళారుల దుష్కృత్యాలు వెల్లువెత్తినా తనకు ఇవేం కొత్త కాదని, లోక కళ్యాణం తన విధిగా వ్యవహరించడంలో అతని ఆత్మస్థయిర్యం ఎలాంటిదో చూడొచ్చు. తనది ఎప్పుడూ పట్టే చేయగా ఉండాలని తలచి చేయిచాచక, అసరా అందుకున్న ముందడుగే వేసిన ఆత్మాభిమాని. వీటిని ఎవరు పుణికి పుచ్చుకున్నా ఎంతో ఎత్తుకు ఎదగగలడు. అలాంటి మార్గనిర్దేశనం రైతుదని చెప్పడం ద్వారా అతనెంత ప్రత్యేకమైన వ్యక్తో తెలియపరచడంలో యదార్థం ఉంది. మన్ను ముట్టుకోవాలంటే నామోషీ, పేడ తియ్యాలంటే సిగ్గుపడే జనాలు మట్టి మనిషిగా బతకడం ఒక అదృష్టమని తలిచేలా రైతన్న గొప్పతనాన్ని

రచయిత ఆవిష్కరించారు. రైతు ఆత్మాభిమానాన్ని, భూమితో పెనవేసుకున్న బంధాన్నీ తెలియపరడాన్ని అవులప్ప మాటల ద్వారా వెల్లడించారు.

"ఆశకి అంతెక్కడిది? ఈ బతుక్కు వింతెక్కడిది? సెటినోళ్లకు సేటు లేదు. బతికినోళ్ళకు బతకు లేదు. ఉప్పు తిన్నంత దప్పి శానా అని మన పెద్దోళ్ళు ఊరికే అన్లేదు. నువ్వు నా వల్ల అనుకుంటే నోట్లు సంపాదించి బంగారు బువ్వ తిను పోప్పో మాకీ మట్టి బతుకులే సాలు"

అవులప్ప తన కొడుకుతో పలికిన ఈ వాక్యాల్లో ఎంతటి సంతృప్తిపరుడో, అతనికి మట్టితో ఉన్న ఆత్మీయత ఎట్టిదో తెలిపారు. నేలమ్మతో అనుబంధాన్ని తెంచాలనుకున్నది. తన రక్త సంబంధమే అయినా దాన్ని వదులుకొని మట్టితో ఉన్న బంధమే అధికమని రైతు అంతరంగం తెలుస్తుందనడానికి ఈ పలుకులే సాక్ష్యం. ఒకేసారి ఆకాశానికి ఎగరాలని తలిచే వారికి వ్యాపార దృక్పథానికీ, ఉన్న నేలలో శాస్త్రీయంగా సాగు చేసుకునే రైతుకి చాలా తేడా ఉంది. డబ్బు అనే కోణంలో సాగునీ కాదని రసాయనాల సాగు, నేలసారాన్ని నాశనం చేసే కొన్ని వ్యాపార పంటలు సాగు చేసే వారికి కూడా ఈ మాటలు ఒక చెంపపెట్టు అన్నదాత ఎంతో కష్టించి పండించుకున్న ధాన్యపు గింజల్లో తాను తినడానికీ, ఇతరులు తినడానికీ సరిపోతే అదే పదివేలు అనుకుంటాడు. అలాగే తన విధి తనతోపాటు పదిమందినీ బతికిస్తూ సంతృప్తికరంగా బతకాలి అనుకోవడం గొప్ప తన మనసుకి వ్యతిరేకంగా నడిచే ఏ నిర్ణయాన్నీ, ప్రలోభాన్నీ మట్టి మనిషి సహించదు. ఆధారపడి బతకాల్సి రావడంలో ఆత్మని తాకట్టు పెట్టాల్సి ఉంటుందని అవులప్పలాగే కన్న కొడుకునైనా ఎదిరించి స్థిర నిశ్చయానికి కట్టుబడే రైతన్నలెందరో ఉన్నారు. వారిది మనోనిబ్బరంతో కూడిన ఆత్మవిశ్వాసం, ఆత్మవిశ్వాసంతో కూడిన ఆత్మాభిమానం అవే రైతుని ఉన్నతుని చేశాయని కథాకర్త ఉదాహరించారు.

ఆధునిక కాలంలో ఆశలకు అంతుపంతు లేదు పల్లెల్లో భూమిని తగనమ్మి పట్టణాలకు వెళ్లిపోయి ఏ వ్యాపారంలోనో లక్షలు ఆర్జిస్తామని వెళ్లేవారు ఉంటారు. తమ వంతు భూమిని పంచి పెడితే వలస పోతామని రైతులను బెదిరించి సంతానాలు ఉన్నారు. కన్నవారిని మోసం చేసి మరీ భూమిని అమ్మే తాను అనుకొని చేసిన అవులప్ప కొడుకు బుర్రోడు వంటి వారందరూ ఉన్నారు. ఈరోజు బిడ్డలకు దూరంగా వృద్ధాప్యంలోనూ ఒంటరిగా గ్రామాల్లో భూమిని పాడిని నమ్ముకున్న మట్టి మనుషులున్నారు. వారికి నేలతో ఉన్న బంధం తెంచేస్తే తెగేది కాదు. అది ఆత్మీయ అనుబంధం. అలా అన్నదాతల హృదయం తెరచిన పుస్తకం. బుర్రోడు భూములమ్ముకొని వెళ్లిపోయినా అవులప్ప దంపతులు ఏడ్వలేదు. ఎందుకూ పనికిరాదని విడిచిన బంజర భూమిలో రాళ్ళూ రప్పలు వేరుచేసి మామిడి, పనస, పరంగి, గెనసుగడ్డల చెట్లను పెంచి అవి తింటూ, మిగిలినవి అమ్ముకొని జీవించారు. ఇక్కడ వారికి బతుకు భారంగానీ, ఒంటరితనాలు కానీ గుర్తు రాలేదు. ఆత్మాభిమానం, ఆత్మసంతృప్తి, స్థైర్యం నేలతో ఉన్న సంబంధం మాత్రమే రైతు సంపదలు. 'కడుపుకి తిండి, నిలిసేకి నీడ, కంటికి వెలుగూ ఇచ్చే బిడ్డ పచ్చని చెట్టే' అన్నట్టి అవులప్ప వంటి రైతులు అరుదు. కానీ ఇటువంటివారు పల్లెల్ని అంటి ఉన్నారు కాబట్టే కోట్లాదిమందికి ఆహారం లభ్యమవుతుంది. మట్టిలో పెరిగి, మట్టిలో కలిసి తిరిగి ఆ మట్టిలోనే జనించాలని అన్నదాత కోరుకుంటాడు. అలా తన కోసం కాక అందరి కోసం బ్రతికే గొప్ప మనసున్నవాడే భూమి పుత్రుడన్న వాస్తవాన్నిలా విశదపరిచారు. వేగంగా ఎదగాలని డబ్బే ప్రధానమని బుర్రోడు భావించిన అవులప్ప సంతృప్తితో కలకాలం రైతుగా బతికాడు. ఓ రైతు ఎలా ఉండాలో తెలిపి జీవన సారాన్ని ప్రబోధించే ఆదర్శం ఒక్క అన్నదాతకే ఉందని ఈ కథలో కొనియాడబడటం విశేషంగా చెప్పుకోదగ్గది.

**ఆధార గ్రంథాలు :**

1. మట్టిమొగ్గలు కథా సంపుటి - సడ్లపల్లి చిదంబరరెడ్డి 2. బతుకులెతుకులాట - సడ్లపల్లి చిదంబరరెడ్డి

3. కథాశిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య.

★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి కథలలో మధ్యతరగతి జీవన చిత్రణ



- పల్లపు పవన్ కుమార్
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రి అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**ఉపోద్ఘాతం :**

చూడగానే వీరు మధ్యతరగతివారు అనిపించేలా ఉన్నది ఉన్నట్లు పారదర్శకం అయ్యేవే మధ్యతరగతి మనసులు, మంచైనా, చెడైనా, కష్టమైనా, దుఃఖమైనా, ఉన్నా లేకున్నా మేముమేమేననే ఒక ముద్ర వీరి మాటల్లోనూ, చేతల్లోనూ ప్రస్ఫుటం అవుతూనే ఉంటాయి. ఏదో దాచుకోవాలని లేకున్నా ఏదీ దాచుకోని తీరు, ప్రతీదానిలోనూ స్పష్టపరుస్తూ మేమింతేననుకోవడం చిత్రంగానే తోస్తుంది. మనస్తత్వంపై సంస్కృతి, దృక్పథాలు, విలువలు, నమ్మకాలు, వ్యవహరింపు, స్వీకరణ వంటివన్నీ ప్రభావాన్ని చూపుతాయి ఆలోచనా విధానం మరియు చర్యల మధ్య కూడా దోలాయమానాలలో ఒక స్థిర చిత్తాన్ని చూపలేకపోవడం అనేది పలు సమస్యలు చుట్టుముడితేనే తెలుస్తుంది. అలా అడుగుని ముందుకు వేయలేని, వెనక్కి తీయలేని సంకటం అనుక్షణం మధ్యతరగతి మనస్త్వానిది. దీంతో పైకి ఒకలా కనిపించి లోపల భిన్నంగా ఉండట వ్యక్తిత్వంపై ప్రభావాన్ని చూపుతుంది.

సమాజాన్ని ప్రతీ నిమిషం దృష్టిలో ఉంచుకునే మనిషి తన స్వీయ పరిస్థితులకు తలవంచాల్సి ఉంటుంది. కుటుంబం, బంధాలు, ఆలోచనలు, ఆచరణలు వంటివన్నీ కలవరపెడుతుంటే, అడుగులు తడబడుతున్నా నడవక తప్పదు. ఒక రకంగా అన్నింటినీ అతిగా మీద వేసుకుని వ్యక్తిత్వాన్ని కూడా అటు ఇటు చేసుకునే వ్యక్తుల మనోస్పందనలు సాహిత్యానికి వస్తువులు, విశాలం-సంకుచితం, మూర్ఖత్వం మేధావిత్వం, ఆవేశం -శాంత మూర్తిత్వం, ఉన్నతనం లేనితనం వీటికి మధ్యస్తంగా ఉండకతప్పని పరిస్థితులు వీటి నడుమ తానేంటో తనకే తెలియనితనం ఆవహిస్తే అదే మధ్యతరగతి మనస్తత్వం. ఆర్థిక ఆటుపోట్లు, లేనిపోని భయాలు, అతి ఊహలు, మార్పుని ఆశించలేని తీరు, పోరాడలేని తత్వాలు, సర్దుకుపోయే గుణాలు వంటివన్నీ మనసుతోనూ మనిషితోనూ ఆటలాడుతాయి. ఆ ఆటలో పావుగా మారిన మధ్యతరగతి మనిషి మనస్తత్వాల గురించి రచయిత కథానుగుణంగా చర్చించారు. అన్నింటికీ కొట్టుకుపోతూ తననితానే నడిపించుకునే వ్యక్తుల అంతరంగాల సూక్ష్మశోధన ఈ కథల్లో దాగుంది.

కూతురే కావాలి...:

**పరిచయం :**

ఈ కథ 'సింహతలాటం' కథల సంపుటిలోనిది. ఈ

కథను 'తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి' రాసారు. సెప్టెంబరు తొమ్మిది, 2020 సంచికనందు వెలుగు జ్యోతి' పత్రిక ఈ కథను ప్రచురించింది.

**కథా సంగ్రహం :**

సత్తియ్య, దుర్గాభవాని దంపతులకు తొలి కాన్పులో మహాలక్ష్మి పుడుతుంది. కొడుకు పుడతాడని ఎదురు చూసిన సత్తియ్య ఆడపిల్ల పుట్టగానే వీరంగం చేస్తుండగా తల్లి వెంకాయమ్మ బుద్ధి చెప్తూ తిడుతుంది. రెండో కాన్పులో కొడుకు పుట్టగా వాడికి ఆనందం అని పేరు పెట్టి సత్తియ్య సంబరాలు చేస్తాడు. కూతుర్ని చిన్నచూపు చూస్తూ ఆమెకి చదువుకూడా చెప్పించక కొడుకుని మాత్రం బాగా చదివిస్తాడు. కారు డ్రైవరు నుండి కార్ల యజమానిగా ఎదిగిన సత్తియ్య తన వద్ద పనిచేసే కళ్యాణ్‌కి మహాలక్ష్మి నిచ్చి పెళ్ళిచేస్తాడు. ఆనందం విదేశాలకు వెళ్ళి అక్కడే స్థిరపడిపోయి కన్నవారికి పూర్తిగా దూరమైపోతాడు. సత్తియ్యకు కాన్సర్ జబ్బు వచ్చినా ఆనందం తిరిగి మరిగి చూడడు. కూతురు, అల్లుడు అతడి దీర్ఘకాలిక చికిత్సకు తోడుగా నిలబడతారు. మహాలక్ష్మి తండ్రి సేవకు అడ్డంకి అవుతుందని గర్భవిచ్ఛిత్తి చేయించుకుని మరీ తండ్రినే బిడ్డగా చూసుకుంటుంది. ఇదంతా చూసి సత్తియ్య తన బుద్ధికి పశ్చాత్తాపం చెందుతాడు. ఆస్తిని అల్లుడి పేరు మీద రాస్తానన్నా కూతురు వద్దంటూ అందరం ఆనందంగా కలసివుంటే చాలంటుంది.

**విశ్లేషణ :**

మధ్యతరగతి మనస్తత్వాల గురించిన అవగాహనలకు ఈ కథ తావిచ్చింది. సంతానంగా ఆడపిల్ల, మగపిల్లాడు అనే వివక్ష చూపే విషయంలో పురుషుని ఆలోచనలు, స్త్రీ ఆలోచనలు ఎలాంటి విరుద్ధ భావాలను ప్రతి ఫలిస్తాయో తప్పక తెలుసుకోవలసిందే, వారు భార్యా భర్తలుగా అర్ధనారీశ్వరంలో చెరోసగం అయినా సంతానం విషయంలో వారి మనో సంఘర్షణలు వేరువేరు అభి ప్రాయాలతో ఉండటం గమనించాల్సిన విషయం. ముఖ్యంగా ఈ తరగతివారి ఆర్థికవనరులు, ఆశలు, ఉద్దేశ్యాలు జీవితాలపై ఆలోచనల్లోనూ, ఆచరణల్లోనూ ప్రభావం చూపుతుంటాయి. వాటిని పక్కనపెడితే అనాదిగా తండ్రి పురుష సంతానాన్నే కావాలని అను కుంటాడు. పితృస్వామిక సమాజ కుటుంబ ప్రతినిధిగా మగ పుట్టుకనే తనింట కోరుకోవడంలో కొన్ని స్వార్థాలు ఆశలు, భయాలు, బాధ్యతలు ప్రభావితం చేస్తుంటాయి. అవి ఎలాంటివో తెలియాలంటే మధ్యతరగతి తండ్రిగా పురుష సంతానాన్నే కావాలనుకోడానికి కారణాలను అన్వేషించాలి. అవి ఎటువంటివంటే ముందుగా సమాజ పోకడ గురించి ప్రస్తావించుకోవాలి, ఇంటా బయటా ఒక మగాడి మాటే చెల్లుబాటు అవుతూ స్త్రీ అంటే విలువలేనిది అనేంతగా పురుష పెత్తనాధికారాలుంటున్నాయి. కనుక ఒక మగాడు తన వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న అబ్బాయినే కొడుకుగా కోరుకుంటుంది.

అలాగే అత్యంతగా సాంప్రదాయకతలను అన్నింటా పాటించే మధ్యతరగతి కొడుకే పున్నామనరకం నుండి తప్పిస్తాడని విశ్వసిస్తుంది. అలాగే సత్తియ్యకూడా కొడుకైతే రాయిపెడతాడు కూతురైతే రాయి పెట్టదు అంటూ భావించాడు. బతికుండగా తన వారసునిలో తనని చూసుకోవాలి అనుకోవడం, మరణించాక తలకొరివి పెట్టి స్వర్గప్రాప్తిని అందించే కొడుకునే ఆశించడం బలంగా నాటుకున్నాయి. మగ పిల్లాడు వంశాన్ని తననూ ఉద్ధ రిస్తాడనే నమ్మకం, తన వారసత్వ వారసుని కోరుకునేలా చేస్తాయి. ఇదే మగవాడి మనస్తత్వంలో నాటుకుపోతుంది అన్నది సత్తియ్య పాత్ర ద్వారా చూపించే దిశగానే ఆ పాత్రని తీర్చారని తెలుస్తోంది.

ఇక మగపిల్లాడిని సంతానంగా పొందాలనే మగాడి మనస్సు భార్యని దూషించడానికో, బెదిరించడానికో ఏమాత్రం వెనకాడదు. అసలు ఆడపిల్ల పుట్టడానికి సైన్స్ సంబంధితాలను పరిశోధించి చూసినపుడు స్త్రీ ప్రమేయం క్రోమోజోముల పరంగా ఉండనే ఉండదని తేల్చబడింది. సాధారణంగా ఇది తెలియని, అజ్ఞాని ఓ మూర్ఖత్వంతో భార్యనే తప్పు పడతాడు. అది చివరకు 'ఇదిగో నీకే చెప్తున్నా ఆడపిల్లైతే మీ పుట్టింట్లో వదిలేసి వస్తేనే నీ కాపురం వుంటుంది. నామాట కాదని ఆడపిల్లను తీసు కొచ్చావంటే నీ సంగతి చూస్తా'ని సత్తియ్య భార్యతో పలికేంత దారుణంగా తయారుచేస్తుంది. 'ఇదిగో దుర్గా

ముందే చెప్తున్నాను. ఈసారి మగ పిల్లాడైతేనే ఈ టపాసులు కాల్చుకొంటూ నిన్ను ఇంటికి తీసుకెళ్ళి పండగ చేస్తా ఆడపిలైతే ఇదిగో ఈ టపాసులతో ఇక్కడే..' అనే అతని మాటలు పూరిస్తే నిన్నూ, అనే అర్థమే వస్తుంది. మగబిడ్డ కావాలనే ఆశ, ఆరాటం ఎంతో పరాకాష్టకి చేర్చుకున్న మనస్తత్వాలే ఇలా ఉన్మాదంగా ప్రవర్తిస్తాయి. అలాంటివారు చివరకు పుట్టిన ఆడపిల్లకి చదువు చెప్పించక, పెళ్ళి విషయంలోనూ శ్రద్ధ చూపక ఇంట్లో ఏ చెడు జరిగినా దాన్ని ఆడపిల్లకే చుట్టబెట్టగలరు. అలాగే జీవితాంతం భార్యను 'ఇంట్లో ఆడపిల్ల పుట్టింది దరిద్రం పట్టింది ఆ రోజే వదిలేయమంటే వదలకుండా తీసుకొచ్చింది' అని చెప్పే నీచాన్ని ప్రకటించే దారుణ మనస్తత్వం పురుషహంకారాన్ని చూపేలా తయారు చేసింది. దీనికి తోడు 'ఆడపిలైతే ఖర్చులు అదే మగ పిల్లాడైతే ఖర్చులేం వుండవు' అన్నట్టి సత్తియ్య మాటల్లో ఆర్థికపరలాభాలు మగపిల్లాడి ద్వారానే లభిస్తాయనే భావం ఉంది మగ పిల్లాడిది ఉద్యోగం, కట్నం ద్వారా డబ్బుని తెచ్చిచ్చే పుట్టుక అని ఆశించాడు. అడపిల్ల పెంపకం, చదువు, పెళ్ళి ఖర్చు అనుకున్నాడు. ఫలితంగా 'చూసావుటే అమ్మా నా కొడుకు ఇంజనీరు అమెరికాలో ఉద్యోగం నెలనెలా నాకు డబ్బులు పంపుతున్నాడు. అదీ మగపిల్లాడంటే. అదే ఆడపిల్ల మహాలక్ష్మిని చూడు పుట్టిన దగ్గర్నుంచీ ఖర్చులే కదమ్మా' అని తల్లితో పలికి సంతృప్తి, అసంతృప్తుల్ని మగ, ఆడ సంతానాలకు కట్టబెట్టాడు. దాదాపు మధ్యతరగతి మగాడి ఆలోచనలు, అహం ఇలాగే ఉంటుందనే స్పష్టతని రచయిత ప్రస్తావించారని తెలుసుకోవచ్చు.

మధ్యతరగతి ఇల్లాలు ఆడపిల్లనే బిడ్డగా కోరుకుంటుంది. తనకు ఒక తోడు అని, అడ పుట్టుక ఇంటి బాధ్యతల్ని సరిగా నెరవేర్చగలదని నమ్ముతుంది. తానెలా పుట్టింటికి, అత్తింటి గౌరవాన్ని నిలిపిందో అలాగే తన కూతురూ ఓ వెలుగు తెస్తుందని విశ్వసించే తీరుతో ఉంటుంది. అందుకే భర్త మూర్ఖత్వాన్ని మౌనంతోనో, గొడవ పడో ఎదుర్కొని ఆడపిల్లని ఆప్యాయంగా పొదవుకుని పెంచి పెద్దచేస్తుంది. ఇక ఆధునిక కాలంలో స్త్రీకి స్త్రీనే వత్తాసు పలికే శక్తిని పొందింది. ఆడపిల్ల కావాలని ఆమెని భ్రూణహత్య నుండి కాపాడుకుంది. ఒకప్పుడు ఆడబిడ్డ పుట్టక ముందో, పుట్టిన తర్వాతో చంపేంత పాశవికత ఉండేది. ఇప్పుడు అలాంటివాటిని స్త్రీలంతా అడ్డుకోగలిగారు. ఆడపిల్ల పెళ్ళికి సొంతంగా కూలిపని అయినా ఆమె చేసుకుంటూ పొదుపు చేయగలుగుతోంది. వరకట్న చావుల్ని చాలావరకూ నియంత్రించగలుగుతోంది. ఆడది అబలకాదు సబల అని అన్నింటా ఆమె మనస్తత్వమై ప్రకటింపబడుతోంది. దీనికో రుజువుని కూడా ఈ కథలో చూడొచ్చు. ఒకప్పుడు అమ్మగా ఆడపిల్లని కోరి అత్తగా కొడుక్కి వత్తాసు పలికి ఆడపిల్లైన కోడల్ని అత్త భాదించేది. కానీ నేడు ఆమె హృదయం విశాలత పొందింది. వెంకాయమ్మలా కొడుకు భావజాలాల్ని చెంపదెబ్బ కొట్టింది. కోడలికి అండగా నిలిచి రేయ్ సత్తిగా ఇందులో దుర్గాభవాని ఏం చేస్తాది రా? దేవుడు మనకి ఏమిస్తే దానిని సంతోషంగా పెంచుకోవాలి. మగాడైతే నెత్తి మీద రాయెడతాడు ఆడదైతే పెట్టదేంటి?' అని అనగలిగింది. 'నా కొడుకు నా మాట వింటాడు' అని కొడుకుకై కలలు గన్న సత్తియ్య మాటవిని 'చూద్దాం ఆడపిల్ల అక్కరికొస్తాదో నీ కొడుకు అక్కరకొస్తాడో, అని కొడుకుకే సవాల్ విసిరింది. మహాలక్ష్మి పుట్టుకని ఆనందంగా ఆహ్వానించింది. ఈ మాటలన్నీ లింగ వివక్షత వద్దని స్త్రీ, స్త్రీ వైపు నిలిచి గళమెత్తిందనడానికి నిదర్శనం. అమ్మైనా, ఆళియైనా ఆమె ఆడదిగా మరో ఆడదాని పుట్టుకకి గౌరవాన్నే ఆపాదిస్తోంది.

అలా ఆమె మనసుని కాలంతో పాటు వివేకంతో తీర్చిదిద్దుకుందని తెలుసుకోవచ్చు. అలా మనోవిశాలతని మగాడి కన్నా అధికంగా పెంచుకోగలిగింది. కొసమెరుపుగా ఒకటి చెప్పుకోవాలి. మధ్యతరగతి స్త్రీ 'ఆడదంటే ఖర్చు కాదు, ఆడదంటే వరం' అని దుర్గాభవానీలు, వెంకాయమ్మలు తెలియపరుస్తూనే ఉన్నారు. సత్తియ్యకి కూతురంటే, గుండెల్లో బాధలనే రాళ్ళని తొలగించే తల్లి అని తెలియవచ్చింది.. కానీ సమాజాన్ని పరికించి నిశితంగా గమనిస్తే స్త్రీని నిలుపుకుని ఆదరించే విజ్ఞాని అయిందని సంపూర్ణంగా విశ్వసించవచ్చు. కానీ ఇప్పటికీ మధ్యతరగతి తండ్రి భార్య గర్భవతి కాగానే, కాన్పు సమయంలోనూ ఓ మగ నలుసుని ప్రసాదించు తండ్రీ అంటూ ఆ దేవుని మగ సంతానాలకే వేడుకుంటున్నాడు. ఆడపిల్ల పుడితే

కొంత మౌనాన్ని వహించి ఆమె ఖర్చుల్ని మనసులోనే లెక్కేసుకుంటున్నాడు. పురుష స్వామిక సత్తియ్యలు కొడుకుకై పడే ఆరాటానికి ముగింపులేదనేది స్పష్టం అవుతుంది. స్త్రీని స్త్రీ నిలుపుకునే మనస్తత్వంలో ఓ మధ్యతరగతి మహిళ ఆడపిల్ల ఈ సమాజంలోనికి స్వాగతిస్తోంది. ఈ భావజాల భిన్నత మాత్రం మనస్తత్వాల పరంగా స్త్రీ, పురుషుల మధ్య కొనసాగుతూనే ఉంది అని ఈ ఉద్దేశ్యాన్ని కథ ద్వారా గ్రహించాను, మధ్య తరగతి మగవాడికన్నా ఈ తరగతి స్త్రీల మనో వికాసాన్ని రచయిత స్పష్టపరిచిన తీరుని వెంకాయమ్మ, దుర్గాభవానీ, మహాలక్ష్మిల మనస్తత్వ వెల్లడిలో పరికింపజేసారు.

**సర్దుకుపోవాలిరా సుబ్బారావూ :**

**పరిచయం :**

ఈ కథ 'రథ యాత్ర' కథాసంపుటిలోనిది ఈ కథను 'తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి' రాసారు. 'ఆలాపన' మాసపత్రిక అక్టోబరు, 2001 సంచికలో ఈ కథను ముద్రించింది.

**కథా సంగ్రహం :**

ఒక ఊరిలో నివసిస్తోన్న దంపతుల ముగ్గురు కొడుకుల్లో సుబ్బారావు మధ్యలోనివాడు. చిన్నప్పటినుండీ 'మంచివాడివి కాబట్టి సర్దుకుపోవాలిరా సుబ్బారావూ' అంటూ కన్నవారు అతడిని అన్నింటా సర్దుకోమనేవారు. అన్నవాడినవి సుబ్బారావు వాడుకోవలసిందే అవి. బట్టలైనా, పుస్తకాలైనా, అదే తమ్ముడు మాత్రం చిన్న వాడనే గారంతో అన్నీ సాధించుకునేవాడు, పెద్దకొడుక్కి మంచి చదువులు చెప్పించిన తల్లిదండ్రులు సుబ్బారావుని చదివించే విషయంలో తాము తూగలేమంటారు. అన్నా, తమ్ముడు మాత్రం జీవితంలో బాగా స్థిరపడగా మధ్య నున్నవాడిగా సుబ్బారావు గుమాస్తా అవుతాడు. చివరకు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయి. విషయంలోనూ అతడినే సర్దుకుపొమ్మంటారు. నలుగురాడపిల్లల తండ్రిఅయినా, ఇంటా బయటా, పనిచేసే చోటా అతడే అన్నింటికీ సర్దుకు పోవాల్సి ఉండేది. అలా ఉండటంలోనే అతడు తన సంతృప్తిని వెతుక్కునేవాడు.

**విశ్లేషణ :**

మధ్యతరగతి మనస్తత్వాలకు అద్దంపట్టిన ఈ కథ కొందరు చదువరులకు ఇది నాకథే అనిపించక మానదు. ఈ తరగతి వారిలోని పెద్దల, వారి సంతానాల మనో విశ్లేషణని. ఇంతగా చేయాలంటే ప్రత్యక్ష, పరోక్ష అనుభవ జ్ఞానమేనని చెప్పాలి. ఇక్కడ కథ మనస్తత్వ శాస్త్రవేత్తగా మారి పరిస్థితులను, ప్రవర్తలను, మనో సంకటాలను తవ్వి తీసిందని భావించాలి. మధ్యతరగతి అనగానే ముగ్గురు, నలుగురు సంతానాలు, ఆర్థిక కష్టాలు, సర్దుకోక తప్పని పరిస్థితులు అనేవి చెప్పకనే తెలిసే అంశాలు. వీటి మధ్య జీవనంలో ఒక్కో కుటుంబ సభ్యుని జీవితం ఒక్కో గ్రంథం అనే అనిపిస్తుంది. అలాంటి ఈ కథ మనసుల్ని, మనుషుల్ని వడపోసి అందించిందవాలి.

ముందుగా మధ్యతరగతి తల్లిదండ్రులు మనస్తత్వా లెలాంటివో గమనిద్దాం తర్వాత సంతానాల గురించి చర్చించుకోవచ్చు. ఎంత చెట్టుకి అంతగాలి అని కాకుండా ఒక బిడ్డ కాకుంటే మరొక బిడ్డ చూస్తాడు కదా! అనే ఆలోచన వీరిది. దీనికి తోడు చెట్టుకి కాయ భారమా! అని తమకి తామే చెప్పుకుని పోషించే స్తోమత లేకున్నా ఎక్కువ మంది సంతానాలను పోగుచేసుకుంటారు. అక్కడి నుండి అందరికీ అన్నీ అందించలేక, సర్దలేక సంతానంలో ఎవరు మెతకవారో, ఎవరు చెప్పిన మాట వింటారో వారిని 'మంచివాడు', 'మాటవింటాడు' అని ఉద్దేశ్యపూర్వంగానే పొగిడి వారికి తెచ్చుకుంటారు. ఆ నిమిషం సుబ్బారావు లాగే ఎన్ని కోల్పోతాయో తెలియకనే తమనితాము సర్దుకునే త్యాగశీలిగా నిలుపుకునే యత్నాన్ని కొడుకో, కూతురో చేయడం వారి ప్రమేయం లేకనే జరిగిపోతుంది. ఇంటికి పెద్ద బిడ్డ మీద ఎక్కడా లేని మమకారం ఉం టుంది కనుక ఆ బిడ్డని మాత్రం అన్నింటినీ కన్నవారు సమకూర్చేయగలరు. ముందుగా పెద్దబిడ్డ తమ చేతికి అందివస్తాడని వారి ఆశ, ఆరాటాలు, వారసత్వం ఆ ప్రథమ సంతానానికి ఒక వరం. ఇక ఇంట్లో చిన్నవాడిగా పుట్టినవాడిని చిన్నోడు, చిట్టోడు అంటూ నెత్తిమీద పెట్టుకుని అతిగారాభం చేస్తారు. అలా పెద్ద, చిన్న సంతానాలకు పెట్టని కిరీటాలు పెట్టినట్లు రాజా బతుకుని తల్లిదండ్రులే అందిస్తారు. ఇక వారిమధ్య సుబ్బారావు వంటి సంతానం అందరితోనూ అన్నింటితోనూ సర్దుకోవల సిందే.

కన్నవారు పెద్ద బిడ్డ వద్ద తమ అసహాయతని చెప్పుకోడానికి ఇష్టపడరు. అడిగిన చదువు, కోరిన బట్టలు, అందిన సౌకర్యాలు అతడి సొంతం. ఇక చిన్నవాడు ముద్దు మురిపాలనే ఆయుధాలుగా చేసుకుని ఎవరివద్దనైనా దేన్నైనా సాధించుకోగలడు. అది ఒక్కోసారి తల్లిదండ్రుల్ని, తోబుట్టువులని గదమాయించి అన్నీ సాధించుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అవుతుంది. అలా అమ్మా నాన్నలు అన్నీ సమకూర్చేది మొదటి, చివరి బిడ్డలకే కావడం యాదృచ్ఛికమే అయినా దాదాపు ఇదే తంతు మధ్య తరగతి పెద్దలది. ఇక సుబ్బారావుల సంగతికి వస్తే ప్రతీదీ ముందు పుట్టినవాడివే తనవిగా భావించాల్సిందే. ఇష్టమైనవి ఏవైనా ఉంటే 'నువ్వు మంచివాడివి కదా వాడు చిన్నోడు కదా వాడికిచ్చేయ్' అంటూ తల్లిదండ్రులు తమ్ముడికే వత్తాసు. 'పెద్దవాడి చదువుకోసం ఎన్నో అప్పులు చేసాం కదా' అనే మాటలతో మంచి చదువూ దక్కడు ఇక పెళ్ళి విషయంలోనూ కన్నవారి మాటే, ఎంపికే ప్రధానం అవుతుంది. పుట్టింది మొదలు చివరి దాకా మధ్యలో పుట్టినవారు ఆకాశానికి, నేలకు చెందక ఊగిసలాడుతూ ఉండిపోవలసిందే. దీంతో దేన్నీ సాధించుకోలేని చేతగానితనం తెలియకనే చేరుతుంది. మంచివాడు అనే పొగడ్తని పోగొట్టుకోలేక తలవంచడమే నేర్చుకుంటాడు. ప్రతీదీ పరిస్థితులకు జతపరిచి నాకు దక్కింది చాలు అనే సంతృప్తి వాదానికి అలవాటు పడిపోతాడు. తమకాళ్ళపై తామున్నా వారి అడుగులు మాత్రం వేరొకరు నిర్దేశించేవే అవుతాయి. అలా అన్నింటికీ సర్దుకుపోవడాన్ని జీర్ణించుకున్నప్పుడు పరిస్థితులకు, సందర్భాలకు, పెద్దలకు, పిన్నలకు, ఇంటా, బయటా, కార్యాలయాల్లోనూ, స్నేహితులవద్ద చివరకు ఎవరివద్దనైనా, దేన్నైనా, దేనికైనా తామే తగ్గి ఉండటాన్ని ప్రవృత్తిలో భాగం చేసుకుంటారు అది సహనమో, మంచితనమో, చేతగానితనమో, సాధించుకోలేని తత్త్వమోగానీ వారికేం కావాలో వారికే తెలియని అయోమయంలోనికి నెడుతుంది 'అయినా నాకంటే ఈ ప్రపంచంలో ఎన్నో బాధలు పడేవాళ్ళు ఉన్నారు. వాళ్ళందరికన్నా నేను చాలా బెటర్' అని సుబ్బారావు జీవితంలో పడిన రాజీ కట్టెకాలేదాకా తప్పనిది, దాదాపు ఏ మధ్యతరగతి నడి మధ్య సంతానం ఈ విధంగానే ఉంటుందని తేల్చి చెప్పేస్తూ కథని కృతజ్ఞతలతో ముగించడం చూస్తే ఆయా మనస్తత్వాలను అభివర్ణించిన తీరు ప్రతీ అక్షరంలోనూ అవగతమైంది.

మధ్య తరగతి మనస్తత్వాలు మారనివి, మూసపోసినవిగా ఉంటాయి సుబ్బారావుకే తిరిగి ముగ్గురు పిల్లలు పుట్టినా మధ్యవాడు మరో సుబ్బారావే అవుతాడు. తాను పడింది తనకి తిరిగి అనుభవానికి వచ్చే రోజుకు తిరిగి తన కన్నవారిలాంటి ప్రవర్తన, మాటల్నే వెలువరిస్తారు. అందుకే ఈ సమాజంలో మధ్య తరగతివాడికి పోరాడటం తెలియదు. అనుసరించడమే తెలుసు అనే చెప్పాలి. తనతోతాను విభేదించుకోలేని, తన పరిస్థితులతో తాను తిరగబడలేని తీరుతో సర్వత్రా వ్యవహరించడం ఈ తరగతి మనస్తత్వాలకే చెల్లింది. ముందు ప్రశ్నించుకుని తన తప్పుని సరిచేసుకునే ప్రయత్నం సుబ్బారావు కన్నవారిలో లేదు. తనని తాను తీర్చిదిద్దుకోలేని అసహాయతలకు ఉదారవాదాన్ని పూతపూసి తృప్తి పడిపోవడం జరుగుతుంది. మారని, మార్పులేని, మార్పునికోరని మనస్తత్వాలెపుడూ ఉన్న దానిలో ఆనందాన్ని వెతుక్కుని తృప్తి అనే తెడ్డుతో జీవనకాలాన్ని దాటేస్తారు. ఎం కోల్పోయామో ఆలోచించలేని అసహాయతే వారి జీవితాలకు రక్ష. లేదంటే అసంతృప్తుల మయమైన బతుకు వారికీ, వారివారికీ పరీక్షలనే పెడుతుంది. తమ గమనాన్ని రణరంగం చేసుకోలేని సుబ్బారావులు శాంతి వచనాలతో, వైరాగ్యపు భావాలతో దాదాపు ప్రతీ మధ్యతరగతి ఇంట్లోనూ ఓ మరబొమ్మగా బతుకుతూనే ఉన్నారు. వారు వేసిన అడుగులు, వేస్తున్న అడుగులు, వేయబోయే అడుగులు సర్దుకుపోవడంలోనే కలగలిసి పోగలవన్న వాస్తవాన్ని వెలికితీసారు.

**ఆధార గ్రంథాలు:**


1. సింహతలాటం : కథల సంపుటి - తెన్నేటి లక్ష్మీనరసింహం
2. రథయాత్ర: కథల సంపుటి - తెన్నేటి లక్ష్మీనరసింహం
3. తెన్నేటి కథలు: కథల సంపుటి - తెన్నేటి లక్ష్మీనరసింహం
4. కథాశిల్పం: వల్లంపాటి సుబ్బయ్య

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఉన్నత పాఠశాల తెలుగు వాచకాలు:నిర్మాణ రూపకల్పనపై విశ్లేషణ



- గంగాధర్

పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్ పల్లి, నిజామాబాద్.

**వ్యాస సంగ్రహం (Abstract)**

ఉన్నత పాఠశాల స్థాయిలో (ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు) తెలుగును ప్రథమ, ద్వితీయ భాషలుగా బోధిస్తుంటారు. విద్యా బోధనలో పాఠ్యపుస్తకం (వాచకం) కీలక పాత్ర పోషిస్తుంది. 1996వ సంవత్సరం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, ఆ తదుపరి 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలోనూ తెలుగు వాచకాల రూపకల్పనలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. విద్యా విధానం, భాషా అభ్యసన పద్ధతులు, సామాజిక అవగాహన, పాఠ్య సూత్రాల మార్పులు మరియు నూతన బోధనా విధానాల ప్రభావం వాచకాల నిర్మాణంలో స్పష్టంగా ప్రతిఫలించాయి. ముఖ్యంగా 2015-16 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (రాజజు=ు) సరికొత్త దృక్పథంతో వాచకాల రూపకల్పన చేపట్టింది. విద్యార్థుల అవగాహన, భాషాభివృద్ధి, సాహిత్యాభిలాష, విమర్శనాత్మక దృక్పథం, భాషా సామర్థ్యాల సాధన మరియు విలువల విద్యను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నూతన వాచకాలు రూపొందాయి. ఈ వ్యాసం తెలుగు వాచకాల రచన, పరిణామం, నిర్వచనం, రకాలు మరియు వాటి రూపకల్పన విధానాలను వివరిస్తుంది.

**కీలక పదాలు :**

తెలుగు వాచకాలు, వాచకం నిర్వచనం, వాచక రచన, వాచకాల రూపకల్పన, ఆంధ్రప్రదేశ్ పాఠ్య సూత్రం, తెలంగాణ పాఠ్య సూత్రం, విద్యాసంస్కరణలు, ఉన్నత పాఠశాల పాఠ్య వస్తు అభివృద్ధి.

## 1. పరిచయం (Introduction)

పాఠశాల విద్యా దశలో, ఉన్నత పాఠశాల స్థాయిలో తెలుగు వాచకాలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. భాషా బోధనలో 'పాఠ్య వస్తువు' (Content) అనేది ఒక ప్రధాన ఉపకరణం. ప్రాథమిక దశ దాటి ఉన్నత పాఠశాల దశకు చేరుకునేసరికి విద్యార్థులలో వచన రచనా శక్తి, కావ్య శైలీ స్పృహ మరియు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయి. ఈ దశలో విద్యార్థుల భాషాభివృద్ధికి తెలుగు వాచకాలు అత్యంత కీలకమైన బోధనా సాధనాలుగా ఉపయోగపడతాయి. నేటి వాచకాలు కేవలం పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థులలో భాషా నైపుణ్యాలు, జీవన విలువలు, సాహిత్యాభిరుచి మరియు విశ్లేషణా శక్తిని పెంచే విధంగా రూపొందించబడ్డాయి. వివిధ రాష్ట్రాల విద్యావిధానాలు, సమకాలీన సామాజిక పరిస్థితులు, సాంస్కృతిక ప్రభావాలు

మరియు ప్రభుత్వ నిర్ణయాలు వాచకాల రూపకల్పనను ప్రభావితం చేస్తాయి.

**2. తెలుగు వాచకాల రచన – చారిత్రక పరిణామం :**

తెలుగు వాచకాల రచనను చారిత్రక కోణంలో పరిశీలిస్తే అది వివిధ దశలుగా అభివృద్ధి చెందిందని అర్థచేసుకోవచ్చు. ప్రాచీన కాలం (క్రీ.శ.11-18 శతాబ్దాలు): ఈ కాలంలో తెలుగు సాహిత్యం ప్రధానంగా పద్య కావ్యాలు, ధర్మశాస్త్రాలు మరియు పురాణాల రూపంలో ఉండేవి. ఇవి గురుకులాలలో విద్యార్థులను చదివించి అర్థం చెప్పడానికి ఉపయోగపడేవే కానీ, ఆధునిక అర్థంలో ఇవి 'వాచకాలు' కావు.

**బ్రిటిష్ పాలన (1830 – 1900) :**

తెలుగు వాచకాలు ఆధునిక రూపాన్ని సంతరించుకోవడం ఈ కాలంలోనే ప్రారంభమైంది. 1853-1880 మధ్యకాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ విద్యాసంస్కరణల ఫలితంగా పాఠశాలల కోసం ప్రత్యేక పాఠ్యపుస్తకాలను సిద్ధం చేయడం మొదలైంది. బోధన కోసం ప్రత్యేకంగా రాసిన గద్య పాఠాలు ఏర్పడ్డాయి. కందుకూరి వీరేశలింగం, గూర్చర్ల రామశర్మ, చిలకమర్తి లక్ష్మీనరసింహం, బాలగంగాధర తిలక్ వంటి మహనీయులు విద్యార్థుల కోసం గద్య రచనలు చేశారు.

**నియమబద్ధమైన వాచకాలు (1900 – 1956):**

ఈ కాలంలో పాఠ్యపుస్తక కమిటీలు ఏర్పడి, ప్రామాణిక వాచక పుస్తకాలను రూపొందించాయి. విద్యార్థుల స్థాయిని బట్టి పరిచయ వాచకాలు, నైతిక వాచకాలు మరియు సాహిత్య వాచకాలుగా వర్గీకరించారు.

**ఎస్.సి.ఇ.ఆర్.టి (SCERT) శకం (1956 – 1980):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (SCERT) అధికారికంగా వాచకాల రూపకల్పన బాధ్యతను చేపట్టింది. భాషా నైపుణ్యాభివృద్ధి, పఠన సామర్థ్యం, నైతిక విలువలు మరియు సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు.

**నూతన విద్యా విధానం & సి.ఎల్.టి (1980 – 1996):**

ఈ కాలంలో కమ్యూనికేటివ్ లాంగ్వేజ్ టీచింగ్ (జుూ) పద్ధతిని ప్రవేశపెట్టారు. దీని ద్వారా వాచకాల్లో సంభాషణలు, నృత్యం, శాస్త్రవిజ్ఞానం మరియు సమకాలీన విషయాలు చోటుచేసుకున్నాయి. విద్యాసంస్కరణలలో భాగంగా నూతన వాచకాల నిర్మాణం జరిగింది. కథలు, వ్యాసాలు, జీవిత చరిత్రలతో పాటు పర్యావరణ అంశాలు పాఠ్యపుస్తకాల్లో చేరాయి.

**తెలంగాణ ఆవిర్భావం–నూతన వాచకాలు (2014 తర్వాత):**

2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత, 2015లో తెలంగాణ SCERT (హైదరాబాద్) ద్వారా నూతన వాచకాలు రూపొందించబడ్డాయి. వీటిలో తెలంగాణ దృక్పథం, తెలంగాణ ప్రజల అవసరాలు, ఆత్మగౌరవం, సంస్కృతి మరియు సాహిత్యాన్ని విరివిగా పరిచయం చేశారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల మాండలికాలు, కవులు మరియు రచయితలకు సముచిత ప్రాధాన్యత కల్పించారు.

**వాచకం – నిర్వచనం :**

వాచకం అంటే కేవలం వాక్యాల సముదాయం కాదు. "ఒక నిర్దిష్ట లక్ష్యంతో, నిర్దిష్ట సందర్భంలో, పాఠకునికి అర్థమయ్యే విధంగా నిర్మించబడిన అర్థవంతమైన భాషా విభాగం లేదా భాషా రూపం." ఇది ఒక కేంద్రక భావం కలిగి, సందర్భానుసారంగా, ఒక నిర్దిష్ట శైలిలో నిర్మించబడిన సంపూర్ణ అర్థవంతమైన రచన.

**తెలుగు వాచక లక్షణాలు :**

ఉన్నత పాఠశాల తెలుగు ప్రథమ భాష వాచక లక్షణాలను ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు:

**భాషా లక్షణాలు :**

**వ్యవహారిక భాష :**

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే శిష్ట వ్యవహారిక భాషను ఉపయోగించడం.

**శైలి వైవిధ్యం :**

కథ, కథానిక, వ్యాసం, సంభాషణ వంటి వివిధ ప్రక్రియలకు తగిన శైలిని పాటించడం.

**పదజాలం :**

నూతన పదాల పరిచయం, పర్యాయపదాలు,

నానార్థాలు నేర్చుకునే అవకాశం కల్పించడం.

**నిర్మాణం :**

పేరాలు, విరామ చిహ్నాలు, సంధి రూపాలు, సమాసాలు వంటి వ్యాకరణ అంశాల పట్ల స్పష్టత.

**విషయ లక్షణాలు :**

**సాహిత్య ప్రక్రియలు :**

నవరసాలకు (అద్భుత, హాస్య, కరుణ, వీర, రౌద్ర, శాంత, మొదలైనవి) సంబంధించిన పద్య మరియు గద్య పాఠ్యాంశాలు ఉంటాయి.

**రచయితల వైవిధ్యం :**

ప్రాచీన కవులతో పాటు (నన్నయ, తిక్కన వంటి వారు), ఆధునిక రచయితల (శ్రీశ్రీ, సినారె వంటి వారు) రచనలను స్వీకరిస్తారు.

**సాంస్కృతిక విలువలు :**

మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే శివాజీ, శిబి చక్రవర్తి, రాముడు (పురుషోత్తముడు) మొదలైన వారి పాఠ్యాంశాలను పొందుపరచడం జరిగింది.

**విలువలు :**

మతసామరస్యం, జాతీయ సమైక్యత, ప్రపంచ శాంతి, విశ్వమానవ సోదరభావం వంటి విలువలను పెంపొందించే పాఠాలు ఉంటాయి. శతక పద్యాల ద్వారా నైతిక విలువలను, ఆలోచనా శక్తిని పెంపొందిస్తారు.

**సాహిత్యేతర విషయాలు:**

పర్యావరణం, సామాజిక అంశాలు, నదులు, అడవులు, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతికత వంటి అంశాలను కూడా కథాత్మక శైలిలో లేదా సంభాషణల రూపంలో విద్యార్థులకు అందించడం జరుగుతుంది.

**వాచక రకాలు**

తెలుగు వాచకాలు ప్రధానంగా ప్రథమ భాష వాచకాలు, ద్వితీయ భాషా వాచకాలు మరియు ఉప వాచకాలుగా విభజించబడ్డాయి. వీటిలోని పాఠ్యాంశాల స్వభావాన్ని బట్టి వర్గీకరించవచ్చు.

**కథన వాచకం :**

కథలు, జీవిత చరిత్రలు, ఇతిహాస గాథలు.

**వివరణాత్మక వాచకం (Descriptive) :**

ప్రకృతి వర్ణనలు, వస్తువులు లేదా వ్యక్తుల రూపరేఖల వివరణ.

**నిరూపణాత్మక/ఉపన్యాస వాచకం (Expository) :**

శాస్త్రీయ విషయాలు, సామాజిక విశ్లేషణలు.

**ఆలోచనాత్మక/విమర్శనాత్మక వాచకం :**

అభిప్రాయాలు, సమీక్షలు, సంపాదకీయాలు.

**ప్రేరణాత్మక/సందేశాత్మక వాచకం :**

స్ఫూర్తినిచ్చే గొప్ప వ్యక్తుల జీవితాలు, సందేశాత్మక పాఠాలు.

**సంభాషణ వాచకం :**

నాటకాలు, ఏకాంకికలు, సంభాషణ రూపంలో ఉండే నీతి కథలు.

**పద్య వాచకం :**

పద్యాల ద్వారా భావ వ్యక్తీకరణ, శతక పద్యాలు, కావ్య భాగాలు.

**వాచకాల రూపకల్పన**

వాచకాల రూపకల్పన అనేది ఒక సంక్లిష్టమైన మరియు సమగ్రమైన ప్రక్రియ. ఇది కేవలం పాఠాలను కూర్చడం మాత్రమే కాదు. విద్యార్థుల వయస్సు, మానసిక పరిపక్వత (Psychology), నేర్చుకునే సామర్థ్యం, భాషా నైపుణ్యాలు మరియు బోధనా అభ్యసన సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకుంటారు.

**మార్గదర్శకాలు :**

జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం (NCF), రాష్ట్ర పాఠ్య ప్రణాళిక చట్రం (SCF), మరియు SCERT/NCERT నిర్దేశించిన విద్యా ప్రమాణాల ఆధారంగా వాచకాలు రూపొందుతాయి.

**ప్రధాన అంశాలు:**

**పాఠ్య ఎంపిక :**

విద్యార్థికి ఊహాశక్తిని, సృజనాత్మకతను పెంచే పాఠాలను ఎంపిక చేయడం.

**భాషా ప్రమాణాలు :**

తరగతి స్థాయికి తగిన భాషను ఉపయోగించడం.

**ఆకర్షణీయత :**

విషయానికి తగిన చిత్రాలు , గ్రాఫిక్స్, పట్టికలు ఉపయోగించడం ద్వారా విద్యార్థికి ఆసక్తిని కలిగించడం.

**అభ్యాసాలు :**

పాఠం చివరన భాషాంశాలు, వ్యాకరణాంశాలు, ప్రాజెక్టు పనులు, సృజనాత్మక ప్రశ్నలు ఇవ్వడం ద్వారా సమగ్ర మూల్యాంకనానికి వీలు కల్పించడం.

**ఉపాధ్యాయ మార్గదర్శకత్వం :**

ఉపాధ్యాయులు బోధించడానికి అనుకూలంగా ఉండేలా పాఠ్య ప్రణాళికను రూపొందించడం. ఒక మంచి వాచకం విద్యార్థిలో కేవలం అక్షర జ్ఞానాన్ని మాత్రమే కాకుండా, విలువలని, సామాజిక స్పృహను కూడా నింపుతుంది.

**ఉపసంహారం**

ఉన్నత పాఠశాల తెలుగు వాచకాల రచన, నిర్వచనం, రకాలు మరియు రూపకల్పనలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ఒక స్పష్టమైన అభిప్రాయం కలుగుతుంది. తెలుగు వాచకాలు కేవలం పరీక్షల కోసం చదివే పుస్తకాలు మాత్రమే కాదు. ఇవి విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి, భాషా నైపుణ్యాల పెంపుకు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు మరియు సృజనాత్మక ఆలోచనాశక్తి వికాసానికి మూలాధారాలుగా నిలుస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా, తెలంగాణ రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా రూపొందిన ఆధునికవాచకాలు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ఆధార గ్రంథాలు:**


1. తెలుగు అకాడమి, తెలుగు భాషా బోధన శాస్త్రం, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2014.
2. జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం (NCF-2005), NCERT, న్యూఢిల్లీ, 2005.
3. భారతీయ భాషల బోధన - స్థితిగతుల పత్రం, NCERT/SCERT, 2005.
4. తెలంగాణ రాష్ట్ర పాఠ్య ప్రణాళిక చట్రం (SCF-2011), SCERT హైదరాబాద్, 2011.
5. రాజజు=ు తెలంగాణ, ఉన్నత పాఠశాల తెలుగు వాచకాలు (6-10 తరగతులు), SCERT తెలంగాణ, 2015.
6. రెడ్డి, డి. చంద్రశేఖర్ , తెలుగు బోధన పద్ధతులు, నీల్ కమల్ పబ్లికేషన్స్, 2010.


★★★

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# బి.వి.యస్. స్వామి తెలంగాణ కథా విమర్శ



– రెడ్డి శ్రీనివాస్
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రపంచంలో జాతి, మతం, వర్గాలు ఉన్నాయి, వీటితో బాటు మనదేశంలో కులం ఉంది. కులం అనేది సంకుచితమైనది కావడంతో వాటన్నిటికంటే ఇది ఎక్కువ ప్రమాదకరం. మన హిందూదేశంలోనే చీమ మొదలు బ్రహ్మ వరకు దేవత్వమే అన్నారు. ఇంత మహాసమత మరే ఇతర దర్శన శాస్త్రాల్లోను గోచరించదు. అటువంటి సమతను కల్పించిన హిందూమతంలోనే నీచమైన కుల బేధాలు ఆచరించబడుతూ కొన్ని కులాలలోని మానవులను అంటరాని వారుగా చూశారు. ఆధునిక కాలంలో మతాంతరం చెందినా వారి కులం మారడం లేదు. వైవాహిక సంబంధాలు స్వీయ కులం వారితో మాత్రమే జరగుతున్నాయి. మతాన్ని దాటినా కులాన్ని దాటజాలక పోతున్నారు. కుల విభజన ప్రపంచంలో మరెక్కడా లేదు, ఒక్క భారత్‌లో తప్ప, సమకాలీన భారతదేశంలో వర్గ విభజనతోపాటు కులవ్యవస్థ కొనసాగడం, వర్గ సంబంధాలతోపాటు కుల సంబంధాలు కొనసాగడం భారతదేశ ప్రత్యేక లక్షణం.

తెలంగాణలో 'వెట్టి' అనేది అధికారికంగా అమలులో ఉండేది. పటేల్ దగ్గర జీతం ఆశించకుండా, ప్రతిఫలం లేకుండా దళితులు పనిచేశారు. ఇందులోని అమాన వీయతను చిత్రిస్తూ భాగ్యరెడ్డి వర్మ "వెట్టి మాదిగ" అనే కథ రాశారు. తెలుగు కథా సాహిత్యంలో ఇది తొలి తెలుగు దళిత కథ. బి. సీతారామారావు 'గరీబోన్ని' కథలో వెట్టి గురించి రాశాడు. వెట్టికి వ్యతిరేకంగా బెల్లంకొండ నరసింహాచార్యులు "సీయూసీ సభలు" అనే కథ రాశారు. అంబేడ్కర్ ప్రభావంతో మరాఠీలో వచ్చినంత విస్తృతమైన దళిత సాహిత్యం తెలుగులో రాలేదు. దళిత జీవితంతో మమేకమైన దళితేతర కథకులు తెలంగాణలో అనేకులు ఉన్నారు. బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య తమ కథల్లో దళిత జీవన ఔన్నత్యాన్ని దళితుల సంవేదనను అక్షరీకరించారు. "భూపోరాటాల మీద జరుగుతున్న వివిధ ఉద్యమాల వల్ల తెలంగాణా గ్రామాలు అగ్నిగుండాలుగా మారిన క్రమాన్ని చిత్రించిన కథ "అగ్నిగుండం". ఊళ్ళు అగ్నిగుండాలుగా మారితే, దళితులు అన్నలకు సహాయం చేస్తున్నారన్న నెపంతో పోలీసు హింసకు గురికావడం ఈ కథలో చూడవచ్చు. చదువుతో గెలుచుకున్న జీవితంలో, దళిత మేధావి సమాజానికి బందీ అయ్యే క్రమాన్ని "బందీ" కథలో చూడవచ్చు. స్త్రీవాదోద్యమాలు, సాహిత్యోద్యమాలు, స్త్రీ కెంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించినా, చైతన్యవంతులను చేసినా అవి దళిత శ్రామిక స్త్రీలనంతగా పట్టించుకోలేదన్నది కాదనలేని సత్యం. ఆ లోటును కొంత వరకు తెల్లబట్ట, ఇల్లాలు,

ఎంగిలిచేతో, ఉద్దరింపు కథలు తీర్చాయి. ఇవి దళిత స్త్రీ సమస్యలపై వచ్చిన మంచి కథలు.

1990 నాటికి నల్లగొండ జిల్లాకు చెందిన బోయ జంగయ్య తెలంగాణ దళిత కథకు దీపదారిగా నిలిచారు. గొర్రెలు, దున్న, ఎచ్చరిక, బొగ్గులు మొదలగు కథలు రాసిన జంగయ్య అస్పృశ్యత, నీటి సమస్య, కులపీడన, రాజకీయాధికారం, నీచవృత్తుల నిషేధం వంటి వస్తు వైవిధ్య కథలు రాశాడు. ననుమాసస్వామి రాసిన "మేమిట్లుండం" కథా సంపుటి దళిత ఆత్మగౌరవ పతాకగా చెప్పుకోవచ్చు. "గూడ అంజయ్య కథలు" నిజాం జమానాలోని దళితుల పాట్లను చిత్రించాయి

కుల హింసలు, శ్రమదోపిడి, దొర, దొర్సాని, ఇంటి మగస్వాములు, ఆకలి హింసలు యివన్నింటి నుంచి దళిత మహిళ విముక్తి చెందాల్సివుంది అని జూపాక సుభద్ర అభిప్రాయపడింది. ఈ భావజాలంలో వచ్చిన కథలు అనేకం ఉన్నాయి. మాదిగలకు బతుకమ్మ లేకుండా చేసిన కుట్రల్ని బహిర్గతం చేసింది. జూపాక సుభద్ర రాసిన "గద్దెత్కపోయిన బత్కమ్మ" జాజులగౌరి "విద్యార్థి" కథ, గోగు శ్యామల "రండం" కథలు దళితుల పిల్లలు చదువు కోసం పడే యాతనల్ని చిత్రించాయి. మాదిగ ఆశ్రిత కులమైన మాస్టి కులస్తుల సమస్యలను చిత్రిస్తూ "మాస్టిపోశవ్వ" అనే కథు మేరీ మాదిగ (పొలడుగు మేరీ సుకుమారి మాదిగ) రాసింది. ఈమె కథల్లో దళిత సమస్యలు వివిధ కోణాల్లో కనిపిస్తాయి. దళితవాదం వచ్చాక దళితుల సాధక బాధకాల్ని తమ సొంత గొంతుకతో కథలుగా చెప్పుకున్నారు. ఆ క్రమంలో వారి కులమాండలికాలు కథా సాహిత్యంలోకి వచ్చి చేరాయి. దాని వల్ల కొత్తశైలి చేర్పుగా కథకు అబ్బింది. రోజురోజుకు మారుతున్న పరిణామాలు, రాజకీయ అధికారం చేజిక్కించుకోవాలన్న ధోరణి కులస్పృహను అధికం చేసింది. మాదిగ దండోరా, మాల మహానాడు ఉద్యమ ప్రభావాలు, ప్రతిపక్ష అధికారం రాజకీయాల ధోరణులను గుర్తుకు తెచ్చాయి. వీటన్నిటి ఫలితాలు ఒకవైపు, రిజర్వేషన్స్ ఇచ్చిన జీవితాల వల్ల ఎదిగిన దళితులు తమ పూర్వులకంటే మిన్నగా బతకడం ఒకవైపు కనిపిస్తుంది. ఈ క్రమం అంతా కూడా కథల్లో నిక్షిప్తం అయింది.

సామాజిక మార్పులకు ప్రాథమిక, గౌణ కారణాలుంటాయి. మార్పు వచ్చాక గౌణ కారణం కాస్తా ప్రాథమిక కారణం స్థాయికి ఎదిగి మరో మార్పుకు చోదకశక్తిగా మారుతుంది. అదే విధంగా పునాది అంశాలు, ఉపరితలాంశాలు అనే భావాలు కూడా స్థితిని మార్చుకుంటాయి. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా కులం అనేది ఇక్కడి సామాజిక దొంతరలలో ఒకటిగా ఒదిగి పోయింది. అది చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. అలాంటి బలీయమైన శక్తిని కాదని భారత రాజకీయాలు సాగినవి. జాతీయత, భాష, మతము, వర్గం అనే విభజనలు రాజ్యాధికారాన్ని కొందరి చేతులకే పరిమితం చేసినాయి. ఈ క్రమంలో అధికారాన్ని అందిపుచ్చుకొని, మొదటి వరుసలో ఉన్న అగ్రకులం వారే కొందరు. మిగిలిన వారు ద్వితీయ, తృతీయ శ్రేణి పౌరులుగా ఉండిపోయిన బహుజనులు. కాలంలో వచ్చిన మార్పుల సారాంశంగా మధ్య తరగతిగా వారు స్థిరపడ్డారు. అప్పుడే తమ స్థితిగతులను బేరీజు వేసుకొని గతాన్ని నెమరు వేసుకొన్నారు. వారి పట్టుదల ఫలితంగా పుట్టుక వచ్చినవే అస్తిత్వ ఉద్యమాలు.

కులము, లింగము, మతము, ప్రాంతము అనే వర్గీకరణ ఆధారంగా దళితవాద, స్త్రీవాద, మైనార్టీ వాద, ప్రాంతీయవాద ఆలోచనలు పురుడుపోసుకొని రాజకీయ అధికారం కోసం ముందడుగు వేశాయి. మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్, కాన్షీరాం లాంటి తాత్వికులు, సంస్కర్తలు, నాయకులు చూపిన బాటలు కొత్త సమాజాన్ని వాగ్దానం చేశాయి. 19-20 శతాబ్దాల్లో మొదలైన సంస్కరణ ఉద్యమాలు ఆధునిక కాలంలో అనేక మార్పులకు దోహదపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మార్పులు మన సమాజాన్ని ప్రబావితం చేశాయి. వీటివల్ల కింది కులాల ఐక్యతకు తొలిబీజం పడింది. వాస్తవంలో ఈ పని బౌద్ధం ఆనాడే చేసింది. బుద్ధుని బోధనలు వాటి ఎగుడు దిగుడు సమాజాన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. అనేకులు బుద్ధుని శిష్యులుగా మారి మతంవారిగా

గుర్తింపు తెచ్చుకున్నారు. తరువాతి కాలంలో సూఫీ ప్రభావం చేత హిందువులు, ఇస్లాం నీడలోకి వచ్చారు. ఈనాటి అర్థంలో వీరందరూ బహుజనులే.

సమాజంలో జరిగే పరిణామాలకు సాహిత్యం దర్పణం. సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో కథ ఒకటి. తెలంగాణన కథ కాలం పోకడలను పట్టించుకుంది. అలా అది ఒక చారిత్రక వనరుగా మిగిలింది. వర్తమానంలో బహుజన కులాల్లో వస్తున్న మార్పులను ఈ కథ చూపెట్టింది. "ప్రపంచీకరణ ప్రభావం వల్ల కుల వృత్తులు ఎలా ఛిద్రం అయ్యాయో కథ చెప్పింది. చేతివృత్తుల కళ జాతి జీవనానికి ఎలా పాదులు వేసిందో వివరించింది. మొత్తంగా బహుజన కథ మానవ శ్రమకు పట్టం కట్టింది. ఈ కథలు సమాజం లోపలి పొరల్లోని మలినాన్ని బయట పెట్టాయి. దాని బాధితుల వేదనను ప్రపంచానికి అందించాయి. వారి అస్తిత్వాన్ని ఎరుక పరుస్తూ ఆత్మగౌరవాన్ని డిమాండ్ చేశాయి. రాజకీయ అధికారం ద్వారానే సాధికారత, సామాజిక న్యాయం, సామాజిక మార్పు సాధ్యమని తేల్చాయి. బహుజన చైతన్యపు ఆనవాళ్ళను అందించాయి. చమట చుక్కల ఉదాత్త వ్యక్తిత్వాలను ఆవిష్కరించాయి. శ్రామికుల స్వచ్ఛ ఆలోచనలను, అమాయక ధోరణులను పదిలపరిచాయి. ఈ కథలు బహుజన ప్రపంచాన్ని కంటిపాప వరకు తెచ్చిపెట్టాయి. సామాజిక మార్పుకు, వ్యక్తిగత చైతన్యం కూడా దోహద పడుతుందని నిర్ణయించాయి.

తెలంగాణ కథకుల్లో చాలామంది బహుజన కథకు అత్యంత శ్రద్ధతో చిత్రించారు. వీళ్ళలో చాలామంది బహుజన కులాల వారే కావడం గమనార్హం. అయితే వీటిలో చాలా వరకు వృత్తులు కోల్పోయిన బాధను ఆవిష్కరించినవే. జీవిత చిహ్నాలుగా బహుజన బతుకులను చిత్రించినవే.

ఆడెపు లక్ష్మీపతి "త్రిభుజపు నాల్గోకోణం" కథలో కులవృత్తి కోల్పోయిన పద్మశాలీలు ఇతర వ్యాపారాలు చేపట్టడం వల్ల కుటుంబాలు ఎలా శిథిలం అవుతున్నాయో చిత్రించాడు. రామాచంద్రమౌళి "అమ్మానాన్న" కథలో శిథిలమైపోతున్న బీడీ కార్మికుల జీవితాల్ని చూపించాడు. కల్లుగీత కార్మికుల జీవితాల్ని అనేక కోణాలలో చిత్రించిన శ్రీనివాస్‌గౌడ్ స్వయాన అదే వృత్తికి చెందినవాడు. ఇతని "మా బతుకులు" కథా సంపుటి గౌడ వృత్తి సాదక బాధకాలను తెలియజేస్తుంది. పెద్దింటి అశోక్ కుమార్ "ఊటబాయి" కథలో ముదిరాజ్ (తెనుగోళ్ళు) కులస్తులు చెట్లను గుత్తకు తీసుకోవడం, పండ్లు అమ్మడం సంబంధించిన పనులలోని కష్టనష్టాలను రాశారు. ముదిగంటి సుజాతారెడ్డి "పలాయనం" కథలో చాకలి వారి జీవితాన్ని ఆ వృత్తిలోని స్త్రీ పురుషుల పని విభజనలో గల వివక్షను, తేడాను తెలిపారు. కులవృత్తుల జీవితాలను చిత్రించిన కథకుల్లో జాతశ్రీది ప్రత్యేక స్థానం. బహుజనులు చేస్తున్న కులవృత్తుల పట్ల వాళ్లు కోల్పోయిన జీవితం పట్ల వీరికి శ్రద్ధ అధికం, తన "ఆర్తారావం" కథా సంపుటిలో అనేక బహుజన కులాల వ్యథలను రికార్డు చేశారు. "వ్యక్తిగతం" కథలో గంగిరెద్దులు ఆడించే వారి జీవితాలు, "విధ్వంసం" కథలో గాడిదలు, దొమ్మరి ఆటలు ఆడేవారి జీవితాల్ని అక్షరీకరించారు. సదానంద శారద రాసిన "తొక్కుడు బండ" కథలో అగ్రకులాల వారు తమ ఎదుగుదలకు బహుజనులను ఏ విధంగా మెట్లుగా చేసివాడుకుంటారో తెలిపారు. ఐతా చంద్రయ్య "గుండె చప్పుళ్ళు" "మలుపు" కథలు మంగలి వారి జీవితాల్లోని వివిధ పార్శ్వాలను ప్రదర్శనకు పెట్టాయి. పి.చంద్ రాసిన "నెత్తుటి ధార" కథలో దూదేకుల స్త్రీ చైతన్యాన్ని చిత్రించారు. దిలావర్ రాసిన "గూడు చెదిరిపోయింది" కథలో ఆధునిక టెక్నాలజీ వల్ల వడ్రంగి వృత్తి శిథిలమవుతూ చివరికి ఆ కులవృత్తి వారు ఏ విధంగా చివికి పోయారో చిత్రించాడు. రేగులపాటి కిషన్రావు రాసిన "బతుకులో ఎడారి" కథ బంగారు, వెండి పని చేసే కంసాలి వృత్తి కులస్తుల పేదరికాన్ని, కడగండ్లను చిత్రించింది. కె.వి. నరేందర్ రాసిన "కటికోల్లు" కథ మాంసం అమ్మి జీవించే కటిక వారి జీవితాన్ని చెబుతుంది. బి.వి.ఎస్.స్వామి "నెలపాడుపు" కథలో చేపలు కడిగి ఇచ్చే వారి వృత్తి గురించి చిత్రించారు. శిరంశెట్టి కాంతారావు రాసిన "బగారా" కథ, సన్నకారు రైతులు వ్యవసాయం చేయలేక పట్నాలకు వెళ్ళి వివిధ వృత్తి పనులకు కుదిరిన తీరును చిత్రించింది. బహుజన వర్గాల్లోని సన్నకారు రైతుల

గోస వర్ణనాతీతం. వీరి బాధల పల్లవులను అనేక కథలు వినిపించాయి. అంబల్ల జనార్ధన్ "బయలు బతుకు" కథలో ముంబయి నగరంలోని బేల్‌దారి జీవితాలను చిత్రించాడు. అంపశయ్య నవీన్ "పొరపాటు" కథలో చేయని నేరాలకు ఎరుకల వాళ్ళు ఎలా బలి అవుతారో తెలిపారు.

టి. సంపత్ కుమార్ రాసిన "చిప్ప" కథలో ప్లాస్టిక్, ఇండాలియన్, అల్యూమినియమ్ ఉత్పత్తులతో కుమ్మరి వృత్తి ఎలా ఛిద్రమైందో కనపడుతుంది. ఆయుర్వేద వైద్యులు తమ వైద్య వృత్తి ప్రాభవం కోల్పోవటం వల్ల అచేతనంగా మిగలడాన్ని బి. మురళీధర్ రాసిన "నెమలి నార" కథ విశదపరుస్తుంది. మేరెడ్డి యాదగిరి రెడ్డి, గూడ అంజయ్య, భూపాల్, సగ్గు రాజయ్య, కాసుల ప్రతాపరెడ్డి, దేవులపల్లి కృష్ణమూర్తి, బోయ అంజయ్య, వర్కపల్లి యాదగిరి మొదలగువారు బహుజన స్పృహతో కథలు రాశారు. వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీ, ప్రేమ, ఆత్మీయతను కలిగి ఉండటం వాటిని తనకు ఇష్టమైన, తనకంటే చిన్నవాడైన యువకునిపై ప్రదర్శించడం ఆయోధ్యారెడ్డి రాసిన "నిశ్శబ్దం చప్పుడు" కథలో కనపడుతుంది. నందిని సిద్ధారెడ్డి "కులకశ్చి" కథళో వడ్రంగి వృత్తిలో వచ్చిన మార్పులను, ఆ మార్పుల వల్ల ఆ కులం వాళ్ళ జీవితాల్లో వచ్చిన కష్టసుఖాలను చర్చించాడు. వడ్రంగి చేసిన బొమ్మలకు గిరాకీలేని దశ రావడం పరమదయనీయంగా ఇందులో కనిపిస్తుంది. సదానంద శారద రాసిన కథల్లో బహుజనులుఎలా అన్యాయానికి గురౌతున్నారో తెలుస్తుంది. "గొలుసు", "తులసిమొక్క" అందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి. అనిశెట్టి రజిత రాసిన "కొత్తపాట"లో చితికిన చేనేత బతుకులో పడిన స్త్రీ సంఘర్షణను ఆమెకు దొరికిన చేయూతను చిత్రించింది. సగ్గు రాజయ్య రాసిన "ప్రాణదాత" కథలో చేపలు అమ్మే వారి జీవితాలను దృశ్యీకరించారు. బహుజన వాదం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను కలిపి ఉంచేది. వీరందరికి ఐక్యతను కోరుకునేది.

బతుకమ్మ పండుగ, బహుజనులు తీర్చిదిద్దిన రూపమని తెలిపే కథలు రావాలి. బహుజన కళాకారుల కళల్లోని విశిష్టతను, వైవిధ్యాన్ని ఆధారం చేసుకొని కథలు రావాలి. బహుజన కులాల సాంస్కృతిక విశేషాలు తెలిపే కథలు రాయాలి. దీనివల్ల తెలంగాణ సాంస్కృతిక వాతావరణం ప్రపంచానికి తెలుస్తుంది. 'బహుజన కథ అంటే ఆయా కులాలకు చెందిన సాంస్కృతిక అంశాలు ఉండాలి. బహుజన కథ అంటే ఆయా కులానికి చెందిన సాంస్కృతిక అంశాలు ఉండాలి. కుల పరంగా మనుషులు అనుభవించిన హింస కథలో కనపడాలి. బహుజన కులస్తులు రాస్తేనే బహుజన కథ అనపడదు. రాసేది ఎవరైనా అందులో బహుజనుల ఆకాంక్షలు, అభివృద్ధి ద్యోతకం కావాలి. సమాజంలో మాటల మధ్య కులపరమైన నిందావాక్యాలు దొర్లుతున్నవి. ఇవన్నీ కూడా బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవిగా ఉన్నవి. ఇలాంటి పదాలు ఎవరైనా వాడినపుడు బహుజనుల నుండి తీవ్రమైన నిరసన వస్తున్నది. రచయితలు ఇలాంంటి ధోరణిని, వివక్షను ఖండిస్తూ కథలు రాయాలి. బహుజనులు అనేక రూపాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారు. పిలుపులో, పని ప్రదేశాల్లో, నిత్యవ్యవహారాల్లో ఇలా అనేకచోట్ల అవమానాలకు గురవుతున్నారు. చాకలి మంగలి పొత్తు ఇంటికి రాదు ఇత్తు, సొదాలాల్ ఏక్ కలాల్, కుమ్మరి పురుగు, వడ్రంగి పిట్ట, సాకలి ఆడబిడ్డ కోసం సన్నాసులు కొట్టుకోవడం, దొమ్మరి దానా పిచ్చకుంట్లోడా అని అవమానకరమైన దూషణలను బహుజనులు ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లను కించపరిచే లాగా "బోటి పేగుల శాలోడా" లాంటి నిందా వ్యాఖ్యలు, పదాలు వింటున్నారు. ఇలాంటి వాటిని చిత్రించాలి. ఈ ధోరణిని ప్రశ్నించే సృజన సాంస్కృతిక వివక్షను పట్టి చూపే కథలను చేయాలి.

తెలుగులో అస్తిత్వ సమస్యను తలెత్తుకొని, తమ ప్రత్యేకతను ప్రదర్శించాయి. సమాజంలో తమ పట్ల జరుగుతున్న వివక్షను, వెనుకబాటును, అణచివేతలను ప్రశ్నించాయి. దళిత, స్త్రీవాదాలు ఆ బాటలోనే నడిచాయి. అదే బాటలో ముందుకు నడిచినది. ముస్లింవాదం అల్పసంఖ్యాకులైన ముస్లింల కష్టనష్టాలను అభివ్యక్తీకరించే సాహిత్యమే ముస్లింవాద సాహిత్యం. దీనికే

మరోపేరు మైనారిటీవాద సాహిత్యం ముస్లింలు తమని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడటం జరుగుతుందని, దాని కోసం ప్రతిచోట దేశభక్తిని నిరూపించుకోవాల్సి వస్తుందని, తాము ముందు భారతీయులమని గుర్తించాలని వారిస్తున్నారు. ముస్లింవాదం మొదలు దళిత, బహుజన వాదాల్లో ఒకటిగా ఉండి, తరువాత స్వతంత్ర విభాగంగా గుర్తింపు తెచ్చుకుంది. ముస్లిం సాహిత్యంలో కూడా ముస్లిం స్త్రీవాద సాహిత్యాన్ని ప్రత్యేకంగా గుర్తిస్తు న్నారు.

తెలుగు సాహిత్యంలో ఇవాళ ముస్లింవాదం ఒక బలమైన శాఖగా ఉంది. ముస్లింల పేదరికం, అభద్రతా భావం, వివక్ష, అణివేత, బాబ్రి విధ్వంసం, గుజరాత్ సమస్య ముస్లిం సంస్కృతి, ముస్లిం స్త్రీ సమస్య, మెజారిటీ మతభావజాలాన్ని ప్రశ్నించడం, ముస్లిం జీవన విధానం, మత విశ్వాసాలు, ఆచారాలు, తాత్వికత, ముస్లింలలో రావాల్సిన సంస్కరణలు, మతంపేర జరుగుతున్న అవకాశ వాద ధోరణులు ముస్లిం స్త్రీలను కించపరచే ధోరణులను వ్యతిరేకించడం, ముస్లిం సమాజ అంతర్గత లోపాలపై దృష్టి, సంస్కరణల ఆవశ్యకతలను ఈ వాదం చర్చకు పెట్టింది. ముస్లిం మైనారిటీవాదం, ఒక వైపు తమ అస్తిత్వాన్ని నిరూపించుకుంటూ, స్వీయ మతంలోని మూఢాచారాలను ఖండిస్తూ, తాము ఇక్కడ ఏ స్థితిలో ఉన్నామో, ఎలా ఉండాలో ముస్లిం వాద సాహిత్యం తెలుపుతుంది. ఇతర స్త్రీలకున్న వివక్షే ముస్లిం స్త్రీలకు ఉంది. ఉన్నత విద్యకు ఆటంకాలు, బురఖాపద్ధతి, బహుభార్యత్వం, బహుసంతానోత్పత్తి సమస్య, లింగ వివక్ష, భర్త చనిపోతే స్త్రీ పునర్వివాహం పట్ల తలెత్తుతున్న అనేక సమస్యలు ముస్లిం స్త్రీవాదంలో కనిపిస్తున్నాయి. దూదేకుల సమస్య, రిజర్వేషన్ల సమస్యలు కూడా ఈ వాదంలో భాగమైనాయి.

**ఆధార గ్రంథాలు:**

1. డా॥.బి.వి.ఎస్. స్వామి, కథా తెలంగాణం వ్యాసాలు, అడుగు జాడలు పబ్లికేషన్స్, హైదరాబాద్, 2013.
2. డా॥. బి.వి.ఎస్. స్వామి, నెలపొడుపు కథా సంకలనం, కౌశిక్ ప్రచురణలు, కరీంనగర్, 2004.
3. డా॥. బి.వి.ఎస్. స్వామి, అందుబాటు, ఉత్తర తెలంగాణ కథా రచయితల పరిచయం, సమైక్య సాహితీ ప్రచురణలు, కరీంగనర్, 2008.
4. డా॥. బి.వి.ఎస్. స్వామి, వివరం - కథా సాహిత్య వ్యాసాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2011.

★★★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# మాధురి ఇంగువ నవలలు – వస్తు వైవిధ్యం



– అల్లం అరుణ కుమారి

పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వ కళా పరిషత్, విశాఖపట్నం.

– డా॥. పెండ్యాల లావణ్య

పర్యవేక్షకులు & ఆంధ్రోపన్యాసకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజోలు, అంబేద్కర్ కోనసీమ జిల్లా.



**ప్రవేశిక :**

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ఉత్తమ స్థానాన్ని సంపాదించుకున్న ప్రక్రియ నవల. ఈ నవలా ప్రక్రియ ఆధునిక సాహిత్యంలో ఇతర ప్రక్రియల ధాటికి తట్టుకొని నిలబడడానికి కారణం ఆ నవలలలో గల వస్తువు వైవిధ్యమే. చాలామంది ఆధునిక రచయితలు సమకాలీన అంశాలను తీసుకొని వారి నవలలలో ప్రతిబింబిస్తున్నారు. వాటితో పాటు కాల్పనిక సాహిత్యాన్న కూడా సృష్టించ గలగడం అనేది మాధురి ప్రతిభా విశేషంగా చెప్పుకోవచ్చు.

మాధురి 1982 సెప్టెంబర్ 9వ తేదీన శ్రీ యడవల్లి కామేశ్వరరావు శ్రీమతి గిరిజ దంపతులకు హైదరాబాద్ లోని సఫిల్గుడాలో జన్మించారు. ఆమె హైదరాబాదులోనే పుట్టి పెరిగి ఆంగ్ల మాధ్యమంలోనే విద్యను అభ్యసించినప్పటికీ వారి కుటుంబంలో పెద్దలందరికీ తెలుగు భాష, సంస్కృతి, మన ఆచార సంప్రదాయాలు అంటే అభిమానం ఎక్కువ కావడంతో ఆమెకు కూడా అదే వరవడి అలవాటయింది.

ఆ విధంగా తెలుగు భాష పై ఆసక్తిని అలవర్చుకున్న మాధురి డిగ్రీ వరకు ఇంగ్లీష్ మీడియం లో చదివినా, తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఎంఏ తెలుగు పట్టాను పొందారు.

పదవ ఏటనే తన రచన వ్యాసంగాన్ని మొదలుపెట్టిన మాధురి వివాహానంతరం ఆమె భర్త ఉద్యోగరీత్యా అమెరికా, న్యూజిలాండ్, కెనడా, ఇంగ్లాండ్ వంటి దేశాలలో నివాసం ఉండవలసి వచ్చినప్పటికీ తెలుగు సాహిత్యంపై తనకున్న మక్కువను వదలలేకపోయారు. విదేశాలలో ఉంటూనే 'డయాస్పోరా' రచయిత్రిగా అనేక రచనలు చేశారు.

మాధురి కథలు, నవలలు, కవిత్వం, గేయాలు, పాటలు, పారడి సాంగ్స్, వ్యాసాలు, అనువాదాలు మొదలైన ఎన్నో సాహితీ ప్రక్రియలో ఆమె ప్రతిభను నిరూపించుకున్నారు. ఆ ప్రతిభకు తార్కాణంగా అనేక అవార్డులు బిరుదులతో పాటు 2025 సెప్టెంబర్ 28న వేటూరి పై పరిశోధనాత్మకంగా వెలువరించిన 'వేటూరి గీతామృతం' పుస్తకానికి హైదరాబాదులోని డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ ఆధ్వర్యంలో నడిచే సాహితీ సంస్కృతి సేవా ట్రస్ట్ వారిచే గౌరవ డాక్టరేట్ ను పొందారు.

ఈ వ్యాసంలో మాధురి నవలలలో గల వస్తువు వైవిధ్యతను గురించి చర్చించడం జరిగింది.

మాధురి ఇంగువ రాసిన నవలలో విభిన్నమైన వస్తు వైవిధ్యత కనిపిస్తుంది. ఆమె నవలలు భిన్నమైన కథలతో

ఆకట్టుకునే శైలితో వేగంగా సాగుతూ, పాఠకుల్ని ఉత్కంఠత లూగించే స్థాయిలో ఉంటాయి.

ఆమె నవలలలో ఒకటైన 'వజ్రకుండం' చదవరులను ఊహాలోకంలో విహరింప చేసే కాల్పనిక నవల అయితే, మరొక నవల 'మనసిజ' మన జీవితాల్ని అతలాకుతలం చేసిన కరోనా కష్టకాలం గురించి, ఆ పరిస్థితులను తట్టుకొని తాను నిలబడడమే కాకుండా, ప్రపంచానికే ఆదర్శంగా నిలబడిన మనసిజ యొక్క ఆత్మస్థైర్యాన్ని సూచించే ప్రేరణాత్మక కథ. మరొకటి బయట ప్రపంచాన్ని అమితంగా ఆకర్షిస్తూ రంగురంగుల లోకాన్ని చూపించే సినీ రంగంలోని చీకటి వెలుగుల్ని, మిట్టపల్లాలను కళ్ళకు కట్టినట్లు చూపించే 'నందు వర్సెస్ నందు'. కాగా ఇంకొక నవల ప్రేమ అనే మాయలో పడి మతిభ్రమించిన తల్లి కోసం ఒక కూతురు పడిన తపన 'మా అమ్మ కోసం'. ఇలా ఆమె ప్రతి నవల లోనూ విభిన్న కథలను తీసుకొని తన రచనా ప్రతిభతో పాఠకులను ఆకట్టుకున్నారు.

**వజ్రకుండం :**

ఇది మాధురి ఇంగువ మొదటి నవల అయినప్పటికీ, దీనిలో కాల్పనిక కథను వస్తువుగా తీసుకోవడం అనేది ఆమె విభిన్న ఆలోచన ధోరణికి ఉదాహరణగా చెప్పు కోవచ్చు.

వజ్రకుండం నవల ఇప్పటి కాలమాన పరిస్థితులకు విరుద్ధంగా, ఏమాత్రం ఆంగ్ల పదాలు వాడకుండా, వెకిలి హాస్యం లేకుండా, 26వేల కు పైగా తెలుగు పదాలతో సాగిన నవల. తెలుగు భాషను ప్రేమించే వారికి, ఆదరించే వారికి ఈ నవల ఒక వరం వంటిది. వజ్ర కుండం అచ్చమైన తెలుగు పదాలతో రాయబడిన స్వచ్ఛమైన తెలుగు నవల. స్త్రీ శక్తి, భక్తి, ప్రేమ, సాహసం, జానపద తెలుగు పద సంపద, కథలో మలుపులు, మనసుల భావోద్వేగాలు వంటి అనేక అంశాల కలయిక ఈ వజ్ర కుండం.

ఈ వజ్రకుండం నవల లో మహారాజు చిత్రసేనుడి అనురాగం, బుద్ధి కుశలత, మహారాణి పుష్ప మాలిక సహసాలు, యువరాజు శ్రీవత్స, యువరాణి మలయ సమీరల ప్రణయ కావ్యం, వారి గత జన్మ రహస్యం, చిత్రసేన, గరుడ ధ్వజ మహారాజు దంపతుల స్నేహం, హొమాగ్ని మహర్షి మహత్యం, వారి మహిమలు, వజ్ర కుండం యొక్క వింతలు ఇలా ఎన్నో అద్భుతాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ పాఠకుల మదిని దోచుకుంటుంది.

శ్రీ వైవస్వత మన్వంతరం, 28వ మహాయుగం, ద్వాపర కలియుగాల సంధి కాలంలో జరిగిన కథగా ఈ కథను రచయిత్రి చిత్రించారు.

ఆధునిక భాష, భావజాలాలతో కొట్టుకుపోతున్న నేటి కాలంలో ఇటువంటి కాల్పనిక ఇతివృత్తాన్ని తీసుకొని పాఠకుల్ని కదలనీయకుండా, ఏకబిగిన నవల మొత్తం చదివేలా చేయగలగడం రచయిత ప్రతిభకు, ఆమెకు తెలుగు భాష పై గల పట్టుకు నిదర్శనంగా మనం భావించవచ్చు. నేటి కాలంలో ఇలా కాల్పనిక ఇతివృత్తాన్ని తన నవలలకు కథా వస్తువుగా తీసుకోవడం అనేది రచయిత యొక్క వస్తు వైవిధ్య దృష్టికి నిదర్శనంగా చెప్పవచ్చు.

**మా అమ్మ కోసం :**

టీనేజ్ అనేది అందరికీ మరపురాని జ్ఞాపకాలని, అనుభవాలను అందించే వయస్సు. ఆ వయసులో జరిగిన సంఘటనల ప్రభావాలు మనసు మీద జీవితాంతం ఉండిపోతాయి. అవి చేదువైనా, తీపివైనా.

నిజానికి ఈ టీనేజ్ అనేది ఒక హరివిల్లుల రంగులు కలబోసిన నింగిని చూపించి, నేల మీద కాలు నిలవనీయకుండా చేస్తుంది. ఆ మాయలో లోకమంతా రంగుల మయంగా కనిపించి, చీకట్లను సైతం చూడ నివ్వదు. ముఖ్యంగా అమ్మాయిలకి భయంతో ముకుళించిన హృదయాలు యవ్వనంలో గులాబీ పువ్వులై వికసించి, కలల పరిమళాలను వెదజల్లుతాయి. అయితే ఆ పూల కింద ముళ్ళు పొంచి ఉన్నాయని, అనిపించని అమాయకత్వం ఆ గులాబీలది. ఎన్నో ముళ్ళు ఎన్నో పూలని నేటికీ చిత్రం చిధ్రం చేస్తూనే ఉన్నాయి. కొన్ని పూలు ప్రాణం తీసుకుంటే, కొన్ని

మతిభ్రమించి జీవితాంతం అలమటిస్తున్నాయి. కొన్ని మాత్రమే నేలరాలకుండా తిరిగి వికసించి, ముల్లును ముల్లుతోనే తీస్తున్నాయి.

మా అమ్మ కోసం కథానాయక మంజు తన యవ్వనపు కాలంలో చేసిన తప్పిదం తన జీవితాన్ని ఏమలుపులు తిప్పింది? ఆమె చెల్లించిన మూల్యం ఏమిటి? పొందిన పర్యవసానాలు ఏమిటి? వంటి విషయాలను పట్టు సడలని బిగువుతో, పరిగెత్తే కథా కథనం, పాత్రల ఔచిత్యం నిండిన నవలే 'మా అమ్మ కోసం'.

తన తల్లి కోసం పెద్దరికం సంతరించుకున్న ఒక చిన్నారి మాలిని చేసిన పనులు తీసుకున్న నిర్ణయాలు మనసుని హత్తుకునేలే చెప్పే కథ 'మా అమ్మ కోసం'.

ఈ జీవితంలో ఎవరు ఎప్పుడు పరిచయం అవుతారో? ఆ పరిచయం మన కథని ఏమలుపు తిప్పుతుందో? ఏ తీరం వైపు తీసుకెళ్తుందో? కాలానికే తెలియాలి. అందుకే ఈ కాలం ముందు మనం మోకరిల్లాలి. కాల ప్రవాహంలో కొట్టుకుపోయే స్నేహాలు కొన్ని, కలకాలం నిలబడే స్నేహాలు కొన్ని. దేని సాంద్రత ఎక్కువ అంటే నిజం నిలకడ మీద తెలుస్తుంది. అయితే కాలం కొన్నాళ్ళు మనల్ని నడిపినా, కొన్నాళ్ళకి మనం కాలాన్ని చేతుల్లోకి తీసుకొని మనకి అనుగుణంగా నడుపుకునే స్థాయికి ఎదగాలి. అందుకు చాలా ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రణాళిక నిలకడ కావాలి. ఇటువంటి సన్నివేశాలు అన్నీ రసవత్తరంగా హాస్యభరితంగా, కరుణాత్మకంగా చెబుతూనే, ప్రణయ ఝురిలో ముంచుతుంది ఈ నవల. ప్రేమను మించిన పెన్నిధి లేదని మరోసారి నిరూపిస్తుంది.

**మనసిజ :**

ప్రపంచాన్ని అతలాకుతలం చేసి, అందరి జీవితాలను మార్చేసిన పెనురక్కసి పుట్టిన సంవత్సరం 2020. మనం జీవించి ఉన్నంతకాలం మర్చిపోలేని జ్ఞాపకాలను మనకు ఇచ్చిన సంవత్సరం అది. తేరుకోలేని విధంగా మన జీవితాలలోని సమస్తాన్ని తల్లక్రిందులు చేసి, మన జీవితాలకు సరిపడా కష్టాలను, కన్నీళ్లను ఒకేసారి గుప్పించి, ఎన్నో కుటుంబాలను నడిరోడ్డుకి తెచ్చి ఉద్యోగాలను, వ్యాపారాలను, ఆర్థిక వ్యవస్థను వినాశనం చేసిన ఈ కరోనా మనకి నేర్పిన పాఠం ఏమిటి? దాని నుంచి మనం నేర్చుకున్న పాఠం ఏమిటి? అనే విషయాలను ఈ నవలలో చర్చించారు మాధురి ఇంగువ.

మనసిజ జీవిత కథలో కూడా ఈ కరోనా ఊహించని పాత్ర పోషించింది. అయితే ఆ వినాశనాన్ని కూడా ఆమె కొత్త సృష్టికి శ్రీకరంగా స్వీకరించింది. నారీ లోకానికి తలమానికమయ్యింది. కరోనా కష్టకాలంలో ఆమె తీసుకున్న నిర్ణయాలు భారతదేశ విద్యా వ్యవస్థనే కాకుండా ప్రపంచ దేశాల విద్యా వ్యవస్థను, పిల్లల భవిష్యత్తుని, ఉద్యోగం అనే సాలిగూడు లో ఉన్న బానిసల జీవిత గమనాన్ని మార్చివేసింది. ఆమెలో ఉదయించిన నవీనమైన ఆలోచనలు నవలోకాన్ని సృజించి మనకు అందించాయి. ఇటువంటి అనేక విషయాలను ప్రాక్టికల్ గా డిస్కస్ చేసి మనకు అందించిన నవల 'మనసిజ'.

మనసిజ సృష్టించిన 'స్వేచ్ఛ విహంగం' ప్రపంచ దేశాలకే తలమానికం అయ్యింది. అదొక నిశ్శబ్ద విప్లవం. ఈ విప్లవం వల్ల ప్రభుత్వం వత్తాసు పలికే ఎన్నో మాఫియాలు, ముఖ్యంగా విద్యా వ్యవస్థలో నిబిడీకృతం అయి ఉన్న మాఫియాలు తమ ఉనికిని కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది.

విద్యా విధానాన్ని, జీవన శైలిని మార్చివేసి తల్లిదండ్రులను 'అవుట్ ఆఫ్ ద బాక్స్' ఆలోచించేలా చేసి మనిషిని సృష్టిలోనే శ్రేష్టమైన జీవిగా ఎదిగే విధంగా మనల్ని పునరాలోచింపచేసిన నవల 'మనసిజ'.

**నందు వర్సెస్ నందు :**

ప్రతి యుగంలోనూ ధర్మానికి, అధర్మానికి యుద్ధమే. చివరికి గెలిచేది ధర్మమే అయినా, ప్రతిసారి గెలిచేదంతా ధర్మం కాదు అన్నారు మహాకవి శ్రీశ్రీ . అలాగే చదరంగానికి రెండు వైపులా నువ్వే కూర్చుని ఆడేవు అని ఆ దేవుడిని ఉద్దేశించి ఆక్రోశించింది వేటూరి కలం.

ఇక్కడ మన 'నందు వర్సెస్ నందు' కూడా అలాగే తమదారే ధర్మబద్ధమైనదని ఒకరు, ధర్మం కన్నా లౌక్యం గొప్పది అని, అదే నా దారి అని మరొకరు చేసుకున్న

చాలెంజ్ ఎన్ని మలుపులు తిరిగింది? ఎన్ని ముసుగులు తొలగించింది? అనేదే ఈ నందు వెర్సెస్ నందు నవల.

ఒక నందు మన అందరికీ ఎంతో ఇష్టమైన సినిమా రంగంలో అత్యుత్తమ దర్శకురాలు అనిపించుకోవడానికి నిజాయితీగా శ్రమ పడుతుంది. కానీ అన్నీ ఆటంకాలే, అన్నీ అవమానాలే.

ఇంకొక నందు అడ్డదారిలో సంగీత దర్శకుడు అయి పోవడానికి తహతహలాడుతూ ఉంటాడు. ఎన్నో అవకాశాలు, సంపదలు వెనకేసుకుంటాడు, తాను చేసిన ప్రతి పనికి ఒక కారణాన్ని వెతుక్కుని ఆ పని సరైనదే అనుకుంటాడు. కానీ చివరకు తాను చేసిన పనుల వల్ల, తాను ఎంచుకున్న మార్గం వల్ల తన లక్ష్యాన్నే కాకుండా జీవితాన్ని కూడా కోల్పోతాడు. మనం ఎంత ఉన్నతంగా ఆలోచించి, ఎంత ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకున్నప్ప టికీ దాన్ని చేరుకునే మార్గం కూడా ఉన్నతంగానే ఉండాలి అనే విషయాన్ని చాలా సున్నితంగా, అందరికీ అర్థమయ్యేలా వివరించారు రచయిత్రి ఈ నవలలో.

మనం కష్టాల కొలిమిలో పడి ఎంత కాలితే అంత నిగారింపుతో, మెరిసే బంగారంలా బయటికి రాగలమనే విషయాన్ని చక్కగా వివరించారు. అలాగే మనకు చిక్కిన చిన్న చిన్న అవకాశాలు చేజారి పోయినప్పుడు మనం బెంబేలెత్తిపోకూడదు. ఎందుకంటే మనకోసం ఏదో పెద్ద అవకాశమే ఎదురు చూస్తూ ఉంటుంది. కాబట్టి దాని కోసం ప్రయత్నం చేస్తూ అటువైపుగా అడుగులు వేస్తే మనం అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం వంటి అనేక విషయాలను పాఠకులను ఆకట్టుకునే విధంగా చర్చించారు రచయిత్రి గారు ఈ నవల 'నందు వర్సెస్ నందు'లో.

**ముగింపు :**

ఇలా విభిన్న రంగాలకు చెందిన కథలను, తన నవల లలో ఇతివృత్తాలుగా తీసుకోవడం వలన ప్రతి నవల వస్తు వైవిధ్యాన్ని చాటి ఆలోచింపచేసేదిగా, ఆసక్తిగా ఉండి పాఠకులను పంక్తుల వెంట పరుగులు పెట్టిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**

1. డా.మాధురి ఇంగువ, నవల, వజ్రకుండం
2. డా. మాధురి ఇంగువ, నవల, మా అమ్మ కోసం
3. డా. మాధురి ఇంగువ, నవల, మనసిజ
4. డా. మాధురి ఇంగువ, నవల నందు వర్సెస్ నందు

★★★

Vol. 22 | Issue 12 | December 2025 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# భూషణం - గోధూమపల్లె కథ : ఆదివాసీ జీవన చిత్రణ



- వంతిన బాలజీ
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
విశాఖపట్టణం.

- ఆచార్య జర్రి అప్పారావు
తెలుగు శాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



**ప్రవేశిక :**

భూషణం కథాసాహిత్యం తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితాన్ని కేవలం ఇతివృత్తంగా కాక, ఒక సంపూర్ణ సామాజిక--చారిత్రక అనుభవంగా మలిచిన విశిష్ట రచనా సంపద. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని శ్రీకాకుళం-పార్వతీ పురం గిరిజన సమాజాల జీవితం, వారి పోరాటాలు, పరాజయాలు, ఆశలు, నైరాశ్యాలు అన్నీ ఆయన కథల్లో జీవంతంగా ఆవిష్కృతమవుతాయి. అధికారిక చరిత్రలు విస్మరించిన ఆదివాసీ అనుభవాలు భూషణం కథల్లో కేంద్రస్థానంలో నిలుస్తాయి. ఈ విశ్లేషణ భూషణం కథా సాహిత్యాన్ని సామాజిక చరిత్ర, ఉద్యమ రాజకీయాలు, సాంస్కృతిక మార్పులు, నైతిక విలువల సంక్షోభం, కథన శైలి వంటి కోణాల నుంచి విస్తృతంగా పరిశీలిస్తుంది. ఉత్తరాంధ్రలోని అటవీ ప్రాంతాలలో నివసించే గోధూమ పల్లె ప్రజల జీవితం ఆధునిక సంస్కృతికి దూరంగా, వారి సంప్రదాయాలపై కట్టుబడి ఉంటుంది. ఈ కథలో, గోపాల మాసు అనే క్షేత్రజీవి యువకుడు, తన కుటుంబంతో కలిసి అడవిలో జీవించసాగినాడు. చీకటి సమయాల్లో అతనికి మాత్రమే తెలిసే అడవి గాథలు, ప్రకృతి పట్ల అనుబంధం అతని జీవితానికి సారాంశం. గోపాల మాసుచిన్నతనంలోనే, తన నాన్న తాతల చేతిలో అడవి సంప్రదాయాలను నేర్చుకున్నాడు. ప్రతి చెట్టు, ప్రతి పది, ప్రతి జంతువు అనేది వారి కుటుంబ భాగం అని అతనికి తెలుసు. ఉదయం మరిచిన పసుపు పండ్లు, మధ్యాహ్నం ముల్లెన్ను, సాయంత్రం సేపు పశువుల వేటతో తిరిగే గోపాల మాసు జీవితంలో ఒక నిరంతర పోరాటం. సరిపడినది ఏమిటి అంటే, చెట్టు మొక్కలను అంగీ కరించి, ప్రకృతి ఆత్మను విశ్వసించి సంతోషంగా ఉం డటం. అతని కథకు ప్రధానమైనహేతువు మాత్రం గోధూమ పల్లె ప్రజల ఆత్మను అవలించిన పోరాటాలలో రహస్యంగా దాగున్నది. బంగారు పంటను ఎలా ఉంచవలెనో, కొత్త జీవన పద్ధతులను ఎలా ఏకీభవింప చేయవలెనో అనే ప్రశ్నలు ఆయన నడిపే దారిలో నిలబడ్డాయి. గోపాల మాసు వృత్తి, పశుపాలనతో సంబంధం ఉండి, తన కష్టాన్నిప్పుడు అగ్నిపర్వతంలోనే అతడు సులభంగా చూసేవాడు. ఈ ప్రత్యేక శ్రద్ధతో, ప్రతిపంటపొలంలో, అడవి వనాలలో, స్నేహపూర్వక సంబంధాలతోజీవించేది గోధూమ పల్లె ప్రజల అభివృద్ధి. ఒక రోజు, పల్లె వద్ద హరివిల్లు తిరిగినప్పుడు, ఊరి దగ్గర చిన్ని పొలములలో కచ్చితమైన ధాన్యం పండింది. ఇది నూతన కాలంలో అందరికీ ఆశలను ఇచ్చింది. కానీ, ఈ చిన్న ప్రేరణ మరింత ధైర్యం పుడితేనే సమాజంలోని

ఉత్తమ మార్పులకు మార్గాన్ని చూపుతుంది. ఇది గోధూమ పల్లె ప్రజల ఆత్మలను గురించి చిన్న కథ, అదే వారి సొంత జీవన మార్గంలో వాళ్ళ ఆదర్శవంతమైన జీవితం! భూషణం గిరిజన జీవితం, సంస్క ృతిని ప్రతిబింబించే కథలు రాశారు, ముఖ్యంగా శ్రీకాకుళ ఉద్యమ స్ఫూర్తితో ఉత్తరాంధ్ర గిరిజనుల జీవన శైలిని తన రచనలలో చూపించారు, ఆయనను గిరిజన భారతానికి వ్యాసుడిగా శ్రీశ్రీ ప్రశంసించారు. భూషణం ఉత్తరాంధ్ర ప్రాంతంలో తొలి తెలుగు గిరిజన కథకులలో ఒకరు,గిరిజన జీవితం, సంస్క ృతిని తన రచనలలో ప్రచురించారు.

**కీలక పదాలు :**

గిరిజన జీవనం, సబాల్టర్న్ అధ్యయనం, సామాజిక, రాజకీయ దోపిడీ, ఆధునిక అభివృద్ధి విమర్శ, సాంస్కృతిక ,ప్రతిఘటన, మార్క్సిస్టు సాహిత్య విమర్శ, జానపద సంప్రదాయాలు, అటవీ సంస్క ృతి, మౌఖిక సాహిత్యం, ప్రాంతీయ భాషా వైవిధ్యం, సాంస్కృతిక వారసత్వం.

భూషణం రచనలలో శ్రీకాకుళ గిరిజన ఉద్యమ స్ఫూర్తి కనిపిస్తుంది, గిరిజనుల పోరాటాలను, జీవన శైలిని తన కథలలో చిత్రించారు. భూషణం గిరిజన జీవితం, సంస్క ృతి, పోరాటాలను తన కథలలో చూపించారు, గిరిజన ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్క ృతిక అంశాలను తన రచనలలో ప్రతిబింబించారు.

